# నా జీవన నౌక

## గొట్టిపాటి బ్రహ్మయ్య

**NAA JEEVANA NOUKA**
(An Auto Biography)
by
**GOTTIPATI BRAHMAYYA**

First Edition : November 1978
Second Edition : December 2009
Language : Telugu

Price : **Rs. 200/-** (Rupees Two hundred only)
www.Telugubooks.com

*Printed at :*
***Anupama Printers***
*Green View, 126, Shantinagar,*
*Hyderabad-28. Phone : 23391364*
Email: anupamaprinters@yahoo.co.in

*Publishers :*
Nani International,
408, Vijaya Towers,
Shantinagar, Hyderabad-500 028.
Ph. : 040-66665146

## అంకితం

నా ఇష్టదైవం గోపాలకృష్ణునకు...

# ముందుమాట

## నార్ల వెంకటేశ్వర రావు

**మన** తెలుగువారిలో ఆత్మకథలు వ్రాసినవారు – వ్రాస్తున్నవారు – బహు కొద్దిమంది. ఆ కొద్దిమందిలో ఆత్మకథ అంటే ఆత్మస్తుతి కాదని తెలిసినవారు మరింత తక్కువమంది.

శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారి ఆత్మకథకు సయితం ఈ "స్తుతి' దోషం పట్టింది. అయితే, అది ఆత్మస్తుతి కాదు, అన్యులస్తుతి.

కొందరి విషయంలో – ముఖ్యంగా నా విషయంలో – ఈ "స్తుతి" అతిగా జరిగింది.

అందుకే బ్రహ్మయ్య – అన్నగారిని గురించి, ఆయన ఆత్మకథను గురించి నాలుగు ముక్కలు వ్రాయవలసిందిగా మిత్రుడు శ్రీ కొల్లూరి కోటేశ్వరరావు పదే పదే కోరగా "ఇదుగో, అదుగో" అంటూ నేను వాయిదాలు వేయడం! అందువల్లనే మరి వాయిదాలు వేయలేని ఘట్టాన్ని చేరిన పిదప వ్రాతకు కూర్చున్నా, కలం కుంటుతూ నడవడం!!

బ్రహ్మయ్య – అన్నగారి రచనకు ఆత్మస్తుతి దోషానికి మారుగా అన్యులస్తుతి దోషం పట్టడానికి కారణం, నా బోటివారు కొన్నివేల మందికి ఆయన అన్న కావడమే. ఎవరినైనా ఆయన నోరారా పలకరిస్తారు ఊరూ, పేరూ విచారిస్తారు, చుట్టరికాలను తిరగవేస్తారు మత కుల వర్గ విభేదాలతో నిమిత్తం లేకుండా ఏదో వరస కలుపుకొంటారు అప్యాయంగా పలకరించడంలో, ఆదరాన్ని చూపించడంలో, మర్యాద చేసి, మర్యాద పొందడంలో ఆయనకు ఆయనే సాటి.

దీని తాత్పర్యం ఎవరి మంచిచెడ్డలెట్టివో బ్రహ్మయ్యగారికి తెలియవనికాదు ఆయన అజాతశత్రువనడం అసలే కాదు. అజాతశత్రువు కాగలిగినవాడు మానాభిమానాలు లేనివాడయినా కావాలి కపటవర్తనలో పట్టభద్రుడైనా కావాలి. బ్రహ్మయ్యగారు ఈ రెండు వర్గాలలో దేనికీ చెందరు. అందువల్లనే ఆయనకు హితులవలె అహితులున్నారు. మిత్రులవలె శత్రువులున్నారు. అయితే ఎట్టివారిలో నయినా, ఏమూలనో ఒక మూల, ఎంతో కొంతమంచి దాగి వుంటుందని ఆయన నమ్మకం, తన జీవితంలో చేస్తూవచ్చినట్టే తన జీవితచరిత్ర రచన సందర్భంలో సయితం ఆ మంచిని చూడ్డానికే ఆయన ప్రయత్నించారు. ఇది ఆయన వ్యక్తిత్వానికి ఘనతను కూర్చగా, ఆయన రచన విషయంలో ఒక లోపంగా పరిణమించింది. దానిలో యెత్తులే తప్ప పల్లాలులేవు, వెలుగులేతప్ప నీడలు లేవు, పూలే తప్ప ముళ్లు లేవు. మంచితనం కావలసిందే మంచిమాట

అనవలసిందే. అయితే నిజాన్ని మరుగుపడ నివ్వరాదు. బ్రహ్మయ్యగారి మంచితనం కొందరి విషయంలో నిజాన్ని మరుగుపడ నిచ్చింది. ఇది నేను హర్షించలేని విషయం.

ఈ ఒక్క లోపాన్ని మినహాయిస్తే, బ్రహ్మయ్యగారి "జీవన నౌక" మన తెలుగులో యెన్నదగు ఆత్మకథ కాబోతున్నది. నిజానికి అది ఆత్మకథ కాదు ఇరవయ్యో శతాబ్దంలో అది ఘంటసాల చరిత్ర, దివిసీమ చరిత్ర, మచిలీపట్నం చరిత్ర, ఆంధ్రరాజకీయాల చరిత్ర, జాతీయోద్యమాల చరిత్ర. ఇన్ని చరిత్రలు దీని పుటలలో యిమిడి వున్నాయి. పల్లెటూరు పెద్దలు మొదలుకొని, ప్రధాన మంత్రుల వరకు ఎందరెందరో దీనిలో మనకు తారసిల్లతారు వారిని గురించి ఎన్నెన్నో ఆసక్తిదాయకమైన విశేషాలను మనం తెలుసుకొంటాము. బ్రహ్మయ్యగారి కంటె నేను సరిగా పదేళ్ళు మాత్రమే చిన్న అయినా నాకు తెలియని కొన్ని విషయాలను ఆయన ఆత్మకథ ద్వారా నేను కొత్తగా తెలుసుకొన్నాను. నాకు తెలిసిన పెక్కు పాతవిషయాలను దాని ద్వారా తిరిగి జ్ఞప్తికి తెచ్చుకొన్నాను. తనకు పూర్తిగా అపరిచితమైన – బహుశా తాము ఊహించనైనా లేని – ఒక పాత సంఘం చరిత్రగా ఇది కొత్తతరం వారికి తోచినా తోచవచ్చు.

మొదటినుంచి చివరివరకు బ్రహ్మయ్యగారి ఆత్మకథను చదివితే కడచిన ఎనభై, తొంభై, నూరేళ్ళలో మన సాంఘిక వ్యవస్థ ఎంతగా మారిందో, మన జీవితపు విలువలు ఎంతగా మారినవో తెలుస్తుంది. ఈ మార్పులు బ్రహ్మయ్యగారేమి, నేనేమి, మాకు ఇంచుమించుగా సమకాలికులైన వారేమి కోరినట్టివే. కేవలం కోర్కెతో సరిపుచ్చక, వీటిని సాధించడానికి మాకు సాధ్యపడినమేరకు మేము కృషి చేశాము కూడా. అయితే, జరిగిన అన్ని మార్పులను మేము హర్షించలేకపోతున్నాము. పైపెచ్చు, వాటిలో కొన్ని మాకు బాధ కలిగిస్తున్నాయి. ఏ యే మార్పులు తమకు బాధాకరంగా తోస్తున్నవో బ్రహ్మయ్యగారు తమ ఆత్మకథలో అక్కడక్కడ సూచించారు. మాది పూర్తిగా ఏకదృక్పథం కాదు కాబట్టి ఆయన నిరసించిన కొన్ని మార్పులను నేను హర్షిస్తున్నాను. పోతే, ఉభయులకు సమానంగా బాధాకరమైన పరివర్తన, మనిషి మనిషిగా మరింత పెరగడానికి మారుగా గిడసబారిపోవడం, ఈనాడు పైకి పెరుగుతున్న వారి కంటె కిందికి పెరుగుతున్నవారు ఎక్కువగా కనబడుతున్నారని మేమంటే, ఇది వృద్ధాప్యపు వాచాలత్వంగా నామాటను, బ్రహ్మయ్యగారి మాటను చాలామంది కొట్టిపారవేయవచ్చు, అయినా, ఇది మా గట్టి నమ్మకం.

పోతే, చివరిమాటగా నేను చెప్పగోరుతున్నది ఈ "జీవన నౌక"ను చదవ వలసింది భాషా వైదుష్యానికి కాదు, రచనా పాటవానికి కాదు, ఒక నిండు బ్రతుకు చిందుతున్న పండు వెన్నెలలో స్నానం చేయదానికే!



**మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీగారితో**
**శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య**







**రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి చేతుల మీదుగా పద్మభూషణ్ అవార్డు అందుకుంటున్న శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య**



**భారత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూతో శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య**



# కాంతిరేఖ

## సంజీవదేవ్

నరులంతా వానరులే ఒకప్పుడు అనే చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని శంకించాల్సిన అవసరం లేదు. కారణం, ఒకప్పుడు కాదు, ఇప్పుడు కూడ నరులలో చాలాభాగం వానరులే, తోకలులేని వానరులు!

నరునిలోని ప్రధాన లక్షణం ఆలోచన. నరుడు హేతువాది, అంటే నరుడు బుద్ధిజీవి. వానరునిలోని బుద్ధి పనిచేయదు హృదయావేశం ప్రధానం. బుద్ధిలేని హృదయం చాపల్యాన్ని సృష్టిస్తుంది, చాంచల్యాన్ని రేకెత్తిస్తుంది. చాలామంది నరులలో ఈ వానర లక్షణాలే పనిచేయటం మూలంగా విశ్వంలో ఇంత అశాంతి, దేశంలో ఇంత కల్లోలం, వ్యక్తిలో ఇంత నిరానందం!

హేతువాదం అనేది ఆలోచనల్లోనూ, ఆదర్శాల్లోనూ మాత్రమే వుండి వుంటే హేతువాదం లేనట్లే. అది ఆచరణలో మేల్కొని వుంటేనే హేతువాదము వున్నట్లు. అది ఈ విధంగా కొద్దిమందిలోనే వుంటుంది వీరు నరులేకాని వానరులు కారు.

నరుడు వానరుడు కాకుండా వుండాలంటే హేతువాదిగా వుంటేనే చాలదు, నీతివాదిగా కూడ వుండాలి. నీతిలేని హేతువు ప్రమాదకరం. ఈ రెండే కాదు రసవాదిగా కూడా వుండాలి. హేతువు సత్యాన్ని అందించటానికి దారితీస్తే, నీతి శ్రేయాన్ని ప్రసాదించటానికి తోడ్పడితే, రసం ఆనందాన్ని ప్రదానం చేయడానికి సహకరిస్తుంది. ఈ మూటినే సత్యం శివం సుందరం అంటారు.

అయితే ఈ మూడు ప్రతివారిలోనూ సమంగా సజీవమై వుండవు. ఒక్కొక్కరిలో ఒక్కొక్కటి ప్రధాన రూపాన్ని తాల్చివుంటుంది. ఈ మూడిటిలో ఏ ఒకటి ఎవరిలో ప్రాధాన్యం వహిస్తే వారు ఆ విధమైన వ్యక్తిగా రూపొందుతారు. మన దేశంలో ముగ్గురు ఇప్పుడు లేని ఆధునిక మహాపురుషులను ఈ మూటినీ ప్రతినిధులుగా చూపవచ్చు. సత్యం అనే దానికి అరవిందుడు, శివం అనేదానికి మహాత్మాగాంధీ, సుందరం అనేదానికి రవీంద్రనాథ్ ఠాకూర్.

ఇదే విధంగా పాశ్చాత్య దేశాల్లో కూడ ముగ్గురు మహా వ్యక్తులను ఈ మూటి ప్రతినిధులుగా చూపవచ్చు. బర్‌ట్రెండ్ రస్సెల్ సత్యానికీ, లియో టాల్‌స్టాయ్ శివానికీ, బెనెదితో క్రోచే సుందరానికీ.

ఈ మూటినీ మూడు శక్తులతో పోల్చవచ్చు. మొదటి దానిది ఆలోచనా శక్తి, రెండవదానికి ఇచ్ఛాశక్తి, మూడవ దానికి అనుభూతిశక్తి. వీటినే పాశ్చాత్య తాత్వికులు *Congnitive, Conative and Affective* అన్నారు.

ఇంతకూ ఏమంటే ఈ మూడు శక్తులూ ఏ ఒకరిలోనూ సమంగా వుండనివి. ఏ ఒక వ్యక్తీ హేతువాదానికీ, నీతివాదానికీ, రసవాదానికీ సమంగా చెంది వుండదని. వీటిలో ఏదో ఒకటి ఒక్కొక్కరిలో ప్రాధాన్యం వహిస్తుందని.

మరి, గొట్టిపాటి బ్రహ్మయ్యగారిలో ప్రధానంగా పనిచేసేది ఈ మూటిలో ఏది అని ? ఇది తేల్చటం అంతసులభం కాదు. అయినా, వారిని వ్యక్తిగతంగా తెలుసుకున్న దాన్ని బట్టీ, వారు రచించుకొన్న స్వీయచరిత్రను బట్టీ చూస్తే ఆయన మధ్యదానికి ప్రధానంగా చెందివున్నట్లు తెలుస్తుంది. అంటే ఆయనది ప్రధానంగా నీతివాదం అనీ, ఆయనది ఇచ్ఛాశక్తి అనీ.

మొదటిదైన హేతువాదమూ, మూడవదైన రసవాదమూ బ్రహ్మయ్యగారిలో అంత ప్రధానమైనవి కావు. మధ్యదైన నీతివాదం వారిలో ప్రాధాన్యాన్ని వహించింది. ఈ మధ్య దాన్నే "శివం" లేక మంచితనం అంటారు.

ఇది వున్న వ్యక్తి మహామేధావి కాకపోవచ్చు. అద్భుత కళాకారుడు కాక పోవచ్చు. కాని మంచి వ్యక్తి, ఉత్తమ మానవుడు మాత్రం అవుతారు. ఇటువంటి వారిది ప్రధానంగా సేవాధర్మం. ఇతర్లకు సహాయపడటమే వీరి స్వార్థం. మంచితనమే వీరి రాచబాట.

ఈ బాటలోని బాటసారులు గొట్టిపాటి బ్రహ్మయ్యగారు.

ఒకరి జీవితగాథను మరొకరు రచించడం అనాదిగా అన్నిదేశాల్లోనూ జరుగుతూనే వస్తూంది. కాని తమ స్వంత జీవితగాథను తామే స్వయంగా రచించు కోవటమనేది ఇటీవలిదే అనిపిస్తుంది. ఇటువంటి స్వీయచరిత్రలు, లేక ఆత్మకథలు పాశ్చాత్య సాహిత్యంలోని ఒక శాఖ అని కొందరి అభిప్రాయం. సరే, అది పాశ్చాత్యమైనప్పటికీ, ప్రాచ్యమైనప్పటికీ ఉత్తమ విధానం అనటంలో సందేహం లేదు.

ఎవరి స్వంత విషయాలు స్వయంగా వారికి తెలిసినట్లుగా ఇతర్లకు తెలిసి వుండటం కష్టం. అందువల్ల ఇతర్లు రచించే జీవితచరిత్రలకంటే స్వయంగా రచించుకొనే స్వీయ చరిత్రలు ఎక్కువ మనోజ్ఞంగా వుండటానికి అవకాశం వున్నది. అయితే



తమలోని దోషాలు ఇతర్లకు తెలిసినంతగా స్వయంగా తమకు తెలియవు. తమలోని మంచిగుణాలు మాత్రమే తమకు ఎక్కువగా తెలిసి వుంటాయి.

స్వీయ చరిత్రా రచనలో రెండు ప్రమాదాలున్నాయి. తమలో లేని గొప్పతనాన్ని ప్రదర్శించ ప్రయత్నించటం ఒక ప్రమాదం. ఇక రెండవది తమలో వున్న గొప్పతనాన్ని ఆత్మస్తుతి అవుతుందని భయపడి అభివ్యక్తపరచకుండా వదలివేయటం. ఈ రెండు రచనా విధానాలు కూడ స్వీయ చరిత్రా రచనకు అసత్యమార్గాలే అవుతాయి.

తమలోని లోపాలనూ, గొప్పతనాన్నీ కూడ నిర్భయంగా అభివ్యక్తపరచ గలిగితేనే అది విలువగల స్వీయచరిత్ర అవుతుంది. తమలోని వెలుగుభాగాన్నీ దాచకూడదు, చీకటి భాగాన్నీ దాచకూడదు. ఈ రెంటిలో దేన్ని గుప్త పరచినా కూడా వెలుగు అనేది చీకటిగా అభివ్యక్తం కావడం, చీకటి అనేది వెలుగుగా ప్రత్యక్షం కావటం అనే ఎండమావులు రూపొందటం తథ్యం.

ఒకే సత్యాన్ని కొందరు అభివ్యక్త పరిస్తే పేలవంగా వుంటుంది. దాన్నే మరికొందరు అభివ్యక్తపరిస్తే మనోహరంగా వుంటుంది. విషయ వస్తువు ఒకటైనా దాన్ని సమర్పించే రీతులు భేదిస్తాయి. సత్యాన్ని సత్యంగా చూపుతూనే దాన్ని రమ్యంగా కూడ చూపవచ్చు. దీన్ని కవిత్వమయ విధానం అనవచ్చు. అభివ్యక్తిలో కవిత్వమయత వున్నంత మాత్రాన సత్యానికి ప్రమాదం రాదు.

"ఆ పర్వత శిఖరం చాలా ఎత్తుగా వున్నది" అని అంటే పాఠకునికి ఒక డాక్యుమెంటరీ సత్యం మాత్రమే తెలుస్తుంది కాని పాఠకుని కల్పనకూ, రస చేతనకూ సంతృప్తి జనించదు. అందుకు బదులు అదే సత్యాన్ని "ఆ పర్వత శిఖరం నక్షత్రాలను ముద్దిడు కొంటున్నది" అన్నప్పుడు ఆ పర్వత శిఖరం చాలా ఎత్తుగా వున్నదనే సత్యానికి హాని కలిగించకుండానే ఆ సత్యాన్ని మనకు హృదయ రంజకంగా చూపుతుంది. అయితే ఇటువంటి అలంకార విధానాలను మితంగా సంయమంలో వుంచటం అవసరం. ఎంతమాత్రం అతి అయినా రసం నశిస్తుంది.

స్వీయ చరిత్రా రచనలో కూడ సత్యానికి హాని కలుగుతుందనే భయంతో తగు మాత్రంగా వుండే వర్ణనలనూ, మితిమీరని అలంకారాలనూ వాడకపోతే అది సృజనాత్మక రచనగా కాక వార్తా పత్రికలోని వార్తగా తయారవుతుంది. వస్తుగత సత్యాన్ని వ్యక్తిగత రసంలో ముంచి చూపాలి. అయితే ఈ ముంచి చూపటం అనేది సత్యానికే మాత్రం భంగం కలిగించరాని రీతిలో వుండాలి.

బ్రహ్మయ్యగారి స్వీయచరిత్రలో ఇటువంటి ప్రక్రియయే గోచరిస్తుంది. బాబయ్యగారు అనే వ్యక్తిని గురించి బ్రహ్మయ్యగారి కథనం ఎంతో రక్తి కట్టిస్తుంది.

“బాబయ్యగారు ఒకసారి బందరులో ఇంటికి కావలసిన సరుకులు కొనుక్కొని తాటాకుబుట్టలలో కట్టించి తలమీద, భుజాలమీద, చేతులలోను పెట్టుకొని ఒక ప్రభబండిగా వస్తున్నారు. నేను ఎదురై నమస్కరించాను. వారు నవ్వుకొన్నారు. ప్రతి వందనం చేయటానికి చేతులనిండా సరుకుల బుట్టలయ్యె. “మనం వీటికెంతో కూలియ్యవలసి వస్తుంది. ఏదో ఇటువంటిదే మనం మిగుల్చుకోగలిగేది, ఏమంటారు?” అని ప్రశ్నించి నావద్ద మూజువాణీ యోగ్యతాపత్రం పుచ్చుకొని ఆనందంతో వెళ్ళిపోయారు.”

దీనిలో ఎంతో సుకుమారహాస్యంతో కూడిన ప్రయోజనాత్మక వాస్తవికత వ్యక్తమవు తుంది. బ్రహ్మయ్యగారి స్వీయచరిత్రలో వారి స్వంతచరిత్ర మాత్రమే కాక ఇతర్ల చరిత్రలెన్నో వున్నాయి. ఒక వ్యక్తులను గురించేకాదు, వస్తువులను గురించి, దేశాన్ని గురించి, కాలాన్ని గురించి, అవసరాలను గురించి, పరిసరాలను గురించి, మంచిని గురించి, చెడును గురించి, పట్టణాలను గురించి, పల్లెలను గురించి, ఈ విధంగా ఎన్నో.

జన్మించిన ప్రతీవ్యక్తి గొప్పవారు కాలేరు. గొప్పవారైన వారంతా మంచివారు కాలేరు. గొప్పతనమూ మంచితనమూ ఒకే వ్యక్తిలో యిమిడినప్పుడే ఆ వ్యక్తులు గొప్ప మంచివారయేది. మంచి గొప్పవారయేది. ఈ సత్యాన్నే చాటుతుంది బ్రహ్మయ్యగారి స్వీయచరిత్ర.

*1922–23* జిల్లా కాంగ్రెసు కమిటీ నిర్మాణానికి పెద్దలంతా బందరులో సమావేశమై నారు. ఆ పెద్దలలో పిన్న అయిన బ్రహ్మయ్యగారు కూడ హాజరయి వున్నారు. ముట్నూరి కృష్ణారావుగారిని జిల్లా కాంగ్రెసు కమిటీకి అధ్యక్షులుగా ఎన్నుకోవాలి అని బ్రహ్మయ్యగారు సభలో సూచించారు. అయితే అందుకు ముట్నూరి కృష్ణారావుగారు లేచి బ్రహ్మయ్యగారిని అధ్యక్షులుగా ఎన్నుకోమని విజ్ఞప్తి చేశారు. అందుకు బ్రహ్మయ్యగారు అయిష్టాన్ని తెలుపుతూ “నేనేమిటి, జిల్లా కాంగ్రెసు సంఘానికి అధ్యక్షత వహించటమేమిటి? చాలా చిన్నవాడను, నావల్లకాదు నేను నా పేరును ఉపసంహరించుకొంటున్నాను.” అని అన్నారట. అంతలో ముట్నూరి కృష్ణారావుగారు లేచి “నేను పెద్దవాడను, నా వల్లకాదు, నేను ఉపసంహరించు కొంటున్నాను” అన్నారట. కాని ఉభయులూ



ఉపసంహరించుకొంటానికి వీలులేదు అంటూ ఓటింగ్‌కు పెట్టించారు పెద్దలు. బ్రహ్మయ్యగారూ, బ్రహ్మయ్యగారి సహచరులు ముట్నూరి కృష్ణారావుగారికి చేతులెత్తారట, చివరకు లెక్కించగా బ్రహ్మయ్యగారికి ఒకవోటు అధికంగా వచ్చినదట. అందుకు ముట్నూరు కృష్ణారావుగారు ఎంతో ఆనంద పరవశులయారట!

ఆనాడు పదవులను వద్దు అనడంలో పోటీపడేవారు. నేడు కావాలనటంలో పోటీ పడుతున్నారు. తాను త్యాగం చేస్తూ ఇతర్లకు గొప్పదనం ఇవ్వడం ఆనాటి గొప్పదనం. ఇతర్ల త్యాగాన్ని ఉపయోగించుకొంటూ తమకు తాము గొప్పదనాన్ని ఇచ్చుకోవటం ఈనాటి గొప్పదనం. వైజ్ఞానిక ప్రగతి సాగినంతగా ఈనాడు మానవీయ గుణాల ప్రగతి సాగలేదు.

పట్టాభి సీతారామయ్యగారి ఖద్దర్ అమ్మకం విషయంలో బ్రహ్మయ్యగారు ఒక మనోహరఘట్టాన్ని వర్ణించారు. బందరులోని అప్పటి జిల్లా జడ్జీ కూతురు సినీమాతార ఒకామె (ఈమె కుమారి వీణాక్షి రామారావు అయివుంటుంది) పట్టాభి సీతారామయ్యగారున్నప్పుడు ఖద్దరు భాండారంలోకి వచ్చినదట. కాని ఎంతసేపు చూచినా ఆమెకు ఏ చీరా కూడ నచ్చలేదట. బ్రహ్మయ్యగారి మాటల్లో “ఒకదానికి పుంజు తరుగు, ఒకదానికి పురితక్కువ, ఒకదానికి నేతవెలితి మరొకదానికి అంచు బాగుండలేదు, వేరొకదానికి కమ్మి బాగుండలేదు, మరొకటి ముదుగు, మరొకటి ఎక్కువకాలం మనదు.” ఈ విధంగా ఆమె అన్నిటికీ అసంతృప్తిని చూపేవరకు పట్టాభిగారికి విసుగువచ్చి ఆమెను అడిగారట, వివాహమయిందా అని ఆమె కాలేదని చెప్పగా “ఇక నీకు పెళ్ళికాదు. ఇన్ని చీరలు చూపితే నీకు ఒకటీ నచ్చలేదే, ఇక నీకు కుర్రవాళ్ళు మాత్రం ఎట్లా నచ్చుతారు? ఒక కుర్రవాని ముచ్చటయిన ముక్కు, మరొకని అందమైనకళ్ళు, వేరొకని పెదవులు, యింకొక్కని నుదురు, మరొకని చాయ, ఇంకొకని మధురమైన సంభాషణ ఇవన్నీ కూడిన కుర్రవాడు కావాలంటే ఏ దేవుడు సృష్టించగలడు?” అని పట్టాభిగారు అన్నారట!

రాజకీయ విషయాలు ఎక్కువగావుండే ఇటువంటి గ్రంథాలలో ఇటువంటి వినోద ఘట్టాలను ప్రవేశ పెట్టినందువల్ల ఒక సరసత ఏర్పడుతుంది గ్రంథములో. బ్రహ్మయ్యగారు ఇటువంటి వాటిలో శ్రద్ధచూపి ఇటువంటి వాటికి తమ స్వీయ చరిత్రలో స్థానం యివ్వటం ఎంతో సముచితముగా వున్నది.

❑

గ్రంథకర్త ఇందులో వర్ణించిన జైలు జీవితం మనోహరంగా వుంది. కొన్ని పనులు చేసి జైలుకు పోవటం తప్పు. మరికొన్ని పనులు చేసి జైలుకు పోవటం గొప్ప. బ్రహ్మయ్యగారు తప్పుగా జైలుకు పోక గొప్పగా జైలుకు పోయారు.

మానసికావస్థను బట్టి కొందరికి ఇళ్ళు కూడా జైళ్ళే. ఇటువంటి మానసికావస్థ గలవాడు తన ఇంటిలో తానే బందీ అయి వుంటాడు. తన స్వేచ్ఛ అంతా తనకు బంధనగానే గోచరిస్తుంది. ఇదంతా కేవలం మానసికావస్థ మీదనే ఆధారపడి వుంటుంది అనలేము. కొంత బాహ్య పరిస్థితుల మీద కూడా ఆధారపడి వుంటుంది.

ఇక మరికొందరుంటారు. వీరికి జైళ్ళు కూడా యిళ్ళే. వీరికి జైళ్ళు కూడా ఇళ్ళు గానే వుంటాయి. అంటే అర్థం ఇళ్ళుకూడా జైళ్ళుఅని కాదు. వీరికి ఇళ్ళుకూడా ఇళ్ళుగానే తడతాయి. జైళ్ళుకూడా ఇళ్ళుగానే తడతాయి. వీరు యింటిలోనూ బందీగా ఉండరు, జైళ్ళలోను బందీగా వుండరు. సర్వత్రా స్వతంత్రులే. బ్రహ్మయ్యగారు ఈ రెండోవర్గానికి చెందుతారు.

ఈ పుస్తకంలోని వారి జైలు అనుభవాలు పాఠకులకు మనోరంజకంగా వుంటాయి. వాటిని అనుభవించినవారికి అంత మనోరంజకంగా వుండకపోవచ్చు. అనుభవించినవారికి కష్టాలు కష్టాలుగా తట్టినా ఆ కష్టాల గాథలను వింటున్న వారికి మాత్రం ఒకవైపున జాలివేస్తున్నాకూడా ఉల్లాసంగానే తడుతుంది.

బ్రహ్మయ్యగారి జీవితం పారిజాతాల పాన్పుకాదు, తుమ్మ ముళ్ళపాన్పు. ఎన్నో ఆందోళనలు, ఎన్నో ఆరాటాలూ, ఎన్నో పోరాటాలు ఆ జీవితంలో. ఇటువంటివారు ఇన్ని ఆందోళనల్లో, ఇన్ని ఆరాటాల్లో, ఇన్ని పోరాటాల్లో వున్నా కూడ మనసులో ఇవన్నీ స్థిరనివాసాన్ని ఏర్పరచుకొని వుండవు. ఇటువంటి వ్యక్తులు నివసిస్తూన్న అశాంతస్థితి ఆ వ్యక్తుల మానసాల్లో వుంటే ఏనాడో వారు మానసికారోగ్యాన్ని కోల్పోయేవారు. ఇటువంటి వారి మానసికారోగ్యానికి ప్రధానకారణం ఏమంటే వీరు అశాంతిలో నివసిస్తారు, కాని అశాంతి వీరిలో నివసించదు. బ్రహ్మయ్యగారూ అంతే.

కాంగ్రెసు ఉద్యమాలు, రైతు ఉద్యమాలు, సంస్కార ఉద్యమాలు, విద్యావిషయక ఉద్యమాలు, గ్రామోద్ధరణ ఉద్యమాలు, మధ్య మధ్య కవుల పోషణ, కళాకారుల పోషణ, ఇన్నిటితో నిండిన జీవితం ప్రశాంతంగా ఏవిధంగా వుంటుందా అనిపిస్తుంది. కాని ఈ గ్రంథకర్త జీవితాన్ని చూస్తే ఆ ప్రశాంతత కనిపిస్తుంది.

ప్రశాంతి ఏకాంత జీవితంలో మాత్రమే వుంటుంది. అది జనాంతంలో వుండదు అనుకోవటం పొరపాటు. చిత్తస్థయిర్యంగల వ్యక్తులకు ఏకాంతంలోనూ



ప్రశాంతతే, జనకల్లోలంలోనూ ప్రశాంతతే. ఆ చిత్తస్థైర్యం లోపించిన వ్యక్తులు ఏకాంతంలో వున్నా అశాంతినే అనుభవిస్తారు, జనాంతంలో వున్నా అశాంతినే.

భారతీయ నాట్య విభాగాలలో కూచిపూడి నాట్యం ఒక విశిష్టమైంది. భావ, రాగ, తాళయుత రమణీయతకు ఈ కూచిపూడి నాట్యం ఒక సజీవ రూపకల్పన. ఈ కూచిపూడి గ్రామం బ్రహ్మయ్యగారి స్వగ్రామమైన ఘంటసాలకు ఎక్కువ దూరంలో వుండదు. పతనావస్థలో వున్న ఈ కూచిపూడి నాట్యాన్ని పునరుద్ధరించటంలో బ్రహ్మయ్యగారిదెంతో ప్రయత్నం వుంది. ఇందుకు తగిన పై వారిని పట్టుకొని కూచిపూడిలో ఆ నాట్యాభివృద్ధి సర్వవిధాలా సఫలమైన కృషి చేశారు. కూచిపూడిలో నాట్య విద్యాలయాన్ని స్థాపించటమే గాక దాన్నొక గొప్ప సంస్థగా ఏర్పరచి, తగినంత ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం నుంచి దానికి ఏర్పాటు చేయించి ఈ కూచిపూడి నాట్య పునరుద్ధరణకు వీరెంతో ప్రధానులైనారు.

ఒక సాదా పల్లెటూరు రైతుబిడ్డ లెజిస్లేటివ్ కౌన్సిల్ చైర్మన్ అయిన జీవన నౌకా యాత్రలోని వివరాలన్నిటినీ చూపుతుంది ఈ గ్రంథం. ఈ నౌక నడచిన నదిలో అందమైన బంగారు రంగు చేపలు మాత్రమేకాక వికృతమైన సర్పాలు, భయంకరమైన మొసళ్ళూ మొదలైన వైపరీత్యాలెన్నో వున్నాయి. కాని ఈ సాహసియైన నావికుడు వాటన్నిటిని ఎదుర్కొని, నౌకకు హాని కలుగనీయకుండా తీరసమీపంలోకి చేర్చటం జరిగింది. తీరసమీపంలోకి వచ్చింది నౌక. ఇంకా తీరానికి చేరలేదు. ఇంకా ఇది ప్రయాణమేకాని గమ్యస్థానం కాదు.

ఇప్పుడప్పుడే గమ్యస్థానాన్ని అందుకోవటం బ్రహ్మయ్యగారి కిష్టంలేదు. నిరంతర ప్రయాణీకుడుగా వుండటంలోనే ఆయన ఆనందం. కొద్దిలో ప్రయాణాన్ని పరిసమాప్తి చేయటం ఆయనకు అయిష్టం ఇంకా అనంతయాత్ర సాగించాల్సిందే. దేన్నయినా కొద్దిలో ముగించటం ఆయన అభిమతం కాదు. అల్పత్వాన్నే హేయంగా చూస్తారాయన. బాహుళ్యమే ఇష్టం. ఆయన శరీరం కొద్దిదికాదు, మనసు కొద్దిది కాదు అభిలాషలు కొద్దివికావు. అటువంటప్పుడు ఆయన ఆశయాలు కొద్దివిగా ఎట్లా వుండగలవు? ఆర్షవాక్కు ఉంటుంది. "నాల్పే సుఖమస్తి భూమైవ సుఖం యావై భూమాత దమృతం అథయ దల్పం తన్మర్త్యం". అంటే, అల్పంలో సుఖం లేదు, అనంతంలోనే సుఖం. ఏది అనంతమో అది అమృతం, ఏది అల్పమో అది మర్త్యం. ఈ గ్రంథం కూడ ఆయతనంలోనూ, విషయంలోనూ కూడ అల్పమయింది కాదు. ❑



శ్రీయుతులు సర్వేపల్లి రాధాకృష్ణన్, శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య



భారతీయ విద్యా భవన్ వ్యవస్థాపకులు శ్రీ కె.ఎం. మున్షీ దంపతులతో
శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య





శ్రీయుతులు జకీర్ హుస్సేన్, సంజీవరెడ్డి,
బి.వి. సుబ్బారెడ్డి, బ్రహ్మయ్యగార్లు



శ్రీయుతులు బి.వి. సుబ్బారెడ్డి, లాల్ బహదూర్ శాస్త్రి,
బ్రహ్మానందరెడ్డి, బ్రహ్మయ్య, తిమ్మారెడ్డిగార్లు.



మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీగారితో
శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య




మాజీ ప్రధాని శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రిగారితో
శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య





రష్యన్ పార్లమెంటరీ డెలిగేషన్‌తో శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి, భారత ప్రధాని జవహర్‌లాల్
నెహ్రూలతో శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య



**శ్రీయుతులు చెన్నారెడ్డి, మీర్ అలీఖాన్, బ్రహ్మయ్యగార్లు అమెరికా రాయబారి గాల్‌బ్రెత్ దంపతులతో**



**శ్రీయుతులు బ్రహ్మయ్య భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, నాగరత్నమ్మ, సంజీవరెడ్డి**



# మనవి

## గొట్టిపాటి బ్రహ్మయ్య

వ్యవసాయం, పశుపోషణా, వృత్తిగా గల కుటుంబం మాది. నేనున్ను వ్యవసాయికుడనే. దేవుని దయవల్ల గురువుల ఆశీర్వచనల వల్ల రాజకీయాలను కూడా విధి నిర్వహణలో భాగంగా ఏర్పరచుకున్నాను. నా అదృష్టం కొద్దీ, జాతిపిత మహాత్ముని నాయకత్వాన స్వరాజ్య సంరంభంలో సైనికుడుగా చేరి నా జన్మభూమి యెడ నాకుగల కర్తవ్యమును నిర్వర్తించి ధన్యోశ్మి అనుకున్నాను.

శ్రీ పండిత వెంకట సుబ్బయ్య, నేను విద్యార్థి దశనుండి మిత్రులము. ఆయన "రయితు పెద్ద" అని నా జీవితచరిత్ర వ్రాశారు. నా జ్ఞాపకాలను "స్వీయ చరిత్రగా వ్రాయమని నన్ను ఆయన తరచు కోరుతూ వచ్చారు. ప్రియమిత్రులు నార్ల వెంకటేశ్వరరావు గారు పలుమార్లు హెచ్చరించారు. నేను విజయవాడ వెళ్ళినపుడు దిగవల్లి వెంకట శివరావుగారితో రాజకీయ చర్చలు సాగించేవాడను. వారున్ను భవిష్యత్ సంతతికి లాభదాయకముగా నుండుటకు గాను నా స్వీయచరిత్ర వ్రాయుట అవుసరమని నొక్కి చెప్పారు. 1953లో నేను రాజకీయ కలాపములను చాలావరకు తగ్గించుకొని వ్యవసాయం మీద ప్రత్యేకశ్రద్ధ వహిస్తూ ఘంటసాలలో ఇంటి పట్టున ఉండే సమయంలో మా కుటుంబ చరిత్రను నన్ను పెంచి పెద్ద చేసిన నా మేనమామల కుటుంబచరిత్రను, నా విద్యార్థి జీవితం వరకు వ్రాశాను. నేను శాసన పరిషత్తు సభాపతినైన రోజున నన్ను అభినందిస్తూ, నా మిత్రులు సంస్కృతి శాఖామాత్యులు యమ.ఆర్. అప్పారావుగార్ను కీ॥శే॥ శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మగారు నా స్వీయచరిత్ర వ్రాయమని కోరుచూ, అది ఆంధ్రలో స్వాతంత్ర్యోద్యమం చరిత్రగా వన్నెకెక్కగలదని ఆశీర్వదించారు.

తరువాత ప్రముఖ రచయిత రావూరి భరద్వాజ గారితో పరిచయ మేర్పడినది. ఆయన సహృదయుడు. శతాధిక గ్రంథ రచన చేసిన ప్రతిష్ట ఆయనకు గలదు. పరిచయము మిత్రత్వమైనది. ఆయన వత్తిడి ప్రభావము వలన నా స్వీయచరిత్రను 1968 జూన్ 30 తేదీవరకు మాత్రం వ్రాసితిని. శ్రీ భరద్వాజగారు మా ఇంటికి వచ్చినప్పుడెల్ల నేను వ్రాసినది చూచి, భాషా విషయమున సరిదిద్ది నాకు అమూల్యమైన సహాయమును చేసిరి.

నా 71 జన్మదినోత్సవమును గూర్చియు, మరికొంతయు, తరువాత చేర్చితిని. 1968 తరువాత రాజకీయ సంఘటనలను గూర్చి వ్రాయలేదు.

శ్రీ నార్లగారు ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రతి ఆదివారం 1969 సం॥ ఏప్రియల్ నుండి 75 వ్యాసాలుగా కొంతవరకు ప్రకటించి హెచ్చుమంది చదువుటకు అవకాశము కలుగజేసిరి.

మిత్రుడు వెంకటసుబ్బయ్యగారి ద్వారా కళాతపస్వి, సాహిత్యమూర్తి, సంజీవ్‌దేవ్ గారితో పరిచయమేర్పడినది. వారింట రెండురోజులుండి వారి యెడ గౌరవమర్యాదలను పెంచుకున్నాను. ఆయన కవి, విమర్శకుడు, చిత్రకారుడు, తత్వవేత్త, స్వయంకృషి వల్ల సంస్కృతాంధ్ర, వంగ, హిందీ, ఉర్దూ, ఆంగ్ల భాషలను నేర్చిన ప్రతిభావంతుడు. మంచి మిత్రుడు. ఆయనకు నా వ్రాతప్రతిని పంపి పరిచయం వ్రాయమనికోరగా, "కాంతిరేఖ" వ్రాసిరి. దీని పేరు "జీవన నౌక"గా వారే ఉంచిరి.

ఒకప్పుడు శ్రీ నార్లగారితో నా సంభాషణలో పుస్తక పరిమాణం కొంత తగ్గించుట అవసరమని సూచనరాగా; ఆ భారం ఆంధ్రజ్యోతి సహాయ సంపాదకులైన నా మిత్రులు శ్రీ తుర్లపాటి కుటుంబరావుగారు నా కోరికపై నిర్వర్తించి నా కృతజ్ఞతకు పాత్రులైనారు. "తెలుగు విద్యార్థి" సంపాదకుడు శ్రీ కొల్లూరి కోటేశ్వరరావు మా ఘంటసాల హైస్కూలు విద్యార్థిగా ఉన్న నాటి నుండి నా యెడ ప్రేమను పెంచుకున్న యువకుడు, ఆయన నా సన్నిహిత మిత్రులలో ఒకరు. అప్పుడప్పుడు నేను వ్రాసిన వ్యాసాలను, రేడియో సంభాషణలను "కాలచక్రం", "జాతివెలుగులు" రెండు పుస్తకాలుగా ప్రకటించి నన్ను గ్రంథకర్తను చేశారు.

ఈ నా జీవననౌక సహితం పుస్తకరూపంలో తీసుకువచ్చే భారాన్ని వహించుట ఆయనకు నా యెడ గల స్వార్థరహిత ప్రేమకు నిదర్శనం.

నేను ఆలస్యం చేసిన కొలది ఈ నా జీవన నౌకను పుస్తకరూపంలో చూడవలననే ఆకాంక్షమిత్రులు శ్రీ నార్లగారికి హెచ్చి, కోటేశ్వరరావుగారు కనపడినపుడల్లా, ఈ విషయమై హెచ్చరించుతూ, ఆయన నిర్ణయాన్ని కార్యరూపంలో వెంటనే పెట్టుటకు కారకులయ్యారు. శ్రీ నార్లగారు విద్యార్థిగా ఉన్ననాటి నుండి నాకు మిత్రులు. తరువాత రాజకీయ కార్యకలాపాలలో నాకు చేదోడు వాదోడు నిచ్చుటయేగాక నేను కోరిన వెంటనే అనారోగ్యంగా ఉండి కూడ శ్రమ తీసుకొని "ముందుమాట" వ్రాసి ఇచ్చిన వదాన్యులు. పైన వ్రాసిన నా మిత్రులందరికీ కృతజ్ఞతాపూర్వక వందనము లర్పించుచున్నాను.

ఈ పుస్తకంలోని విషయాలనెల్ల, నేను చెప్పగా వ్రాసి, దాని సాపుప్రతిని సహితం ఆనందంతోను, ఉత్సాహంతోను వ్రాసిన మిత్రులు. సి. వెంకటేశన్, బి.ఎ.బి.యల్. శ్రీపతి శాస్త్రి రాఘవశర్మ, యమ్.ఎ., యల్.యల్.బి., కొండపల్లి రంగారావుగార్లకు నమస్కారముల నందజేస్తున్నాను.

కొద్దిరోజులలోనే ప్రత్యేకశ్రద్ధ తీసుకొని ఈ పుస్తకాన్ని అందచందాలతో అచ్చువేసి ప్రజల కందుబాటులో ఉంచిన స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు వారికి వందనము లర్పించుచున్నాను. ❑



# మా ఘంటసాల చారిత్రక ప్రసిద్ధి

**మా** వూరు ఘంటసాల. జనాభా సుమారు ఎనిమిదివేలు. కృష్ణాజిల్లాలో పెద్ద గ్రామములో ఒకటి. పరమ భక్తాగ్రేసరుడైన త్యాగరాజుకు ఈడూ-జోడూ అయిన మధురభక్తుడు క్షేత్రయ్య భర్తగా ఆరాధించిన వేణుగోపాలుడు వెలసిన మొవ్వ గ్రామం మాకు అయిదు మైళ్ళలో గలదు. భరత నాట్యాచారుడైన శ్రీ సిద్ధేశ్వర మహాయోగి నడయాడిన కళాక్షేత్రం - భాగవతుల కూచిపూడి మాకు ఎనిమిది మైళ్ళలో వున్నది.

ప్రాచీన కాలంలో బౌద్ధ మతం చాల వ్యాప్తి పొందిన రోజులలో బుద్ధ భగవానుని గుర్రం పేరున "కంటక శైల" అని ఈ గ్రామం నిర్మించబడినట్లు చరిత్రాధారములు కలవు. ఆ నాడు బౌద్ధమత వ్యాప్తికి ఏర్పడిన ప్రధాన ప్రచార కేంద్రములలో ఇది ఒకటి. ఆనాడు బౌద్ధమత వ్యాప్తికి ఏర్పడిన ప్రధాన ప్రచార కేంద్రములలో ఇది ఒకటి. శిథిలములైనను ఇప్పటికీ కానవచ్చే అనేక స్థూపములు, బౌద్ధ శిల్పములు అమరావతి, జగ్గయ్యపేట బౌద్ధ శిల్పములతోగల సామీప్యత ఈ విషయమును బలపరుస్తున్నవి. నేడు ధర్మగోటకమని పిలువబడే విశాలమైన పచ్చికబయలు నాడు బౌద్ధుల వుద్యానవనమని పురాతత్వశాఖవారి రికార్డులు చెబుతున్నవి. క్రీస్తుకు పూర్వం నుంచి మనకు యూరప్ ఖండముతో వర్తక వ్యాపారాలు కలవు. ఆనాడు వ్యాపారమంతా ఓడలద్వారానే. ఈజిప్టు ఖగోళ శాస్త్రజ్ఞుడు, సుప్రసిద్ధుడు టొలమీ ఈ కంటకశైలం కృష్ణానది ముఖద్వారమునగల ఓడరేవని, వాణిజ్య కేంద్రమని వ్రాశాడు. ఈయన క్రీస్తుశకం రెండవ శతాబ్దంనాటివాడు. ఈ కంటకశైలం ఓడరేవు నుంచే ఇటలీ మొదలైన పాశ్చాత్యదేశములకు వజ్రములు, సన్నని నూలు వస్త్రములు విరివిగా ఎగుమతి అవుతుండేవి. ఆనాడు రోమను నాణెములు మనదేశమున బాహాటంగా చెలామణి అవుతుండేవి. నేటికీ గ్రామంలోని పాటిదిబ్బలు త్రవ్వునప్పుడు దొరికే బంగారు నాణెములు (ఒకవైపున రోము చక్రవర్తి రెండవవైపున సముద్ర దేవుడు గలవి) ఈ విషయమును ధ్రువపరుస్తున్నవి. ఈ కంటకశైలం బందరుకంటె పురాతన రేవు పట్టణమని, ఆనాడు గూడూరు, కంటకశైలం రేవుల నుంచే విదేశాలకు ఓడ వ్యాపారం జరుగుతుండేదని నమ్మడానికి తగిన ఆధారములు కలవు

ప్రాచీన కాలమున బౌద్ధ భిక్షువులు, బ్రాహ్మణ మత ప్రచారకులు తమ మతవ్యాప్తికై ఈ ఓడలలో పయనించి, జావా, సుమత్రా, బోర్నియో మొదలైన ప్రాగ్దేశములకు వెళ్ళారు. ఆ ప్రాంతమున గల ఆంధ్రదేశపు పట్టణ నామములు కూడా ఇందుకు నిదర్శనం. సయాం, కంబోడియా దేశములలో ఇప్పటికీ శాలివాహన శకమే చెల్లుబడి కావడం మరొక నిదర్శనం.

ఈ నాగరికత కంటకశైలం గూడూరు రేవులనుంచే వ్యాప్తి చెందెనని సుప్రసిద్ధ ఫ్రెంచి చరిత్రకారుడు డూబ్రయల్ దక్కన్ పూర్వచరిత్రలో స్పష్టపరిచాడు.

నాగార్జునకొండ, అమరావతి, పెదవేగిలలో దొరికిన శాసనములు కంటక శైల ప్రసిద్ధి ప్రశంసలతో నిండివున్నాయి. బౌద్ధమతవ్యాప్తికి ఇది ప్రసిద్ధ కేంద్రం కావడం వల్ల చాళుక్యుల పాలనలో కూడా దీని ప్రసిద్ధి కలదు. వీరి కాలమున ఇది ఘంటసాలయై చోడ పాండ్యపురమనే నామాంతరం కలిగి వున్నది.

పదమూడవ శతాబ్దం వరకు ఓడరేవుగా వున్న ఘంటసాల. నదీ ముఖ ద్వారం మారుటచే రేవు పోయినందున పట్టణ ప్రాముఖ్యం తగ్గి క్రమముగ క్షీణించింది. ఎన్నో కట్టడములు, దేవాలయములు, శిథిలములై భూపతనమైనవి. రైతులు పాటి మట్టిని త్రవ్వినపుడు అనేక శివలింగములు, నందులు, ఇతర విగ్రహములు, స్థూప సంబంధపు శిలాఖండములు, శిల్పములు దొరకడం ఇందుకు సాదృశ్యం.

నేటికీ గ్రామం మధ్యన పురాతనమైన పెన్నేరమ్మ ఆలయం కలదు. దేవుళ్ళకు పూర్వం దేవతలనే ప్రజలు ఆరాధించేవారు. ప్రసిద్ధి చెందిన నదులను, స్థానికంగా ప్రజలకు ఆధారభూతములైన జలాధారాలను దేవతలుగా పూజించినట్టు కనబడు తున్నది. నేడు ఘంటసాల గ్రామం మూడువైపుల వున్న గంజికాల్వ గుండేరునే పెన్నేరుగా ఆరాధించి వుండవచ్చు. ఈ పెన్నేరుపై పడవలలో చేపలను పట్టి జీవించుట రెండవ వృత్తిగా గల కర్షకులగు ముదిరాజుల వంశీకులే ఈ గ్రామ ఆదిమ నివాసులు. నేటికీ వీరు వున్నారు. తరువాత మానవుల ఆరాధనకు దేవుళ్లు, దేవాలయములు వెలసినవి. గ్రామం మధ్యనగల శ్రీ జలధీశ్వరాలయం ఘంటసాల ప్రాచీనతను తెలుపుతున్నది.

ఈ గ్రామం ఓడరేవు కావడంవల్ల ఇచట నావికులు, వర్తకులు, తమ భాగ్య భోగాలు, జయాపజయాలు జలధిపై ఆధారపడి వుండడం వల్ల జలధీశ్వరుని ఆరాధించు చున్నారు. ఈ ఆలయ మెపుడు నిర్మించబడినదో తెలియదు కాని, అందుగల శాసనాలను బట్టి తొమ్మిదవ శతాబ్దికి పూర్వమే నిర్మించబడినట్లు విధితం కాగలదు. విష్ణువర్ధన మహారాజు రెండువేల బ్రాహ్మణులకు గృహదానము చేసినట్లు ఒక శాసనం తెలియజేస్తున్నది.

చాళుక్యుల కాలమున కూడా ఇది ప్రాముఖ్యమైన ఓడరేవుగా వుండి వైశ్యుల అష్టాదశ ముఖ్యపట్టణాలలో ఒకటిగా ప్రసిద్ధిగాంచినది. ఈ గ్రామంలోని వైశ్యులు అనేక దేవాలయాలకు, ఇంకా ఇతర ధర్మ ప్రతిష్టాపనలకు దానములు చేసినట్టు శాసనములు కలవు.

ఈ ఆలయ ఆవరణలోనే శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామివారి ఆలయమును కీర్తిశేషులు గొర్రెపాటి కృష్ణమ్మగారు నూరు సంవత్సరములకు పూర్వము నిర్మించారు. ప్రతిసంవత్సరం మార్గశిర శుద్ధషష్ఠి వుత్సవం భక్తిశ్రద్ధలతో జరుగుతుంది.



ఈ ఆలయమునకు దక్షిణముగా వున్న శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయము కూడా చాలా పురాతనమైనదే. ఈ ఆవరణలో శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయం నూరు సంవత్సరముల క్రితం వైశ్యులచే నిర్మింపబడినది. ఈ ఆలయములు నాలుగు, పెన్నేరమ్మ ఆలయం గ్రామం మధ్యనే కలవు.

ఈ గ్రామం ప్రాచీన కాలమున ప్లాను ప్రకారం కట్టబడినట్టు కనబడుతున్నది నలుచదరమైన గ్రామము, మధ్య రెండు వీధులు చాలా వెడల్పయి, సుమారు ఒక మైలు పొడవైనవి. గ్రామమునకు తూర్పున పద్మశాలీయుల ధర్మచెరువు, వనంతోట, దాని వెంట హరిజనపల్లె, దక్షిణాన ఆళ్ళవెంకమ్మ ధర్మచెరువు, వేమూరివారి విశ్వేశ్వరాలయం, వనంతోట దాని వెంట హరిజనపల్లె, పడమర వైశ్యుల ధర్మచెర్వు వనంతోట, ఉత్తరమున గొర్రెపాటివారి ధర్మచెర్వు, చుండూరి నాగభూషణంగారి ధర్మసత్రం, విశాలమైన గోభూమి ధర్మగోటకం గలవు. ఈ ధర్మగోటకంలో రెండు హరిజన పల్లెలు కలవు. ఇటీవల ఈ వీధులను కొంతవరకు ఆక్రమించుకున్నట్లు కనబడుతున్నది. ప్రస్తుతం ఆక్రమణలోగల ఇండ్ల ఆవరణలో బజారువైపున ఒక వరుసను చిన్నవరల నూతులు పురాతనకాలం నాటివి దొరకడం నిదర్శనం. ఈ నూతులు మంచి నీళ్ళ సప్లయికి ఏర్పడిన పబ్లిక్ నూతులుగా తలంచబడుచున్నవి.

## సైనిక కేంద్రం

శాతవాహనయుగమున ఆంధ్రరాజధానిగా ప్రసిద్ధి చెందిన శ్రీకాకుళం, ఇక్కడికి ఏడుమైళ్ళు. ఆనాడు ఘంటసాల ఆంధ్రసామ్రాజ్యములో రెండవ పట్టణముగా ప్రసిద్ధి చెందినది. కొంత సేనకూడా ఇక్కడ వుండేదని, నేడు దండుబాట, గుర్రాల గొంది, గుర్రాలశాల అనే పేర్లుగల ప్రదేశాలు దాని చిహ్నాలేనని ప్రతీతి.

ఈనాటి గ్రామం చక్కగా తీర్చిదిద్దిన వీధులతో గ్రామం మధ్యను గల అయిదు దేవాలయముల ఉత్సవాదులకు, బహిరంగసభలకు, నాటకములు వగైరా ప్రదర్శనలకు అనువైన, విశాలమైన ఖాళీప్రదేశం, నలువైపుల విశాలమైన వీధులు, చక్కని భవంతులు పరిశుభ్రముగా వుండి కనుల పండువుగా ఉంటాయి. ఈ గ్రామ విశిష్టత ప్రతి యింటికి చక్కని ప్రహరి. దీనిని అనుకొని వచ్చేవారిని ఆహ్వానించుతున్నట్లు అరుగులు కలిగి వుండడం. సంక్రాంతి పండుగకు ప్రతి యిల్లు పెండ్లి యింటివలె వెల్లవేయబడి, అలుకు ముగ్గులతో అందచందాలతో అలరారుతూ వుంటుంది. ఈ గ్రామ శోభ అప్పుడు అతిశయిస్తుంది.

మావూరు ప్రాచీన చరిత్రకు తోడు నవీనచరిత్రను కూడా అలవరచుకున్నది. జమీందారు-రైతు సమస్యలలో ప్రముఖపాత్ర వహించిన ధీరులైన కీర్తిశేషులు గొర్రెపాటి బాలకృష్ణమ్మ, గొట్టిపాటి వీరరాఘవయ్యగార్లు ఈ గ్రామమున జన్మించి, గ్రామ పెద్దరికమును నిలబెట్టారు. ఒక శతాబ్ది క్రితం బ్రిటిష్‌వారి పాలనలో సైనికుడుగా చేరి, స్వయం ప్రతిభవల్ల

సుబేదారుగా ప్రతిష్ట ఆర్జించుకుని, విక్టోరియా రాణి దర్శనార్థం ఇంగ్లాండును దర్శించి విక్టోరియారాణీ పతకమును పొందిన సుబేదార్ బ్రహ్మయ్యగారి స్వగ్రామమిదే.

గ్రామంలోని పశువులు మేయడానికి ఉపయోగపడుతున్న పెద్ద భూఖండం ధర్మగోటకమును తన సొంత సేద్యముగా ఉపయోగించుకొనడానికి ఆనాటి జమీందారు చేసిన అనేక బ్రహ్మ ప్రయత్నములను అనేక కష్టనష్టములకు గురి అయి ప్రాణములను సయితం పణంగా పట్టి, విఫలపరచి నేటికి గ్రామ సాముదాయక భూమి వుండునట్టు చేసిన ఘనత ఆనాటి యువజన నాయకులు గొట్టిపాటి వీరరాఘవయ్య, దోనెపూడి వెంకట్రాములు, వేమూరి వెంకన్న, పిశుపాటి పెదసుబ్బయ్య ప్రభృతులకు అరువది అయిదు సంవత్సరముల క్రితమే దక్కింది. చల్లపల్లి ఎస్టేటులోని అన్ని గ్రామములలోని గోభూమి జమీందారుని స్వంతకమతము కాగా, ఈ ఒక్క గ్రామంలోని భూమి ప్రజల ఆధీనముననే ఈనాటికీ నిలుపుకొనడం ఈ గ్రామ వ్యక్తిత్వానికి నిదర్శనం.

రాల్ గరిగించు విమలగాంధర్య విద్యల విఖ్యాతి గాంచిన చల్లపల్లి సీతారామయ్య, సుబ్బయ్య సోదర ద్వయం, పంచనదీశ్వర శర్మ, పురుషోత్తం సోదర ద్వయం ఈ వూరివారే. శ్రీ సుబ్బయ్య గద్వాల సంస్థాన విద్వాంసులుగా గౌరవింపబడినారు.

భరతనాట్యమును బోధించే గరడీలు కూడా వుండేవి. వీరు వీధినాటకముల ప్రదర్శనల నిచ్చేవారు. ఆనాడు భరతనాట్యమున ప్రసిద్ధిపొందిన కళావంతులకును ప్రసిద్ధి గాంచినది మా వూరు. 1900 వ సంవత్సరములకు పూర్వమే గొట్టిపాటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఘంటసాల సీతారామయ్యగారలు ఆంగ్లవిద్యలో పట్టభద్రులుగా ఆ గ్రామమునకు ప్రతిష్ట నార్జించారు. చిన్నవయస్సుననే వారిరువురు పరమపదించడం మా గ్రామ దురదృష్టం. వేదాంత తర్కశాస్త్రములలో వుద్దండుడైన పండితుడనిపించుకున్న చింతలపాటి లక్ష్మీపతి శాస్త్రిగారిదీ ఈ వూరే.

బందరు బ్రహ్మమందిరమున వసతి ఏర్పరచుకొని చదువుకొను విద్యార్థులం 1914లో ఒక గ్రంథాలయమును ఏర్పాటు చేసుకొని దానికి శ్రీ రామమోహన గ్రంథాలయ మని పేరు పెట్టుకున్నాము. దీనికి అనుబంధముగ వేసంగి సెలవులలో వయోజన పాఠశాలలను కూడా నడిపాము. ఈ కార్యకలాపములకు మేము దిగుటకు "కృష్ణాపత్రిక" సంపాదకులు శ్రీ ముట్నూరి కృష్ణారావు పంతులుగారి ప్రభావం మాపై ప్రసరించుటయే కారణం. మా విద్యార్థి బృందమునకు నాయకుడుగా, మమ్ములను జాతీయ భావప్రేరితులుగా చేసిన సోదరుడు గొర్రెపాటి వెంకటేశ్వర్లుగారు 1917లోనే ఆకస్మికముగా మమ్ములను వీడి స్వర్గస్తులగుట మా గ్రామమునకు వచ్చిన మరొక దురదృష్టం.

ఒక దృష్టిలో 1917 మా గ్రామచరిత్రలో చెడ్డసంవత్సరమనుకున్న రోజులు గలవు. అప్పుడు బందరులో ఆంగ్లభాష చదువుతున్న పదిహేడుమంది యువతులు అనారోగ్య



కారణముననో, కుటుంబకష్టపరంపరలవల్లనో చదువులకు స్వస్తిచెప్పి గ్రామములో కుదురు కొనుట తటస్థించింది. నేటి పరిణామమునుబట్టి ఆ చదువు సంధ్యలు మానినవారు అంతోఇంతో దేశసేవచేసి, గ్రామానికి పేరు ప్రతిష్టలను ఆర్జించుటేగాక గ్రామాన్ని ఆధునిక సౌకర్యాలతో, వసతులతో సౌభాగ్యవంతముగ ధనధాన్యముల రాశిగా చేసిన ఘనతను ఆర్జించుకున్నారు. కాబట్టి, 1917 మాకు యోగదాయకమైన సంవత్సరమనే చెప్పక తప్పదు.

## స్వాతంత్ర్య దుందుభి

1917 మాంటేగ్, చెమ్స్‌ఫర్డు సంస్కరణల అవతరణ సంవత్సరం. అఖిల భారత కాంగ్రెసు స్వాతంత్ర్య దుందుభి మమ్ములను ఆకర్షించింది. మేము నడుములు బిగించి దేశసేవకు మమ్ములను మేము అర్పించుకుంటిమనవచ్చు. కాంగ్రెసు ఆదేశాన్ని అనుసరించి కాంగ్రెస్, ముస్లింలీగ్ ప్రణాళికపై సంతకములను గ్రామాల వెంట తిరిగి సేకరించడంతో మా రాజకీయ కార్యక్రమం ప్రారంభమైంది.

మదరాసు రాష్ట్ర శాసనసభకు 1920లో జరిగిన ఎన్నికల సందర్భమున కాంగ్రెసు ఆదేశాన్ని అనుసరించి మా తాలూకా అంతటా వోట్లు యివ్వవద్దని మేము ప్రచారం చేశాము. మా పోలింగులో పదమూడు గ్రామములు కలవు. పది రూపాయల శిస్తు యిచ్చే వారందరు వోటర్లు. మా పోలింగులో గ్రామ మునసబు, కరణములతో సహా ఎవరును వోటు చేయలేదు. ఖాళీపెట్టెలను పదిలంగా సీలువేసి ఉద్యోగులు పంపారు. మదరాసు రాష్ట్రమునగల ఇరువది ఆరు జిల్లాలలో మా ఒక్క పోలింగులోనే ఖాళీపెట్టెలను పంపిన ఘనత దక్కించుకున్నాము. దీనితో మా గ్రామం కాంగ్రెసుకు పెట్టనికోటగా పరిఢవిల్లినది.

తిలక్ స్వరాజ్యనిధి, గాంధీ పూజానిధి వసూళ్ళను అన్ని వృత్తులవారి నుంచి మేము ఐచ్ఛికముగ తగుమాత్రం ధనం వసూలు చేసి సమర్పించిన సందర్భమును పురస్కరించుకొని డాక్టర్ పట్టాభి సీతారామయ్యగారు వారి "జన్మభూమి"లో ప్రాచీన సాంప్రదాయములతో గ్రామ సమిష్టి కుటుంబతత్వమును నేటికీ ఆచరించుచున్న గ్రామము "ఘంటసాల" అని 1923లో ప్రశంసించారు. 1923లో ఖద్దరు వుత్పత్తి సంస్థను స్థాపించి 1929లో అఖిలభారత ఖద్దరు ప్రతిష్ఠాపనకు స్వాధీనపరచే వరకు సమర్థతతో నిర్వహించి ఘంటసాల ఖద్దరు మన్నికకు, నిర్దుష్టతకు పేరు ప్రతిష్టలు అలవరచుకున్నది.

మద్యపాన నిషేధమును దీక్షతో అమలుపరచి చుట్టుప్రక్కల అనేక గ్రామాలలో పికెటింగులు వగైరా జరిపి, అనేకమంది స్త్రీ పురుషులు జైళ్ళయాత్రలను చేశారు.

1918 ఏర్పడిన పంచాయితీ బోర్డుకు పదహారు సంవత్సరములు పోటీ లేకుండా చేసి, ఐకమత్యంతో సమిష్టిగా సేవాతత్పరతతో గ్రామాభివృద్ధికి పాటుబడడం జరిగింది.

మహాత్ముని ఆదేశాన్ని అనుసరించి గ్రామంలో క్రిమినల్, సివిల్ కేసులను కోర్టులకు వెళ్ళకుండా పంచాయితీ ద్వారా పరిష్కరించుకుంటూ పది సంవత్సరాలు ఆదర్శప్రాయంగా వ్యవహరించాము. అనేకసార్లు పోలీసు ఉద్యోగుల ఆర్భాటములకు, మందగింపులకు గురి అయినా, మా దీక్ష మొక్క వోవలేదు.

హరిజనోద్యమంలో కూడా ముందంజ వేశాము. 1933లో మహాత్ముడు కృష్ణాజిల్లా సంచారంలో చల్లపల్లిలో జరిగిన బహిరంగసభలో హరిజనోద్యమ సందర్భమున హరిజనులకు దేవాలయ ప్రవేశం కలుగజేసిన ఘంటసాలను అనుసరించవలసిందిగా హెచ్చరించి మమ్ము లను ఆశీర్వదించారు.

1920 నుంచి స్వరాజ్య సంసిద్ధి వరకు జరిగిన అన్ని ఉద్యమాలలోను పాల్గొని స్వరాజ్య సంపాదనకు తోడ్పడి, శ్రమించి, ఆంధ్రదేశమున ప్రథమ, ద్వితీయశ్రేణిలో నిలచిన బిడ్డలను కన్న గౌరవం మా గ్రామం పొందినది. మా యువజనబృందమునకు తోడ్పడి గ్రామప్రతిష్ఠ పెరగడానికి మాకు చేయూత నిచ్చిన పెద్దలు కీర్తిశేషులు గొర్రెపాటి వెంకయ్య ద్వయం, వేమూరి వెంకయ్య, ధర్మయ్య, కొండపల్లి సుబ్బయ్య, దోనేపూడి వెంకట్రాయులు, గొర్రెపాటి గోపాలకృష్ణయ్యగారలు స్మరణీయులు.

ప్రజోపయోగమైన గ్రామ సమిష్టి కార్యక్రమముల నిర్వహణ ద్వారా గ్రామానికి అన్ని సౌకర్యములు చొనగూర్చే కార్యక్రమములకు ప్రత్యేకశ్రద్ధ 1920 నుంచి తీసుకొంటు న్నాము. గ్రామస్థులు విరాళము యిచ్చి పనులు చేయించుకొనడానికి ఆ రోజులలో ముందుకు రావడం అరుదు. 1920, 23 సంవత్సరంలో విరాళమిచ్చి రెండుచప్టాలు, తరువాత రెండు వంతెనలు నిర్మించుకున్నాము. ప్రభుత్వ సహాయంతో నాలుగుమైళ్ళ కంకరరోడ్డు, పల్లపు సాగుకు రెండు పంటకాల్వలు, ఒక హైస్కూలును ఏర్పరచుకున్నాము. ఈ హైస్కూలు విద్యార్థులు సుమారు నూరుగురు పట్టభద్రులు నేడు మావూరులో వుండడం సంతోషం. ఒక విశాల పరపతి సంఘం, ఒక భూమి తనఖా బ్యాంకి ఆదర్శప్రాయంగా పనిచేస్తున్నవి. చేనేత పారిశ్రామిక సహకార సంస్థలు ఆరు, రెండు ఖద్దరు ఉత్పత్తి విక్రయసంస్థలు కలవు. టెలిగ్రామ్, టెలిఫోన్ ఆఫీసులు కలవు. లోకల్ లైబ్రరీ అధారిటీ ఆధ్వర్యాన గ్రంథాలయం, ప్రభుత్వంవారి విత్తనముల క్షేత్రం ఉత్తమశ్రేణికి చెందినవి కలవు. ఇది ధర్మగోటకములోనిదే. ఇక్కడనే, ప్రభుత్వంవారు వ్యవసాయ పాఠశాలను 1964లో స్థాపించారు. ఇది రాజేంద్రనగర్ విశ్వవిద్యాలయమునకు అనుబంధంగా వుండగలదని ఆశిస్తున్నాము. రక్షిత, నీటి సప్లయి ఏర్పడడానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నాము, మా గ్రామ పంచాయతీ ద్వారా.

1917లో చదువులు మానిన యువకులు గ్రామసేవ, దేశసేవలకు అంకితమైన స్వరాజ్య సంరంభంలోను, స్వరాష్ట్ర సంపాదనలోను కష్టనష్టములకు గురి అయి జైళ్ళయాత్రలు చేసినవారు నేడు వృద్ధులుగా పరిగణింపబడుతూ, వోపినంత ప్రజాసేవ చేయడం మా గ్రామానికి గర్వకారణం. ❑



# 'మా పూర్వీకులు - పుట్టు పూర్వోత్తరాలు'

**మా** ముత్తాత గంగయ్యగారు, గుంటూరుజిల్లా గొట్టిపాడు నుంచి వచ్చి ఘంటసాలకు ఆరుమైళ్ళ దూరంలో శ్రీకాకుళమునకు దగ్గరగానున్న చినకళ్లేపల్లి గ్రామంలో వారి అత్తవారు ఇనుగంటివారింట స్థిరపడినారు. గొట్టిపాటివారి ధర్మవనం తోట ఈ గ్రామంలో ఉండేది.

ఈయనకు భూమి, పుత్ర గలవు. మంచి వ్యవసాయకుడు. ఈ గంగయ్య గారి భార్య వీరమ్మ. వీరు ధర్మబుద్ధిగల ఆదర్శ దంపతులు. గంగయ్యగారు వ్యాధిగ్రస్తులై మరణించారు. భర్త మరణించిన వెంటనే భర్తతోడిదే లోకమని భావించే పతివ్రత వీరమ్మగారు నూతిలోపడి మరణించింది.

వీరి ఏకైక పుత్రుడు బ్రహ్మయ్య. అప్పటి కాయన వయస్సు ఎనిమిది సంవత్సరాలు మాత్రమే. ఆయన రక్షణ భారం భగవంతునిపై పడింది.

## "మా తాత సుబేదారు బ్రహ్మయ్యగారు"

తల్లిదండ్రులు లేని ఆయనను భాగవతుల కూచిపూడికి దగ్గరగా వున్న పెదపూడిలోని ఆయన మేనత్త తీసుకువెళ్ళి కన్నకుమారునిగా మూడేండ్లు సాకినది. వారింటి పేరు వేములపల్లి వారు. వారికి బంధువు ఘంటసాల కాపురస్తుడు, అయిన పూడి రామన్నగారు. పెదపూడి వెళ్ళినపుడు ఈ కుర్రవానిని ఆయనకు అప్పగించినారు. ఆయన సంపన్న గృహస్థు, అపుడు పల్లపు సాగులేదు. అతివృష్టి అనావృష్టులవల్ల మెట్టపైర్లు దెబ్బతిని రైతు తనను తాను పోషించుకొనలేని స్థితిలో వున్నాడు. వ్యవసాయం గిట్టుబాటు కావడంలేదు. వ్యవసాయదారు గౌరవంగా జీవించుటకు మరొక వుపవృత్తి అవసరమయ్యేది. ఈ రామన్నగారు మరికొందరు ఆసామీలను కలుపుకొని కొన్ని బండ్లను సమకూర్చుకొని జగ్గయ్యపేట, హైద్రాబాదులకు బాడుగకు తోలి రెండు మూడు నెలలు శ్రమచేసి కొంత డబ్బు కూడబెట్టుకొని దానితో శిస్తు దస్తులు చెల్లించుకుంటూ భూములను నిలబెట్టుకొనేవాడు.

బాలుడైన బ్రహ్మయ్యను రామన్నగారు తమ బండ్లవెంట తీసుకునివెళ్ళేవారు. అందరిలోకి చిన్నవాడైనా ఆత్మాభిమానంగల ఈ బ్రహ్మయ్య వారు చెప్పే పని పాలు చేయుటకు మనస్కరించక ఆ బండ్లను వదలి దారి తెన్ను తెలియని ఆ అడవిలో కొంతదూరం పోయి అలసి ఒక చెట్టునీడను విశ్రమించి వున్నాడు. ఆ దారిని పోయే కొంతమంది మిలటరీ సిబ్బందిలో ఒక ఆంగ్లేయ సేనాధిపతి వచ్చి మంచి అందచందాలుగల బ్రహ్మయ్యను చూచి

ముచ్చట పడినాడు. కొద్దిరోజుల క్రితం తన కుమారుని పోగొట్టుకొనిన ఆయన హృదయం పుత్రప్రేమతో ముప్పిరిగొని ఈ బాలుని గురించిన వివరములు తెలుసుకొని తల్లిదండ్రులు లేని అనాథబాలుడుగా గుర్తించి తన వెంట వస్తే విద్యాబుద్ధులు నేర్పి సేనలో చేర్పింతుననగా అంగీకరించి బ్రహ్మయ్య ఆయనవెంట వెళ్ళాడు. చదువు సంధ్యలు నేర్పించి పదునెనిమిది సంవత్సరములు వెళ్ళడంతోడనే ఆయనను మిలిటరీలో చేర్పించి తన కుమారునివలె ప్రేమతో చూచుకునేవాడు.

ఈయన ఆజానుబాహువు. అందమైన ముఖవర్చస్సు. వీరత్వం వుట్టిపడే గాంభీర్యం. పై ఉద్యోగులను ఆకర్షించి వారి మన్ననలకు పాత్రుడైనాడు. ఈయనను పెంచి, పోషించి, విద్యాబుద్ధులు చెప్పించి బ్రతుకుతెరువు కల్పించి ఒకదారిని పెట్టిన సేనాధిపతి పింఛను తీసుకుని ఆంగ్లదేశం వెడుతూ తనస్థానే వచ్చినవారికి ఆయనను అప్పగించి ఆశీర్వదించాడు. ఆయనకూడా బ్రహ్మయ్యను ప్రేమతో చూచేవాడు. ఆయన ఇంటిలో లేని సమయాన ఒకరాత్రి ఇంటిలో దొంగలు పడటం, ఆ దొంగలను బ్రహ్మయ్యగారు పట్టుకొనడం అందుపై ఆయన భార్య ఆయన సేవను ప్రశంసించడం జరిగింది.

కొంతకాలానికి బ్రహ్మయ్యగారు నెలకు ఇరవై అయిదురూపాయల జీతంగల జమేదారయ్యాడు. జమేదారుగా వున్నప్పుడు సెలవుపై ఘంటసాల వచ్చి అయినపూడి రామన్నగారింటనే బసచేసి పెండ్లి చేసుకొనుటకు సంబంధములకై అన్వేషించాడు. అప్పుడే ఘంటసాల కాపురస్తులగు మా మాతామహుడు కొండపల్లి చిట్టెన్నగారితో స్నేహం ఏర్పడింది. ఘంటసాల శివారు ఘంటసాల పాలెం కాపురస్థుడు వేమూరి కొండన్నగారి చెల్లెలు అచ్చమ్మగారిని వివాహం చేసుకొని భార్యను, అత్త వెంకమ్మగారిని తీసుకొని తిరిగి ఉద్యోగంలో చేరారు.

అచ్చమ్మగారు స్ఫురద్రూపి. పసిమిఛాయ, సత్వగుణము కలది. పూజా పునస్కారాలు నిత్యం చేసేది. తరువాత కొంతకాలానికి బ్రహ్మయ్యగారు నెలకు యాభూరూపాయల జీతంగల హవల్దారయ్యాడు. మరికొంతకాలానికి నెలకు నూరు రూపాయల జీతంగల సుబేదారయ్యాడు. ఈయన నూర్గురు సైనికులకు అధిపతి. వారికి ప్రతిదినం కవాతు వగైరా తర్ఫీదునిస్తూ అవసరమైనపుడు సేనాని ఆజ్ఞలను అనుసరించి యుద్ధమునకు తయారుగా వుంచడం ఆయన విధి. ఈయన బర్మాలోని ఆవా యుద్ధంలో పాల్గొన్నారు ముఖముపై ఒక కత్తి దెబ్బ ఆనవాలు కలదు. ఒకసారి యుద్ధంలో గుండు దెబ్బకు గురికానున్నప్పుడు తలవంచి కూర్చొనగా అది పైగా దూసుకుపోవటంవల్ల ప్రాణాపాయం తప్పినది. ఈయన పాపభీతి, ధర్మనిష్ఠ, భక్తి తత్పరత గలవాడు. అతనిక్రింది ఉద్యోగులైన సైనికులను ప్రేమతో చూస్తూ వారి భక్తిని చూరగొనేవాడు.

సుబేదారుగా వుండగా ఇప్పుడు మేము వుంటూవున్న పెంకుల భవంతిని కొని దానిని మా మాతామహుడు చిట్టెన్నగారి ఆజమాయిషీలో వుంచి తిరిగి పటాలానికి వెళ్ళారు.



మద్రాసు రాజధాని నుంచి పందొమ్మిదిమంది పటాలపు వుద్యోగులను ఏరి విక్టోరియా మహారాణి దర్శనానికి పంపిన సందర్భంలో ఈయన వారిలో ఒకడుగా బ్రిటన్ వెళ్ళివచ్చారు. ఈ సందర్భమున ఆయనకు విక్టోరియారాణి పతకం బహూకరించారు.

ఆయనది 25 రెజిమెంటు (సి) కంపెనికిన్ని పటాలము మూడవ కంపెనీ అయివున్నది. ఆయన బళ్లారి, కన్ననూరు, రాయవేలూరు కంటోన్‌మెంట్సు (సైనికులుండే ప్రదేశం)లో హెచ్చుకాలము గడిపాడు. కన్ననూరు (మలబారు)లో మా తండ్రి వీరరాఘవయ్య, మా పినతండ్రి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిగార్లు జన్మించారు. ఘంటసాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిపట్ల బ్రహ్మయ్యగారికి భక్తి కుదిరింది. ప్రతి సంవత్సరం జీవితాంతం వరకు మార్గశుద్ధ షష్ఠి ఉత్సవమునకు మూడు రూపాయలు పంపుతుండేవారు. ఆ దేవునిపేరే రెండవ కుమారునికి పెట్టుకున్నారు.

రాయవేలూరులో వుండగా మా నాయనమ్మ అచ్చమ్మగారు పరమపదించింది. ధర్మపత్ని తనను విడిచి స్వర్గస్తురాలైనందుకు ఆయన దుఃఖసాగరమున మునిగాడు. కొంతకాలానికి దుఃఖాన్ని దిగమింగి, తిరిగి వివాహం చేసుకొన నిశ్చయించాడు. తన బిడ్డల పోషణకు భార్య అవసరమని భావించాడు. అయితే, అనంతరం ఆయన అధికంగా ప్రేమించిన కుటుంబ గౌరవ ప్రతిష్ఠలను అనేక రెట్లు పెంచి ప్రజా మన్ననలకు పాత్రుడైన త్యాగమూర్తి అయిన జ్యేష్ఠకుమారుని ఈ రెండవ భార్య కుటుంబాస్తి దక్కించుకోవలెననే పేరాశతో విషప్రయోగంతో పొట్టన పెట్టుకుంటుందని ఆయన ఆనాడు కలలోనైనా తలంచలేదు కదా?

సంతానం కోసం వివాహము అనే ఉత్తమాదర్శము సర్వత్రా సర్వకులాలలోను అనుష్ఠించడం ఉత్తమం. ఏ పరిస్థితిలోను సంతానం కలవారు తిరిగి వివాహం చేసుకొనుట సర్వానర్థాలు కారణమగుననే సత్యాన్ని పైసంఘటన ఋజువు పరచినది. ఇట్టి నిదర్శనము లెన్నో కలవు.

ఆయన సెలవుపై ఘంటసాల వచ్చాడు. గుడివాడ తాలూకా యలకుర్రు అగ్రహారం కనకమేడల రామన్నగారి సోదరి కాంతమ్మను వివాహం చేసుకున్నారు. ఈవిడకు నలుగురు కుమార్తెలు. ఒకావిడ వివాహం కాకముందే పరమపదించింది. ఇద్దరు వివాహమైన తర్వాత నిస్సంతుగా చనిపోయారు.

సేనాధిపతి ప్రాపకం తన కున్నందున కొలదికాలంలో మేజరు సుబేదారు అయి, రెండువందల రూపాయల జీతం తీసుకొని నూరు రూపాయల పెన్షన్‌లో ఉద్యోగం విరమించ వలెననే తన కోరికకు భిన్నంగా తన క్రింద ఉద్యోగి మానుకోదగిన వయస్సుగలవాని అసహనాన్ని, ఆతృతను గుర్తించి తన బిడ్డల క్షేమమునకు తాను వెంటనే వుద్యోగం నుంచి విరమించుకుని క్రింది వుద్యోగి ప్రమోషన్‌కు అవకాశమిచ్చుటే ఉత్తమమని భావించి ఆ విషయాన్ని సవివరంగా సేనానికి నచ్చజెప్పి నెలకు 50 రూపాయల పెన్షన్ తీసుకునే పద్ధతిని

ఘంటసాల వచ్చి తాను నిల్వ చేసుకొనిన డబ్బుతో 22 ఎకరాల మెరక భూమిని, కొన్ని పశువులను కొని వ్యవసాయకుడైనాడు. రెండు అరకలతో శ్రద్ధగా వ్యవసాయం, పశుపోషణచేస్తూ ఇతరులకు ఆదర్శప్రాయంగా వున్నాడు.

ఈయన నిత్యము జపతపాలు, ప్రతి శుక్రవారం దేవీపూజచేస్తూ వుండేవారు. అర్థించేవారికి లేదనకుండా తన శక్తికొద్ది దానధర్మాలు చేస్తూ వుండేవారు. బంధువుల పిల్లలకు మా వీధి పిల్లలకు తరచు చిరుతిండ్లు పెట్టి ఆనందించేవారు. కూరగాయలు కోకొల్లలుగా కాయించి నిత్యం మావైపు వారికి యివ్వడం, శుభకార్యాలలో బంధువులకు పంపడం జరుగుతుండేది.

ఈయనకు బ్రాహ్మణ భక్తి హెచ్చు. శుభకార్యములలోనేగాక ప్రతినెల పెన్షను తెచ్చుకున్న మరునాడు నలుగురు బ్రాహ్మణులను సన్మానించేవారు.

గ్రామ వ్యవహారములలో ఎట్టి సంబంధమును పెట్టుకునేవారు కాదు. సన్నిహిత బంధువులతో తప్ప ఎవరితోను పొత్తుపొందికలు ఆయనకు ఉండేవి కావు. తన ఇంటికి ఎవరు వచ్చినా వయస్సుతో నిమిత్తం లేకుండా చిన్నలను, పెద్దలను గౌరవించేవారు. ఆయన మితభాషి. అధిక ప్రసంగాలు ఆయనవద్ద పనికిరావు. అధిక ప్రసంగి ఆయనచేత చివాట్లు తినకుండా బయటపడడం అరుదు. ఆయనకు 'శ్రీయః పతి దయవల్ల, పైగానుంచి వచ్చి" అనేవి ఊతపదాలు. ఇవి సంభాషణలో తరచు వుపయోగించేవారు. ఎవరైనా తనపని ముగించుకుని వెళ్ళక అధిక ప్రసంగం చేస్తే "పై గానుంచి వచ్చి పెద్దమనిషివని మర్యాదచేస్తే ఏమిటయ్యా అధికప్రసంగం? వెళ్లు వెళ్లు" అని గద్దించేవారు. కోపంవస్తే ఆయన ఎదురుగా నిలుచుండటం అసంభవం. ఒకరితో ఆయనకు జోక్యం లేదు. తన వ్యవహారంలో ఎవరు ఎట్టి జోక్యం పెట్టుకున్నా సహించేవాడు కాదు. పట్టుదల చాలా హెచ్చు.

ఒకసారి గ్రామమునసబు గొ౹రైపాటి బాలకృష్ణమ్మగారు కోమట్ల చెరువులో ఇటుకరాయి తీయించుటకు కళ్లం తయారుచేయించగా, ఆ రాయి తీస్తున్న గంగయ్యతో "నేను రోజూ పొలం వెళ్ళేదారి ఇది. ఒక గజం వెడల్పున రాయితీయకుండా ఖాళీగా వుంచు. నేను చెప్పానని మునసబుగారితో చెప్పు" అన్నారట. కాని దారి వదలకుండా రాయి తీసివుండుట చూశారు. "ఏమి గంగా, మునసబుగారితో చెప్పావా, లేదా" అని అడిగారు. "మునసబుగారితో చెప్పగా దారి వదలకుండా రాయి తీయమన్నారు" అని సమాధానం వచ్చింది. "అట్లాగా, మునసబు దారి అడ్డుకడతాడా చూస్తాను" అంటూ ఆ మూలనుంచి ఈ మూలకు ఇటుకరాళ్ళను తొక్కుకుంటూ రెండుమూడు రోజులు నడిచారు. మునసబుగారు "ఆయనతో మనకు తగాదా ఎందుకు? ఆయన ఏమి చేస్తాడో చూద్దామని నీతో అలా చెప్పాను దారి వదలి మిగతా ప్రదేశంలో రాయితీయ"మని చెప్పడం జరిగింది.

ఒకసారి ఆయన నెలసరి ఫించను తెచ్చుకొనుటకు డిప్యూటీ కలెక్టరు ఆఫీసుకు వెళ్ళగా, ఆయన లేచి కుర్చీ యిచ్చి మర్యాద చేయలేదు. వెంటనే కలెక్టరుకు ఫిర్యాదు చేసి



"నేను ధరించిన విక్టోరియా రాణి పతకమును ఈ విధంగా అవమానపరచి నందుకు క్షమాపణ యిప్పిస్తారా లేక మా కమాండర్‌కు రిపోర్టు చేయమన్నారా?" అని నిష్కర్షగా అడగడం, డిప్యూటీ కలెక్టరుచే క్షమాపణ చెప్పిండచం జరిగింది.

ఒకసారి శ్రీకాకుళం స్వాములవారు శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వరస్వామివారి ఆలయ ముఖమండప నిర్మాణమునకు డబ్బు వసూలుచేస్తూ ఆయన శిష్యుడగు బాలకృష్ణమ్మగారితో (మునసబు) సహా పెక్కుమందిని తీసుకొని మా ఇంటికి వచ్చారు. ఆ సమయంలో మా తాతగారు జపం చేసుకుంటున్నారు. మా నాయనగారు, ఆయన ప్రియమిత్రులు దోనెపూడి వెంకట్రాయుడుగారి వారిని కూర్చుండపెట్టారు. కానీ, జపం చేస్తున్న మా తాతగారిని మాట్లాడించే సాహసం ఎవరికి గలదు? మా ఇంట్లో మా తాతగారు పటాలంలో వుండగా, కాపురమున్న పిశుపాటి వెంకటాద్రి గారిని స్వాములవారు "చాలా ఆలస్యమగుచున్నది. ఆయనను పిలువు"మని గద్దింపుతో హెచ్చరించారు. కాని, రెండుమూడుసార్లు వెంకటాద్రిగారు లోపలికి వెళ్ళివచ్చుట తప్ప వేరు పని జరుగలేదు. మా తాతగారు జపం పూర్తి చేసుకుని వచ్చిన తరువాత విషయం విని ఒక రూపాయి (ఆరోజుల్లో భూరి విరాళమే) ఇవ్వగా స్వాములవారు తీసికొని, "ఇంతసేపా" అని గద్దించారు. "స్వామీ మీరు వచ్చేటప్పుడు ఆ కుక్కను వెంట తీసుకు వచ్చారేమి? ఇంట్లో కట్టివేసి వస్తే బాగుండేది" అని సమాధాన మివ్వగా స్వాములవారు మారుమాట చెప్పకుండా నెమ్మదిగా వెళ్ళారు. వారు వెళ్ళిన తరువాత దోనెపూడి వెంకట్రాములుగారు "ఏమి పెదనాయనా! స్వాములవారిని అలా అన్నారు" అని ప్రశ్నించారు. "ఆ బ్రాహ్మణునికి బ్రాహ్మణేతరుడనైన నేను జపం చేసుకొనడం ఇష్టంలేదు. అందుకనే ఆ కోపతాపాలు. కాబట్టే ఆ కోపమనే కుక్కను వెంట ఎందుకు తీసుకువచ్చారు?" అని అడిగాను. "కోపం చంపుకోలేని స్వామి ఏమి స్వామి" అన్నారట.

వీరికి దృష్టి దోషమునందు చాలా నమ్మకం. తన పశువులనుగాని, వస్తువులను గాని ఎవరైనా బాగున్నవని వాటి వివరాలు తెలుసుకొనగోరితే అనవసర విషయములు మీకెందుకని గద్దించి వారిని ఆ చోటునుంచి పంపేవారు.

ఈయనకు తెలుగు వ్రాయడం, చదవడం, అరవం, ఉర్దూ బాగా మాటాడడం వచ్చు.

మా తల్లి కొండపల్లి చిట్టెన్నగారి రెండవ కుమార్తె యశోదమ్మ. కొండపల్లి వారితో వియ్యమందుట ఆయనకు చాలా సంతోషకరమైనది. ఆ పెండ్లి నాటికి తన మిత్రుడైన చిట్టెన్నగారు గతించినందున చాలా విచారించాడు. మా పెద్ద మేనమామగారి ప్రవర్తన ఆయనకు చాలా ఆమోదకరమైనది. మా నాయనగారితో "గ్రామవ్యవహారాలలో నీవేది చేసిన మీ బావమరిది సుబ్బయ్యతో ఆలోచించి చేయవోయి, అతను చాలా ఆలోచన, తెలివిగలవారు" అని అంటూ వుండేవారు. తన పెద్దకుమార్తెను అయినపూడి రామన్నగారి తమ్ముడు నరసయ్యగారి కుమారుని కిచ్చుట వలన చాలా ఆనందించారు.

ఇద్దరు కుమాళ్ళకు పెద్దకుమార్తెకు వివాహం ఆయన చేశారు.

సుబేదారు బ్రహ్మయ్యగారు 1897 జులై 31వ తేదీ హేవళంబి నామ సంవత్సరం శ్రావణ శుక్రవారం ఆయన స్థిరాస్థిని గురించి మరణశాసనము వ్రాశారు. ఆ తరువాత అయిదారు రోజులకే స్వర్గస్థులైనారు. ఆయన పరమపదించినది 1897 ఆగష్టు 5 లేక 6వ తేదీ. అప్పటికి వారి వయస్సు సుమారు అరవై మూడు సంవత్సరాలు.

నేను పుట్టినది 1898 డిసెంబరు 3వ తేదీ అనగా ఆయనగారు చనిపోయిన తరువాత ఒక సంవత్సరం నాల్గు మాసములకు అన్నమాట. అందుచేత ఆయన పేరే నాకు పెట్టారు. ❑



# జమీందారీ వ్యతిరేక పోరాటంలో ఘంటసాల గ్రామం ముందంజ

**నా** తండ్రి వీరరాఘవయ్యగారు ఆరడుగుల ఎత్తయిన వ్యక్తి. మంచి బలాఢ్యుడు. వెడల్పయిన రొమ్ము, సన్నని నడుం, రాజసము కలవాడు. ధైర్యసాహసాలకు పెట్టినది పేరు. అందగాళ్ళలో లెక్కించదగినవాడని చెబుతారు.

తెలుగు భాషలో ఆయనకు మంచి ప్రవేశం గలదు. కావ్యాలు, ప్రబంధాలను తన చిన్ననాటి సహపాఠి, తరువాత మహాపండితుడై ప్రసిద్ధి చెందిన మా గ్రామ కాపురస్తుడు చింతలపాటి లక్ష్మీపతిశాస్త్రిగారి వద్ద చదువుకున్నారు. కవిత్వ ధోరణి కూడా కలదు. మంచి వ్యవహర్త. గ్రామంలో నాయకత్వం సంపాదించుకున్నారు. చుట్టుప్రక్కల గ్రామాలలో మర్యాద, మన్ననలను పొందారు. చిన్నవయస్సులోనే గ్రామ వ్యవహారాలలో పాల్గొని న్యాయదృష్టితో వ్యవహరించేవారు. అన్యాయాన్ని ఎదుర్కొనడానికి జంకేవారు కాదు. నిర్మొహమాటంగా మాట్లాడడం ఆయన స్వభావం.

మంచి వ్యవసాయకులు. వ్యవసాయంలో అన్ని పనులు చేసేవారు. పనివారు రాతిగోడలు కట్టడం చూచి మా మేనమామగారి గోడ ఒకటి ఆయన స్వయంగా కట్టాడు. చేతి పనులు చేయడంలో ఆయనకు గల ఆసక్తికి ఇది నిదర్శనం. మా తండ్రిగారికి సాముగారడీలో కూడా మంచి ప్రవేశమున్నది.

గ్రామానికి సౌకర్యాలు కలుగజేయాలనే ఆసక్తి ఆయనకు కలదు. మా గ్రామానికి తూర్పున వున్న గండి కాల్వకు పశువులు, బండ్లు, వెళ్ళటానికి వీలుగా చప్టా వేయించవల సిందిగా ఆయన స్వదస్తూరితో వ్రాసిన అర్జీ నకలు మా పాత రికార్డులలో కలదు. (1920లో ఈ చప్టాను జిల్లా బోర్డు వారి సహాయంతో నేను వేయించుట జరిగింది.)

ఆ రోజులలో వ్యవసాయానికి తోడు మరో ఉపవృత్తి చేసుకుంటే గాని గౌరవ మర్యాదలతో కుటుంబయాత్ర సాగేదికాదు. ఆయన బండి రత్తయ్యగారితో కలసి ధాన్యం వ్యాపారం చేశారు. బందరు కాపురస్తులు కూనపరెడ్డి పాపయ్యగారికి కమీషన్ మీద ధాన్యంకొని తోలిపెట్టడం వల్ల కొంత ద్రవ్యార్జన చేసేవారు.

వీరి స్నేహాన్ని మరచిపోకుండా కూనపరెడ్డి పాపయ్యగారి కుమారుడు సుబ్బారావు. అచ్చయ్యగార్లు, పాపయ్యగారి భార్య. నేను బందరులో చదువుకునే రోజులలో నన్ను చాలా

ప్రేమించేవారు. ఆయన బందరుకు తరచు వెళ్ళే రోజులలోనే కృష్ణాజిల్లాలో మొదటివితంతు వివాహం జరిగింది. వరుడు శ్రీ చోడవరపు జగన్నాథరావుగారు. ఆవివాహమునకు ఆయన, దోనేపూడి వెంకట్రాయులుగారు హాజరై కట్నం కానుకలు చదివించారు. ఆ జగన్నాథరావుగారు బి.ఎ, ఎల్.టి. అయి నోబుల్ హైస్కూలులో నాకు థర్డు ఫారంలో విద్యాగురువు అయ్యారు.

ఘంటసాల దేవరకోట పరగణాలోనిది. ఈ పరగణాలో అరువది ఆరు ఊళ్ళు కలవు. ఈయన కాలంలో శ్రీరాజా యార్లగడ్డ మల్లిఖార్జున ప్రసాద్‌నాయుడు గారు జమీందారుడు. ఈయన మంచి వ్యవహారదక్షుడు, పరమ లౌకికమూర్తి. ఈ జమిందారీని హెచ్చు భాగ్యవంతమైనదిగాను ధనవంతమైనదిగాను చేసినది ఈయనయే. ఈయనకు పూర్వం కొన్ని వందల ఎకరాల స్వంత కమతపు భూములు మాత్రమే వుండేవి. ఆ సంఖ్యను ఐదువేల ఎకరాలకు పెంచినది యీయన రాజనీతియే.

గ్రామాలలో పూర్వం ఏర్పడిన గోభూములను భుక్తపరచుకొని స్వంత కమతాలుగా సేద్యం చేయించారు. దాదాపు యీ గ్రామాలన్నిటిలో రైతులు కమ్మవారు. ఈర్ష్యా ద్వేషాలతోనో – పెద్దరికం కోసమో ప్రతి గ్రామంలోను పార్టీలుండేవి. అందొక పార్టీని చేరదీసి సివిల్, క్రిమినల్ వ్యాజ్యాలలో వారికి ఆర్థికంగాను, ఉద్యోగస్తులకు సిఫార్సులు చేసి, తమ స్వంత కమతాల మీద నౌకర్లను ఆ గ్రామాల తగాదాలలో తనకు అనుకూలమైన పార్టీకి మద్దతునిచ్చి, వారిని తమ కనుసన్నల మెలిగేటట్టు చేసుకొనేవారు. ఈ పార్టీవారిచేత గ్రామపు ఉమ్మడి భూములను తమ స్వంత కమతములుగా ఖత్తు కవుళ్ళు వ్రాయించుకొని భుక్తపరచుకొనేవారు. ఎదురు తిరిగిన గ్రామస్థులమీద సివిల్, క్రిమినల్ కేసులు పెట్టించి హైకోర్టు వరకు ఈడ్చేవారు. ఆబోతుతో దుక్కిటెద్దు పోట్లాడలేనట్టే రైతులు ఈ జమీందారుతో పోట్లాడలేక, వ్యాజ్యాలు ఆడలేక ప్రాచీక కాలంనుంచీ గోభూములుగాను, ధర్మభూములుగాను వున్నవాటిని జమీందారుకు వదలుకొనడం తప్పలేదు.

జమీందారీ వ్యతిరేక పోరాటాలలో ప్రముఖ పాత్రవహించి వ్యవహరించిన ప్రజా నాయకుడు ఘంటసాల గ్రామమునసబు గొర్రెపాటి బాలకృష్ణమ్మగారు. జమీందారు వైపు పూర్తి మద్దతునిచ్చి వ్యవహరించిన గడుసరి, ఈ బాలకృష్ణమ్మ గారి రెండవ తమ్ముడు రామస్వామిగారు. ఘంటసాలలో ధర్మగోటకమని పిలుబడుతున్న గోభూమి సుమారు 270 ఎకరాలు కలదు. ఘంటసాల, ఘంటసాలపాలెం పశువుల మందలు వాటిలో పచ్చిక మేస్తుండేవి. ఇది అనాది నుంచి జరుగుతున్నది. దీనిపై శ్రీ మల్లిఖార్జున ప్రసాదనాయుడుగారి కన్నుపడింది. దీనికి తగిన వ్యూహరచనకూడా జరిగింది. రామస్వామిగారు తన పార్టీవారిచే ఖత్తులు వ్రాయించడం జరిగినది. జమీందారుగారి పూర్తి మద్దతుతో వ్యవహరించే రామస్వామి గారిని తట్టుకొనడం తమకు కష్టమైనపని అని, ఈ పోరాటంలో అపజయం పొందడం తథ్యమని, బలవంతులతో ఆజన్మాంతం విరోధం పెంచుకొనడం బహు చిక్కులతో కూడిన



సమస్య అని బాలకృష్ణమ్మగారు భావించారు. అనేక సందర్భాలలో జమీందారుని లక్ష్యం చేయక వ్యవహరించి శెహబాసనిపించుకున్న ప్రజానాయకులు బాలకృష్ణమ్మగారు. వృద్ధాప్యంలో జవసత్వాలుడిగిన కారణాన అట్టి నిర్ణయానికి తప్పనిసరిగా వచ్చినట్టు చెబుతారు.

దీనికితోడు చిరకాలం తాను చేసిన ప్రజాసేవను ప్రజలు గుర్తించక పైపెచ్చు కొందరు కృతఘ్నులుగా మారిన కారణంగా "ప్రజలకు చేసిన మేలు, పీనుగకు చేసిన జాగరణ ఒకటేరా నాయనా? అని వచించి తన పార్టీ వారి చేత కూడా 1898 సెప్టెంబరు 28వ తేదీన ఖత్తులు వ్రాయించారు. జమిందారు కోరిక ప్రకారం అప్పుడు జరుగుతున్న సర్వే లెక్కలలో "ఘోటకము జమీందారుగారి కమతము" అని కరణాల చేత వ్రాయించి దాని క్రిందా మా గ్రామ కరణాలందరిచేత సంతకాలు చేయించి తాను కూడా గ్రామ మునసబుగా సంతకం చేశారు. ఈ రిమార్కు గల దస్తూరి కరణాందరిలోను చిన్నవాడైన ఘంటసాల పున్నయ్యగారి కుమారుడు నరశింహం గారిది. కరణాలందరికి జమీందారు గారినుంచి వచ్చిన ధనం పారితోషికంగా ముట్టజెప్పడం జరిగింది.

ఈ పని జరిగిన తర్వాత ఘంటసాల నరసింహంగారు (ప్రస్తుతం కరణం రామారావు గారి తండ్రి) ఈ పాపకార్యమునకు చాలా పశ్చాత్తాపపడి రాత్రింబవళ్లు నిద్రాహారములు లేక ఆ పై రిమార్కు తన దస్తూరితోనే వున్నందువల్ల అందుకు పరిహారం తాను చేయకల పద్ధతులు ఆలోచించుకుని ఆ కాగితములు డిప్యూటీ కలెక్టరు ఆఫీసులో వుండగా వెళ్ళి ఆ రిమార్కును "ధర్మఘోటకము జమీందారు గారి కమతము కాదు" అని వివరించారు. ఈ విధంగా తప్పు దిద్దుకుని గ్రామానికి శాశ్వతమైన మేలు చేశారు.

మొదటి రెండు అక్షరాలు "ధర్మ" చివర రెండు అక్షరాల "కాదు" చేర్చి వెనుకటి అర్థము పూర్తిగా మార్చారు. వీరి సమయస్ఫూర్తి ప్రశంసించదగినది. గ్రామప్రజలకు శాశ్వత లాభము చేకూర్చిన గ్రామకరణము ఘంటసాల నరసింహం గారికి ఘంటసాల ప్రజలు శాశ్వతంగా కృతజ్ఞులు. శ్రీ నరసింహంగారు ఇలా సరిచేయడంలో సంప్రతింపులు, ప్రోత్సాహము యిచ్చినది మా నాయన వీర రాఘవయ్య, దోనెపూడి వెంకట్రాయులుగార్లు.

పేరు ప్రతిష్టలు, శక్తి సామర్థ్యాలు, వ్యవహారదక్షత కలిగిన బాలకృష్ణమ్మ, రామస్వామి సోదరుల నాయకత్వాన జమీందారు ధర్మఘోటకమును కబళిస్తుండగా – ఎదిరించడానికి శక్తిలేకపోయినా, ఈ అధర్మ కార్యమునకు అష్టాదశ వర్ణాలవారు లోలోపల కుమిలిపోతూ, దీనిని ఎదుర్కొనడానికి మార్గములను వ్యక్తులను అన్వేషిస్తున్నారని చెప్పక తప్పదు. ఈ వ్యవహారమునకు పూర్వమే బాలకృష్ణమ్మ, రామస్వామిగార్ల ప్రతిభ మధ్యందిన మార్తాండుని పగిది వెలుగుచుండిన కారణాన వారిని తేరిపార చూచుటకే గ్రామమంతా వెరవొందుతున్న దనడం అతిశయోక్తి కాదు. ముగ్గురు యువకులు అదను దొరికినపుడు వీరిని ఎదిరించడానికి లోలోన ఆలోచనలు చేస్తున్నారు. వారే (1) మా నాయన వీరరాఘవయ్య, (2) దోనెపూడి వెంకట్రాయులు (3) బాలకృష్ణమ్మగారికి అండ దండలుగా వుండే గొర్రెపాటి రంగన్నగారి

మనుమడు రామస్వామిగార్లు. బాలకృష్ణమ్మ, రామస్వామిగార్లు ఐక్యమత్యంగా ఉండే రోజులలోనే బాలకృష్ణమ్మగారి మొదటి తమ్ముడు శ్రీరాములుగారు గుడివాడ తాలూకా ప్రముఖులైన అడుసుమిల్లి సుబ్రహ్మణ్యంగారితో కమీషన్ కొట్టు వ్యాపారం సాగించడం, అందులో వారికి అభిప్రాయ భేదాలు రావడం, క్రిమినల్ కేసులకు కోర్టులకెక్కడం జరిగింది. శ్రీరాములు గారికి ఎదురుగా ఘంటసాలలో అడుసుమిల్లి వారికి అనుకూలంగా సాక్ష్యం చెప్పేవారు అవసరమయ్యారు. అపుడు పై ముగ్గురు బహిరంగంగా అవసరమైన సహాయం చేయడానికి అంగీకరించి, దోనేపూడి బాపన్న, దోనేపూడి వెంకయ్యగార్లను సాక్ష్యం పంపడం తటస్థించింది.

తర్వాత ధర్మఘోటకపు వ్యవహారంలో బాలకృష్ణమ్మ, రామస్వామిగార్లు జమీందారుకు అనుకూలమైనప్పుడు గ్రామములో అన్ని కులములవారి దృష్టి వీరరాఘవయ్య, వెంకట్రాయులు గార్లపై పడినది. (అప్పటి వీరి మిత్రుడు రామస్వామిగారు స్వర్గస్తులైరి) ఆయా కులాలలో ముఖ్యులు వీరిని కలుసుకొనటం జమీందారుకు వ్యతిరేకంగా వ్యవహరించడానికి వీరిరువురు కృత నిశ్చయులు కావడం జరిగింది. ఇక ఆర్థిక విషయము.

ఘంటసాలలో అన్ని వర్గాల వారి ఇళ్ళకు తిరిగి ఇంటికి రెండుఅణాల తక్కువ లేకుండా వసూలు చేయడానికి నిశ్చయించుకున్నారు. ఘంటసాల పాలెం సంపన్నులతో కూడిన గ్రామం. పరిగణా పెత్తనదారు వేమూరి వెంకట్రాయుడి గారి స్వగ్రామం. ఘంటసాలకు శివారు, ఈ ధర్మగోటకం ఘంటసాల - ఘంటసాలపాలెం మధ్య కలదు. రెండు గ్రామాల పశువులకు ఉపయోగపడుతుంది. వారితో సంప్రదించడానికి వెళ్ళగా వుద్దండులైన బాలకృష్ణమ్మ, రామస్వామిగార్ల అండ జమీందారుకు వుండగా ముక్కుపచ్చలారని పిల్లవాళ్ళు మీరేమి చేయగలరని ప్రశ్నల వర్షంచే నఖశిఖ పర్యంతం వీరి మనోనిబ్బరమును, కృతనిశ్చయమును పరిశీలించి ఆ గ్రామముఖ్యులు వేమూరి చినవెంకయ్య, తుమ్మల చన్నారాయుడు (కొత్తపల్లి మునసబు) మూల్పూరి రామస్వామిగార్లతో సంప్రదించి "మేము అయ్యే ఖర్చులో మూడవ వంతు భరిస్తాము. మా గ్రామ వ్యవసాయభూమి ఘంటసాల వ్యవసాయ భూమిలో సగంగాన ఆ ప్రాప్తిని, ఈ వ్యవహారంలో మీకు జయం జరగాలని మనోవాక్కాయ కర్మల ఆశీర్వదిస్తాము. నిరంతరం దేవుని ప్రార్థిస్తూ వుంటాము. కాని బలవంతుడైన జమీందారుతో ప్రత్యక్షంగా విరోధం కొని తెచ్చుకోము. మేము దెబ్బలాటలకు రాము, దస్త్రం కట్టి వ్యవహరించవలసిన వారు మీరే" అని చెప్పారు. ఆ షరతుల కన్నిటికి వీరంగీకరించి ఘంటసాల వచ్చి బ్రాహ్మణులు, వైశ్యులు, విశ్వబ్రాహ్మణులు, పద్మసాలీలు, కాపులు, గాజుల బత్తులు, ముదిరాజులు, యాదవులు, భజంత్రీలు, రజకులు, వీరి నాయకులందరిని ఒకచోట చేర్చి ముచ్చటించి, వారి అండదండలు తమకు నిరంతరం వుండగలవనే కృతనిశ్చయం ప్రోత్సాహం కలిగించుకున్నారు.

బ్రాహ్మణులకు నాయకుడు పిశుపాటి పెదసుబ్బయ్య, వైశ్యులకు గెల్లి సుబ్రహ్మణ్యం, విశ్వబ్రాహ్మణులకు వానపాముల సుబ్బారాయుడు, పద్మసాలీయులకు పోలన కోటప్ప,



భజంత్రీలకు చినముక్తేవి బసవయ్య, రజకులకు పోతర్లంక పిచ్చయ్య, వెంట్రప్రగడ లక్ష్మయ్య గార్లు నాయకత్వం వహించి చందాలు వసూలు చేయడం ప్రారంభించారు. గోటకమునకు సంబంధించిన పాతరికార్డులన్నీ అందుబాటులో కరణాలుంచారు. దీనికంతకు నాయకత్వం వీరరాఘవయ్య, దోనేపూడి వెంకట్రాయులుగార్లది. భూములకు ఖత్తులను వ్రాసిన రైతులు వేమూరి కోటయ్య వగైరా నాగళ్ళతో ధర్మ గోటకమును దున్నడానికి వచ్చారు.

(1) వేమూరి వెంకన్న (పెదకాపు), (2) యనిగళ్ళ శ్రీరాములు (3) వేమూరి రామస్వామి, (4) గొర్రెపాటి లక్ష్మన్నగారి కుమారుడు గోపాలుడు, (5) గెల్లి సుబ్రహ్మణ్యం, (6) దోనేపూడి బాపన్న, (7) దోనేపూడి వెంకట్రాయులు, (8) గొట్టిపాటి వీరరాఘవయ్య గార్ల నాయకత్వమున చాలామంది మమ్ములను చంపి ఈ భూమిని దున్నండని సాత్వికంగా వారలను నిరోధించారు. వారు కూడా తాము చేయునది అధర్మము అని తెలిసినవారగుటచే ఎట్టి దౌర్జన్యమును చేయక, ధర్మ గోటకమును దున్నకుండానే నాగళ్ళను తోలుకువెళ్ళి జమీందారుకు ఈ విషయం తెలియజేశారు. జమీందారు ఈ ఎనమండుగురిపైన క్రిమినల్ కేసు బందరు సబ్ మెజిస్ట్రేటు కోర్టులో దాఖలు చేయడం జరిగింది. రైతులకు, ప్లీడర్లు (1) శ్రీ వలూరి సూర్యనారాయణరావు పంతులు, బి.ఏ., బి.యల్.యల్.టి. (2) శ్రీ కటపటపు నరశింహం బి.ఎ.(జూనియరు). వీరు త్యాగబుద్ధితో తమ సర్వశక్తులను వినియోగించి న్యాయమునకై పోరాడిన ధీరమూర్తులు. వీరికి ఘంటసాల ప్రజల జోహార్లు. గ్రామంలో ఆబాలగోపాలము ధర్మగోటకం ప్రజలదే అని స్థిరపడటానికి రోజురోజుకు హెచ్చుగా ప్రజాభిప్రాయం వ్యక్తీకరించసాగారు.

గ్రామంలో శ్రీ జగదీశ్వరాలయమందు అన్ని కులాల ప్రజలు చేరి ఒక ధర్మగోటకం కమిటీని ఏర్పరచుకున్నారు. దానికి అధ్యక్షులు గొర్రెపాటి బ్రహ్మన్నగారి కుమారుడు వెంకయ్యగారు. ఉపాధ్యక్షులు, కోశాధిపతి కొండవల్లి చిట్టెన్నగారి కుమారుడు సుబ్బయ్యగారు (మా మేనమామ). కార్యదర్శులు మా నాయన వీరరాఘవయ్యగారు, దోనేపూడి వెంకట్రాయులు గారు, అన్ని కులాల ప్రముఖులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొనబడ్డారు. తరచు ప్రజాసమూహం గొర్రెపాటి బ్రహ్మన్నగారి కుమారుడు వెంకయ్యగారి అధ్యక్షతన సమావేశమై ఎప్పటికప్పుడు ఈ కేసుకు సంబంధించిన వివరాలు తెలుసుకొనడం ముందు కర్తవ్యమును గురించి నిర్ణయించుకొనడం జరుగుతుండేది. అధ్యక్షులు వెంకయ్యగారు అధ్యక్షపీఠం అధిష్ఠించినప్పుడు అందుకై ప్రత్యేకంగా ఏర్పరచుకొన్న దుస్తులు, సూటుకోటుతో వుండేవారు.

ఇదంతా చూచి తాము తప్పుదారిని పడడం గుర్తించి గ్రామవృద్ధ, విజ్ఞానవేత్త, పూజ్యులు బాలకృష్ణమ్మగారు తమకు గల పార్టీతో - అనగా కమ్మవారిలో హెచ్చుమందితో - ప్రజల పక్షాన చేరారు. ఈ సందర్భంలో ఆయన తనవారలతో "ప్రజావశీకరణరానాయనా ప్రజాశక్తి నెవరు అడ్డగించగలరు?" అని అన్నారట. వీరి చేరికతో పట్టపగ్గాలులేనంత శక్తి ఏర్పడింది. న్యాయం ప్రజల పక్షానవున్నా, న్యాయం వ్యక్తీకరించగల సమర్థులైన న్యాయవాదు

లున్నా మెజిస్ట్రేటు జమీందారు పక్షాన తీర్పునిస్తూ ఈ ఎనమండుగురికి అక్రమ ప్రవేశానికిగాను ఒక్కొక్కరికి ముప్పది అయిదు రూపాయలు చొప్పున జరిమానా విధించడం జరిగింది. అందుపై హెడ్‌క్వార్టర్సు డిప్యూటీ మెజిస్ట్రేట్ కోర్టులో 23-7-1900లో అపీలు చేశారు. ఆయన సమగ్రంగా విచారించి, జరిమానాను రద్దుచేయడమేగాక, జమీందారు ప్రజల ఆధీనంలోగల ధర్మగోటకమును ఆక్రమించుకొనవలెననే దురుద్దేశంతో ఈ క్రిమినల్ కేసు పెట్టి, సివిల్ కోర్టు ద్వారా పొందవలసిన లాభమును క్రిమినల్ కోర్టు ద్వారా పొందనెంచనని ఈ గోటకం ప్రజలదే కాబట్టి ఇండియన్ పీనల్‌కోడ్ 147, 447 సెక్షనులు అన్వయించవని తమ గ్రామ వుమ్మడి సొత్తును పరీక్షించుకొనడానికి చేసిన ప్రయత్నం సక్రమమైనదని తీర్పు చెప్పారు. ఈ న్యాయమూర్తి పేరు శ్రీ కె. శ్రీనివాసన్. ధనమునకు ధనవంతుల ప్రాబల్యమునకు లొంగక, ధర్మసంస్థాపనార్థం న్యాయపీఠ మేర్పడెనని నిర్ధారణచేసిన ఇట్టి మహామహునకు నా జోహార్లు.

ఈ కేసులో జమీందారుకు ఖర్చు ఇరవై వేలు, ప్రజలకు అయినది మూడు వేలు. రాత్రిళ్లు గ్రామంలో చందాలు వసూలు చేసుకొని, తెల్లవారుసరికి, బందరు వెళ్ళి ముద్దాయిలకు, సాక్షులకు కూనపరెడ్డి వారింటిలో స్వంతంగా వంటచేసుకోవడం ప్లీడర్లకు వ్యవహార సందర్భమున సంజాయిషీ సాధన సామగ్రి అందజేయడం వీరరాఘవయ్య, వెంకట్రాయులగార్ల పని. అన్ని కాగితాలకు నకళ్లు మా నాయనగారి దస్తూరిలో ఇప్పటికీ కలవు. గోటకం సుబ్బయ్య అనే సార్థక నాయధేయుడైన పిశుపాటి పెదసుబ్బయ్య, పోలన కోటప్ప, వానపాముల సుబ్బారాయుడు, గెల్లి సుబ్రహ్మణ్యంగార్లు వగైరాలు చేసిన సేవ అపారం. గ్రామం నేటికీ వారికి ఋణపడి వున్నది. ❑



# మా కుటుంబానికి కలిగిన విపత్తు

**మా** నాన్నగారు చనిపోయే నాటికి హైకోర్టులో కొంత వ్యవహారకాండ పూర్తి కావలసి వున్నది. అందుకు సంబంధించిన కాగితాలు వగైరాలు మా మేనమామ గొర్రెపాటి చిన నరసన్నగారి కుమారుడు వెంకయ్యగారికి (బాలకృష్ణమ్మగారి ప్రథమ అనుచరుడు, శిష్యుడు) యిచ్చి వున్నారు. ఆ వ్యవహారాలను వారు జయప్రదంగా నిర్వహించారు. ఈ వెంకయ్యగారు ఆ రికార్డునంతా ఒక రోజున “ఇది మీ నాయనగారి రికార్డు నీ దగ్గిరే వుండదగినది” అని చెప్పి నాకు యిచ్చారు. ఆ ధర్మగోటకం రికార్డు అంతా నేటి వరకు నా దగ్గర భద్రంగా ఉంది.

నాకు రెండవ సంవత్సరం జరుగుతుండగా, మా నాయనగారు అకస్మాత్తుగా పరమపదించారు. ఆయన తమ 28వ సంవత్సరమున అనగా 1890 మార్చి (వికారి సంవత్సర ఫాల్గుణ శుద్ధ పాడ్యమి) నాడు కన్నుమూశారు. ఆయన పరమపదించిన రోజున ఆయన సన్నిధిలో ఆయన ఆప్తమిత్రులు దోనేపూడి వెంకట్రాయులు, బండి రత్తయ్యగార్లు వుండి పరిచర్యలు చేశారు. ప్రథమంలో కలరా అనుకున్నారు. తరువాత ఆయన భుజించిన ఆహారంలోని కొంతభాగం పెంటపోగులో వేయగా, దానిని తిన్న కుక్కలు, కోళ్లు, కాకులు చచ్చినవి. అందువలన విషప్రయోగమని నిర్ధారణ అయింది. ఆ రోజున మా తల్లి సూర్యనమస్కారాలు చేస్తూ వుపవాసం వున్నందున మా నాయనగారి సవతితల్లి వంటచేసింది. ఆ వంటలో నాభి కలిపినట్టుగా తలచారు. ఈవిడకు వత్తాసు మా పినతండ్రిగారి భార్య మేనత్త వెంకమ్మ అని ప్రతీతి. అంతకుముందు వారంరోజుల క్రితం నాకు విషపూరితమైన ఎర్ర నిప్పులపుల్లలు అరగదీసి పోసినట్లు, ఆ విషం స్తన్యపానం చేస్తూవున్న నాకు అపకారం చేయలేకపోయినట్లు తెలిసింది. మా నాయనగారు చనిపోయిన తరువాత నా గొంతు నులిమి చంపడానికి వీరందరు నాచుట్టూ చేరినట్టు, వారి కుట్ర తెలియకపోయినా దైవప్రేరితుడైన మా చినమేనమామ వెంకయ్యగారు నన్ను ఎత్తుకునివెళ్ళి అయినపూడి రామన్నగారి కుమారుడు సుబ్బన్నగారి భార్య యశోదమ్మగారి వశములో ఉంచారు. (ఈ సుబ్బన్నగారి కుమార్తెనే మా చినమామ తరువాత వివాహమాడడం జరిగింది) ఆవిడకు నా వయస్సు కుమారుడు గోపాలకృష్ణయ్య వున్నందున ఆవిడ స్తన్యపానంతోనే నేనక్కడ వున్నట్టు చెప్పారు.

ఈ కుట్రకు కారణం మా నాయనగారిని, నన్ను అంతమొందించితే, అందువల్ల ఆస్తి తమకు దక్కగలదని కాంతమ్మ వగైరాలు భావించి ఈ పాపమునకు ఒడిగట్టినారు. తరువాత ఈ కుట్రదారులు తమలో తాము దెప్పుకున్నందువల్ల ఇది సత్యమని నిర్ధారణ

అయ్యింది.  కుటుంబ ప్రతిష్ఠను నడివీధిన పెట్టడం ఇష్టంలేని మా మేనమామ ఎట్టి చర్యను తీసుకొనలేదు.  అకస్మాత్తుగా జరిగిన సంఘటనకు గ్రామంలోని ఆబాలగోపాలము దుఃఖించారు.  తమ కట్టి విశ్వాసపాత్రుడైన నాయకుడు దొరకడని దురపిల్లారు.

ధర్మగోటకం, మిత్రులతో కలిసి మా నాయనగారు పడిన శ్రమ ఫలితంగా ప్రజలదిగా నిలిచి వున్నదని నేటికీ ప్రజలు చెప్పుకుంటున్నారు.  అదే ఆయన స్మారకచిహ్నంగా భావిస్తున్నారు.

## మా తల్లి యశోదమ్మ

ఆవిడ తల్లిదండ్రులకు ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు.  ఈవిడ చిన్న కుమార్తె.  సంతానంలో మూడవది.  అందచందాలుగల సుకుమారి.  అదివరకే ఉత్తర ప్రత్యుత్తరాలు నడుపుకొనుచున్న బ్రహ్మయ్య చిట్టెన్నగార్లు వుత్తరాల ద్వారానే వియ్యంకులు కావడానికి నిశ్చయించుకున్నారు.

మా తల్లిగారి మూడవ సంవత్సరంలోనే మా తాత చిట్టెన్నగారు చనిపోయారు. మా తల్లిగారి వివాహం మా పెద్ద మేనమామగారే చేశారు.  అన్నగారిపట్ల మా తల్లిగారికి అధికభక్తి, మా నాయన, మా తల్లి ఆదర్శప్రాయమైన దంపతులుగా మెలిగారు.  వారికి కలిగిన మొదటి ఇద్దరు బిడ్డలు పురిటిలోనే పోయారు. నేను మూడవ బిడ్డను.  నాకు సంవత్సమున్నర వయస్సులోనే మా నాయనగారు పోయిన రెండవరోజుననే నన్ను, మా తల్లిగారిని మా మేనమామలు తమ ఇంటికి తీసుకువెళ్ళి నన్ను కన్నబిడ్డకంటే అధికంగా ఇరువదియేండ్లు సాకారు.  మా అమ్మ నన్ను నిరంతరం గాఢమైన ప్రేమతో కంటికి రెప్పవలె కాచి పెంచి పెద్దవాడిని చేసింది.  అప్పట్లో సుబ్బయ్యగారికి పిల్లలు లేరు.  వెంకయ్యగారికీ ఇంకా పెండ్లి కాలేదు.  అందరి మధ్య నేనే గారాబుపట్టిని, అల్లారుముద్దుగాను, గట్టి శిక్షణలోను పెంచారు.

మా అమ్మ, నేను బందరులో చదువుకునే సమయంలో కూడా పూటకూళ్ళ భోజనం నాకు ఆరోగ్యకరం కాదని నా భోజన సౌకర్యానికి బందరు వచ్చింది.  నాపట్ల ఎంత ప్రేమవున్నా మా తల్లి మంచి శిక్షకురాలేనని చెప్పాలి.  చిన్నతనంలో అల్లరి పనులకు ఆవిడవల్ల నాకు ప్రహరణాలు అప్పుడప్పుడూ తగులుతుండేవి.  ఆవిడ నాపై చూపిన ప్రేమ, నన్న పెంచడంలో పడిన కష్టాలు హెచ్చు.  ఆ ఋణం ఎన్ని జన్మలకైనా తీరదేమో  ఆమె నలభై సంవత్సరాల ప్రాయమున 1926 అక్టోబరు నెలలో స్వర్గస్తురాలైంది.

మా పినతండ్రి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్లీడరు.  జననం 1878 ఫిబ్రవరి 8వ తేదీ ఈశ్వర నామ సంవత్సరం మాఖ శు 6 శుక్రవారం రాత్రి 8 గంటలపైన.  మరణం 1899 ఏప్రిల్. వారిది పసిమిఛాయ. అంత భారీ కాదు, అంత పొట్టికాదు.  చాలా అందమైన



వాడు.  తెలివైనవ్యక్తి.  ఆయన దస్తూరి ఇంగ్లీషు, తెలుగులో కూడా ముత్యాల కోవవలె చాల అందంగా ఉండేది.  వేమూరి రామచంద్రరావు బి.ఎ., బి.ఎల్.  కీర్తిశేషులు కోపల్లె హనుమంతరావు పంతులు యం.ఎ.బి.ఎల్., కట్టమంచి కొళందరెడ్డి, బి.ఎ. సేతు మాధవరావు బి.ఎ. పెద్దిబోట్ల వీరయ్య బి.ఎ.బి.ఎల్. గారలు ఈయన సహధ్యాయులు.  వీరందరు ఆయనకు చాలా సన్నిహిత మిత్రులు.

ఒకసారి సంభాషణలో రావుసాహేబ్ కంఠంనేని వెంకటరంగయ్యగారు చెప్పారు. "మీ పినతండ్రిగారు, నేను సహధ్యాయులము.  మెట్రిక్యులేషన్‌లో నేను దండయాత్రలు చేస్తూ వుండేవాడిని.  ఆయన చాలా చిన్నవయస్సులోనే ఇలావచ్చి అలాపాసయిపోయాడు. అపుడు ఆయనకు పెద్దజుట్టు, చేతికి బంగారపు మురుగులు, దండకడియం కూడా వుండేవి. చాలా సుకుమారి, మంచి తెలివైనవాడు.  మనవాళ్ళలో ఆ రోజులల్లో మొదటి గ్రాడ్యుయేట్ ఆయనే.  చాలా దురదృష్టం చాలా చిన్నవయస్సులోనే పోయాడు" అన్నారు.  మా తాతగారు చనిపోయేనాటికి ఈయన బి.ఎ.లో కొంతభాగం పూర్తిచేయవలసి వున్నది.  ఆనాడు మా కుటుంబ పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులు చాలా దుస్థితిలో పడ్డవి.  మా తాతగారు చనిపోవడంతో ఆయనకు వచ్చే పెన్షన్ ఆగిపోవడం, ఔదార్యం, వితరణత్వంతో కూడిన ఆయన కుటుంబ నిర్వహణ.  మా చిననాయనగారి చదువుసంధ్యలు వగైరాల వలన కొంత ఋణపణాదులు కుటుంబానికి ఏర్పడినవి.

చిన్నతనంలోనే మా కుటుంబభారం మా నాయనగారిపై పడినది.  సవతి తల్లి కలుపుగోలుతనం లేకపోవడం వల్ల సంపారం ఆయనకు మరీ భారమైనది.  వున్నది ఇరవైరెండు ఎకరాల మెరకభూమి.  పంటలు సరిగా పండకపోయినా తన తమ్ముని బి.ఎ. పూర్తి చేయించి ప్లీడరీ పరీక్షకు పంపించటం తన ప్రథమ కర్తవ్యంగా భావించారు.  ఇందులకై సంపాదన అవసరం కాగా బందరు వెళ్ళి ఏ ప్లీడరు వద్దనైనా గుమాస్తాగా చేరడానికి నిర్ణయించుకొన్నారు. ఈ నిర్ణయం మా పెదమేనమామగారితో మా నాయనగారు చెప్పారు.  ఆయనది ఈయనది మూడు నాలుగేళ్ళు హెచ్చుతగ్గు వయస్సు.  పరస్పరం ప్రేమ గౌరవాలు కలవారు.

మా పెద మేనమామగారికి నాయనగారు గ్రామంవదలి బందరువెళ్ళి మరొకరి నౌకరీలో చేరడం ఎంత మాత్రం యిష్టం లేదు. అప్పటికి మా తల్లిగారి స్త్రీ ధనం బాపతు తనవద్ద వున్న మొత్తం తీసుకు వెళ్ళి మా చిన నాయనగారి చదువుకు పెట్టుబడిగా వినియోగించుకొనమని, ఆ సంవత్సరమే భీమనది ఛానల్‌ద్వారా వారి తాలూకు కొంత భూమి సుమారు 14 ఎకరాలు పల్లపు సాగు కాగా, అందులో రెండు ఎకరాలు మా తల్లిగారికి పసుపుకుంకుమ క్రింద యిచ్చి దానిలో పంట మా కుటుంబ పోషణకు ఉపయోగించుకొనమని సలహానిచ్చి, మా నాయనగారిని అందుకు ఒప్పుకొనేటట్టు చేశారు.  ఈ అమూల్యమైన సలహా సహాయం మా నాయనగారు ఘంటసాలలోనే వుండి కుటుంబయాత్ర గౌరవంగా చేయడానికి తోడు గ్రామ వ్యవహారములు న్యాయసరళిని తీర్చిదిద్దవలననే ఆకాంక్షగల మిత్రులు

శ్రీదోనేపూడి వెంకట్రాయులు వగైరాలకు తోడ్పడడానికి అన్నిటికంటె హెచ్చు ధర్మగోటక వ్యవహారంలో నాయకత్వం వహించి జయప్రదంగా నిర్వహించి గ్రామానికి శాశ్వతలాభం కలుగజేయడానికి తోడ్పడింది.

మా చిననాయనగారు బందరునోబుల్ కళాశాలలో ఎఫ్.ఎ. వరకు మద్రాసు క్రిష్టియన్ కాలేజీలో బి.ఎ. చదివాడు. జార్జిటౌన్ అప్పుడు బ్లాక్ టవున్ అని పిలవబడేది. అక్కడ గల ప్రభుత్వ వసతిగృహంలో వుండేవారు. బి.ఏ. పూర్తి చేసి ప్లీడర్ పరీక్ష అయిన తర్వాత బందరులో ఉన్నవ సుబ్బయ్యగారి వద్ద కొన్ని నెలలు జూనియర్‌గా వుండి, తరువాత స్వతంత్రంగా న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. లా చదివే రోజులలో మా ధర్మగోటక వ్యవహారం జరుగుతూవున్నది. ఈయన గవర్నర్‌కు ఒక మెమోరాండం వ్రాసి సరిచూచి పంపడానికి మా ప్లీడరు వల్లూరి సూర్యనారాయణరావుగారికి పంపారు. తను ప్లీడరీకి వచ్చిన తరువాత ఈ వ్యవహారంలో సూర్యనారాయణరావు పంతులుగారికి జూనియర్‌గా పనిచేశారు.

అన్నగారి నాయకత్వాన జరిగే ఈ వ్యవహారకాండ జయప్రదంగా జరగడానికి తగిన సలహాలిచ్చారు. ఈయనకు అన్నగారిపట్ల చాలా భక్తి, ప్రేమలుండేవి. ఆయనకు ఈయనపట్ల గల అపారమయిన ప్రేమనుగురించి వేరుగా వ్రాయనక్కరలేదు. ఈయనకు మంచి భవిష్యత్తు వుంటుందని, తమ కుటుంబ గౌరవ ప్రతిష్టలు ఈయనద్వారా అభివృద్ధి పొందగలదని ఆశించారు. కాని అకస్మాత్తుగా 21 సంవత్సరాల రెండు మాసాలకు గుండె నంజువల్ల ఘంటసాలకు మైలుదూరాన గల దేవరకోట గ్రామంలో మరణించారు. దేవర కోటలో ఆయన అత్తవారితరపు బంధువు దోనేపూడి బ్రహ్మయ్యగారింటిలో వుండి, వక్కలగడ్డ ఆయుర్వేదవైద్యుడు ఆచార్యులుగారి వద్ద ఔషధం తీసుకున్నారు. మా నాయనగారు బందరు ఈ దారినే, ఆ గ్రామ స్మశానవాటికలోనుండే వెళ్లే సందర్భంలో "పశ్చిమకోస్తా కన్న నూరులో మేము పుట్టాము. మా తమ్ముడు యిక్కడ నన్ను విడిచి పోయాడు" అని దుఃఖపడేవారట.

అప్పుడు నాకు ఒక సంవత్సరము వయస్సు. మా నాయన నన్ను చూచి "మా అబ్బాయి దురదృష్టవంతుడు. అదృష్టవంతుడే అయితే మా తమ్ముడే బ్రతికేవాడు" అని తమ మిత్రుల వద్ద దుఃఖసమయంలో అనేవారట.

పినతండ్రినే కాక తండ్రిని సహితం అతి బాల్యముననే పోగొట్టుకున్న దురదృష్ట వంతుడను నేను. ❑



# కొండపల్లివారు

కొండపల్లి గ్రామం విజయవాడకు దగ్గరగా వున్నది. ఇది ఒకప్పుడు చాలా ప్రసిద్ధి చెందినది. నేటికీ శిథిలమైన ఒక ఖిల్లా కలదు. కృష్ణాజిల్లాలో చరిత్రప్రసిద్ధిపొందిన యాత్రాస్థలములలో ఇది ఒకటి. కొండపల్లివారు అని పిలువబడే అన్ని వర్గాలవారి స్వస్థానం ఈ గ్రామమే. ప్రస్తుతం కొండపల్లివారు హెచ్చుగాగల గ్రామం దివితాలూకాలోని నిడుమోలు శివారు మంత్రిపాలెం, వ్యవహార దక్షతగల పెక్కుమందికి ఇది నిలయం. మా మాతామహులు ఆ గ్రామంలోనే జన్మించారు.

## ముత్తాత కొండపల్లి చౌదరిగారు :

ఘంటసాల గ్రామ పెత్తనదారు. పరగణాలో ప్రముఖుడైన గొర్రెపాటి చెంచయ్యగారి కుమార్తె బియ్యమ్మగారిని వివాహమాడారు. వీరికి ముగ్గురు కుమారులు (1) రంగన్న, (2) చిట్టెన్న, (3) బుచ్చయ్యగారలు.

ఆ రోజులలో ఇంటినిండా బిడ్డలు దొడ్డినిండా పశువులువున్న కుటుంబాలలో వివాహాలు చేయడం గౌరవప్రదం. ఆనాటి సంపత్తి పశుసంపదే. పదుగురుగల కుటుంబంవారిది. మార్బలం పలుకుబడి వారికున్నది అని మురుసుకునేవారు. కొండపల్లి, గొర్రెపాటివారల కుటుంబాలు అట్టివి. ఈ పిల్లలు కలిగిన తరువాత, చౌదరిగారి అనంతరం చెంచయ్యగారి కుమాళ్ళలో వెంకయ్యగారికి (ఘంటసా గ్రామమునసబు) తన తోబుట్టువును, మేనల్లుళ్ళను ఘంటసాల తీసుకురావలెననే అభిప్రాయం కలిగింది. బండ్లు, పశువులు వగైరా చరాస్తితోను, కొంత డబ్బుతోను వారిని తీసుకువచ్చి, కొంత భూమి పుట్ర ఏర్పాటుచేసి ఘంటసాల గ్రామస్థులను చేశారు. వీరిలో రంగన్నగారు మంచి స్ఫురద్రూపి, పశువైద్యం బాగా తెలుసు. అందరిచే ప్రేమించబడుతుండేవారు. బుచ్చయ్యగారు కూడా మంచి ప్రయోజకుడే. వీరిద్దరు తగినంత భూవసతి సంపాదించుకుని సంతానం కలిగి గౌరవంగా కాలక్షేపం చేస్తూ వుండేవారు.

## మా తాత చిట్టెన్నగారు :

ఘంటసాలకు రెండుమైళ్ళలోగల కొత్తపల్లి గ్రామమునసబుగారి కుమార్తెను వివాహ మాడారు. ఆవిడ నిస్సంతుగా చనిపోగా ఆమె చెల్లెలు అమ్మాయమ్మగారిని పరిణయమాడారు. ఈవిడ మేనమామ చిట్టెన్నగారి పెదతల్లి కుమారుడు వేమూరి రామన్నగారు, బోళ్ళపాడు

గ్రామ పెత్తనదారు, ఘంటసాలలో ప్రథమశ్రేణికి చెందిన ప్రముఖుడు. ఏడుకత్తుల భూస్వామి చిట్టెన్నగారికి సర్వవిధాల అండదండలుగా వుండేవారు. రామన్నగారి పిల్లలు పెద్దవాళ్ళయ్యే వరకు వారి వ్యవసాయం సహితం చిట్టెన్నగారే చూచేవారు. రామన్నగారు గ్రామ పెత్తనం చూచుకునేవారు.

చిట్టెన్నగారికి చిట్టూరు గ్రామ కరణం పెదపేర్రాజుగారు ప్రాణస్నేహితుడు. వీరు ఒకరినొకరు "మామా" అని పిలుచుకునేవారు. ఆ రోజులలో సహపంక్తి భోజనాలు లేకపోయినా, మళ్ళు, ఆచారాలు హెచ్చుగావున్నా ఆనాటి కలుపుగోలుతనం, పరస్పరం ప్రేమించుకొని ఒకరి కష్టసుఖాలలో మరొకరు భాగస్వాములుగా వుండడం గ్రామమంతా సమిష్టి కుటుంబం అనే భావన ఈనాడు లేవు.

గ్రామంలోని ముఖ్యులు అన్ని కులాలవారు. వావివరసలతో పిలుచుకొని పరస్పరం ప్రేమ గౌరవాలతో చూచుకొనేవారు. నవీన నాగరికత పెచ్చు పెరిగిన ఈ రోజులలో అట్టి సుగుణాలు మృగ్యమైనవి. వ్యష్టితత్వం, స్వార్థం, ఈర్ష్యాద్వేషాలు నేడు రాజ్యం చేస్తున్నవి. అక్షరాస్యత పెరిగింది అయితే, ఇది సంపూర్ణ విజ్ఞానం కాదు. ప్రాచీనకాలం నుంచి వంశ పారంపర్యంగా వచ్చిన సంస్కారం నశించింది. దీని స్థానే అహంకారం పెరిగి, గౌరవ మర్యాదలు, యిచ్చి పుచ్చుకునే సంప్రదాయం నశించాయి. పాత అంతా రోత అని కొత్త అంతా నాగరికతా చిహ్నమనే అపోహ నశించి పాతకొత్తలలోని మంచిని సమన్వయం చేసుకుని సంఘం సమిష్టితత్త్వం ద్వారా వ్యక్తి అభివృద్ధి చెందే సుదినాలకోసం ఎదురుచూద్దాం.

చిట్టెన్నగారు ఒక కత్తిభూమి (పదిహేడు ఎకరాలు) ఋణ ఫణాదులు లేకుండా కాస్తాకూస్తో నిల్వచేసి స్వర్గస్తులయారు. రావలసినదానికి హద్దూపాయా లేదు. వివరాలు చెప్పనూలేదు. అప్పుడు మా పెద్దమేనమామగారికి 16 సంవత్సరాలు. మా పెదతల్లిగారికి 8 సంవత్సరాలు. మా తల్లిగారికి 3 సంవత్సరాలు, చినమేనమామగారికి 2 సంవత్సరాలు. కర్మకాండలైన తరువాత మా పెదమేనమామగారిని ఆయన పెదమేనమామ కొత్తపల్లి మునసబు తుమ్మల చెన్నరాయుడుగారు వెంటపెట్టుకుని వేమూరి రామన్నగారి సలహా సంప్రదింపులు తీసుకుని చిట్టూరి పెదపేర్రాజుగారి వద్దకు వెళ్ళి "ఏం బాబూ చిట్టెన్న మామ ఏమీ చెప్పకుండానే చనిపోయాడు. మీ లావాదేవీలు ఏమిటి" అని అడుగగా "చిట్టెన్న మామ చచ్చిపోయినా ఆయన చెప్పకపోయినా, ఆయన బిడ్డలకు అన్యాయం చేస్తానా? నా బిడ్డలుగానే చూసుకుంటాను. చిట్టెన్న మామకు నేను అరవై రూపాయలివ్వాలి. పద్దు అప్పుడే తాటాకుమీద వ్రాసి మా చూరులో పెట్టాను" అని తీసి చూపించారు.

అరవై రూపాయల రొఖ్ఖంగా తీసుకోవటం చన్నారాయుడుగారి కోరిక. ఈ అభిప్రాయం తెలిసే సరికి "ఏం చన్నారాయుడు! మా తాతను (మా మేనమామను) నాకు కాకుండా చేసేటట్టున్నావే! పాత కోటిధరిని అయిదు ఎకరాలు మంచినల్లరేగడ భూమిని



తాతకు పట్టావేసి యిస్తాను ఈ అరవై రూపాయలక్రింద. మాతాత నా రైతుగా వుండాలి" అని సమాధానం చెప్పారు పెద పేర్రాజు గారు. అందుపై చన్నారాయుడు, ఈ పిల్లవాడు ఈ దూరపు భూమి వ్యవసాయం చేయవద్దా? అన్నారట. మా తాత పెద్దవాడై వ్యవసాయం పెట్టేవరకు నేనే నా స్వంత నాగళ్ళతో వ్యవసాయం చేయించి పంట పండించి ఘంటసాల తోలిపెడతాను! విత్తనాలు మాత్రం పంపుతూ వుండండి" అని "ఏమి తాతా ఏమంటావు" అని ప్రశ్నించడం "నేను మీ రైతుగానే వుండడం నాకిష్టం. నేను భూమే తీసుకుంటాను" అని మా మేనమామగారు ఖంగున సమాధానం చెప్పడం జరిగింది. ఇందుకు పెద్దలిద్దరు ఆనందించి ఆశీర్వదించారు. అప్పటి ప్రేమలకు పై విషయమే నిదర్శనం.

ఈ ప్రేమలు అంతటితోనే పోలేదు. పెద పేర్రాజుగారి మనుమడు చినపేర్రాజు గారు కరణీకానికి వచ్చారు. మా మేనమామ, ఆయన ఆత్మీయులు, "ఏమి పేర్రాజు మామ" అంటే "ఏమి సుబ్బయ్య బావా" అని సంబోధించుకునేవారు. ఈ చిన పేర్రాజుగారు అఖండుడు. మంచి వ్యవహారదక్షుడు. నూటయాభై ఎకరాల వరకు భూమి సంపాదించారు. దాదాపు అంతా ఖర్చు పెట్టారు. మేడలు, మిద్దెలు కట్టారు. రామాలయం, శివాలయం కట్టించారు. కుమారులకు, అల్లుళ్ళకు చదువులు చెప్పించారు. జిల్లాబోర్డు తాలూకా బోర్డులలో సభ్యులుగా రాణించారు. ప్రఖ్యాత ఆంగ్ల వైద్యవిద్యావేత్త డాక్టర్ ఎడ్లపాటి తిరుమలరావుగారు వీరి అల్లుడే. వీరి కుమారుడు శ్రీ రామకృష్ణారావుగారు (ఎం.ఎ.బి.ఎల్.) సన్యసించి ప్రస్తుతం కుర్తాళం పీఠాధిపతులుగా శ్రీ త్రివిక్రమ రామానంద భారతీ స్వాములవారు పేరున అనేకమంది శిష్యకోటిని కలిగి మతప్రచారం చేస్తున్నారు.

ఈ చినపేర్రాజుగారు స్థిరచరాస్తుల సంపాదనలను గురించిగాని, కుమార్తెల, కుమారుల పెండ్లిండ్ల సందర్భమున గాని మా మేనమామగారితో సంప్రదించి వారి ఆమోదముద్ర వేయించుకునేవారు. మేడలు మిద్దెలు కట్టి హెచ్చు డబ్బు ఖర్చుపెట్టే సందర్భాలలో మా మేనమామగారి మందలింపులను తినడం మా మేనమామగారికి వ్యయపు అంచనాలు తగ్గించి చెప్పి ఏదోవిధముగా వారిని తృప్తిపరచుట జరిగేది. తరువాత కొంతకాలానికి నాతో అన్నారు. "బ్రహ్మయ్యా, సుబ్బయ్య బావను వ్యతిరేకించి ఆయన సలహాకు భిన్నంగా ఈ చిట్టూరులో మేడ కట్టాను. ఇప్పుడు అమ్ముదామంటే కొనేవారు లేరు. దీనికి పెట్టిన కూలి కూడా రాదు ఈనాడు. అన్నివిధాల నష్టపడవలసి వచ్చింది" అని.

ఆనాడు స్నేహితుల సలహాలు ఎంత అమూల్యంగా భావించేవారో తెలియడానికి ఇట్టి నిదర్శనము లనేకం.

1939లో నేను ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగా విశాఖపట్టణం వెళ్ళి నప్పుడు డాక్టరు తిరుమలరావుగారిని ఆసుపత్రిలో కలియగా, వారింటికి తీసుకువెళ్ళి నన్ను వారి భార్యకు ఘనంగా పరిచయం చేశారు. ఈ పరిచయం ఆమెను ఆకర్షించలేదు. ఏదో

పెద్దరికంగా చూస్తూవున్నారు. అంతట ఆయన ఘంటసాల కొండపల్లి సుబ్బయ్యగారి అల్లుడు ఈయన అని చెప్పారు. అలా చెప్పరేం. మా కొండపల్లి సుబ్బయ్యగారి అల్లుడా? నా చిన్నప్పుడు సుబ్బయ్యగారు బందరు నుంచి మా వూరి మీదుగా వస్తూ మాకు మిఠాయి పొట్లాలు యిస్తూ వుండేవారు" అని అప్పుడు నన్ను తమ ఆత్మబంధువులుగా సత్కరించారు. ఆనాటి కుటుంబ ప్రేమలకు ఇది నిదర్శనం.

మా అమ్మమ్మ - అమ్మయమ్మగారు! ఈవిడకు డబ్బు చేతబట్టడం తెలియదు. ఇంట్లోవారికి, వచ్చేపోయేవారికి తృప్తిగా భోజనంచేసి పెట్టి ఆనందించేది. అర్ధరాత్రి పూట అతిధులు వచ్చినా ఆనందంతో వంటచేసి పెట్టేది. ధర్మానికి ఎవరు వచ్చినా లేదనేది కాదు. (ధాన్యరూపంలో) ఒకసారి జనాభా లెక్కలు వ్రాయడానికి ఘంటసాల జ్వాలా నరసింహం పంతులుగారు వచ్చారు వీరింటికి. వయస్సు అడిగితే నా వయస్సు యాభై. మా పెద్ద అబ్బాయి వయస్సు నలభై ఇలా అందరి వయస్సు చెప్పింది. ఆ పంతులు గారు ఆవిడతో సమాన తెలివితేటలుగల ఘనుడే ఈమె చెప్పినట్టే ఆయన వ్రాసుకున్నారు. ఇదంతా వింటూ చూస్తూ వున్న మా అమ్మ, "ఏమే అమ్మా, నీకు పది సంవత్సరాలకే అన్నయ్య పుట్టాడా? ఈ లెక్కలేమిటి?" అని అన్న తరువాత అందరూ సంప్రదించుకొని ఏవో లెక్కలు చెప్పారు. అవి వ్రాసుకు వెళ్ళారు పంతులుగారు.

మా అమ్మమ్మకు నామీద చాలా ప్రేమ. నేను ప్రయమరీ పరీక్ష అయిన తర్వాత బందరు వెళ్ళి చదవాలని పట్టుపట్టాను. నన్ను అప్పట్లో బందరు పంపుటకు మా తల్లిగారికిగాని, పెదమేనమామగారికి గాని ఇష్టంలేదు. కారణం నన్ను వదిలి వారు వుండలేకపోవటమే. అపుడు మా అమ్మ "ఒరే వాళ్ళ వాళ్ళంతా చదువుకున్నవాళ్ళు. వుద్యోగాలు చేసిన వాళ్ళురా! అతనిచేత కావడిమోయించుతావా? నాగలిదున్నించుతావా అని అన్నది, లేదు ఒక మాష్టరును తీసుకువచ్చి ఇక్కడే ఏ రెండు మూడేళ్ళో చదువుచెప్పిస్తాను అని అన్నారు మా మేనమామగారు. నేను చదువు సంధ్యలు మాని, నా పెండ్లికి ముందు మా స్వంత ఇంట్లోకి వెళ్ళే ప్రయత్నంలో వుండగా మంచినీళ్ళు గ్రామం వెలుపల నూతులనుంచి తెప్పించుకొనుటకు కావడి మట్లు వేయించాను. మా మేనమామగారు ఇది చూచి విషయం తెలుసుకొని "మీ అమ్మ నీచేత కావడి మోయించడం గాని చేయించవద్దని చెప్పింది" అని ప్రతి రోజు మంచినీళ్ళు తెచ్చి ఉప్పు నీళ్ళు దొడ్లోవి తోడుటకు జొన్నలగడ్డ కోటయ్య (యాదవ)ను ఏర్పాటు చేశారు. ఈ కోటయ్య యిరవై సంవత్సరాలు మాయింట్లో నీళ్ళు సప్లయి చేశాడు. ఇప్పటికి ఈ కుటుంబం నా సహాయ సంపదలు పొందుతూ వుంటుంది. మా అమ్మమ్మ వృద్ధాప్యంలో మా అమ్మ ఆవిడకు బాగా సపర్య చేసేది, ఆఖరున ఆవిడ నన్ను మా మేనమామలకు అప్పగించి చనిపోయింది. ❑



# శిస్తుల చెల్లింపుకు ఆనాటి రైతుల పడరాని పాట్లు

**మా** పెదమేనమామ సుబ్బయ్యగారికి 16 సంవత్సరాల వయస్సులో తండ్రి చిట్టెన్నగారు గతించారు. పైన తెలిపిన వేమూరి రామన్నగారిని యీయన 'బాబూ' అని సంబోధించి ఆయన మాట సుగ్రీవాజ్ఞగా పాలించేవాడు. ఆయన, ఆయన కుమారులు ఈయన సలహా సంప్రతింపులకు చాలా విలువనిచ్చి వర్తించేవారు. వయస్సు చిన్నదైనా, గ్రామంలో పార్టీలు ముమ్మరంగా వున్నా, రామన్నగారు ఒక పార్టీకి ముఖ్యనాయకుడైనా ఈయన ఆయన పార్టీ వ్యవహారాలలో ఎట్టి జోక్యం పెట్టుకొనక వ్యవసాయం చేయించుకొంటూ పశువులను చక్కగా మేపుతూ, అయినపూడి సుబ్బన్నగారి నాయకత్వాన వెళ్ళే కమాను బండ్లతో తాను కూడా ఒకటి రెండు బండ్లు తోలిపెట్టించి దాని మీద కొంత వరుమానం సంపాదించుకుంటూ, తన వద్దకు వచ్చిన వారికి వ్రాత కోతలలో సహాయం చేస్తూవుండేవారు. వీరికి వీరి పెదమేనమామ చన్నారాయుడుగారి సలహా వుండేది.

ఈయన రాత్రుళ్ళు ఇంటివద్ద పదిమందిని చేర్చి పురాణ కాలక్షేపం జరిపించే వారు. వీరి తండ్రి మేనమామ గొర్రెపాటి వెంకయ్యగారి కుమారులు బాలకృష్ణమ్మ, రామస్వామి సోదరులు, గ్రామంలో ప్రముఖులు ఒకరికొకరు ప్రత్యర్థులు అయినా ఈయనను సమానముగా ప్రేమించేవారు మెచ్చుకునేవారు. వారి అండదండలు ఈయనకు అవసరమైతే కలవనే వాతావరణం కలుగజేసేవారు. ఈయన విద్యాగురువు ఘంటసాల రామబ్రహ్మం పంతులుగారు.

సుబ్బయ్యగారు నిండు డాబు దర్పంగల వ్యక్తి. మంచి వ్యవహర్త. చాలా కలుపుగోలుతనం, పదిమందికి నిరంతరం ఏదో సలహా సంప్రదింపులు యిస్తూ అందరిచేత మంచి అనిపించుకున్న వ్యక్తి. మంచి ముసద్ది చిన్నవారిని సైతం ఏమోయి, ఏమయ్యా అని మర్యాదగా సంబోధించి వారి ప్రేమను చూరగొనేవాడు. వారికి సంబంధించిన మిత్రులు ఎవరు భూమి అమ్మినా, కొన్నా వీరింటివద్దనే ఆయా గ్రామ కరణాల చేత క్రయ దస్తావేజులు వ్రాయించుకునేవారు. ఘంటసాల, బోళ్ళపాడు, చిట్టూరి గ్రామ కరణాలు వీరికి చాలా సన్నిహితంగా, స్నేహంగా వుండేవారు. సాధారణంగా భాగం పంపిణీలలో ఈయన మధ్యవర్తిత్వం హెచ్చు. ఎవరైనా ఋణాలపాలైనప్పుడు ఈయన ఋణదాతలకు సౌమ్యంగా నచ్చజెప్పి, వారి అందరికి సమానంగా న్యాయంగా దామాయిషీని కొంత యిప్పించి ఆర్థికంగా చెడిపోయిన వారికి ఏదో కొంత నివేశస్థలం, భూమి నిలిపి ఒక గృహస్తునిగా గ్రామంలో

వుండేటట్లు చేసేవారు. నిరంతరం ఎవరికో ఒకరికి సహాయం చేయాలనే దృష్టి వుండేది. ఏ కులంవారైనా, ప్రయోజకులై, సంపాదించుకునే వారిని చూస్తే ఆయనకు ఆనందం. వారిని మరొకసారి పలకరించి మంచి సలహాలనిచ్చి ప్రోత్సహించేవారు. పశువులను హింసించే వారిని నడిబజారులోనే చివాట్లు వేసి "ఒరే మీకు కుష్ఠువస్తుంది సుమా! నోరులేని పశు వులను హింసించుతున్నారు!" అనేవాడు. ఆయన చెప్పేవాడు "రైతుకు పాపము అనేది లేదు. పశువులను కన్నబిడ్డలాగు పెంచి పోషించితే" అని మా పెదనాయన రంగన్నగారు అనేవారు" అని.

ఈయన వివిధ కులాలలోని కొన్ని కుటుంబాలకు తనకంటె పెద్దవారికి కూడా సంరక్షకుడుగా (గార్డియన్) వ్యవహరించాడు. వీరిలో అర్హులైనవారికి వారుకోరిన ఉద్యోగాది వృత్తులు సిద్ధించడానిగాను నన్ను వినియోగించేవారు. వారు చనిపోయే ముందు వీరి కుటుంబాలకు సంబంధించిన ఆయన కర్తవ్యభారం నాపై పడింది. నేటి వరకు వాటిని నేను నా శక్తికొలది నిర్వహిస్తున్నానని సవినయంగా వ్రాసుకొనడం నా విధి.

ఈయన దైవభక్తి, బ్రాహ్మణభక్తి గలవాడు. పండ్రెండు యేండ్లు మా గ్రామ పంచాయితీలో సభ్యులుగాను, చాలాకాలం గ్రామ సంఘ సభ్యులుగాను వున్నారు. గ్రామ పెత్తందార్లలో ప్రథమశ్రేణికి చెందినవారు పాలేళ్ళమీదను, కూలీలమీదను ప్రేమతో వుండేవారు. కూలీలకు ఏ రోజు కూలీ ఆ రోజు చిల్లర మార్చి పశువుల దొడ్డివద్దనే యిస్తూ వుండేవారు. కూలికోసం మరొకమారు వారిని త్రిప్పడం ఆయనకు యిష్టం వుండేదికాదు. ఆయన కబురు పంపినదే తడవుగా హెచ్చుమంది పనిపాటలలోకి వస్తూ వుండేవారు కూడా. కరువు కాటకాలలో ధాన్యం అప్పుగా యిచ్చి ఆదుకునేవాడు. పెండిండ్లకు వాళ్ళకు ఆస్తులున్నా, లేకపోయినా విధిగా అప్పు యిచ్చి నెమ్మదిగా తీర్చమనేవాడు. ఆనాటి రైతు పాలేళ్ళ ప్రేమకు ఇది ఒక నిదర్శనం.

దిరిశం వాళ్ళ హరిజనపల్లె (నాడు పెద్దగూడెం) కాపురస్థుడు పేరయ్య అనే పెద్ద పాలేరు వుండేవారు. ప్రతి సంవత్సరం అయినపూడి సుబ్బన్న గారి కమానుబండ్ల ముఠాతో ఒక బండిని ఇతడు జగ్గయ్యపేట ప్రాంతాలకు తోలుకు వెళ్ళేవాడు. అందులో ఒక ఎద్దు లంకవారి ఎల్ల ఎద్దు నడకకు, బురద పట్టుకుచాల గట్టిది, ఎప్పుడు వెనుకాడనిది బండ్లలో ఎవరి ఎద్దు అయినా లాగక ఎగగొట్టినప్పుడు దిగడిన ఆ బండి లాగడానికి ఈ ఎద్దును సుబ్బన్నగారు కట్టించేవారు. ఒకసారి రెండుబళ్ళకు కట్టిన తర్వాత నా ఎద్దు రొమ్ము పడిపోతుంది ఇక కట్టడానికి వీలులేదు" అన్నాక ఈ పేరయ్యను "లింగు లింగుమంటూ ఒక బండి తోలుకువచ్చి మహా నీలుగుతావు నీ బండి ఎగ గొడితే ఏమి చేస్తావు మరొకరి ఎద్దును కట్టవద్దా" అని సుబ్బన్నగారు గద్దించాడట. ఇది మనసులో వుంచుకుని మరుసటి సంవత్సరం బండ్లు రేపు బయలు దేరుతాయనగా ఆ రాత్రి సంప్రదాయం ప్రకారం తలంటించి భోజనం



పెట్టి కొత్త బట్టలు ఇవ్వడానికి పేరయ్యను పిలువగా "ఈ సంవత్సరం రెండు బండ్లు తోలిపెట్టితే నేను వెళ్ళుతున్నాను. ఒక బండి అయితే నేను వెళ్ళను" అని మొరాయించాడు. కారణం ఏమిటని విచారిస్తే, పై కథంతా చెప్పాడు. వున్న మూడు ఎడ్లకు తోడు ఎద్దపట్టని కొత్తగిత్తను తోడుచేసి సుబేదారుగారి వద్ద మొదటినుంచి గొడ్ల దగ్గర వుంటూ ఇపుడు వీరివద్ద గొడ్లకాపరిగా వున్న కోటయ్యను జతయిచ్చి రెండు బండ్లు తోలిపెట్టడం జరిగింది.

అక్కడ అన్ని ఎడ్లకు వేసే దాణాకు తోడు ప్రత్యేకంగా ఈ గిత్తకు హెచ్చు దాణా వేసి ఎక్కువ రోజులు నిల్వవుండేచోట జొన్న – చొప్ప ప్రత్యేకంగా దీనికి కొని మేపి, వాగులలో ఈ గిత్త బండిని లంకవారియెల్లదానితో లాగించి కోటయ్యను నామకః వుంచుకొని రెండుబళ్ళ బరువులు తానే ఎత్తుకుని నెలో, రెండు నెలలో అయిన తర్వాత, రెట్టింపు డబ్బు సంపాదనతో గిత్తను ఇంకా బలిపించుకుని, దానికి దృష్టి దోషం లేకుండా గవిసెన వేసుకుని బండ్లు తోలుకువచ్చాడు పేరయ్య. బండ్లు వస్తూ వున్నవని తెలిసి గిత్తను చూద్దామనే ఆకాంక్షతో మా మేనమామలు ఎదురేగి ధర్మగోటకం లోకి వెళ్ళి గనిసెన తీయమంటే "ఇట్లా వచ్చారెందుకు, గిత్త చిక్కి సగమైపోతే, నానాయాతన పడి వచ్చింది. ఇంటికి వెళ్ళిన తరువాత చూడవచ్చులే!" అని కసిరి పంపించాడు – ప్రేమ భక్తులకు నిలయమైన పాలేరు. అట్టి పాలేరును కాదనడానికి సాహసం యజమానులకు ఎక్కడనుంచి వస్తుంది.

భోజనమైన తరువాత, నీ యింటికి వెళ్ళి నీ భార్యను, బంధువులను చూచుకోమంటే "సరేకాని ఈ రెండు నెలలు ఇక్కడి వాళ్ళచేత ఏమి చేయించావు? మోకులేమైనా వేయించావా? పలి తాళ్ళు పగ్గాలు వేయించావా? భోంచేయగానే నీవు నిద్రపోవడం, వాళ్ళయిష్టం వచ్చినట్లు తిరగడం జరిగిందా" అని సణుగుతూ సతాయించుతూ పొద్దుపోయేవరకు వుండేవాడట. ఆఖరుకు కొంతకాలానికి అతనికి సుస్తీచేసి పనిచేయలేని స్థితిలో పాలేరుతునం మానుకొని వెళ్ళేటప్పుడు "ఇదిగోనయ్యా, సుబ్బయ్యా! ఈ కర్ర ఏడు యేళ్లు వాడాను, ఎడ్లను ఎట్లా మేపానో, ఎట్లా పాటుపడ్డానో – ఇక ఎట్లా వ్యవసాయం చేసుకుంటావో? జాగ్రత్త" అని హెచ్చరించి పోయాడు. తర్వాత ఒకటి రెండు నెలలకు అతడు స్వర్గస్థుడయ్యాడు. రైతు, పాలేరు సంబంధం అట్టిది.

ఆ రోజులలో ఆయన వద్ద పాలేళ్ళుగా చేసిన వారి కుమారులు, మనుమలు ఎడతెగకుండా ఇప్పటికీ నా వద్ద వున్నారు. అట్టి సంబంధాలు వదలకుండా తీసుకు రావడమే నాకు కూడా యిష్టం.

నేను తంజావూరు జైలులో వుండగా మా అల్లుడు చిట్టెయ్య నన్ను చూడడానికి వచ్చినపుడు వ్యవసాయాన్ని గురించిన సంభాషణలో పాలేళ్ళను గురించి ప్రశ్నించగా "కొత్తవాళ్ళను పెట్టాను. కొంతకాలం పాతవారిని తీసివేస్తే పని బాగా చేస్తా"రని చెప్పాడు. రాబోయే సంవత్సరం నేను వచ్చేటప్పటికి పాతవాళ్ళనే పిలిచి వ్యవసాయంలో వుంచవలసిందిగా చెప్పాను. అలాగే జరిగింది. నేటికీ అలాగే జరుగుతున్నది.

# కమాను బండ్లు

ఈ విషయం ఒక శతాబ్దంనాటి సంగతి. ఆనాడు వరి పంట హెచ్చుగా లేదు. కొద్దిగా బుడమ వరి వుండేది. ఆ బియ్యం ఎర్రగా వుండేవి, అన్నం ఎర్రగా వుండేది. ఆనాటి హెచ్చు పంటలు జొన్న, మొక్కజొన్న, తవిద వగైరా మెట్ట పైర్లు. ఇవి చాలా బలవర్థకపు ఆహార ధాన్యాలు. ఈ కాయధాన్యాలు తిన్నందువల్లనే ఆనాటి మనుష్యులు మంచి ఆరోగ్యం కలిగి బలాఢ్యులుగా వుండేవారు. కాయకష్టం చేసేవారు. ఈ కాయధాన్యాలకు తోడు మంచి పాడి వుండేది. గోంగూర, గుమ్మడికాయలకు గల ప్రాముఖ్యం ఇతర కూరగాయలకు వుండేది కాదు. గుమ్మడికాయ ముక్కలు వుడికించి చిరుతిండ్లుగా తినేవారు. తాటిపండ్లు అనేకరకాల పిండి వంటలకు ఉపయోగించుకునేవారు. అధికవర్షాలవల్ల పంటలు పండనప్పుడు తాటిపండ్లే ముఖ్య ఆహారం. ఈ తాటిపండ్లు కూడా చాలనపుడు నల్లరేగడి మట్టిలో పెరుగు పోసుకుని క్షుద్బాధ నివారణ చేసుకునేవారు. అమరకాయలనే దుంపలు కూడా ముఖ్య ఆహారంగా వుండేవి.

భూమి ఎంతవున్నా, రైతు శిస్తు ఇవ్వలేని స్థితిలో వుండేవాడు, నాణెములు చెలామణి అధికముగాలేని ఆ రోజులలో పంటలు పండినా కొనేవాళ్ళుండేవారుకాదు.

ఆ కాలంలో రైళ్ళు, రస్తాలు లేవు. వున్నకొద్ది వ్యాపారం గంతావులమీద, బళ్ళమీద సాగుతూ వుండేది. అప్పట్లో భూమికి విలువలేదు. పశుధనమేధనం. పంటలు పండక పోయినా పాడి పుష్కలంగా వుండేది.

శిస్తులు చెల్లించలేని ఆ కాలంలో రైతులు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి బాడుగ తోలుకొని శిస్తుకుగాను కొంత ధనం సంపాదించుకొంటూ వుండేవారు. దానికే "కమాన్ తోలుడు" అనేవారు. ఈ విధంగా తోలే బండ్లు ముఠాలుగా వుండేవి. ముఠాకు ఇరవై బళ్ళు.

మా గ్రామం నుంచి అరవై బళ్ళు వెళ్ళేవి. వాటికి బలమైన ఎడ్లను కట్టేవారు. ఆ ఎడ్లకు ఝణుగులు, గంటలు కట్టేవారు.

జగ్గయ్యపేట నుండి హైదారాబాద్‌కు కొన్ని, నాగపూర్ – షోలాపూర్ వైపుకు కొన్ని బండ్లు వెడుతూ వుండేవి. జగ్గయ్యపేట ఆనాడు వాణిజ్యకేంద్రం. అక్కడి నుంచి బెల్లం, ఉప్పు, కొబ్బరి వగైరా బళ్ళమీద వేసుకొని పోయేవారు. హైదరాబాద్ నంచి కలప, చింతపండు మొదలగునవి తెచ్చేవారు.

ఈ బళ్ళవారికి కావలసిన పదార్థాలన్నీ ఒక బండిలో వేసుకునేవారు. ఈ బళ్ళ ముందూ, వెనుకా డప్పులు వాయిస్తూ వుండేవారు. కోయవాళ్ళు ముందు నడుస్తూ దారి



చూపేవారు. అడవి పాలకర్ర ఎంత పచ్చిదైనా బాగా కాలేది. దాన్ని వెలిగించుకొని పులుల భయం లేకుండా ఈ బళ్ళు సాగిపోయేవి. ఇలా బళ్ళు వెళ్ళి తిరిగి రావడానికి ఆరునెలలు పట్టేది. దీనికి ప్రతిఫలం నలభై యాభై రూపాయలు వచ్చేవి. ఆ కాలంలో ఇలా రైతులు కష్టపడి, ప్రాణాలు వొడ్డి, బళ్ళబాడుగుల ద్వారా ధనమార్జించి శిస్తుదస్తులు చెల్లించి భూములను నిలబెట్టుకున్నారు.

మా చినమేనమామ వెంకయ్యగారు మంచిరైతు, అన్నగారి సూచనలను అనుసరించి వ్యవసాయం శ్రద్ధాభక్తులతో చేసేవాడు. అన్నగారి పట్ల చాలా భక్తిని చూపేవారు. ఈయన దగ్గర నాకు చాలా చనువు. చిన్నప్పుడు నన్ను హెచ్చుగా ఎత్తుకొంటూ వుండేవారు. నేను బందరులో చదువుకుంటున్న రోజులలో కలరా, మశూచికం మొదలైన అంటు జాడ్యాలు వస్తే నేను జడుసుకుంటానేమోనని, అట్టి భయాలు నాకు లేకపోయినా నా పట్ల గల ప్రేమకొద్ది బందరు వచ్చి కొన్ని రోజులు నాతో గడిపేవారు. నన్ను అమితంగా ప్రేమించేవారు. మా గ్రామంలోని శ్రీ జలదీశ్వర నాటక సమాజమునకు మేనేజరుగా వుండి, యువకులైన కళా రాధకులను ప్రోత్సహించారు.

శ్రీ వెంకయ్యగారు ఆరువది సంవత్సరాలు నిండుగా జీవించి స్వర్గస్థులైనారు.

❑

# నా విద్యార్థి దశ

నాకు ఏడవ సంవత్సరం వచ్చిన తర్వాత మా మేనమామ సుబ్బయ్యగారు శాస్త్రీయంగా ఘంటసాల వెంకట కృష్ణయ్య పంతులుగారి చేత విద్యాభ్యాసం చేయించారు. ఈయన తాలూకా బోర్డు పాఠశాలలో ఉపాధ్యాయుడు, తోటి విద్యార్థులకు భోజనాలు, ఉపాధ్యాయునికి నూతనవస్త్ర బహూకరణ జరిగింది. మా తల్లి నన్ను పెందలకాడనే లేపి, నిత్యకృత్యాలైన తర్వాత చల్ది అన్నం వెన్న, పెరుగుతో పెట్టి ప్రతి నిత్యం వేళకు పాఠశాలకు పంపేది. పిల్లలను సరియైన వేళకు వచ్చేటట్లు చేయడానికి అప్పుడు స్కూలులో మొదట వచ్చినవారికి "శ్రీ" అని తరువాత వచ్చిన వారికి 'చుక్క' అని అరువాత క్రమానుగతంగా చిన్నదెబ్బలు అరచేతిమీద తగిలించేవారు. పిల్లలు పెందలకడనే లేచి వేళకు వచ్చుటకు పోటీని ఈ పద్ధతి పెంచేది. నేను శ్రీ, చుక్క సంపాదించుటకే ప్రయత్నించేవాడిని. శ్రద్ధగా చదివేవాడిని. ప్రతిక్లాసులో నేనే పెద్దను. మార్కులను బట్టి ఈ పెద్దరికం వచ్చేది.

శని ఆదివారాలలో స్కూలు వుండేది కాదు. మా మేనమామగారి దొడ్లో జామచెట్టు వుండేది. ఆ జామకాయల కోసం ఎడ్లు గొడ్లతో కాలక్షేపం చేయడానికి నేను నా తోటి విద్యార్థులతో ఆ దొడ్డివద్దకు వెళ్ళడం చూచి, సుబ్బయ్యగారు దొడ్డి వద్దకు రావడం అలవాటైతే వ్యవసాయంమీద, పశువుల మీద, మోజుపడి చదువులకు స్వస్తి చెప్పడం జరుగుతుందని తలంచి దొడ్డివద్దకు రావద్దని, జామకాయలు వున్నప్పుడు తానే తెచ్చి పెట్టెదనని చెప్పారు. ఆయనమాట పాటించవలసిన శాసనం నాకు. అంత ఖచ్చితంగా చెప్పి పాటించేటట్లు చేసేవారు. ఎపుడూ కొట్టడం మాత్రం జరిగేది కాదు.

పది సంవత్సరాలకు నేను మూడవక్లాసు చదువుతున్నాను. మా వూరిలో అనేక చెరువులున్నవి. పెద చెరువు ఆళ్ళ వెంకమ్మ చెరువు. కొందరు పిల్లలతో స్నానానికి వెళ్ళాను. ఒకరిని మించి ఒకరు కేరింతలు కొట్టుకొంటూ స్నానాలు చేస్తున్నాము. నేనొక లోతు గోతిలో పడి మునిగిపోయాను. రెండు గుక్కలు నీళ్లు కూడా త్రాగాను. ఇంక కొన్ని నిముషాలలో ప్రాణము పోయేది. ఆ చెరువుకు నీళ్ళకు వచ్చిన ఒక పద్మసాలి ఆడపడుచు శ్రీమతి దేవిమాణిక్యం నా స్థితిని చూచి నా జుట్టుపట్టి బయటకులాగి నన్ను మా యింటికి తీసుకెళ్ళి మా అమ్మకు అప్పగించింది.

సంవత్సరమున్నర వయస్సులో విషగండం నుంచి, ఇప్పుడు ఈ జలగండం నుంచి బ్రతికి బయటపడ్డాను. ఆ పద్మశాలి యువతి ఆత్మకు నా ప్రణామాలు.



# ప్రాథమిక పాఠశాల

వెంకట కృష్ణయ్య పంతులుగారు తాలూకా బోర్డు ఎలిమెంటరీ స్కూలులో ఏకోపాధ్యాయుడు. వారు తండ్రి రామబ్రహ్మంగారి వద్ద కట్టుదిట్టంగా చదువుకున్నవారు. ఒక గంట చెప్పినా గట్టిగా పిల్లలకు అర్థమయ్యేటట్లు చెప్పకలరు. ఉపాధ్యాయ బాధ్యతకు తోడుగా ఆయన బ్రాంచి పోస్టుమాష్టరు.

ఈ రెండు సంస్థల స్థాపనలోను అగ్రతాంబూలం వారిదేకూడా. పోస్టాఫీసు స్థాపనలో వానపాముల లక్ష్మీనారాయణగారు హెచ్చుకృషి చేశారు. మెరక వ్యవసాయం. ఎడ్లు, ఆవులు, పాడి పశువులు వీరి అజమాయిషీ చూసుకోక తప్పదుగదా!

పైగా గ్రామములో వీరిమీద లక్ష్యముతో ప్రామిసరీ నోట్లు దస్తావేజులూ వ్రాయించి కొంత డబ్బు ముట్టజెప్పాలనే ఆయన మిత్రుడు మా మేనమామ బోటివారు వూళ్ళోవున్నారు. వీటినన్నిటిని సంబాళించుకుంటూ అష్టావధానం చేసేవారు. వీరి గైర్‌హాజరు సందర్భంలో చిన పేర్రాజుగారి కుమారుడు రామయ్య, నరసయ్యగార్లను క్లాసులు చూస్తూ వుండవలసిందిగా ఆదేశించి వెళ్ళేవారు. వారు పిల్లలు అల్లరి చేయకుండా చూస్తూ వారికి వచ్చినది బోధించారు.

అప్పుడు పిల్లలను క్రమశిక్షణగా వుంచడానికి ఆయుధాలు బెత్తపు దెబ్బలు, తొడపాశాలు వీరు విరివిగా వుపయోగించారు. వీరు లేనపుడు వీరి తల్లి సీతమ్మగారే మమ్ములను అల్లరిచేయకుండా అదుపులోవుంచేది. ప్రతిక్లాసు పెద్ద మిగతా పిల్లలకు చూచివ్రాత కాపీలు వగైరా వ్రాయించుతూ వుండేవారు. నువ్వు కాయకోత వగైరా వ్యవసాయపు ఒత్తిడి పనులలో పిల్లవాళ్ళు పాల్గొని పంతులుగారి ప్రశంసలనందు కునేవారు. మా మేనమామగారి పట్ల గల భయంతో నాకట్టిపనులు వారు చెప్పకపోయినా నా అంతట నేనే స్వచ్ఛందంగా పాల్గొని మిగతా పిల్లలతో పోటీపడి పనిచేసేవాడిని. కొన్ని సందర్భాలలో అందరికంటె నాకే ప్రశంసలు వచ్చేవికూడా.

పంతులుగారిపట్ల నాకు అమితభక్తి, మాకుటుంబ స్నేహాలు ఇప్పటికీ వర్ధిల్లుతునే వున్నవి. అప్పటి పల్లెటూళ్ళ పాఠశాలల భోగట్టా నిమిత్తం పై విషయం వ్రాశాను. ఇప్పటి బోర్డు ప్రాథమిక పాఠశాలలో కుర్చీలు, మేజాలు, బల్లలు, హెచ్చు మంది ఉపాధ్యాయులు ప్రతిసంవత్సరం పుస్తకాలమార్పిడి కొత్తకొత్త కోర్సులస్థాపన, నూతనమైన బోధనాపద్ధతులు వున్నప్పటికి కూడా, 70 సంవత్సరాల క్రిందట వీధిబళ్ళ స్థాయిని అందుకోలేనందుకు విచారించక తప్పదు. అయితే, నేను గుంట ఓనమాలు దిద్దుడు రోజులకు, కోదండాలు వేయించి చింతబరికెలతో శిక్షణ ఇచ్చే రోజులకు వెళ్ళమని చెప్పడం లేదు. పెద్దబాలశిక్ష, ఎక్కాలు కంఠస్థం చేయించుటకు, అర్థం కాకపోయినా కృష్ణ, దాశరథి, సుమతి, ఆంధ్రనాయక శతకములు వల్లెవేయించుట వగైరా పిల్లల జ్ఞాపకశక్తిని పెంచుననుట నిర్వివాదం.

1919లో ఎలకుర్రు అగ్రహారంలో దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులుగారు వారి తల్లిపేర స్థాపించిన శ్రీ శ్యామలా పాఠశాల వార్షికోత్సవ సందర్భంలో కీర్తిశేషులు ముట్నూరి కృష్ణారావుగారు చెప్పినట్లు "అమ్మ మొగుడు నాయన, అక్క మొగుడు బావ చదువులు నేటివి" బందరు నేషనల్ కాలేజీ స్థాపకులకు కీర్తిశేషులు కోపల్లె హనుమంతరావు పంతులుగారు ఎం.ఏ., బి.ఎల్. ఆ రోజుననే చెప్పినట్లు చిన్ననాడు చదువు భవిష్యత్తులో ఉపయోగపడేదిగా వుండాలి, వారు ఇల్లా చెప్పారు:

"వయస్సు వచ్చిన తర్వాత బట్టీపట్టిన షేక్స్పియర్ నాటకాలలోని వేల పంక్తులు జ్ఞాపకం లేవు. చిన్ననాడు కంఠస్థం చేసిన కృష్ణశతకము, దాశరథిశతకము, సుమతీ శతకము, వేమన శతకము పద్యాలు ధారళంగా ఇప్పటికి తప్పులేకుండా అప్పజెప్పగలను. చిన్ననాడు ఆ పద్యాల అర్థము సరిగా తెలియకపోయినా, పెద్దవారైన తరువాత వాటి అర్థము నెమరు వేసుకొని జీవితమును ధన్యత గావించుకొనవచ్చు". ఈ భావాలు ఇప్పటి పరిపాలకులకు ఎప్పటికి తలకెక్కునో చూపుదూరాన కనబడటం లేదు. బ్రిటీషువారి హయాంలోని వరవడే ఇప్పటికీ కొనసాగుతున్నందుకు విచారించక తప్పదు. నియమనిబంధనలు వురిత్రాళ్ళుగా కాక చేతుళ్లగా వుపయోగించే విచక్షణా జ్ఞానాన్ని వుపయోగించగల దక్షత, విజ్ఞానం మన పాలకులకు, ఉద్యోగులకు పెరగాలని కోరుకుందాం.

ఈ కృష్ణయ్య పంతులుగారినే ఆహ్వానించి సత్కరించి మా అబ్బాయి చిరంజీవి వీరరాఘవేంద్రరావుకు 1940లో వీరిచేతనే అక్షరాభ్యాసం చేయించడం జరిగింది. వీరిది మా కుటుంబ విద్యాగురువుల కుటుంబంగా భావించుచున్నాను.

ఈ కృష్ణయ్యపంతులుగారిని ప్రధానోపాధ్యాయులను చేసి రెండవ ఉపాధ్యాయునిగా చిరువోలు రామశేషయ్యగారిని వేసిరి. ఆయన యువకుడు పొరుగూరి వాడు. ఇతర వ్యాపకాలు లేనివాడు. మాకు శ్రద్ధగానే చదువుచెప్పాడు. నేను ఇంగ్లీషు అక్షరాలు ఆయనవద్దనే మూడవ తరగతిలో ప్రారంభించాను. ఇంగ్లీషు పాఠం రాత్రిళ్ళు మా ఇంటికి వచ్చి నాకు చెప్పేవారు. అందుకు మారుగా మా మేనమామగారు జీతం ముట్టజెప్పేవారు. తరువాత వారి స్థానే వచ్చిన దశరథరామయ్య పంతులుగారి సెలవు కాలంలో వెంకటరమణయ్యగారు ఉపాధ్యాయులుగా వున్నారు. వెంకటరమణయ్యగారు మాకు చదువు సరిగా చెప్పుటలేదని, గ్రామవ్యవహారాలు చూచుకుంటున్నారని పిల్లలంతా సంతకాలుచేసి ఒకకార్డు, కవరు వ్రాశాము. పై ఉద్యోగులు విచారణకు రానందుకు విచారించాం.

నేను మూడవతరగతి చదువుతూ వుండగా వందేమాతం ఉద్యమంలో శ్రీ బిపిన్ చంద్రపాల్‌గారిని ఆరునెలలు ఖైదులోవుంచి విడుదల చేసినపుడు మా గ్రామంలోని సుజనరంజని నాటక కంపెనీవారు బిపిన్ చంద్రపాలుగారి ఫోటోను వూరేగించారు. ఆ వూరేగింపులో పాల్గొని వందేమాతరం నినాదాలు యిచ్చిన కుర్రవాళ్ళలో నేనుకూడా వున్నాను, ఆ వెంటనే కొద్దిరోజులకు స్కూళ్ళ సూపర్‌వైజర్ మా స్కూల్ తనిఖీకి వచ్చారు. వారు రావడంతోటే "వందేమాతరం, మందేరాజ్యం" అనే నినాదం విద్యార్థులందరం ఇచ్చాం. సీమసున్నంతో ఆయనవచ్చేటప్పటికే బోర్డుమీద, గోడల మీద వ్రాసి వుంచాం. అందుకు ఆయన మా మేష్టరుగారి మీద మండిపడ్డాడు. ఆయన వెళ్ళిన తర్వాత మా మేష్టారు కృష్ణయ్య పంతులు రూళ్ళకర్ర దెబ్బలు మేము వహించిన పాత్రకు అనుగుణంగా ముట్టజెప్పారు. నాకు బహుమానం ఘనంగానే ముట్టింది.

1910 ప్రాంతంలో గొర్తి నారాయణమూర్తిగారు ప్రధానోపాధ్యాయుడుగా వచ్చిన తరువాతనే ఘంటసాల స్కూలు చెప్పుకోదగిన ఉచ్ఛస్థితికి వచ్చింది. ఆయన ఊరంతా తిరిగి హెచ్చుమంది పిల్లలను చేర్చడం, ఉపాధ్యాయులను హెచ్చు చేయించడం, పిల్లలకు చక్కగా బోధించి, తోటి ఉపాధ్యాయులు బోధించేటట్టు, ఎక్కువమంది ఆయా తరగతులలో వుత్తీర్ణులయ్యేటట్లు చూడడం జరిగింది. నేను ప్రైమరీ తరగతి ఈయన వద్దనే ఉత్తీర్ణుడయ్యాను. శ్రద్ధగానే చదివేవాడిని. క్లాసులో మొదటివాడిగానే వుండేవాడిని.

## ప్రయివేటు పాఠశాల

కీర్తిశేషులు వారణాసి చిన అచ్చన్న పంతులుగారిది పశ్చిమగోదావరి జిల్లా తణుకు తాలూకా అత్తిలి దగ్గర మొయ్యేరు. ఈయన మంచి లౌకికుడు. వ్యవహర్త కూడా. అన్ని విషయాలు చెప్పుటలో మంచి బోధనాశక్తి గలవారు. రాత్రింబవళ్ళు విద్యార్థులు ఆయనతో వుండవలసిందే. చదువులకు తోడు భజనలు, ఆటలు, పాటలు సాగించేవారు. అందులో ఆయన కూడా పాల్గొనేవారు. మాచేత ఘంటసాల ప్రైవేటు స్టూడెంట్సు లైబ్రరీ అని పెట్టించి దానికి నన్నే కార్యదర్శిగా చేశారు. ఘంటసాల, ఘంటసాలపాలెం, దేవరకోట గ్రామాలలో ముష్టి ఎత్తించి కొన్ని పుస్తకాలు కొన్నారు. ఆంధ్రపత్రిక, కృష్ణా పత్రిక, దేశాభిమాని ఆంధ్రకేసరి, శశిరేఖ, గృహసుందరి వార్తాపత్రికలు తెప్పించి చదివించేవారు. వాగ్వర్ధనీ సంఘాలలో మమ్ము మాట్లాడునట్లు చేశారు. గ్రామంలో బహిరంగసభలు జరిపి విద్య, సంఘసంస్కరణ మొదలగు విషయాలను గురించి తాను ప్రసంగించి, మమ్ములను మాట్లాడుటకు ప్రోత్సహించేవారు. గ్రామంలోకి ఏ రెవిన్యూ ఇన్‌స్పెక్టరో వచ్చినపుడు బహిరంగ సభ ఏర్పాటుచేసి ఆయనను అధ్యక్షులుగా వుంచేవారు. ఈ మీటింగులకు ప్రజలు ఎక్కువగా రాకపోతే, తిరుపతి కవుల "అశ్వమేధయాగ" నాటకమును మామూలు దుస్తులతోనే మాచేత ప్రదర్శింపజేసి, హెచ్చుమంది వచ్చుటకు ఆకర్షణను కలుగజేసేవారు. దానిలో నాది భీమునిపాత్ర. నా జీవితరంగంలో కూడా నాది భీమునిపాత్ర అయింది.

ఈయన పత్రికలతో పాటు, ఇతర పుస్తకాలు (General Books) చదవాలనే కోరికను, ప్రజాసేవ చేయాలనే వాంఛను, సంస్కరణాభిలాషను మాకు కలుగజేశారు.

## బందరు నోబుల్ హైస్కూలు

ఈయనవద్ద చదువు పూర్తి చేసుకొని 1913లో బందరు నోబుల్ హైస్కూలులో చదువుటకు వెళ్ళాను. అప్పుడు బందరులో ఒకేఒక కాలేజీ నోబులు కాలేజీ. ఆంధ్రదేశంలో ఆనాడు దానికి వున్న ప్రసిద్ధి ఏ ఇతర కాలేజీకి లేదు. అప్పుడు రెవరెండ్ పెన్ ప్రిన్సిపాల్. చాలా పొట్టిగా వుండేవారు. అయినా గంభీరుడు. ఈయనంటే ఉపాధ్యాయులకు, పిల్లలకు కూడా హడలే. బాగా పకడ్‌బందీగా నడిచేది. రెవరెండ్ ఎన్నిస్ వైస్ ప్రిన్సిపాల్, ఆరడుగులు మించిన నిండైన విగ్రహం. చాలా సౌమ్యుడు. ఈయనది ఐర్లాండ్. ప్రధానోపాధ్యాయుడు రాస్‌పిళ్ళే. ఈయన బెత్తం చేతపుచ్చుకొని నెమ్మదిగా పిల్లి అడుగులు వేసుకుంటూ స్కూలంతా కలియ తిరుగుతూ వుండేవాడు. నిశ్శబ్దంగా ఎట్టి సందడి లేకుండా పాఠ్యపఠనాలు జరిగిపోవలసిందే. ఏ మాత్రం అలజడి జరిగినా రిపోర్టుతో నిమిత్తం లేకుండా అక్కడ ఆయన ప్రత్యక్ష మయ్యేవాడు. స్కూలు ఫైనల్‌లో ఆయన మాకు బైబులు, ఇంగ్లీషు, పొయిట్రీ చెప్పేవారు. ఆయన చెబుతూంటే ఎట్టి మొద్దు అబ్బాయిలకైనా అర్థంకాక తప్పదు. ఆయన బోధనాశక్తి అట్టిది.

నేను మూడవ ఫారంలో చేరాను. చోడవరపు జగన్నాథరావుగారు మాకు క్లాసు టీచరు. ఆయన ఆ కాలేజీ విద్యార్థే. చక్కగా బోధించేవారు. చాలాకాలం ఫుట్‌బాల్ టీమ్ కెప్టెన్‌గా వుండి పేరుపొందారు. అందుచేత ప్రిన్సిపాల్ పెన్‌గారికి ఆయనపట్ల ప్రత్యేకాభిమానం. ఆటలను గురించి ప్రత్యేకశ్రద్ధ ప్రదర్శించి పిల్లలు ఆడుకొనడానికి ప్రోత్సహించేవారు. శ్రీ పెన్ తాము అన్ని ఆటలకు హాజరయ్యేవారు. జగన్నాథరావుగారు నా పట్ల ప్రత్యేకాభిమానం చూపేవారు. పండుగ పబ్బాలకు వారింటికి తీసుకవెళ్ళి పిండివంటలు పెట్టేవారు. వీరింట్లో నేను చాలా స్వతంత్రంగా తిరిగేవాడిని. వారి పెద్దకుమారుడు సుగుణభూషణరావు, రెండవ కుమారుడు విద్యాభూషణరావు. పెద్దవారు బి.ఎ., బి.యల్. ఇప్పుడు బందరులో ప్లీడరు. ప్రఖ్యాత పత్రికా రచయిత కోటంరాజు రామారావుగారు జగన్నాథరావుగారి అల్లుడు. జగన్నాథరావుగారు యస్.యస్.ఎల్.సి. ట్రెయినింగు క్లాసులోని విద్యార్థులకు అపుడపుడు తనవద్ద చదువుకున్న శిష్యులను గురించి చెప్పేటప్పుడు నా పేరు, కొల్లిపన సూరయ్యగారి పేరు తప్పక ఉదహరించేవారని ఆ విద్యార్థులు చెబుతుండేవారు.

1927లో నేను తాలూకాబోర్డు అధ్యక్షుడనైనప్పుడు వారింటికి వెళ్ళి వారికి నమస్కారం చేయగా సాయంత్రంపూట తూగుటుయ్యాలమీద వారు వుండి నన్ను కౌగలించుకొని అమాంతంగా తమ తొడమీద కూర్చోబెట్టుకున్నారు. నేనప్పుడు 29 సంవత్సరములవాడినైనా ఆయనదృష్టిలో 1913–1914 సంవత్సరాల నాటి వారి ప్రేమకు పాత్రుడనైన విద్యార్థినే.

నాల్గవఫారంలో నాకు గురువులుగా వున్న జిడ్డు లింగయ్యగారు, జిల్లా మునసబు అయ్యారు. కాళీపట్నపు నరసింహమూర్తిగారు మాకు హిస్టరీ టీచరు. తర్వాత బందరులో



పేరు ప్రతిష్టలు అర్జించుకున్న ప్లీడరైనారు, నేను కలుసుకున్నపుడు ఆప్యాయతతో పలుకరించి గౌరవిస్తూ ఉంటారు. చిరకాలం ఆయన ఆధ్వర్యంలో నడచిన జైహింద్ హైస్కూలులో ఆయన ఫోటో ఆవిష్కరణకు నేటి పాలకవర్గం నాచేత చేయించడం నాకు, మా గురువుగారికి మిక్కిలి ఆనందదాయకమైనది. ముక్తేవి ప్రకాశరావుగారు (బి.ఎ.బి.ఎల్) పరమపదించారు. స్వర్గీయ దర్వా నిత్యానందశాస్త్రి (బి.ఏ.యల్.టి) గారి వంటి ఆదర్శప్రాయమైన పవిత్రమూర్తి అయిదు, ఆరు ఫారములలో నాకు గురువు అని చెప్పుకునే అదృష్టం కలిగింది. ఆయన బోధించినప్పుడు శ్రద్ధగా విని, మాకు బోధించడానికి ఇంటివద్ద ఆయన శ్రమచేసే కాలంలో సగంకాలం శ్రమచేస్తే మేము పండితులం అయ్యేవారము.

చదువు మానిన పదేళ్ళకు ఒక రోజున రోడ్డు మీద మేమిరువురం తారసిల్లాము. నేను నమస్కరించగా నన్ను ఆయన గుర్తుపట్టలేదు. మీసాలు, గడ్డాలు వచ్చినవాయె. "నేను మీ శిష్యుడను, బ్రహ్మయ్యను" అనడం తడవుగా జి. అని గుర్తుకు తెచ్చుకున్నారు. తర్వాత అపుడపుడు వెళ్ళి వారి దర్శనం చేసుకునేవాడిని. ఆరవఫారంలో కళ్యాణ రామయ్యగారు ఇంగ్లీషు బోధించేవారు. తెలుగు శ్రీ నరసింహశాస్త్రిగారు, సూర్యనారాయణ శాస్త్రిగారు, నాగేశ్వరశాస్త్రిగారు బోధించేవారు. వీరిని వరసగా ఎర్రశాస్త్రి గారు, నల్లశాస్త్రిగారు, బుడ్డిచెంబు శాస్త్రిగారు అని పిల్లలం అనేవారం. నరసింహశాస్త్రిగారి కుమారుడు పార్వతీశ్వరశాస్త్రి (బి.ఎ.బి.ఎల్) మాకు ఆరవఫారము బి.గ్రూపు, హిందూదేశ చరిత్ర, ప్రకృతిశాస్త్రాలకు వచ్చేవారు. వారు కాశీవిశ్వవిద్యాలయ విద్యార్థి. మేమందరం ఆయనను చూడడం తడవుగా ఆప్యాయతతో రాజకీయములను గురించి, రాజకీయ నాయకులను గురించి వారివల్ల విని ఆనందించేవారము. ఆ సంవత్సరం వీరి సహచర్యం వల్ల జాతీయ భావాలు పెంచుకున్నాము. దేశసేవ చేయాలనే ఆకాంక్ష నాలో ప్రబలమైనది.

ఆ సంవత్సర పాఠ్యగ్రంథాల చదువు సన్నగిల్లడం, దేశాయ వ్యాసంగం హెచ్చు కావడం, ఫలితం స్కూలుఫైనలు తప్పటం.

మరుసటి సంవత్సరం తిరిగి చదవడానికి హిందూ హైస్కూలులో చేరాను. కాని అనారోగ్యం కావడం వల్ల చదువుకు స్వస్తి చెప్పడం జరిగింది.

## శ్రీ వెంకటాచలపతయ్య

ఈ సందర్భంలో ఒకమాట – నేను జ్వరంతో నా గదిలో పడుకొనివుండగా కౌతవరం కాపురస్తులు రైతు బాంధవ కానూరి వెంకటా చలపతయ్యగారు 1917లో నా గదికి వచ్చి "అబ్బాయీ! అక్కరకు రాని ఈ ఇంగ్లీషు చదువులతో నీ ఆరోగ్యం చెడగొట్టుకునే కంటె ఇంటికివెళ్ళి ఆరోగ్యం పొందడం నా అభిమతం" అని చెప్పి తాను స్వయంగా రాబర్టుసన్‌పేట వెళ్ళి ఒంటెద్దుబండిని తీసుకవచ్చి నా పెట్టె, బేడ దానిలో వేయించి నన్ను

ఎక్కించి ఇంటికి పంపుతూ "నీవు చిన్నతనంలోనే విషాన్ని జీర్ణించుకున్నవాడవు. నీకు ఈ చదువు సంధ్యలతో నిమిత్తం లేదు. అభివృద్ధిలోనికి వస్తావు" అని ఆశీర్వదించారు.

ఈ కానూరి వెంకటాచలపతయ్యగారే తరువాత ఆంధ్రదేశంలో ప్రథమశ్రేణి ఆంధ్ర రైతునాయకులుగా ప్రసిద్ధికెక్కారు. రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాన్ని ఢీకొనడానికి అనేక బహిరంగసభలను చేయించి ప్రజావాణిని వేల టెలిగ్రాముల రూపంలో ప్రభుత్వానికి గుప్పించి తన అసాధారణ ప్రజ్ఞవల్ల అనేక సమస్యలను పరిష్కరించారు. వీరు దక్షిణదేశపు గోఖలేగా ప్రసిద్ధికెక్కిన మోచర్ల రామచంద్రరావు పంతులుగారి అనుచరులు. రైతులోకంలో ప్రసిద్ధి ఆర్జించుకున్న మాగంటి సీతయ్యగారి సహచరులు. ఒకసారి మద్రాసు శాసనసభకు అభ్యర్థులుగా నిలువ నిశ్చయించి ప్రచారం వగైరా అయ్యదేవర కాళేశ్వరరావు పంతులుగారితో కలిసి చేసుకుంటున్న తరుణంలో మహాత్మాగాంధిగారు తన ఆంధ్రదేశ సంచారంలో బెజవాడ రావడం, వారి భావాలను విని శాసనసభా అభ్యర్థిత్వానికి తిలోదకాలిచ్చి, సహాయనిరా కరణోద్యమంలో చేరడం జరిగింది

ఓట్ల నిరాకరణ ఘట్టంలో వీరు చాలా ప్రశంసనీయంగా పనిచేశారు. వీరు అసాధారణ ప్రజ్ఞాశాలి. రాజకీయాలలో కులతత్వాలకు తావులేదనేవాదన వీరిది. 1926లో బెజవాడలో జరిగిన కమ్మ మహాజనసభలో ఆనాడు జస్టిస్ పార్టీ అభ్యర్థిగా కాంగ్రెసుకు వ్యతిరేకంగా పోటీచేయ నిశ్చయించుకొన్న అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య గారికి 14 ప్రశ్నలు అని ఒక కరపత్రం ప్రచురించారు. మహాత్మాగాంధి నిర్మాణ కార్యక్రమంలోని 14 సూత్రాలకుపూర్వమే మహమ్మదాలీజిన్నాగారి 14 ప్రశ్నలకు పూర్వమే చలపతయ్యగారి 14 ప్రశ్నలు ప్రకటనలోనికి వచ్చినవి.

ఈనాటి ఆనాటి ఉపన్యాసాలలో వెలిబుచ్చే రైతుఋణ విమోచన చట్టపు కలలు 1937లో రాజగోపాలాచార్యులుగారి మంత్రివర్గ హయాంలో కార్యరూపం పొంది అనేకమంది ఋణగ్రస్తులైన రైతులు వడ్డీ వ్యాపారుల బారినుంచి రక్షింపబడ్డారు.

## కృష్ణా పత్రిక" ప్రభావం

1913లో బందరు నోబుల్ హైస్కూలులో చేరి బ్రహ్మమందిరంలో ఒక గది అద్దెకు తీసుకుని చదువు ప్రారంభించాను. ప్రతి ఆదివారము ఉదయాన జరిగే ప్రార్థనలకు హాజరయ్యేవాడిని. ఆ రోజున విధిగా ముట్నూరి కృష్ణారావుగారి బోధన వుండేది. సందర్భోచితంగా పండుగ పబ్బాలను గురించి, ప్రాచీన భారతీయవీరులను గురించి, ఆధునిక భారతదేశభక్తులను గురించి ముచ్చటిస్తూ వుండేవారు. "కృష్ణా పత్రిక" సంపాదకీయ వ్యాసాల స్థాయిలోనే ఈ బోధనలు కూడా వుండేవి. కృష్ణారావు పంతులుగారి గొప్పతనమును గురించి సోదరుడు కీర్తిశేషుడు గొర్రెపాటి వెంకటేశ్వర్లుగారి వల్ల విన్నాను. శని, ఆదివారాలలో



"కృష్ణాపత్రిక" ఆఫీసుకు తరచు వెళ్ళి ఒకమూల కూర్చొని జరిగే ముచ్చటలను వినేవాడిని. విధిగా "కృష్ణాపత్రిక" పారాయణం వుండేది. ఆంధ్ర జాతీయ కళాశాల వార్షికోత్సవములను, బందరు పురమందిరంలో జరిగే సభలకు హాజరయ్యే ప్రేక్షకబృందంలో నేనుకూడా ఒకడిని. డాక్టర్ పట్టాభిగారు, కోపల్లె హనుమంతరావు పంతులుగారు, కౌతా శ్రీరామశాస్త్రిగారు కనబడి నప్పుడు దూరంగా వుండి నమస్కరించుచుండెడి వాడను కృష్ణారావుగారితో మాత్రం సన్నిహిత పరిచయమేర్పడింది. ఉన్నతవిద్యపట్ల విముఖత కలిగింది. ప్రజాసేవాభిలాష దినదిన ప్రవర్థ మానమైంది. మిత్రులము స్వదేశ వస్త్రధారణకు దీక్షావ్రతులమయ్యాము. అంటరానితనం పాటించకూడదని శపథం పట్టాము. సంభాషణలలో ఆంగ్లపదములు వాడకుండా తెలుగు మాట్లాడడానికి కట్టుదిట్టాలు చేసుకున్నాము. 1914లో ఘంటసాలలో స్థాపించుకున్న శ్రీ రామమోహన గ్రంథాలయానికి తోడు సెలవులలో వయోజన పాఠశాలలను నడుపుతుండే వారము. జిల్లా రాజకీయ సభలకు స్వచ్ఛంద సేవకులముగా వెళ్ళేవారము. ఈ కార్యక్రమంతా ముట్నూరి వారి ఉపదేశ ఫలితాలే అని వేరుగా వ్రాయనక్కరలేదు.

విద్యార్థి దశలో బ్రహ్మమందిరంలో మేము ఉండే రోజులలో పండిత గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, నేను ఒకే గదిలో వుండేవారము. ఆయన హెచ్చుకాలం తదేక దీక్షతో చదువుతూ వుండేవాడు. పైగా, కౌతా శ్రీరామశాస్త్రిగారి దగ్గర బెంగాలీ భాష చదువుకొంటూ వుండేవాడు. నేను వార్తాపత్రికలు, తెలుగు నవలలు హెచ్చుగా చదువుతూ వుండేవాడిని. రాత్రులు పెందలకడనే నిద్రపోవడం నాకలవాటు. మిత్రుడు వెంకటసుబ్బయ్య నన్ను హెచ్చుగా చదవవలసిందిగా హెచ్చరించేవాడు. పెందలకడనే పడుకుంటూ తెల్లవారుఝామున చదువుతానని, తెల్లవారుఝామున లేపితే, ఉదయం చదివితే చాలదా? అని సమాధానం చెప్పేవాడిని. మొత్తం మీద తెలివితేటలున్నా ఎక్కువ శ్రమపడేవాడినికాను. అయినా, క్లాసులో మొదటి పదిమందిలో వుండేవాడిని. కొన్ని సబ్జెక్టులో గణనీయమైన మార్కులు వచ్చేవి.

పత్రికలు నిత్యం చదువుటచే మా క్లాసులో నన్ను దేశాభిమానిగాను, రాజకీయవేత్త గాను పరిగణించారు. అలాగే నా మిత్రులు కీర్తిశేషులు వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బయ్యగార్లు కూడా గణనీయంగా గుర్తించబడేవారు.

మా ఘంటసాల విద్యార్థులకుతోడు కపిళేశ్వరపురం, కవుతరం, గుడ్లవల్లేరు విద్యార్థులు కలిసి ఒక హాస్టలు పెట్టుకున్నాము. స్థలం అద్దెకు తీసుకొని, తన సొంత డబ్బుతో పాకవేయించి కానూరు వెంకటచలపతయ్యగారు మాకు స్వాధీనం చేశారు. మా నాయకుడు గొర్రెపాటి వెంకటేశ్వర్లు మేనేజరుగాను, నేను కార్యదర్శిగాను వుండేవారము. వంతులవారిని ప్రతిరోజు ఒకళ్ళు బజారుకువెళ్ళి కూరగాయలు తెచ్చేవాళ్ళము. ప్రతినెల లెక్కలు మా సమావేశంలో చదివి వినిపించడం అయిన ఖర్చులు సమానంగా పంచుకొనడం జరిగేది. ఈ స్వంత హాస్టలు నిర్వహించడంలో మాకు ఒక సమిష్టి కుటుంబంగా వ్యవహరించే ప్రేమభావాలు ఏర్పడటం, ఒక సంస్థను నిర్వహించే శక్తిస్తోమతులను పెంచుకొనడం జరిగింది.

ఆ రోజులలో బందరు హిందూ హైస్కూలు, నోబుల్ కళాశాలలో గల కమ్మ విద్యార్థులందరం కలిసి కమ్మ విద్యార్థి సంఘాన్ని నిర్మాణం చేసుకున్నాము. ఈ నిర్మాణంలో ప్రముఖపాత్ర మా నాయకుడు వెంకటేశ్వర్లుగారిదే. నేను కార్య నిర్వాహక సంఘంలో సభ్యుడుగా వుండేవాడిని. ఈ అసోసియేషన్‌లో కమ్మ విద్యార్థులను సభ్యులుగా చేర్చడం మా విధిగా పరిగణించేవారము. నెలసరి చందాలద్వారా డబ్బు సమకూర్చుకొని ఒక విలువైన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకున్నాము. దీనికి అనుబంధంగా ఒక డిబేటింగు సొసైటి ఏర్పరచుకున్నాము. ప్రతి ఆదివారం డిబేటింగు సొసైటీల చర్చలు సాగుతూ వుండేవి. ప్రముఖ విద్యాధికులను ఆహ్వానించి, సత్కరించి, వారి ఉపన్యాసములను వినేవారము. కవిరాజు త్రిపురనేని రామస్వామిగారు డబ్లిన్ యూనివర్శిటీలో బారిష్టర్ చదువుతూ బందరు వచ్చినప్పుడు మేము వారిని ఆహ్వానించి, పాశ్చాత్యదేశాలలో వారి అనుభవాలు విన్నాము.

ఆ రోజులలో ప్రయాణ సౌకర్యాలు లేవు. మా వూరు బందరుకు ఇరువది ఐదుమైళ్ళు. సెలవులకు మేము వెళ్ళేటప్పుడు సాధారణంగా నడిచే వెళ్ళేవారం. వర్షాకాలంలో పడవ ప్రయాణం. పడవకు చార్జి ఆ రోజులలో నాలుగు అణాలు మాత్రమే. బండి ప్రయాణానికి బందరునుంచి చల్లపల్లికి పన్నెండు అణాలు చార్జి నలుగురము. ముగ్గురము ఎక్కేవారము.

బాగా ఖర్చుపెట్టుకున్నా, సంవత్సరానికి రెండువందల రూపాయలు ఖర్చు అయ్యేవి. థర్డుఫారము నుండి స్కూలుఫైనల్‌వరకు నాలుగు సంవత్సరాలకు నాకైన ఖర్చు ఎనిమిదివందల రూపాయలు మాత్రమే. ❑



# రామమోహనరావు పుస్తక భాండాగారము - నేను

ఆ రోజులలో పల్లెటూళ్ళ నుంచి బందరు వచ్చి చదువుకునేవారిలో మా ఘంటసాల విద్యార్థులు, కౌతవరం విద్యార్థులు హెచ్చుగా వుండేవారు. కౌతవరం నుంచి హెచ్చుమంది రావడానికి కారణం కీ.శే. కౌళందరెడ్డిగారు స్థాపించిన జాతీయ విద్యాలయ ప్రభావం. అందులో ఉపాధ్యాయుడిగా వుండిన చెరుకువాడ వెంకట నరసింహం పంతులుగారి ప్రతిభ.

1917లో మా గ్రామస్థులు వివిధ తరగతులలో చదువుకొనేవారు 17 గురు వుండేవారు. వెంకటేశ్వర్లుగారు నాగపూర్‌లో చదవడానికి వెళ్ళి విషజ్వరంవల్ల కీర్తిశేషులైనారు. ఆయనతోనే అక్కడ చదువుకు వెళ్ళిన అయినపూడి గోపాలకృష్ణయ్య అక్కడ ప్లేగు వచ్చిన కారణాన పాఠశాల మూసివేయడంవల్ల చదువు చాలించి వచ్చారు. పండిత గొర్రెపాటి వెంకటసుబ్బయ్య కండ్ల జబ్బు వలన, బాలకృష్ణమ్మ వారి తండ్రి చనిపోవడం చేత, వేమూరి సీతారామయ్య కీళ్ళవాతం వలన చదువు చాలించారు. అలా అందరూ ఏదో ఒక కారణాన చదువుమానడం తప్పనిసరి అయింది.

ప్రథమశ్రేణికి చెందిన మా చిననాయనగారు, కరణం ఘంటసాల తారక బ్రహ్మం గారి కుమారుడు సీతారామయ్యగారు యిద్దరు పట్టభద్రులై, ఒకరు లాయరు, ఒకరు ఉపాధ్యాయవృత్తిని స్వీకరించిన వెంటనే స్వర్గస్తులగుట, పూజ్యులు తిరుపతి వెంకట కవుల శిష్యులు పూజ్యశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సహపాఠి, జంటకవి, చాల భవిష్యత్తుకలవారుగా పరిగణింపబడిన పిశుపాటి జగన్నాథంగారి కుమారుడు వెంకట్రామయ్యగారు గతించిరి.

ద్వితీయ శ్రేణికి చెందిన మేమందరము చదువు మానడం, మా నాయకుడు వెంకటేశ్వర్లుగారు చనిపోవడం, గ్రామంలో చాలా నిరుత్సాహం గల్గించినది. గొర్రెపాటి శ్రీరాములుగారి మనుమడు బాలకృష్ణమ్మ నాకు చాలా సన్నిహిత మిత్రుడు. తరువాత 1921వ సంవత్సరంలో నా ప్రోత్సాహముతో చదవడానికి వెళ్ళి కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి వాత్సల్యమునకు పాత్రుడై అందరి ప్రశంసల నందుకొన్నాడు. సర్పద్రష్టుడై అకాల మరణం పొందడం జరిగినది. అందువల్ల ఒక దశాబ్దం వరకు మా ఊరునుంచి ఇంగ్లీషు చదవడానికి బయటకు వెళ్ళినవారు లేరు. తరువాత నెమ్మదిగా పై పాత సంఘటనలు మరచి చదువులకు వెళ్ళుట, తరువాత మా వూరిలోనే హైస్కూలు నేను, నా మిత్రులు ఏర్పాటు చేసిన ఫలితంగా నేడు సుమారు నూరుగురు పట్టభద్రులు వుండడము గమనించ దగినది.

ఆంగ్లవిద్యకు స్వస్తి ఫలితంగా రాజకీయరంగమున, స్వరాజ్య సంరంభమున వివిధ దశలందు, మా గ్రామం సముచిత పాత్ర వహించి స్వరాజ్య సంసిద్ధిలో పాలుపంచుకొనడం దైవప్రసాదమనే భావించుచున్నాను. నేను మా మేనమామలతో నిత్యం పొలం వెడుతూ వ్యవసాయ కార్యకలాపములలో పశువులను సాకుటలో యథాశక్తి పాటుపడుతున్నాను. శ్రీ రామమోహన పుస్తక భాండాగార నిర్వహణ మా మిత్రుల నిత్యవిధి అయింది. మిత్రులలో వేమూరి నాగయ్య వారి తాత తండ్రుల నాటి నుంచి వున్న ధాన్యపు కమీషన్ వ్యాపారమునకై విజయవాడ వెళ్ళారు. అయినపూడి గోపాలకృష్ణయ్య షోలాపూర్ మిల్స్‌లో బాయిలర్ ఇంజనీరుగా వెళ్ళారు. గ్రామంలో పెద్దలతో కలిసి వ్యవహరించే బాధ్యత పండిత వెంకట సుబ్బయ్య, వేమూరి సీతారామయ్యలతో కలిసి నేను వహించాను.

## శ్రీ కంఠంనేని వెంకటరంగయ్య

1918లో శ్రీరామమోహన పుస్తక భాండాగార వార్షికోత్సవమునకు అధ్యక్షత వహించవలసిందిగా కోరడానికి వెంకటసుబ్బయ్య, నేను కంఠంనేని వెంకటరంగయ్య గారివద్దకు నాగాయతిప్ప వెళ్ళాము. నాగాయతిప్పలోని కంఠంనేనివారిది ప్రఖ్యాత కుటుంబం. జిల్లా మొత్తం మీదనే ఎన్నికలోనికి వస్తుంది. తగినంత భూమి, ధన సంపత్తిగల పెద్ద కుటుంబం. కంఠంనేని సుబ్బన్నగారు తాలూకా బోర్డు మెంబరు, ఆయనకు అయిదుగురు సోదరులు. కుమారులు ఇద్దరు, 1. వెంకటరంగయ్య, 2. బాబయ్య. వెంకటరంగయ్యగారు నిండైన ఆజానుబాహుడు, దాబుదర్పంగల వ్యక్తి. స్ఫురద్రూపి, సంభాషణలో చాలా కుశలుడు. వారితో ఎన్నిగంటలైనా ఆనందంతో గడుపవచ్చు. మహా ప్రతిభావంతుడైన వారి సాంగత్యమున ఎన్నో విషయములు నేర్చుకొనవచ్చు. నిరంతరం ఉద్యోగస్తులతో సాంగత్యం, తాను గ్రామమునసబు అయినా జిల్లా కలెక్టరుగా వ్యవహరించిన ఘనుడు. అవనిగడ్డ పంచాయతీకి మొదటి అధ్యక్షుడు, కౌతవరంలో జరిగిన మొదటి కమ్మ మహాజన సభకు అధ్యక్షుడు. వీరు ముట్నూరి కృష్ణారావుగారికి సహాధ్యాయి, ఆత్మీయుడు.

మేము వారి దర్శనమునకు వెళ్ళేసరికి వారు అప్పుడే బందరునుంచి వచ్చి బందరులో కొనుక్కొని వచ్చిన కుటుంబానికి కావలసిన వస్తుసామగ్రి జమాఖర్చు లెక్కలను తమ్మునితో కలిసి సరిచూచుకొనుచున్నారు. మేము నమస్కరించగానే బహు ఆప్యాయతతో, పితృ వాత్సల్యంతో "రండి బాబూ రండి. కూర్చోండి, బాబయ్యా, బాబులకు కాళ్ళకు నీళ్ళు తీసుకురా. బాబు ఎక్కడనుండి రావడం" అన్నారు. మమ్ములను ఎంతో ఎరుగున్నట్టు ఆప్యాయతతో మర్యాదచేస్తూ మేమెవరమో తెలుసుకొనుటకు గాను ప్రత్యక్షంగా అడగకుండా ఎక్కడినుంచి రావడం అనే ప్రశ్నతో మేమెవరమో తెలుసుకొనదలచారు రంగయ్యగారు. నేను వారిని అర్థం చేసుకొని ఘంటసాల నుండి "నేను తమకు ఉత్తరం వ్రాశాను. మా భాండాగార వార్షికోత్సవానికి అధ్యక్షత వహించవలసిందిగా ప్రార్థిస్తూ" అన్నాను. ఔనౌను,



మిమ్ములను చూడగానే అనుకున్నాను ఘంటసాల బాబులని. సంతోషం, బాబులను ఈ విధంగా పరిచయం చేసుకోగలిగాను.

వెంకట్రామయ్యా, (ఒక పినతండ్రి వెంకటకృష్ణయ్యగారి కుమారుడు, మా గ్రామంలోని వేమూరి రత్నయ్యగారి అల్లుడు) ఇదిగో, ఘంటసాల నుంచి బాబులు వచ్చారు. రా! వీరితో ఏమైనా స్నేహం కలుపుకున్నావా? వీరెవరో వివరాలు తెలుసుకున్నావా? ఘంటసాలలో ఉన్నప్పుడు ఈ బాబులతో ఏమైనా మాట్లాడినావా? లేక అత్తవారింట దిట్టంగా తిని గదిలో పడుకొనుటేనా?" అని పరిహాసంలో కలిపి ప్రశ్నల వర్షం కురిపించారు. మమ్ములను అడగకుండా మమ్ములనుగురించి తెలుసు కొనవలెనని వారి ప్రయత్నం.

వెంకట్రామయ్యగారు వచ్చి మమ్ములను చూచి పలకరించారు. కాని, మమ్ములను గురించిన వైనం వారికి తెలియదు. ఆయన ఏమీ చెప్పలేక సందిగ్ధస్థితిలో పడ్డారు. నేను ఇది గమనించి "వారు ఘంటసాలలో ఉన్న రోజులలో మేము బందరులోనే ఉంటూ ఉండేవారము. ఏదో ఒకటి రెండుసార్లు కలుసుకొనడం తప్ప పెద్ద పరిచయం కలుగలేదు" అని మమ్ములను మేము ఎరుక పరచుకున్నాం. వెంకటసుబ్బయ్యను పరిచయం చేసిన తర్వాత నేను కొండపల్లి సుబ్బయ్యగారి మేనల్లుడను అని చెప్పాను. మా నాయనగారు నా చిన్నతనంలో చనిపోవడంవల్ల, వారిని రంగయ్యగారు ఎరుగరని, నన్ను పెంచుతూ వున్న మా పెద్ద మామగారిని వారు ఎరిగి వుందురని తలచి అలా నన్ను పరిచయం చేసుకున్నాను. అంతట వారు 'బాబూ మీ ఇంటిపేరు?' అన్నారు చాలా ఆప్యాయతతో నేను "గొట్టిపాటి" అన్నాను. "అయితే బాబూ సుబేదారుగారి మనుమడివా?" అన్నారు. అవును అన్నాను. "అలా అయితే వీరరాఘవయ్యగారి కుమారుడవు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామిగారు మీ పినతండ్రి, అంతేనా" అన్నారు. ఔను అన్నాను. "ఏమిటబ్బాయి మీ కుటుంబానికి ఎంతో చరిత్ర వున్నది. మీ తాత సుబేదారు. మీ తండ్రి ఆగోటక వ్యాజ్యంలో జమీందారును వణికించాడు. మీ పినతండ్రి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అప్పుడు మన కమ్మవారిలో మొదటి బి.ఎ. నేను మెట్రిక్యులేషన్‌లో దండయాత్రలు చేస్తూ వుంటే ఇలా వచ్చి అలా ప్యాసయి వెళ్ళాడు. అప్పుడు ఆయనకు పెద్ద జుట్టు, ముచ్చటముడి, చేతులకు బంగారు మురుగులు, దండకడియం వుండేవి. ఆలా తెలివైనవాడు. పాపం వారిద్దరు చిన్నతనంలోనే చనిపోయారు.

"నాయనా ఇంత చరిత్రగల కుటుంబం మీది. అయితే నీవు నీ మేనమామగారి పేరు చెబుతావెందుకు?" అన్నారు. అప్పుడు నా తప్పు నేను తెలుసుకున్నాను. ఈ అనుభవంతో ఇక ఇట్టి పొరపాటు ఎప్పుడూ చేయలేదు. చాలామంది పెద్దవారు సహా తమ్ముతాము పరిచయం చేసుకొనేటప్పుడు, ఇతరులను పరిచయం చేసేటప్పుడు తమకు తెలియకుండానే ఇట్టి పొరపాట్లు చేస్తారు. అలాగే నేను చేశారు. ఒకసారి ఘంటసాల పాలెం గ్రామంలో ఒక పెండ్లి సందర్భములో ఒకరిని పరిచయం చేయవలసి వచ్చింది.

నేను "వీరిని ఎరుగరూ మనకు బంధువు. గూడవల్లి వెంకయ్యగారి జ్యేష్ఠ కుమారుడు చన్నయ్యగారు. ప్రస్తుతం నందమూరు మునసబు చేస్తున్నారు. ఇదివరకు నూజివీడు తాలూకా బోర్డుకు ఉపాధ్యక్షుడుగా పనిచేశారు. సినిమా డైరెక్టరు మన గూడవల్లి రామబ్రహ్మం గారు ఈయన తమ్ముడే" అని చెప్పాను. ఈ చెప్పే వరసంతా గమనించిన చన్నయ్యగారు "బావా! బ్రతికించావు. నేను వాడి అన్నను అని చెప్పక, వాడు నా తమ్ముడు అని చెప్పారు బాగుంది" అన్నారు. ఇలా పెద్దవారి వద్ద నేను నేర్చుకొనినవెన్నో గలవు.

రంగయ్యగారు వారి పినతండ్రులను, సోదరులను పిలిపించి మమ్ములను వారికి పరిచయం చేసి సంభాషణలు కొంతసేపు జరిగిన తరువాత "బాబయ్యా! బాబులు స్నానం చేస్తారు. నీళ్ళు తీసుకువచ్చి స్నానం చేయించు అని పురమాయించారు. బాబయ్యగారు స్వయంగా నీళ్ళు తెచ్చి పీటవేసి నీళ్ళు చేతి కందించడం, సీకాయతో వీపు తోముటకు సిద్ధపడడం, ఆ సందర్భంలో బాబయ్యగారు "ఏం బాబూ! మీ అమ్మ నీకు వీపు తోమి నీళ్ళు పోయదా? మీ అమ్మస్థానే నేను వీపు తోముట న్యాయమేగా? అని ప్రశ్నించడం నాకు నవ్వొచ్చింది. అతిథి సత్కారాలలో ఓనమాలు కూడా తెలియని మేమెంత నేర్చుకోవాలో ననుకున్నాను.

ఇక భోజనాల సమయం – నేను వడ్డిస్తానంటే నేను వడ్డిస్తాను అని వారిలో వారు వంతులు పడ్డారు. చివరికి ఆఖరుమాట రంగయ్యగారిదే!

ఇదుగో బాబయ్యా! నేను చెబుతున్నాను. బాబులవంటి పిల్లలు వస్తే నేను వడ్డించాలి. నీవు వారి ప్రక్కన భోజనానికి కూర్చోవాలి. నీకంటే వారికి ఆప్యాయతగా నేను వడ్డిస్తాను. వారి తల్లుల మాదిరి. పెద్దవారెవరైనా వస్తే వారి సరసను నేను కూర్చుంటాను. నీవు వడ్డించేద్దువుగాని" అని చెప్పారు.

భోజనాల సమయంలో ఆ అన్నదమ్ముల పరిహాసాలు బావమరదుల పరిహాసాలకు మించినవి. చాలా వ్యవహారదక్షులు. మితవ్యయం వారినుంచి నేర్చుకోవాలి. నొచ్చకుండా నొవ్వకుండా వుండే కార్యనిర్వహణ చాతుర్యం వారి సొమ్ము.

బాబయ్యగారు ఆదర్శప్రాయమైన వ్యవసాయకుడే కాక మంచి వ్యవహర్తకూడ. మన పని మనం స్వయంగా చేసుకొనడం మన విధి అనునది వారి ఆదర్శం. ఒకసారి బందరులో ఇంటికి కావలసిన సరుకులు కొనుక్కుని తాటాకు బుట్టలలో కట్టించి తలమీద, భుజాలమీద, చేతులలోను పెట్టుకొని ఒక ప్రభ బండిగా వస్తున్నారు. నేను ఎదురై నమస్కరించాను. వారు నవ్వుకున్నారు. పతి వందనం చేయడానికి చేతులనిండా సరుకుల బుట్టలయ్యే "మనం వీటికెంతో కూలి ఇవ్వవలసి వస్తుంది. ఏదో ఇటువంటిదే మనం మిగుల్చుకోగలిగేది ఏమంటారు?" అని ప్రశ్నించి నావద్ద మూజువాణీ యోగ్యతాపత్రం పుచ్చుకొని ఆనందంతో వెళ్ళిపోయారు.



నేను దివిసీమ ప్రాంతాలకు వెళ్ళునపుడెల్ల కృష్ణ దాటవలసిన రేవు కూడా అదే. విధిగా వెంకటరంగయ్యగారిని దర్శించి, వారి ఆతిథ్యం స్వీకరించి మరీ వెళ్ళుతుండేవాడిని. మా తాలూకాకు వారు భీష్ములు. నాపట్ల వారికి కూడా పుత్రవాత్సల్యం, కనబడినపుడెల్ల వినయ విధేయతలతో నేను నమస్కరించగానే వారు ఆప్యాయతతో కౌగలించుకుని తన అనుభవాలను చెబుతూ "బాబూ పెద్దవాళ్ళమయ్యాము. కాస్త కనిపెట్టి వుండండి. నాకు తెలుసు నా మీద నీకు ప్రేమ భక్తి ఎక్కువని – వింటూనే వుంటున్నాను. నేను గ్రామ మునసబునని, రావు సాహెబునని బంగారపు పన్నుకర్రను ప్రభుత్వం నాకు బహుమతి ఇచ్చిందని మనవాళ్ళు ఏదో సభలలో అంటూ వుంటే నీవు వారిని మందలించుటే కాకుండా నన్ను చాలా బాగా పెద్దరికంగా మాట్లాడుతుంటావని చెబుతున్నారు. కనిపెట్టి వుండుబాబు" అని కౌగలించుకునేవారు. వారి కుటుంబంలో వారి చిననాయనగారి కుమారుడు శ్రీ కంఠంనేని పిచ్చయ్య (బి.ఎ.) కాంగ్రెసు కార్యకర్త, రాజకీయాలలో నా సహచరుడు, మిత్రుడు, త్యాగధనుడు, స్వార్థరహితుడు.

ఈ గ్రామ కాపురస్తుడు, తాలూకా, జిల్లా బోర్డులలో సభ్యుడుగాను, కాంగ్రెసు కార్యరంగమున నాకు సన్నిహిత సహచరుడుగాను వ్యవహరించిన వేములపల్లి వెంకట గోపాలరావుగారు నాకు నిరంతరం స్మరణీయుడు. చాల ఆత్మీయుడు, చక్కని సలహాల నిచ్చేవాడు.

శ్రీ రామమోహన పుస్తక భాండాగారానికి నేను భాండాగారాధిపతిగాను, కార్యదర్శి గాను, అధ్యక్షుడుగాను చాలాకాలం వ్యవహరించాను. మా గ్రామానికి వచ్చిన పెద్దలందరిని మా పుస్తక భాండాగారానికి ఆహ్వానించి, వారికి మా కార్యనిర్వహణను చూపి, గ్రామంలోని దేవాలయాల వద్దగల బహిరంగ స్థలంలో సభలు జరిపి, వారిచేత ఉపన్యాసాలిప్పించి, గ్రామస్థులకు అప్పటి పరిస్థితులను గురించి విశదపరచడం జరుగుతూ ఉండేది.

## శ్రీ దామెర్ల వెంకట్రావు

1920లో అవనిగడ్డ రేంజి స్కూళ్ళ డిప్యూటీ ఇన్‌స్పెక్టరుగా వున్న దామెర్ల వెంకట్రావు గారు మా వూరు వచ్చినప్పుడు మా గ్రామంలో పాటిమట్టి త్రవ్వినప్పుడు దొరికే పురాతనపు బంగారు నాణెములను సేకరించి వాటిని లక్కమీద ముద్రించి, వారికిచ్చి వాటిని గురించిన భోగట్టాతో మా గ్రామ ప్రాచీన చరిత్రను వారి నుంచి తెలుసుకున్నాను. ఇలాగే మా వూరు వచ్చే విద్యాధికులనుంచి విషయ సేకరణ చేయడం జరుగుతూ ఉండేది. వెంకట్రావుగారు ప్రభుత్వోద్యోగిగా ఉన్నా జాతీయవాదే. కాంగ్రెస్ అభిమాని. గ్రామాలవెంట ఆయన తిరుగుతూ కాంగ్రెస్ కార్యకర్తలను ప్రోత్సహించేవారు. ఈయన 1920లో పెదకళ్ళేపల్లిలో జరిగిన కృష్ణాజిల్లా రాజకీయ సభకు ప్రచ్ఛన్నంగా హాజరై మాంటేగ్స్ చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల గురించి, రాజుగారి ఫర్మానా గురించి చేయబడిన తీర్మానాలను నానుంచే తెలుసుకుని ఆనందించారు.

మా తాలూకాలో జరుగుతున్న కాంగ్రెస్ కార్యక్రమ నిర్వహణలో వీరి ప్రోత్సాహం పరోక్షంగా ఉన్నదని పసిగట్టి పై ఉద్యోగులు వారిని మరొకచోటికి బదిలీ చేశారు.

వెంకట్రావుగారు తర్వాత ఉమ్మడి మదరాసు ప్రభుత్వంలో ఎం.ఎల్.సి. అయ్యారు. చిన్నవయస్సులోనే సుప్రసిద్ధ కళాకారుడుగా ఆంధ్రప్రశస్తిని నలుమూలల చాటిన కీర్తిశేషులు దామెర్ల రామారావుగారు వీరి తమ్ముడే. వెంకట్రావుగారు ఆనాటి నుంచి నాకు ఆప్త మిత్రులైనారు, నేను రాజమహేంద్రవరం వెళ్ళినప్పుడల్లా నేను మాటాడే సభలకు వచ్చి ఆప్యాయతతో నన్ను ఆశీర్వదిస్తూ వుంటారు.

## శ్రీ క్రొవ్విడి లింగరాజు

ఆంధ్రదేశంలో ప్రసిద్ధులైన క్రొవ్విడి లింగరాజుగారి మాతామహస్థానం మా గ్రామమే. వారు జన్మించినది ఇక్కడనే. వారి తండ్రిగారి జన్మస్థానం ప్రాచీన ఆంధ్ర సామ్రాజ్యానికి ముఖ్యపట్టణంగా ప్రసిద్ధిచెందిన శ్రీకాకుళం.

శ్రీకాకుళం కరణాలు తెలివితేటలకు వ్యవహార దక్షతకు ప్రసిద్ధిగన్నవారు. ఆ కరణాల కుటుంబాలలోనివారే వీరు.

వారి తండ్రిగారు ఉద్యోగరీత్యా రాజమహేంద్రవరంలో స్థిరనివాసం ఏర్పరచు కున్నారు. లింగరాజుగారు వారి రెండవ మేనమామగారి కుమార్తెను వివాహమాడిన కారణంగా విద్యార్థిగా వున్నప్పుడు సెలవులలో మా వూరు వస్తుండేవారు. వీరి పెద్ద మేనమామగారి అల్లుడు శ్రీకాకుళంలో కాపురం వుంటున్న శ్రీ వెంకటేశ్వరరావుగారు కూడ తరచు మావూరు వస్తుండేవారు.

వీరిద్దరు మహాత్ముని అసహాయోద్యమం శంఖారావం విని, చదువులకు స్వస్తి చెప్పి జాతీయ ఉద్యమంలో ఉరికినవారే.

వారు ఘంటసాల వచ్చినప్పుడు వారితో మా పుస్తక భాండాగారంలో రాజకీయాలను గురించి చర్చలను సాగించేవారము. సాయంత్రము, మా గ్రామం దక్షిణాన ఉన్న "ఆళ్ళ వెంకమ్మ చెరువు" గట్టుకు షికారు వెళ్లి అక్కడ రాజకీయాలను గురించి సంభాషణలు సాగించుకుని స్వరాజ్య సంరంభంలో చురుకుగా పాల్గనడానికి పరస్పరం ఆలోచనలు సాగించేవారం.

శ్రీ వేంకటేశ్వరరావు కాంగ్రెసు కార్యకలాపాలలో, రైతు ఉద్యమంలో, జమీందారీ వ్యతిరేక పోరాటంలో నాకు సహచరుడుగా ప్రశంసనీయంగా పనిచేశారు.



శ్రీ లింగరాజు ఆంధ్రనాయకులుగా ప్రసిద్ధులైన డా॥ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం, మహర్షి బులుసు సాంబమూర్తి, ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు గార్ల ప్రేమకు పాత్రులై వారికి నచ్చిన శిష్యకోటిలోని వారైనారు.

మేధావి కావడం వల్ల 'స్వరాజ్య' పత్రికలో ఉపసంపాదకుడుగా, సీతానగర ఆశ్రమం అంతేవాసిగా, "కాంగ్రెసు" పత్రికకు సంపాదకుడుగా వుండి, ఆంధ్ర యువకులను ఉత్తేజపరచి రాజకీయ ప్రబోధ మొనర్చి స్వాతంత్ర్య యోధులను ఎందరినో తయారుచేసిన కీర్తినందు కున్నారు.

స్వరాజ్య సంరంభంలోని ప్రతి సంఘటనలోను పాల్గన్న త్యాగధనుడీయన.

తన తండ్రి చిన్న ఉద్యోగిగా చేరి జీవనయాత్ర గడిపిన రాజమహేంద్రవరం మునిసిపాలిటీకి అధ్యక్షులై, ఆ పట్టణ ప్రముఖుల ప్రశంసలు పొందడం ఆనందించ దగినది.

కీర్తిశేషులు ఆంధ్రకేసరి మంత్రివర్గంలో పార్లమెంటరీ కార్యదర్శిగా కార్యనిర్వహణ చేయడమేగాక ఆంధ్రకేసరి జీవితాంతం వరకు ఆయనకు నచ్చిన శిష్యశ్రేణిలో ఒకడై నమ్మిన బంటుగా ప్రతిష్ఠ నార్జించుకున్నారు.

బ్రిటీషు ప్రభుత్వ హయాంలో చురుకైన విమర్శలకు అలవాటైన వారి కలం వాడి ఛాయలు ఈనాటికీ వారివ్రాతలలో మనం చూస్తున్నాము.

ఇటీవలనే ఆయన షష్టిపూర్తి జరిగింది. దానికి నన్నే అధ్యక్షునిగా షష్టిపూర్తి ఆహ్వానసంఘం వారు ఆహ్వానించి గౌరవించడం, మా చిననాటి సాహచర్యాన్ని సింహావలోకనం చేసుకొని ఆనందించడం జరిగింది. ❑

# గ్రామంలో కార్యకలాపాలు

నేను బందరులో చదువుకునే రోజులలో నాకు పంపే డబ్బుకు జమాఖర్చు లెక్కలు సరిగా తేదీలవారీ వ్రాయమని మా మేనమామగారి ఆజ్ఞ. అలాగే వ్రాసి సెలవులలో ఆయన పరిశీలనకు వుంచేవాడిని. సెలవులలో ఇంటివద్ద ఉన్నప్పుడు ఎవరైనా డబ్బుయిచ్చి పుచ్చుకోవడానికి వచ్చినప్పుడు ప్రామిసరీ నోట్లకు లెక్కలు కట్టించి ఆ డబ్బు పుచ్చుకొనడం, రోజు ఆవర్జాలు వ్రాయడం చేయించుతూ ఒక విధమైన తర్ఫీదు ఇచ్చేవారు.

చదువుమానిన తర్వాత తనవెంట పొలం తీసుకునివెళ్ళి పాలు పిండించడం, పాలేళ్ళు పనులు చేస్తూ వుంటే అజమాయిషీ చేయడం, గ్రామంలోని వ్యక్తులకు తాను భాగపంపిణీలు వగైరా వ్యవహారకాండ చేస్తూవుంటే, తనవెంట తీసుకువెళ్ళి అక్కడ కొలతలు వగైరా నాచే చేయించడం, ఆ పాళ్ళ జాబితాలు వగైరా వ్రాయించడం, ప్రామిసరీనోట్లు, దస్తావేజుల ముసాయిదాలు వ్రాయడం నేర్పి ప్రోత్సహించేవారు. భూముల సర్వే, దస్తావేజుల ముసాయిదాలు తెలుసుకుని గ్రామంలో నా వద్దకు వచ్చినవారికి యధేచ్ఛగా క్రయదస్తావేజులు వగైరా వ్రాసి యిస్తూ వుండేసరికి మా గ్రామకరణం ఘంటసాల నరసింహంగారి నుంచి మా మేనమామగారికి ఫిర్యాదు వెళ్ళింది. మీ మేనల్లునిమూలాన నా వరుమానం తగ్గిపోతూ వున్నదని, వారిద్దరు స్నేహితులు. దీనివల్ల కొంత ప్రజారంజ నాయకత్వం మనకు వచ్చినా ఆ వృత్తుల మీద ఆధారపడిన వారికి మనం అడ్డంగా వుండరాదని, గ్రామకరణంగారితో మనకు వ్యతిరేకత ఏర్పడడం కూడా మంచిదికాదని మా మేనమామగారు సలహా చెప్పారు. ఈ నరసింహంగారి కుమారుడు కీర్తిశేషుడైన శేషగిరిరావు నాకు మిత్రుడు. రెండవ కుమారుడు శ్రీ రామారావు ప్రస్తుతం కరణీకం చేస్తున్నారు. నాకు మిత్రులు, ఆయన కూడా నన్ను కలుసుకున్నప్పుడు నాతో ఈ విషయమై ముచ్చటించారు. అంతటితో ఈ కార్యక్రమం విరమించాను.

నన్ను పట్టభద్రుని చేయించి నావల్ల ప్లీడరీ చేయించవలెనని ఆయన ఆదర్శం. స్కూల్ ఫైనల్‌తో చదువుకు స్వస్తిచెప్పిన నన్ను ఇక గ్రామం పెత్తనదారుగా తయారు చేయడానికి దిగింది. ఒకసారి అన్నారు ఆయన నాతో నవ్వుతూ "పెండ్లిలో అంపకాల సమయంలో సమయమంత్రి కట్నాలు, పెండ్లి సమయాలలో సంభావనలు వగైరా గురించి కూడా తెలుసుకోవోయి" అని.

నేను కాంగ్రెసువాదిగా గ్రామాలవెంట ప్రచారానికి తిరుగుతూ వుంటే ఆయనకు కష్టంగా వుండేది. రెండుసార్లు హెచ్చరించినా, నేను వినకపోయేసరికి ఆ ప్రయత్నం



మానుకున్నారు. డబ్బు పాడుచేస్తూ వున్నానేమోనని మాత్రం అప్పుడప్పుడు వచ్చి దగ్గరవుండి పెట్టితీయించి నారోజు ఆవర్జా లెక్కలు చూస్తూ వుండేవారు. గ్రామంలో నా కార్యక్రమానికి తాలూకా సభ జరపడం, ఓట్ల పెట్టెలు ఖాళీగా పంపడంలో వారి చేయూత పూర్తిగా వుండేది.

1920లో డాక్టరు పట్టాభి సీతారామయ్యగారివద్దకు వారిని తీసుకువెళ్ళాను. ఆయన ఆరోగ్యాన్ని గురించి పరీక్షించి సలహా ఇవ్వడానికి వారి వద్దకు వెళ్ళి నమస్కరించుటయే తడవుగా "ఓ బ్రహ్మయ్యగారా! ఘంటసాలవారు" అన్నారు. నేను నా మేనమామగారిని పరిచయం చేశాను. పరీక్షచేసి సలహా యిచ్చిన తరువాత సుబ్బయ్యగారు వారితో "మీ వద్దకు వందలమంది వస్తూ వుంటారుకదా. చిన్నవాడైన మా మేనల్లుడి పేరు మీకు ఎలా జ్ఞాపకమున్నది?" అని ప్రశ్నించడం అందుపై ఆయన "మీ బ్రహ్మయ్యగారి పేరేమిటి? ఇంటిపేరు గొట్టిపాటి అని కూడా జ్ఞాపకం వున్నది వుంటుంది. ఘంటసాలవారు ఖాళీపెట్టెలు పంపించి ప్రఖ్యాతి పొందిన తరువాత బ్రహ్మయ్యగారి పేరు జ్ఞాపకం వుండకుండా ఎలా వుంటుం"దని అన్నారు. ఆ సమాధానం మా మేనమామగారికి సంతోషం కలిగించింది. బస్తీలకు, వూళ్ళవెంట, తిరగడం, ప్రయాణపు ఖర్చుక్రింద డబ్బు ఖర్చుపెట్టుకొనడం లోలోపల ఇష్టంలేని సుబ్బయ్యగారిలో మార్పు వచ్చింది. పేరు ప్రతిష్ఠలు, పెద్దల సాంగత్యం, పెద్దలచే గౌరవింపబడడం ఇందుకు కొంత ఖర్చుపెట్టుకున్నా ఆయనకు ఆనందమే.

# పంచాయతీ బోర్డు ఎన్నికలు

గ్రామంలో పంచాయతీబోర్డు ఎన్నికలు వచ్చినప్పుడు నా మిత్రులు గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, వేమూరి సీతారామయ్య, నేను పంచాయితీ సభ్యులుగా రావలెననే నిశ్చయానికి వచ్చాము. ఈ విషయమై ఆయనతో చెప్పగా సరే ఒకటో వార్డు (ఆయన వున్న వార్డు చిన్నప్పటినుంచి నేను పెరిగిన వార్డు. అందరికి నాయందు ప్రేమాభిమానం కల వార్డు. అంతవరకు ఛైర్మన్ వెంకయ్యగారు తాను ప్రతినిధులుగా వుంటున్నవార్డు)లో నిలబడాలని, పోటీ వుండదని అన్నారు. 'మీకు స్థానమో' అని నేను అనగా, "నేను మానుకుంటాను" అన్నారు. గ్రామ పెత్తనం ఆయన మానుకొనడం నా కిష్టంలేదు. అందుచేత మా ఇల్లున్న ఏడవ వార్డులో నిలుస్తానన్నాను. "అక్కడ ఎవరు నిలుస్తారో, తెలుసా గొర్రెపాటి చిన నరసన్నగారి కుమారుడు వెంకయ్యగారు, దోనేపూడి వెంకట్రాయులుగారు, వారు హేమాహేమీలు. పలుకుబడి కలవారు. నీవు కొత్తగా మీ ఇంటికి వెళ్ళావు. అక్కడివాళ్ళను నీవు యెరుగవు. నిన్ను వాళ్ళు యెరుగరు. నీకు ఓట్లు యెవరు ఇస్తారు?" అన్నారు. 'గెలిచినా ఓడినా నా ఇల్లు వున్న వార్డులోనే నిలవడం న్యాయం' అని నేను నా కృత నిశ్చయం తెలిపాను.

వారితో పోటికి నేను నామినేషన్ కాగితం దాఖలు చేయడం అందరికి ఆశ్చర్యం వేసింది. ప్రతి వార్డుకు రెండు స్థానాలు. ముగ్గరము రెండు స్థానాలకు పోటీ చేస్తున్నాము అన్నమాట. ఛైర్మన్ వెంకయ్యగారికి, వారి తమ్ముడు, మంచి పలుకుబడిగల వ్యవహర్త

లక్ష్మయ్యగారికి నేను ఓడిపోవడం ఇష్టంలేదు. ఛైర్మన్‌గారు బాహాటంగా ప్రచారం చేయడం న్యాయంకాదు. ఆ సత్సంప్రదాయం ఆయన పాటించే పెద్దమనిషి. లక్ష్మయ్యగారు నావద్దకు వచ్చి నేను "నీకు ప్రచారం చేస్తాను" అన్నారు. అపుడు నేను అన్నాను ఆయనతో, "చాల పలుకుబడి గలవారు వెంకయ్యగారు, ఆయన యెలాగైనా గెలవడం ఖాయం. వెంకట్రాయులు గారికి, నాకు మధ్య పోటీ. మీరు వచ్చి మీ మామగారైన వెంకట్రాయులుగారికి ఓటు ఇవ్వవద్దని చెప్పాలి. మీ మామా అల్లుళ్ళ మధ్య తగాదాలు నేను పెట్టినవాడి నవుతాను. ఇది ఎంతమాత్రం మంచిది కాదు. మీరు ఆశీర్వదించండి. నేను ఎవరి సహాయం తీసుకోకుండా ఇల్లిల్లు తిరిగే ఓట్లు అడుగుతాను" అన్నాను.

ఈ ప్రచారంలో విశ్వబ్రాహ్మణుడు వానపాముల సుబ్బారాయుడుగారి తమ్ముడు శ్రీ లక్ష్మీనారాయణ నాకు సాయం చేశారు. ఆయన చక్కగా మాట్లాడగల నేర్పరి, వ్యవహర్త. మా నాయనగారి పట్ల ఆయనకు గల పెద్దరికం నామీద వాత్సల్యంగా మార్చుకున్న నా శ్రేయోభిలాషి. గొర్రెపాటి కృష్ణయ్యగారు (గొలుసు కృష్ణయ్యగారు) నాతో వున్నారు. ఈ కృష్ణయ్యగారు మా పెదతాత కొండపల్లి రంగన్నగారి మనుమడు. వానపాముల సుబ్బారాయుడుగారు, గోటకం వ్యాజ్యంలో మా నాయనగారి సహచరుడని వేరుగా వ్రాయనక్కరలేదు. మా వార్డులో వైశ్యులు, విశ్వబ్రాహ్మణులు, గాజులబత్తులు, కళావంతులు, భజంత్రీలు, రజకులు, యాదవులు, కొద్దిమంది కమ్మవారు వున్నారు. లక్ష్మీనారాయణగారు నా తరఫున వక్త. "బ్రహ్మయ్య కుర్రవాడు. బుద్ధిమంతుడు, తెలివైనవాడు, పైకిరాదగిన విద్యాయోగ్యతలున్నవాడు. సుబేదారుగారి మనుమడు, గోటకం కోసం మీ తరఫున జమీందారు గారితో పోట్లాడి, వ్యాజ్యాలాడి, గోటకం నిలిపిన వీరరాఘవయ్యగారి కుమారుడు, నాటికీ నేటికీ ఇరవైయేండ్లకు తిరిగి ఇంటికివచ్చి మన తరపున పంచాయతీబోర్డు మెంబరై మనకు సేవ చేస్తానంటున్నాడు. మనమందరం ఈయనకు ఓటివ్వాలి" అని చెప్పేవారు.

మా తాత దండ్రులు సంపాదించుకున్న ప్రతిష్ఠ గౌరవాలు, ప్రజారంజకత్వం నాకు పూర్తి రక్షణ నిచ్చినవి వెంకయ్యగారి "ప్రచారం ఒక్క ఇల్లువున్న గొట్టిపాటి వారికి ఈ ఊరి పెత్తనమా?" అని. మా ప్రచారం ముందు వారి ప్రచారం ఏ మాత్రం పనిచేయలేదు. కమ్మవారిలో హెచ్చుఓట్లు నాకు వెంకట్రాయులుగారికి పడినవి. మిగతా వర్ణాలలో హెచ్చుఓట్లు నాకు, వెంకయ్యగారికి పడినవి. హెచ్చు ఓట్లు వచ్చిన నేను, వెంకయ్యగారు సభ్యులమయ్యాము. వెంకయ్యగారికంటె నాకు హెచ్చుఓట్లు వచ్చాయి. ఇది నేనూ, ఎవరుకూడ అనుకోనిది. ఈ చలువ మా తాతతండ్రులది.

తరువాత మూడు సంవత్సరాలకు జరిగిన ఎన్నికలలో ఈ వార్డుకు వెంకయ్యగారు, నేను పోటీలేకుండా వచ్చాము. వెంకట్రాయులుగారు 8వ వార్డుకు సభ్యులయ్యారు. నా మిత్రులు వెంకటసుబ్బయ్య, సీతారామయ్యలుకూడా సభ్యులయ్యారు. మేము పెత్తందార్ల లెఖ్ఖలోపడ్డాము. ఈ వెంకయ్యగారు మమ్ములను కర్రెంటు పెత్తందార్లు అనేవారు.



మేము గ్రామ వ్యవహారాలలో జోక్యం చేసుకొనక పూర్వం గ్రామంలో రెండు పార్టీలుండేవి. వేమూరి వెంకయ్య, రత్నయ్యగార్లు ఒక పార్టీకి నాయకులు. గొర్రెపాటి నరసన్నగారి కుమారుడు వెంకయ్య, దోనేపూడి వెంకట్రాయులు, గొర్రెపాటి గోపాలకృష్ణయ్య గారలు రెండవపార్టీకి నాయకులు. మొదటిపార్టీ రామన్నగారి పార్టీ అని, రెండవపార్టీ నరసన్నగారి పార్టీ అని వాడుక. అప్పుడప్పుడు కొట్లాటలు, క్రిమినల్, సివిల్ వ్యవహారాలు జరుగుతుండేవి.

1920లో కాంగ్రెసు సిద్ధాంతాలకు, మహాత్మాగాంధీ ప్రబోధాలకు మేము వశులు కావడం, తరచు పూజ్యులు ముట్నూరి, భోగరాజు, చెరుకువాడ, కౌతా ప్రభృతులను కలుసుకొనే భాగ్యం మాకు కలగడం వల్ల వారి ప్రభావం మాపై గాఢంగా ప్రసరించడం జరిగింది. దీని ఫలితంగా శ్రీగొర్రెపాటి వెంకటసుబ్బయ్య (పండిత) నేను గ్రామంలో పార్టీలు లేకుండా చేయడానికి కృతనిశ్చయులమయ్యాము. బంధుత్వరీత్యా, ఛైర్మన్‌గారి వద్ద నాకు, గొర్రెపాటి చిన నరసన్నగారి కుమార్డు వెంకయ్యగారి వద్ద గొర్రెపాటి వెంకటసుబ్బయ్యకు గల పలుకుబడిని వుపయోగించి ఈ వెంకయ్య ద్వయానికి చాలా సన్నిహితత్వం కలుగజేశాము. ఒకరు ఛైర్మన్, మరొకరు వైస్ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగానే అయ్యారు.

పంచాయతీ బోర్డులో ఏకగ్రీవంగానే నిర్ణయాలు జరుగుతూ వుండేవి. పంచాయతీ బోర్డుకు గుమస్తాలేకుండా బిల్లు కలెక్టరు లేకుండా సభ్యులమే ఆయాకార్యాలు నిర్వహించే వారము. అందరం కలిసి గ్రామం వెంట అప్పుడప్పుడు తిరిగి గ్రామంలోని మట్టిని తీసుకుని, పెంటపోగులో పోసుకోకుండా, పెంటపోగు వీధులలో పోనీయకుండా, మురుగునీళ్ళను వీధులలోనికి వదలకుండా నచ్చచెప్పే వారము. పన్నులు తక్కువ కావడం వల్ల హెచ్చు పన్నులు వసూలు చేయకపోయినా, వసూలైనవి సద్వినియోగం చేసేవారము. కాంగ్రెసు కార్యక్రమాన్ని అనుసరించి శాసనసభకు ఓటు నివ్వరాదనే ఉద్యమం (No vote campaign) తర్వాత గ్రామంలో సివిల్, క్రిమినల్ కేసులు లేకుండా చేయవలెననే సంకల్పం కలుగడం, అట్టి తగాదాలు గ్రామంలోనే పరిష్కరించడంలో అందరు నిష్కల్మషంగా పాక్షికభావం లేకుండా పని చేయడం దేవుని ముఖం చూచి న్యాయంగా తీర్పుచెప్పాలనే భావం విస్తరించడం జరిగింది. అన్నిట గ్రామపెద్దలందరి సహకారం మాకు వుండేది. ఈ మా కార్యనిర్వహణ మా మేనమామగారిలో నాపట్లగల సంతృప్తిని పెంచింది.

తరువాత బందరు తాలూకా బోర్డు ఎన్నికలు వచ్చినవి. ఛైర్మన్ వెంకయ్య, లక్ష్మయ్యగార్ల సహాయ సంపత్తితో నేను సభ్యుడను అయ్యాను. అనంతరం అధ్యక్షుడను అయ్యాను. మా గ్రామంలో ఒక సమావేశం కూడా జరిగింది, ఆ సమావేశానికి గ్రామ పెద్దలందరు హాజరయ్యారు. నేను సభ బాగా జరపడం నాకంటె పెద్దలైన తాలూకా బోర్డు సభ్యులతో నేను మెలగే పద్ధతి చూచి మా మేనమామగారు చాలా ఆనందించి సంవత్సరంన్నర శిశువును పెంచి పెద్దజేసిన తన శ్రమకు తగిన ఫలితం సిద్ధించినదని తృప్తి పడ్డారు.

తరువాత రాజకీయాలలో నా నడవడిని, వర్తనను పోషించడం తన పనిగా భావించారు. నల్లజెండాల కేసులో నేను సబ్‌జైలులో వుండగా కొత్తఖద్దరు వస్త్రాలను ధరించి నన్ను చూడడానికి వచ్చారు. అప్పటి నుంచి ఆయన చనిపోయే వరకు నియమంగా నిత్యం ఖద్దరే ధరించారు. సబ్ జైలులో వుండగా నన్ను చూచి దుఃఖపడ్డారు. తరువాత వెల్లూరు జైలులో బి.క్లాసులో వుండగా వేమూరి పరమేశ్వరుడు గారితో కలిసి వచ్చి చూచి నా చొక్కా తీయించి నా పొట్ట నిమిరి తృప్తిపడి ఆనందంతో "మా బ్రహ్మయ్య ఎక్కడ వున్నా నెగ్గుకు రాగలడు" అని అందరితో చెప్పేవారు.

# అంటరానితనం నిర్మూలన

1923లో నేను జైలులో వుండగా అంటరానితనం నిర్మూలనకు గాంధీ మహాత్ముడు తన యావచ్ఛక్తిని కేంద్రీకరించడానికి నిశ్చయించి హరిజన దేవాలయ ప్రవేశం, గ్రామసమిష్టి బావులలో నీరు తోడుకొనడానికి వారి కవకాశం కలుగజేయడం వగైరా కార్యక్రమాన్ని నిర్ణయించారు.

చెరుకువాడ వెంకటనరసింహం పంతులుగారు కడలూరు జైలునుంచి నా కంటె ముందు విడుదల అయ్యారు. మా వూరిలోని వారందరు వారికి చిరపరిచితులు. వారి మేనమామలది మా వూరే. ఆయన జన్మించినది మా వూరిలోనే. వారి తాతగారి ఇంట్లో. వారి అక్కగారిని మా వూరే యిచ్చారు. ఘంటసాల ఉద్దండ నరసింహంగారికి. ఈ విషయమై గ్రామ పెత్తనదార్లను కొంతమందిని కలుసుకొని బావులలో హరిజనులు నీరు తోడుకొనే విషయంలో వారు కొంత వెనుకాముందులాడి ఒక నిర్ణయానికి వెంటనే రాలేక "ఈ వూరికి కాంగ్రెసు నాయకుడు బ్రహ్మయ్య. ఆ బ్రహ్మయ్య మామ సుబ్బయ్యగారు పెత్తనదారులలో ముఖ్యుడు. ఆయన సరేనంటే మేముకూడా సరేనంటాము" అన్నారట.

అంతట మా మేనమామగారిని నరసింహంగారు మిత్రుడు వెంకట సుబ్బయ్యగారు కలుసుకొనగా "సాయంత్రం నేను మా దొడ్డివద్ద వుంటాను. వారినందరిని కలుపుకుని మీరు అక్కడికి దయచేయండి. మా దొడ్డిముందు మంచినీళ్ళ బావివున్నది, మనమందరం ఆలోచించుకొని ఒక నిర్ణయం చేద్దాము" అని చెప్పారు.

సాయంత్రం అందరూ వచ్చిన తరువాత మా పాలేరు గొరుముచ్చు నరసయ్యను పిలిచి అక్కడ నూతిలో నీరు తోడించి మా మేనమామగారు అందరి యెదుట చెరుకువాడ నరసింహంగారితో "నేను శుద్ధ శ్రోత్రియుడను, నాకు అంటు ఆచరాలు, నిష్ట యెక్కువ. అయితే నామేనల్లుడిని పెంచి పెద్దచేశాను. పిల్లను యిచ్చి పెండ్లి చేశాను. అతడు కాంగ్రెస్‌లో చేరి కాంగ్రెసు చెప్పినట్లు చేస్తున్నాడు. అతడు జైలు నుంచి వచ్చిన తరువాత హరిజనుని చేత మంచినీళ్ళు యెలాగూ తెప్పిస్తాడు. అతని ఇంటికి వెళ్ళినప్పుడు నేను ఎలాగూ ఆ హరిజనుని చేతినీళ్ళు త్రాగక తప్పదు. నా ఆచారాల కంటె నాకు మా బ్రహ్మయ్య ఎక్కువ. మా



బ్రహ్మయ్య మునిగిందే నాకు గంగ" అని చెప్పి ఆ హరిజనుని చేతినీళ్ళు ఆయన త్రాగాడు. అటుపిమ్మట అందరూ త్రాగారు. అంతటా గ్రామంలోని పబ్లిక్ నూతులన్నింటిలో హరిజనుల చేత నీరు తోడించడం జరిగింది. నేను జైలునుంచి వచ్చిన తరువాత నరసింహంగారు నాతో "మీ మామయ్యకు నీమీద చాలా ప్రేమ" అని పైకథ అంతా చెప్పారు.

నిజంగా ఆయనకు నామీద ఆయన బిడ్డలమీదకంటె హెచ్చు ప్రేమ. చివరి రోజులలో నా నిర్ణయమే ఆయన నిర్ణయం. 1933లో నేను జైలులో వుండగా వేయి రూపాయల జరిమానా చెల్లించవలసి వచ్చినప్పుడు, 1934లో హరిజన దేవాలయ ప్రవేశ సందర్భంలో శుద్ధ శ్రోత్రియులు, తనకు సన్నిహిత స్నేహితులు అయిన బ్రాహ్మణులతో ఈ సందర్భంలో సంఘర్షణ పడవలసి వచ్చిన పరిస్థితులలోను ఆయన నన్నే బలపరచి నా వాదనను పోషించారు. 1945లో జైలునుంచి విడుదల అయి వచ్చిన తరువాత కమ్యూనిస్టులతో నిరంతరం ఘర్షణపడడం, నిరంతరం అగ్నిభయాలతో ప్రాణభయాలతో ప్రాణాలను గుప్పిటపెట్టుకుని తిరిగే రోజులలో కూడా ఆయన ఒకసారి అయినా అధైర్యపుమాట ఆడలేదు. నా కార్యక్రమాలన్నీ జయప్రదం కాగలవని ఆయనకు మనోధైర్యమే.

గ్రామంలో మిడిల్ స్కూలును స్థాపించడం, దానిని హైస్కూలును చేయడం, దాని భవన నిర్మాణానికి ప్రయత్నాలు చేయడం, రోడ్ల నిర్మాణం, మాగాణీ సాగుకు ప్రయత్నాలు, ఇవన్నీ నేను చేయడం ఆయనకు ఆనందదాయకం. పదిమందికీ సహాయం చేయడం పేరు ప్రతిష్ఠలు సంపాదించుకొని కుటుంబ గౌరవమర్యాదలు పెంచుకుని ఫలానావారి అబ్బాయి అనిపించుకొనడం ఆయనకిష్టమైన పని. మొదట్లో నాకు ఉన్నతవిద్య రానందుకు విచారించినా, చివరకు అట్టి అసంతృప్తిని ఆయన మరచిపోయాడు. భూములను కొన్నప్పుడు, శాసనసభకు అభ్యర్థిగా నిలిచినప్పుడు కొందరికి నేను ప్రామిసరీ నోట్లు వ్రాసి అప్పు తీసుకొనడం గమనించి తాను తన జీవితంలో ఎట్టి అవసరం ఏర్పడినా మరొకరికి నోటు వ్రాయలేదు అని చెప్పగా "నేను కూడా మీవలె నోట్లు వ్రాయకుండా వుండవలెనని మీ హెచ్చరికయా?" అని నేను ప్రశ్నించగా ఔనన్నారు. అప్పటి నుంచి సుమారు ముప్పది సంవత్సరాల నుంచి నేను కూడా ఆ నియమాన్ని పాటిస్తున్నాను.

ఆయన కుమార్తె చిరంజీవి సరస్వతిని నాకిచ్చి వివాహం చేశారు.

నా కుమార్తె చిరంజీవి యశోదమ్మను తన కుమారుడు చిరంజీవి చిట్టెయ్యకు ఇవ్వవలసిందిగా కోరినారు. ఆ వివాహం కూడా ఆయన ఆధ్వర్యంలోనే జరిగింది.

మా అందరిచే సపర్యలనంది ప్రశాంతంగా 82వ యేట ఆయన పరమ పదించారు.

1917లో స్కూల్ ఫైనల్‌తో చదువుకు స్వస్తి చెప్పి, శ్రీ రామమోహన పుస్తక భాండాగార నిర్వహణను ప్రధానంగా చూచుకుంటూ గ్రామవ్యవహారాలలో కొద్దో గొప్పో జోక్యం

కల్పించుకుంటూ పాత పెత్తందార్ల వెనక కొత్త పెత్తందార్లమంటూ తిరుగజొచ్చాము. గ్రామంలో వున్న రెండు పార్టీల నాయకులను సన్నిహితం చేసి గ్రామంలో జరిగే తగాదాలు వగైరా పంచాయతీలద్వారా తీర్చుకొనడానికి మా శక్తినంతా వినియోగించాము. ఈ నా వ్రాతలో మా, మేము అంటే నేను, పండిత గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, వేమూరి సీతారామయ్య 1917 నుంచి 1920వరకు బందరుకు వచ్చినపుడెల్లా కృష్ణరాయలవారి దర్బారుకు హాజరై అక్కడ జరిగే చర్చలను విని ఆనందించడం జరుగుతుండేది.

## సహాయ నిరాకరణోద్యమం

1920వ సంవత్సరంలో సహాయ నిరాకరణోద్యమం, స్వరాజ్య సంరంభం ప్రారంభమైనాయి. మమ్ములను సైనికులుగా ఈ ఉద్యమాలు ఆహ్వానించినవి. ఘంటసాలలో దివితాలూకా మహాజనసభ దిగ్విజయంగా జరుపుకున్న బాలవీరులుగా తాలూకా అంతటా ప్రచారానికి బయలుదేరాము, అవనిగడ్డ నుండి ముట్నూరు కృష్ణారావు పంతులు, చెరుకువాడ వెంకటనరసింహం పంతులు, బోడి నారాయణరావు గార్లతో కోడూరు చేరుకున్నాం. ఆనాటి వరకు కృష్ణారావు పంతులుగారిని అధ్యక్షులుగా కోరుకున్నారు పెద్దలందరు. వారు చిరునవ్వుతో నావైపు చూపి "ఆయన మీ సభాధ్యక్షుడు" అన్నారు. అందరిలోకీ నేను చిన్నవాడను. అప్పటికి ఏ సభకు అధ్యక్షత వహించలేదు. చాలా వుక్కిరి బిక్కిరి అయ్యాను. "ఫర్వాలేదు అధ్యక్షత వహించు" అని ఆదేశించారు. అగ్రసేనాధిపతి నయ్యాను, మూగనోము మాత్రం కాదు. దేశ పరిస్థితులు, మహాత్ముని నాయకత్వం, సహాయ నిరాకరణోద్యమం, పంజాబు వధలు – మన రాష్ట్రంలోని జస్టిస్ పార్టీ, మితవాదుల అభ్యర్థిత్వాలను గురించి ముచ్చటించాను. పంజాబు వధలను గురించి నిప్పుల వర్షం కురిపించి రణభేరి మ్రోగించారు పంతులుగారు. సభానంతరం ముట్నూరివారు, చెరుకువాడవారు, నేనేమో అక్కరకు వచ్చేవాడిననే భావించారనుకుంటాను. ఉద్యమ సంరంభంలో మునిగిపోయాం. మద్రాసు రాష్ట్రం మొత్తంలో మునసబు, కరణాలు కూడా ఓటుచేయక ఖాళీ పెట్టెలను పంపిన పోలింగ్ స్టేషన్‌లలో మా ఘంటసాల ఒక్కటే. గురువుల అభినందనల నందుకుని వీరుడననిపించుకున్నాను. ❑



## "నా గురు దేవులు శ్రీ ముట్నూరి"

కాంగ్రెసు సంఘాలు వచ్చినవి. 1920–21లో తూర్పు కృష్ణా కాంగ్రెసు అధ్యక్షులు ముట్నూరివారు. ప్రధాన కార్యదర్శి భోగరాజువారు. సంవత్సరం గడిచింది. నూతన సంవత్సరం 1921–22కు కమిటీ నిర్మాణానికి బందరు టౌను హాలులో సమావేశమయ్యాము. యథాతథంగా ముట్నూరువారిని వుంచవలసిందిగా నేను వారి పేరును ప్రతిపాదించాను. వారు (ముట్నూరివారు) అందరు ఆశ్చర్యపడేటట్టు లేచి నా పేరు సూచించారు. "నే నేమిటి? జిల్లా కాంగ్రెసు సంఘానికి అధ్యక్షత వహించడమేమిటి? చాలా చిన్నవాడను నావల్లకాదు. నేను నా పేరును ఉపసంహరించు కుంటున్నాను అని అన్నాను. నేను పెద్దవాడను. నా వల్ల కాదు, నేను ఉపసంహరించుకుంటున్నాను అన్నారు పంతులుగారు. ముట్నూరి వారు భోగరాజు వారు నేత్రావధానం చేసుకున్నారు. ఇద్దరి ఉపసంహరణ ఒప్పుకోబడదు. ఓటుకు పెడుతున్నానన్నారు నాయకులు, శ్రీ పట్టాభి.. పెద్దవారందరు నాకు చేతులెత్తారు. నేను నా తోటి యువకులు పంతులుగారికి చేతులెత్తాము. లెక్కలో నాకు ఒకటి హెచ్చుపడింది. "అయ్యావు అధ్యక్షుడవు రా కుర్చీ ఎక్కు" అన్నారు పంతులుగారు. భయపడుతూ వెళ్ళి కూర్చున్నాను, నేను అధ్యక్షుడను, పట్టాభిగారు ప్రధాన కార్యదర్శి, ఇదంతా శ్రీకృష్ణమాయ.

బందరుతో నాకు గల సంబంధం విడరానిదైనది. తరచు బందరును, దర్బారును దర్శించే భాగ్యం. పెద్దల సంభాషణలను వినే అదృష్టం కలిగింది. తూర్పు కృష్ణ కాంగ్రెసు రంగంలో పట్టాభిగారి తరువాత వాడుగా పరిగణింపబడే అదృష్టం కలిగింది. 1927లో గురువులు ముగ్గురి ఆశీర్వచనాలతో బందరు తాలూకా బోర్డు అధ్యక్షత సిద్ధించింది. తెలుగులో పరిపాలన జరపడం, ఖద్దరు అంటరానితనాలను గురించి ప్రత్యేకశ్రద్ధతో ప్రబోధాలు, గ్రామాలలో ఉపన్యాసాలు సైమన్ కమీషన్ వచ్చిన సందర్భమున ఆఫీసుపై నల్లజెండా ఎగరవేసి పాఠశాలలు మూయడం వగైరా కార్యక్రమాలు ఇతర పరిపాలనా వ్యవహారాలు ఎప్పటికప్పుడు కృష్ణారావు పంతులుగారు నావల్ల విని, సలహాల నిచ్చేవారు. పరిపాలనా సందర్భంలో పెద్దలతో వచ్చిన అభిప్రాయభేదాలు పోగొట్టి సరిచేయడంలో వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎట్టి కష్టాలు నాకు దాపరించకుండా కంటికి రెప్పవలె కాచిన సందర్భాలు ఎన్నోకలవు.

## నంద్యాల రాజకీయసభ

1937లో నంద్యాలలో జరిగిన 16వ ఆంధ్ర రాష్ట్ర రాజకీయ మహాసభాధ్యక్షత తలవని తలంపుగా నాపై పడింది. ఎట్టి ప్రయత్నం లేకుండానే ఇందుకు భగీరథ ప్రయత్నాలు

చేసిన వారిని వరించకుండా ఘంటసాలలో వున్న నన్నే వరించడానికి కారణం? 1937లో చల్లపల్లి రాజాగారితో జరిగిన అసెంబ్లీ పోటీలో నన్ను గురించి కృష్ణాపత్రిక. ఆంధ్రపత్రికల భావాలు అన్ని జిల్లాలవారిని ఆకర్షించి, నాకే ఓటు చేసేటట్లు చేసినవి. ఘంటసాలలో ప్రశాంతంగా కూర్చుని అధ్యక్షోపన్యాసం తెలుగులో వ్రాసుకుని పట్టాభిగారికి చూపించాను. ఇన్నేళ్ళకు తెలుగులో అధ్యక్షోపన్యాసం వినే అదృష్టం దేశానికి కలిగింది. సంతోషం" అని నేను వ్రాయని కొన్ని విషయాలను సూచించి "వీటిని గురించి కూడా మీరు వ్రాసి కృష్ణారావుకు చూపించండి" అన్నారు. నే అలాగే చేశాను. వారు దానికి మెరుగులు దిద్ది ఆకర్షవంతంగా హెడ్డింగులు పెట్టి అచ్చుకిచ్చారు. "మెయిల్" పత్రికతో సహా అన్ని పత్రికల ప్రశంసల చూరగొన్నది ఆ ఉపన్యాసం.

అప్పటినుంచి రాష్ట్రంలో ద్వితీయశ్రేణి ముఖ్యుల జాబితాలో నాపేరు కూడా చేరింది. ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారు రెవిన్యూ మంత్రిగాను, మహర్షి సాంబమూర్తిగారు – స్పీకరుగాను వెళ్ళడం వల్ల రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్ష, కార్యదర్శి పదవులు ఖాళీ పడినవి. కృష్ణారావు పంతులుగారితో ఈ విషయం చెప్పి ప్రయత్నం చేస్తే నేను ప్రధాన కార్యదర్శి నయ్యేటట్టున్నాను. "పట్టాభిగారిని అధ్యక్షులుగా వుండమని మీరు చెప్పండి. నేను చెబితే నాకెందుకు అన్నారు. సరే నువ్వు అధ్యక్షుడుగా వుండు. పట్టాభి కార్యదర్శిగా వుంటాడు. బ్రాహ్మణేతరుడు కిరీట ధారణకు అర్హుడు. బ్రాహ్మణుడెప్పుడూ" మంత్రిగా వుండడానికి మాత్రమే అర్హుడన్నారు. ఇది న్యాయం కాదు, వారిని అధ్యక్షుడుగా ఉండమని చెప్పండి" అన్నాను వెనుక మీరు జిల్లా కాంగ్రెసుకు అధ్యక్షతా కార్యదర్శులుగా వున్నారుగా! అలాగే వుండండి!" అన్నారు. వారికి నాపై గల అనురాగం అలాటిది. సరే నేను కార్యదర్శిగా వుండడానికి కారణాలు. పట్టాభిగారు అధ్యక్షులుగా వుండవలసిన అవసరం సవివరంగా చెప్పి వారి ఆమోద ముద్ర వేయించుకున్నాము. నేను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వున్నప్పుడు జరిగిన సంఘటనలను ఎప్పటికప్పుడు వారికి చెప్పడం, వారి అంగీకారం పొందడం. సందేహ నివృత్తులు చేసుకొనడం జరిగేది.

రైతు వుద్యమంలోగాని, జమీందారీ రైతువుద్యమంలోగాని వారి సలహా సంప్రదింపులు ఎప్పుడూ నాకు వుండేది. వారు వెనుక వుండి చుక్కాని పడుతూవుంటే నేను గడకర్రతో పడవను నడిపేవాడిని.

పట్టాభిగారితో నేను హెచ్చుకాలం గడుపుతున్నా, వారిని సముద్రుడుగానో – హిమాలయ పర్వతంగానో చూడవలసి వచ్చేది. కృష్ణారావు పంతులుగారు మాత్రం నిరంతరం నన్ను పునీతమొనర్చే పవిత్రకృష్ణమ్మ తల్లిగా నేను భావించి నమ్రతతో వారు చెప్పినదానికి వల్లె అని చెప్పే స్థితిలో నన్ను వుంచేవారు. దీనికంతకు నాపై వారు కురిపించిన ప్రేమ వర్షమంటే అతిశయోక్తి కాదేమో!



ఒక సందర్భంలో వారి "కృష్ణాపత్రిక"లో పట్టాభిగారిపై చేసిన ఒక విమర్శనను గురించి నేను హెచ్చరించడం జరిగింది. వారు వెంటనే ఈ క్రింది విధంగా సమాధానం చెప్పారు, "ఈ కిరీటం, ఈ భుజకీర్తులు, ఈ కాగితం, కలం, కృష్ణాపత్రిక సంపాదకునివి. సంపాదకుడుగా, దేవుని సయితం లక్ష్యపెట్టేది లేదు. శత్రుమిత్ర భేదం ఈ కలం పాటించదు. ఈ విషయం గుర్తెరిగి నీవు నడుచుకో – నీతో చెప్పిన మీ గురువుకు ఈ విషయం చెప్పు. "కృష్ణాపత్రిక" సంపాదకుడు వేరు – ముట్నూరి కృష్ణారావు వేరు. ఈ భేదం గమనించే నా నుంచి మీరేమైనా ఆశించండి" అన్నారు. ఆయన ఆకారమెంత ఆకర్షవంతమో ఆయన విమలవర్తన నిష్కామభావం అంతే అనుసరణీయాలు.

శ్రీ ముట్నూరి కృష్ణారావుగారికి "కృష్ణాపత్రిక" "ముద్రణాలయం" మీద ఖర్చులు పోను నెలకు నూరు రూపాయలు మాత్రమే మిగిలేవి. ఆ నూరు రూపాయలతో కుటుంబ పోషణను మితవ్యయంతో సరిపెట్టుకొనవలసి వచ్చేది.

ఒక రోజున పట్టాభిగారు "కృష్ణారావు కృష్ణాప్రెస్‌ను మూడు నాలుగువేల పెట్టుబడితో అభివృద్ధి చేస్తే నెలకు నాలుగువందల రూపాయలు రాబడి రావచ్చు. ఈ విషయం నేను రెండు మూడుసార్లు హెచ్చరించినా, ఆయన అందుకు సంసిద్ధంగా వున్నట్లు కనబడలేదు? మీరైనా నచ్చచెప్పండి" అన్నారు నాతో.

నేను ఈ సంభాషణను కృష్ణారావుగారికి చెప్పగా, "నేను నా ముసలితనపు జీవనభృతికి దాచుకున్నది అయిదువేల రూపాయలు మాత్రమే. దానిలో మూడు, నాలుగువేలు ఖర్చుపెట్టడం నాకిష్టం లేదు, పైగా నేను పట్టాభిని కానుకదా! కృష్ణారావును నాలుగువేలు ఖర్చుపెట్టిన తర్వాత హెచ్చు రాబడిని తీయగలశక్తి నాకు లేదన్న విషయం నేనెరుగుదును. అదిగాక, నెలకు నా కుటుంబ ఖర్చుకు నూరు రూపాయలు చాలు. అంతకంటె హెచ్చువస్తే నేనేమి చేసుకోను?" అన్నారు. ఇది ఆయన మనఃప్రవృత్తి. ఆయనను 1929లో ఖద్దరు పర్యటనలో మహాత్ముడు బందరు వచ్చినపుడు "ఆధ్యాత్మిక తేజస్వి"గా వర్ణించారు.

వారి ఆఖరు రోజులలో నేను వారి ఆఫీసుకు వెళ్ళినప్పుడు "ఒరే! వీడు వెళ్ళిపోతాడు. ఇక ఉండేదిలేదు" అన్నారు. నన్ను ఒరే అని వారు పిలవడం అదే ప్రథమం. అదే ఆఖరు కూడా. ఆ సంభాషణ జరుగుతుండగా ఎలక్ట్రికల్ బెల్ దానంతట అది మోగింది. మెయిన్ స్విచ్ ఆఫ్ చేసినా అది మ్రోగుతూనే వుంది అప్పుడు వారు అన్నారు. "అది ఆగదు. నాకు తెలుసు. మీకేమి తెలుస్తుంది దానిని గురించి. అది యమధర్మరాజు దున్నపోతుగంట. అది నాకొరకే వస్తున్నది" అన్నారు హాస్యంగా. వారు వెళ్ళిపోయే రోజులు వచ్చినట్టె చెప్పారు కాని మేము అర్థం చేసుకోలేదు. తర్వాత ఒక పక్షం రోజులకే వారి పరమపదించారు తపస్సు భగ్నమై జన్మించిన తాపసోత్తమునిగా వారిని నేను భావించాను. నాలో ఆంధ్రప్రదేశ్ మెచ్చుకోదగ్గ విషయాలేమైనా ఉంటే, వాటిని తీర్చిదిద్దిన మహామహుడాయనే. ఆ నా గురుదేవుని ఆత్మకు ప్రణామాలు.

# మా ఊరి పెత్తనదారులు

**మా** గ్రామ పెత్తనదార్లను గురించి ఇక్కడ వ్రాస్తాను. వేమూరి రామన్నగారిని గురించి వ్రాయడానికి ముందు వారి తండ్రి సుబ్బయ్యగారిని గురించి అప్పటి దేవరకోట జమీందారీ పరిస్థితులను గురించి పరిచయం చేస్తాను.

ఈయన ఏడుకత్తుల భూమిగల పెద్దరైతు. బోళ్ళపాడు గ్రామ పెత్తందారు – ఆ రోజులలో జమీందారీ పరిపాలనా పద్ధతిని అనుసరించి ప్రతి గ్రామానికి ఒక పెత్తనదారు చొప్పున పరగణాకు అరువది అరుగులు పెత్తనదార్లు వుండేవారు. వంశపారంపర్యంగా వారికి పెత్తనదారీ తనం వుండేది.

పరిగణాకంతకు ఒక పెత్తనదారు. ఈయనను పరగణా పెత్తనదారు అనేవారు. ఈయన ఘంటసాలపాలెం వేమూరివారి కుటుంబంలో జ్యేష్ఠుడు. వేమూరి వెంకట్రాముడుగారు. ఆయన కుమారుడు వెంకయ్యగారు తరువాత ఆయన కుమారుడు వెంకట్రామన్నగారు పరగణా పెత్తనం నిర్వహించారు.

ఒకనాడు జరిగిన సంఘటనను ఇక్కడ పొందుపరుస్తాను. జమీందారు అంకినీడు గారు (పెద్ద) శివగంగ అమ్మవారిని ప్రతిష్ఠించిన మహాభక్తుడు) పేష్కసు చెల్లించని కారణాన జమీ వేలం కానుండగా పరగణా పెత్తనదారును కలుసుకొనడానికి ఘంటసాలపాలెం వచ్చి, వెంకట్రాముడుగారు చెరువుగట్టు మీద నిలువు చెంబు క్రింద వేసుకుని కూర్చుండడం చూచి, మేనా ఆయన ముందు ఆపక, కొన్ని గజాల అవతలికి పెద్ద శబ్దాలు చేసుకుంటూ వెళ్ళి దిగారు. వెంకట్రాముడు గారు చెంబు మీద నుంచి లేవనేలేదు. అంతట జమీందారు వెంకట్రాముడూ అంటూ కొన్ని గజాలు వెనుకకు నడిచిరాగా, ఆయన కూడా కొన్ని గజాలు వెళ్ళి, ఆయనను సన్మానపూర్వకంగా, గౌరవ పురస్పరంగా సంబోధించి విషయం తెలుసుకొని "మేముండగా జమీ వేలము పడడమే?" అని వాయిదానాటికి పరగణాలోని గ్రామాల పెత్తనదార్ల నుంచి డబ్బు వసూలు చేసుకుని జమీవేలం పడకుండా కాపాడారు, ఆనాటి పెత్తనదార్ల ఆత్మగౌరవమట్టిది.

ఈ సుబ్బయ్యగారు ఘంటసాల గ్రామ పెత్తనదారైన చెంచయ్యగారి అల్లుడు, గ్రామంలోను, చుట్టుప్రక్కల పలుకుబడిగల వ్యక్తి. ఒక రోజున మధ్యాహ్నం 12 గంటలకు భోజనానికి ముందు స్నానం చేయడానికి అంగవస్త్రం కట్టుకుని సిద్ధంగా వుండగా చిట్టూరు కరణం పెద పేర్రాజుగారు వచ్చి గావురుమని ఏడ్చారు. ఏమిటని అడుగగా, తన భూమికి



శిస్తు చెల్లించలేని కారణాన జమీందారు కోటకు పిలిపించి నెత్తిమీద దుంగలు యెత్తించి నిలబెట్టి అవమానించారని చెప్పేటప్పటికి ఉగ్రుడై పై బట్టకూడా లేకుండా ఆ అంగవస్త్రంతోనే నాలుగుమైళ్ళు ఎండలో నడిచి చల్లపల్లి కోటలోనికి వెళ్ళి, వారిమామ అయిన ముక్త్యాల జమీందారుగారితో కలిసి హాలులో కూర్చుని ఏవో ఆలోచనలు చేస్తూవున్న శ్రీ అంకినీడు గారినిచూచి, ఈ జమీ పుట్టిన తరువాత ఎంతమంది జమీందారులయ్యారు? మీరెన్నోవారు? యిలా రైతులను యెన్నడైనా హింసించారా? ఇలా అయితే రైతులనుంచి శిస్తులు వసూలు చేస్తారా? జమీందారీ నిలిచినప్పుడు చూస్తాను అని ఆ హాలు దద్దరిల్లేటట్లు పెద్దగా గర్జించారు.

అసలే ఎర్రనికళ్లు, ఎండలో నడచిరావడంతో, కోపంతో ఒళ్లు తెలియని ఆవేశంతో వుండడం, ఇదంతా చూచి కంగారుపడి ఏమీ సమాధానం చెప్పకుండానే అంకినీడుగారు తెలివిగా దిగ్గునలేచి, వెనుక వసారాలోనికి వెళ్ళి, ఆ సుబ్బయ్యను ఈ వైపుకు ఇక్కడికి తీసుకురమ్మనమని ఆయన అక్కడకు రాగానే "ఏమి బావా! కళ్ళంత ఎర్రగా వున్నవేమి? ఏమైనా పుచ్చుకోలేదు కదా?" అని పరిహాసమాడి "నీవేమైనా అంటే నేను ఒంటరిగా వున్నప్పుడు అనాలిగాని, పరాయి జమీందారు ముక్త్యాలవారి ఎదుట అంటే మనకు అమర్యాద, వారికి మనం లోకువ అవ్వడం కాదూ? ఇంతకు వచ్చిన పనేమిటో చెప్పు" అని ఆయనను శాంతపరచి ప్రశ్నించడం జరిగిన విషయం చెప్పి, "ఈ బ్రాహ్మణుడు నా బిడ్డంటివాడు. ఈయనను ఇలా అవమానించడం నన్ను నేను మరచిపోయే అంతకోపం తెప్పించింది. ఇకనైనా ఆయన శిస్తు చెల్లించలేడు భూములు పంటలు పండవాయె. పెద్దకుటుంబం, కరణీకానికి మీరిచ్చేది తిండికి చాలదాయె, ఎక్కడ నుంచి తెచ్చి శిస్తులు చెల్లిస్తాడు, చెప్పండి? అని తిరిగి గర్జించేసరికి, "ఇంతకూ ఏమి చేయమంటావు" అని జమీందారు గారు అడగడం పెద పేర్రాజుగారితో సంప్రతించి కాజ ముఠాకు సముద్దారుగా ఆయనను నియమించి ఆయనకు ఇచ్చే జీతం శిస్తు క్రింద జమకట్టుకొని, మిగతాది ఆయనకివ్వడానికి ఒప్పందం చేసుకుని తిరిగి ఘంటసాల చేరుకున్నారు – కాపు కరణం ఇద్దరు.

ఇలాంటి చండప్రచండుని కుమారుడు రామన్నగారు పొట్టికురచ మనిషి బలాఢ్యుడు? ఆయనకు డబ్బు చేతపట్టడం తెలియదు. అసలు రూపాయలు అణాపైసలు ఎపుడైనా లెఖ్ఖపెట్టాడా అనేది అనుమానం. ఈయన ఆశ్రితవత్సలుడు ముందొచ్చి చెప్పుకున్నవారి తరఫున ఈయన ఉండడం స్వభావం. న్యాయమో, అన్యాయమో, సత్యమో, అసత్యమో, ఆ సంగతి దేవునికెరుక తాను ఒకరికి డబ్బు తినేది లేదు. తాను పదిమందికి పెట్టటం నిత్యం జరిగేది, భూములు పుట్ర నివేశన స్థలాలు అడగనివాళ్ళది పాపం. గ్రామంలో అన్ని వర్గాల చేత ధర్మాత్ముడనిపించు కున్నాడు. మా మేనమామగారు ఆయనను "బాబూ!" అని పిలిచేవారు. అలాగే ఊళ్ళో అందరికీ బాబుగారు అయ్యారు ఆయన. ఆయన భార్యపేరు సీతమ్మ. నా వివాహానికీ శుభలేఖలు ఈయన పేరుననే వ్రాయించాము. ఈ సీతారాములను పూజించి, వారి ఆశీర్వచనాలను అందుకుని నేను పాలకీ ఎక్కాను పెండ్లికొడుకుగా వీరికి అయిదుగురు

కుమాళ్ళు, ఒక కుమార్తె. రామన్నగారికి మొదటి సంబంధం భార్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఈ సీతారాముల పెదకుమారుడు వెంకయ్యగారు. తండ్రి రామన్నగారి, తాత బాలక్రిష్ణమ్మగారి పేరు, ప్రతిష్ఠలు నిలిపారు. అజాతశత్రువు, ఆయనకు కోపం రాదు. వస్తే ఆయనముందు ఎంతటివారికైనా నిలువడం చాలా కష్టతరం. 16 ఏండ్లు పంచాయతీబోర్డు అధ్యక్షులుగా, జనరంజకంగా వ్యవహరించారు. "ఛైర్మన్ వెంకయ్యగారు" అనే పేరు వీరికి ఏర్పడింది. గ్రామంలో పార్టీల కక్షలు వున్నా, ఎదిరిపక్షం మెప్పులు కూడా పొందిన అదృష్టవంతుడు. జలధీశ్వరాలయ ముఖమండప నిర్మాణంలో వీరి కృషి ప్రధానంగా పరిగణించదగింది.

ఈ పంచాయతీబోర్డు అధ్యక్షులుగా వున్నప్పుడు నేను, నా స్నేహితులు గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, వేమూరి సీతారామయ్య సభ్యులుగా వుండేవారము. గ్రామాభివృద్ధి సౌభాగ్యం దృష్టిలో పెట్టుకుని కలిసిమెలిసి పనులు చేయించేవారము. ఒకప్పుడు పంచాయతీబోర్డు అధ్యక్షుడుగా నన్ను వుండమని ఆయన కోరారు. ఆయనవంటి పెద్దలే అధ్యక్షులుగా వుండడం. మా బోటి పిన్నలు వారికి సహాయకులుగా వుండడం మంచిదని వారిని ఒప్పించాను. అపుడు పంచాయతీబోర్డు ఆఫీసు మా మేడమీదనే వుండేది.

ఆయన కొంతకాలం బందరు తాలూకా బోర్డు సభ్యులుగా వున్నారు. తిరిగి ఎన్నికలు వచ్చినపుడు ఆయన చిన్నతమ్ముడు లక్ష్మయ్యగారి సూచనపై ఆయన నన్ను తాలూకా బోర్డు సభ్యులుగా వుండడానికి ప్రోత్సహించి బలపరిచారు. పోటీ లేకుండానే సభ్యుడనై తరువాత తాలూకా బోర్డు అధ్యక్షుడనయ్యాను. తాలూకాబోర్డు సభ్యత్వానికి, అధ్యక్షతకు నాకు అయిన ప్రయాణ ఖర్చులు వగైరా అరవైరూపాయలు మాత్రమే. శ్రీ వెంకయ్యగారు చనిపోయేవరకు ఆయన ఆశీర్వచనాలు నాకు గలవు. నేనెక్కడ వున్నా నా యోగక్షేమాలు ఆలోచిస్తూ వుండేవారు. ఆయన కాంగ్రెసు సానుభూతి పరుడు. కాంగ్రెసువాదిగా నేను చేసిన కార్యక్రమాలలో ఆయన అండదండలు నిరంతరం నాకు వుండేవి.

1945 నుంచి 1951 వరకు కాంగ్రెసు, కమ్యూనిస్టు పోరాటాలలో ఆయన స్వంత మేనల్లుడు చిరంజీవి గొర్రెపాటి వెంకట్రామయ్య ఆ పార్టీకి నాయకత్వం వహించినా, ఆయన మాకే అన్ని విధాల సహాయ సంపత్తినిస్తూ మాలోనే వున్నారు.

## వేమూరి లక్ష్మయ్యగారు

వీరు రామన్నగారి చిన్న కుమారుడు. చాలా అందమైనవాడు, ఉదారుడు. ఉత్సాహ ధైర్య సాహసాలకు పెట్టింది పేరు. మంచి కార్యసాధకుడు. ఈయనలో చినతాత రామస్వామిగారి తెలివితేటలు, చాకచక్యం కలవనే వారు, ఎస్టేటులోని ముఖ్య గ్రామాలలో



ఈయనకు మంచి పలుకుబడి వుండేది. ఆ గ్రామాలలో పెత్తందార్లు వీరిమాట వినేవారు. అలాగాని యెడల కొందరు యువకులైనా ఆయన పక్షాల ప్రాణాలిచ్చుటకైనా సిద్ధపడేవారు వుండడమో జరిగేది.

పోలీసులకు ఈయన ముఖ్య స్నేహితుడు. ఆఫీసర్లను బుట్టలో వేసే ప్రజ్ఞ ఈయనకు అపారం. ఆయన వున్నంతవరకు ఏ వుద్యోగి గ్రామంలోనికి వచ్చినా షడ్రసోపేతంగా ఆయన వారికి ఆతిథ్యమివ్వడం జరుగుతుండేది. ఈయన ఆక్టింగ్ మునసబుగా వుంటూనే కాంగ్రెస్ వుద్యమ సాఫల్యతకు చాలా తోడ్పడ్డారు.

రామన్న, చిట్టెన్నగార్ల సంబంధాన్ని గురించి పైన వ్రాశాను. ఆయన రామన్నగారి కుమారుడు. నేను చిట్టెన్నగారి మనుమడిని. మా కుటుంబాలు ఒకటిగానే లెక్క. నేను భవిష్యత్తులో పైకి రాగలనని, నా వల్ల గ్రామ ప్రతిష్ఠ పెరుగగలదని పదుగురితో ఆయన చెప్పేవాడు. నాలోని, ప్రజా, గ్రామ సేవా బీజాలను ప్రభవింపజేసిన దీయనయే నేను కోరినదే తడవుగా నాకు ప్రోత్సాహమిచ్చి సహాయం చేయడాన్ని ఆయన కర్తవ్యంగా భావించేవాడు.

గ్రామంలో ఇళ్ళు తగలబడిపోగా, వారలకు వాసాలు, తాటాకు సహాయం చేయడానికి ప్రయత్నించడంలోను, గ్రామంలో తూర్పున, ఈశాన్యపుమూల చప్టాలను వేయించడంతోను నా గ్రామసేవ ప్రారంభమైనది. 1920లో మహాత్ముని శంఖారావం విని దేశాన్ని ఓట్ల నిరాకరణకు తయారు చేయడంలో ఆంధ్ర దేశమంతటా తాలూకా సభలు జరుగుతుండగా, దివి తాలూకా సభను ఘంటసాలలో జరపడానికి సంకల్పించాం. పెద్ద ఎత్తున అంచనాలు వేశాం. పండిత వెంకటసుబ్బయ్య, నేను నా సహచరులైన మిగతా యువకులలోనే తగినంత ప్రోత్సాహం కనబడని కారణాన మేము చాలా నిరుత్సాహపడ్డాం. ఈ సంగతి తెలుసుకున్న లక్ష్మయ్యగారు నా వద్దకు వచ్చి యేమోయి వేసిందే ఒక గంతు, తగిలిందే ఒక దెబ్బ మీరు ఒక ఘనకార్యం తలపెట్టింది. ఇదే ప్రథమం ఇంతలోనే దిగజారితే మీరు చేయగల్గినదేమిటి? మీ పలుకుబడి మీకు తెలియదు మీరు కోరితేయివ్వని వారెవ్వరు? నేను పదిమందితోను చెబుతాను మీ వెంట నేను వస్తాను, బయలుదేరండని ప్రోత్సాహమిచ్చారు. అయిదు వందలు రూపాయలు వసూలైనది, అది తాలూకా సభ కాదు, జిల్లా సభ అనిపించు కున్నది. దీనితోనే నేను, నా మిత్రబృందం జిల్లాలో కొంతపేరు ప్రతిష్టలు గల వారమయ్యాము. రాజకీయ రంగంలో ఇది నా మొదటి అడుగు. రెండవ అడుగు వేయడానికిగల శక్తి ఉత్సాహాలు మాలో ఏర్పడినవి. కలిగిన నిరుత్సాహాన్ని, తన ప్రోత్సాహమనే మంత్రదండంతో పోగొట్టి మమ్ములను దేశసేవకు పురికొల్పారు లక్ష్మయ్యగారు.

తమ అన్న, కుటుంబపెద్ద, పూజ్యుడు, తాలూకా బోర్డు సభ్యుడుగా అది వరకు వున్నవారిని "నీవు సభ్యుడుగా మాత్రమే ఉండగలవు. బ్రహ్మయ్యను మనం సభ్యునిగా

పంపితే, ప్రెసిడెంటు కాగలడు" అని చెప్పి ఆయన స్థానే నన్ను తాలూకా బోర్డుకు వెళ్ళేటట్టు చేశారు. తాలూకా బోర్డు అధ్యక్షతకు అభ్యర్థిగా వుండాలనే కోర్కె అప్పటికి నాలో కలగనే లేదు. ఆయన భవిష్యత్ సూచనల ద్వారా ఆ కోరికకు నాలో బీజారోపణ చేశారు.

ఆయనకంటె నేను ఎనిమిది సంవత్సరాలు చిన్న. ఆయనకు నాపై పలుకుబడి కూడా కలదు. నేనేదైనా వ్యవహారాలలో మధ్యవర్తిగా ఉన్న సందర్భాలలో నాకు సిఫారసు చేయమని ఎవరైనా ఆయనను కోరినప్పుడు "అభివృద్ధి రాదగిన బ్రహ్మయ్యకు సిఫారసు చేసి, అతనిని తప్పుదారిని పట్టించి, అతని గౌరవం తగ్గించడం నా వల్ల కాదు" అని చెప్పేవారు. నేను తాలూకా బోర్డు ప్రెసిడెంటుగా వున్న ఇంకా ఏ ఇతర పదవులలో వున్నా, తానే ఆ పదవిలో వున్నట్టు ఆనందించేవాడు.

నల్లజెండాల కేసులో నేను సబ్‌జైలులో వుండగా చూడవచ్చి కండ్ల నీరు పెట్టాడు నేనే ఆయనకు ధైర్యం చెప్పవలసి వచ్చింది, వేలూరు జైలులో వుండగా చూడవచ్చి మహా ధైర్యంగా ప్రోత్సాహవాక్యాలు పలికారు. గ్రామంలోను తాలూకాలోను అప్పుడు ఉప్పు సత్యాగ్రహం, కల్లుదుకాణాల పికెటింగు. ఈత, తాటిచెట్ల గెలలు నరకడం జరిగే రోజులు. వాటిని చేసే కాంగ్రెసు సేవకులను ప్రోత్సహించి తగిన బలం యిచ్చి వుద్యమం జయప్రదం కావడానికి సాయపడవలసిందిగా నేను కోరిన వెంటనే సరేనన్నారు.

ఆయన అప్పుడు ఘంటసాల ఆక్టింగ్ మునసబు, ఆ రోజులలో ఆయన పగలు ఉద్యోగులతో, రాత్రిళ్ళ కాంగ్రెసువాదులలో వుండి, అన్ని విధాల కాంగ్రెసు ఉద్యమానికి పట్టుకొమ్మ అయ్యారు. ఈ విషయం కర్ణాకర్ణిగా విని "డిప్యూటీ కలెక్టర్ ఆయనను మందలింపుగా మాట్లాడగా - రాజీనామా యివ్వడానికి సిద్దంగా వున్నానని సమాధానం చెప్పేసరికి ఆయనకు గల పలుకుబడిని గుర్తించిన వాడగుటవల్ల ఆయన వినీ విననట్లు మిన్నకున్నారు. సర్వవిధాల ప్రోత్సాహమిచ్చిన ఈ లక్ష్మయ్యగారిని నిత్యం స్మరించుట నా కర్తవ్యంగా భావిస్తున్నాను. ❑



# జమీందారీ వ్యతిరేక ఉద్యమానికి పునాదులు

ఘంటసాల గ్రామ పెత్తందారు చంచయ్యగారి కుమారుడు వెంకయ్యగారు, గ్రామ మునసబు, మంచి ఔదార్యం బంధుప్రేమ, న్యాయదృష్టిగల గొప్ప వ్యక్తి. ఆయనయే తమ మేనల్లుళ్ళగు కొండపల్లి వారిని మంత్రిపాలెంనుంచి, తిరువూరు తాలూకా బిల్లనపల్లి నుంచి కాకుమానువారిని ఈ వూరికి తీసుకువచ్చిన బంధుప్రియుడు. ఈయన భార్యపేరు నాగమ్మ గారు. అఖండమైన తెలివితేటలు గల వ్యక్తి. వీరి పెద్దకుమారుడే బాలకృష్ణమ్మగారు. ఈయన ఆర్జించిన పేరు ప్రతిష్ఠలే అవలంబించిన ధర్మప్రవృత్తియే. సత్యనిర్ణయంలో ఈయన చూపిన జంకుగొంకు లేని సాహసమార్గమే నేటికీ ఘంటసాల పేరు ప్రతిష్ఠలుగల గ్రామంగా వన్నెకెక్క డానికి కారణములైనవి.

తండ్రి వెంకయ్యగారి తర్వాత ఈయన గ్రామమునసబు అయ్యాడు. ఆనాటి ఉద్యోగులు బాలకృష్ణమ్మగారి మాట సత్యంగా భావించి గౌరవించేవారు. జమిందారీ విధానం రైతులను పీల్చి పిప్పిచేసే విధానమని వేరే చెప్పనక్కరలేదు. జమీందారు చేసే అక్రమాలను ఎదుర్కొనడం అంటే ప్రతి చిన్న తగాదాకు హైకోర్టువరకు సివిల్ క్రిమినల్ కేసులలో చిక్కుకుని ఋణాలపాలై భూమి పుట్ర అమ్ముకోవలసిన దుర్గతి కోరి తెచ్చుకొనడమే. ఇలాంటి సాహస వంతులు నూటికి, కోటికి ఒకరుంటారు. అట్టివారిలో ఒకరు బాలకృష్ణమ్మగారు. రెండవవారు నూజివీడు జమిందార్లను ఎదిరించిన ముస్తాబాద్ కాపురస్థుడు శ్రీ కడియాల చంద్రయ్య.

1. రైత్వారీ పద్ధతి అమలులోకి రాకపూర్వం రైతు, జమీందారు మధ్య "ఆస్రా" లేక అమానీ పద్ధతులు అమలులో వుండేవి. ఈ పద్ధతిలో రైతు పండించే పంటలో సగం జమీందారుది. ఈ పంటను సిఖామరకంతో కొల్వక పిచ్చబోలె (తక్కువ మరకంతో) కొల్చి బజారు ధాన్యపుధరను జమీందారు రైతువద్ద జబర్దస్తీగా పుచ్చుకొనేవాడు. దీనికి ఆందోళనచేసి విచారణలు సాగించి సిఖామరకంతో కొలిచేటట్లు ఉద్యోగులచే నిర్ణయం చేయించారు బాలకృష్ణమ్మగారు.

2. ఆరోజులలో కత్తికి (య. 17 భూమి)

| | |
|---|---|
| అమ్మవారి రుసుం | 2-0-0 |
| బాజా ఖర్చు | 2-8-0 |
| ఆటగాళ్ళకు జమీందారి ఉద్యోగుల ఖర్చుకు | 0-7-0 |
| నాయకునికి | 0-2-7 |
| | 5-1-7 |

వసూలు చేసేవారు జమీందారుగారు.

ఇది అక్రమమని హైకోర్టు వరకు 1873లో వేమూరి వెంకయ్య (పరగణా పెత్తందారు), బాలకృష్ణమ్మగారు వెళ్ళి జయం పొంది ఖర్చుల క్రింద రూ. 300లు జమీందారునుంచి వసూలు చేశారు. దీనికే పరిగణావాజ్యమని ప్రసిద్ధి కలిగింది.

3. తాళ్ళ శిస్తులు – తాడి ఈత చెట్లకు గీసే కల్లు (అనగా) గీస్తూ వున్న అని రైతుల వాదన, 'గీతకు తగిన' అని జమీందారు వాదన. హైకోర్టు తీర్పు "గీస్తూ వున్న" అనే రైతు వాదనకు అనుకూలమయింది.

4. కరణాలకు జీతాలేర్పడక పూర్వం రైతుల నుంచి కత్తికి (య. 17కు) 1-00 జమీందారు వసూలు చేసి కరణాలకు యిచ్చి కరణాలు తనకు అనుకూలంగా వర్తించునట్లు చేసుకునేవాడు. దీనికి "కరణంశలగ" అని పేరు. దీనిని జమీందారు రైతుల నుంచి వసూలు చేయరాదని హైకోర్టు తీర్పు నిచ్చింది.

5. పగ్గం కేసు : రైతు తన భూమిలో తుమ్మచెట్టుకొట్టుకొనగా పోరంబోకులో కొట్టినాడని జమీందారు క్రిమినల్ కేసు పెట్టాడు. సివిల్ స్వభావమని కోర్టు నిర్ణయమైన తరువాత తిరిగి సివిల్ కోర్టులో వ్యాజ్యం.

అక్కడ పగ్గమనగా 44 గజాలని జమీందారు వాదన.

48 గజాలని రైతు వాదన.

కత్తి అనగా 14 ఎకరాలని జమీందారు వాదన.

17 ఎకరాలని రైతువాదన.

రైతు వాదన నెగ్గింది హైకోర్టులో. రైతుకు రు. 350/- ఖర్చులు యిచ్చుకోవలసి వచ్చింది జమీందారు. ప్రతి చిన్న తగాదాకు రైతును కోర్టుకు లాగడం ఖర్చులు పెట్టులేక కోర్టులు చుట్టూ తిరిగే యమయాతన పడలేక రైతు జమీందారుకు లోబడి ఆయన అన్యాయాలకు తలవొగ్గవలసిన వాడయ్యేవాడు. శ్రీ బాలకృష్ణమ్మ ఈ ఎస్టేటులో రైతులకు నాయకత్వం వహించి ఆ సమస్యలను పరగణా సమస్యలుగా చేసి అష్టకష్టాలు పడి సమిష్టి ధనంతో జమీందారుని ఢీకొనేవారు.

ఆర్థిక స్థోమతుకు ఈయన అవలంభించిన విధానాలు – నమూనాకు గ్రామంలో ఒక శుభముహూర్తాన పది పెండ్లిండ్లు జరిగినవి. దొడ్డి సంభావన పెత్తనం గ్రామ పెత్తందార్లది. పాలకీ ఒకటికి పది రూపాయల చొప్పున నూరు రూపాయలు మగపెండ్లి వారివద్ద వసూలు చేశారు. బ్రాహ్మణ సంతర్పణకు బియ్యం, పప్పు, కూరగాయలు వగైరా ఆడపెండ్లి వారివద్ద వసూలు చేశారు.



ఇక తక్కువైన కూరగాయలు గ్రామంలోని తోటలలో కోసుకు వచ్చారు. క్షీరాన్నానికి తగిన పాలు రైతుల దొడ్లలో పాలుపిండే సమయంలో పోగుచేశారు. ఆ క్రిందటి రోజుననే తియ్యని పెరుగు, మామిడిపండ్లు, విసనకర్రలు వగైరా జాగ్రత్త చేశారు. ఆనాడు బ్రాహ్మణులందరికి షడ్రసోపేతంగా సంతర్పణ చేసి వారికి తన స్వహస్తంతో గంథంపూసి అదివరకే సిద్ధపరచి వుంచిన మల్లెపూల దండలు (గ్రామంలో పూచినవే) వారి మెడలో వేసి, విసనకర్రతో వారికి విసరి అణాబేడో వారి చేతిలో భక్తి శ్రద్ధలతో వుంచి సన్మానం చేసేవారు. వారితో కొంత శాస్త్రచర్చ, పురాణగోష్ఠి జరిపేవారు. ఆ బ్రాహ్మణులందరు బాలకృష్ణమ్మ గారిని గురించి డబ్బు ఎంత యిస్తే మాత్రం ఈ మర్యాదమన్ననలు మరొకరు చేయగలరా? ఆ దేవతా విగ్రహం. ఆ పాండిత్య ప్రకర్ష అని పొగడుకుంటూ తమ గ్రామాలకు వెళ్ళేవారు. కొద్ది ఖర్చుతో బ్రాహ్మణులను తృప్తి పరిచారు తన కీర్తి పెంచుకున్నారు. జమీందారీ వ్యవహారములలో ఖర్చుకు డబ్బు సేకరించుకున్నారు.

1889లో ఉప్పెన గాలికి ఓడ ఒకటి కొట్టుకు వచ్చి ఘంటసాల నేలమీద పగిలిపోయింది. దాని కలప వగైరా జమీందారుగారి హుకుం ప్రకారం వారి తాబేదారులు కూలీలతో పోగుచేయించి గుట్టలు పెట్టించుకున్నారు. బాలకృష్ణమ్మగారు వాటి మీద విలాసాలు చూచి, తాడేపల్లి వారిదిగా గుర్తించి వారికి కబురు చేశారు. మీ వోడ కలప తోలిపెట్టించి వాళ్ళకు బాడుగ మాత్రం ఇవ్వమని ఉత్తరం వ్రాశారు. వారు పరమానంద భరితులై ఒకరోజున బాలకృష్ణమ్మగారిని సన్మానించనెంచి ఘంటసాల నుంచి తీసుకువెళ్ళి విందు భోజనాలైన తర్వాత ఒక పళ్ళెంలో తాంబూలంతో సహా 80వ నంబరు ధోవతులు, ఒక బంగారు మొలత్రాడు సమర్పించారు. ధోవతులు మాత్రం తీసుకుని ధరించారు. మొలత్రాడు తీసుకోలేదు. వారు తీసుకొనవలసినదిగా ప్రాధేయపడగా "ఈ ధోవతులతో మీరు నన్ను సత్కరించారు. మరొకప్పుడు నేను మిమ్ములను మరొక ధోవతుల చాపుతో సత్కరించగలను. ఈ మొలత్రాడువంటి విలువగల వస్తువులతో తిరిగి మిమ్ములను సత్కరించగల ధనవంతుడను గాను. అట్టి స్థితిలో దీనిని అక్రమలాభంగా పరిగణించవలసి వస్తుంది" అని ధర్మపీఠమునగల న్యాయమూర్తిగా సమాధాన మిచ్చారు. ఈ సంఘటన తాడేపల్లి వారిని బాలకృష్ణమ్మగారికి శాశ్వత స్నేహితులుగా చేసింది.

రైతులపై జమీందారు అక్రమ వ్యవహారాలను తలపెట్టినపుడు అందుకు ధనం కావలసినప్పుడు కొంతమందిచేత వారిపేర ప్రామిసరీ నోట్లు వ్రాయించి డబ్బు అప్పుగా తెప్పించేవారు. మరల వడ్డీతో తీర్చేవారు. ఉద్యోగుల కెవరికైనా సిఫార్సు కావలసి వస్తే జమీందారుకు దీటైన ఉజ్జీగా తాడేపల్లి వారిని ఉపయోగించుకునేవారు. ఈయన వ్యవహార నిర్వహణ నైపుణ్యానికి ఇట్టి వెన్నో చెప్పవచ్చు.

# కరణం, మునసబుల సయోధ్య

ఈయన మా గ్రామకరణం. ఘంటసాల తారక బ్రహ్మంగారితో కలిసి యెక్కడికైనా ప్రయాణమై వెళ్ళేటప్పుడు "తారక బ్రహ్మంగారూ! గుండేరు దాటుతున్నాం జాగ్రత్త!" అని హెచ్చరించేవారట. దాని తాత్పర్యం మనం ఒకరిని ఒకరు చులకనగా ఇతరులవద్ద మాట్లాడితే యిద్దరినీ వారు తేలికగా చూస్తారు సుమా అని హెచ్చరిక. తారక బ్రహ్మంగారు బాలకృష్ణమ్మ గారిని గూర్చి ప్రశ్నిస్తే "బాలకృష్ణమ్మగారా, ఆయన దేవతా విగ్రహానికి తగిన ధర్మమూర్తి, సత్యనిష్ఠగలిగిన పండిత ప్రభువు. ఆయనతో మరొకరు సాటి వస్తారా" అనేవారు. తారక బ్రహ్మంగారిని గురించి బాలకృష్ణమ్మగారిని అడిగితే "మా కరణంగారా! మంచిలెక్కవాడు. చక్కని ముసద్దీ, కలుపుకోలుతనంగల పెద్దమనిషి. రైతులకు తలలోని నాలుకలాగు వుంటాడు" అని అనేవారు వీరి మర్యాద మన్ననలు ఇట్టివి.

బాలకృష్ణమ్మ వేదాంతి, అహింసా తత్పరుడు గ్రామ దేవతలకు జంతువుల బలిని మాన్పి కొబ్బరి కాయలతోనే ఆరాధనా చేసుకొనునట్లు చేశారు.

శ్రీ జలధీశ్వర ఆలయం ముందు చక్కని, గ్రామానికి అందచందాలు తెచ్చే మేడను ప్రజలవద్ద ధనం వసూలుచేసి కట్టించారు. స్వామివారికి పవ్వళింపు సేవకు అది అపుడు వుపయోగపడేది, ఇపుడు పాఠశాలగా వుపయోగపడుచున్నది. గ్రామ ఉమ్మడి ధనంతో ఇట్టి శాశ్వత ప్రతిష్ఠాపనచేసి నేటివరకు కీర్తి నిలబెట్టుకున్న దూరదృష్టి గల మహామహుడు, ఈ గడ్డమీద పుట్టిన వారిలో ఈయనయే మొదటివాడు, తన తర్వాత తరాలవారికి మార్గదర్శి.

ఆయన ఆరోజులలో గ్రామమంతా తనదేనని, గ్రామస్థులందరిని సంస్కరించడం తన విధి అని భావించేవారు. ఆనాడు ఎరుకలవాళ్ళకు గోచిపెట్టుకొనడం మాని బట్టకట్టుకొనడాన్ని ప్రోత్సహించేవారు. చనిపోయేముందు (1907) కుమారునికి అంత్య సందేశం : "ఇచ్చేది మడులు మాన్యాలు కాదు. ప్రజావశీకరణ మంత్రం" అని అన్న దేవతామూర్తి, కీర్తిశేషుడు బాలకృష్ణమ్మగారు.

ఆయన లౌకిక ప్రజ్ఞావిశేషానికి మరొక ఉదాహరణ.

కోర్టు ఆఫ్ వార్డ్సు పాలన నుంచి శ్రీ మల్లిఖార్జున ప్రసాద్ నాయుడు జమీన్‌ను అప్పగింత చేసుకున్న తర్వాత అంతవరకు ప్రభుత్వం తరపున మేనేజరుగా వున్న చేవేంద్ర వెంకటచలం పంతులుగారు (సీనియర్ డిప్యూటీ కలెక్టరు) బాలకృష్ణమ్మగారిని చల్లపల్లి పిలిపించుకొని జమీందారుగారికి పరిచయం చేస్తాను రమ్మనమనగా పెద్దలు మీదయ వుంటేచాలు. మీ దర్శనమునకై మాత్రమే వచ్చాను. ఎక్కడ వున్న ఆశీర్వదిస్తూ వుండండి" అని సెలవు పుచ్చుకున్నారు. ఆయన ముఖ్యానుచరుడు, శిష్యతుల్యుడైన ఆయన పెదతండ్రి మనుమడు గొర్రెపాటి వెంకయ్యగారు వారు కోరినట్టు జమీందారుగారి పరిచయం పొందితే బాగుండేదికదా అని అనగా, "మనవద్ద సరుకుంటే జమీందారుగారే మనను పిలిపించు



కొంటారు. మనవద్ద శక్తిలేకపోతే ఈయన పరిచయం చేసినా జమీందారుగారు మనను లెఖ్ఖగా చూడదు. జమీందారు పరిచయం కంటే ఆయన పరిచయమే అమూల్యంగా భావించి ఆయన ఆశీర్వచనములు కోరాం. ఆయన ఇందుకు సంతోషించాడే కాని అన్యధా భావించలేదుగా?" అని చెప్పారు.

ఇటువంటి ప్రజ్ఞాశాలి కుమారుడే వెంకట నరసింహంగారు. 1920లో ఓట్లు ఇవ్వవద్దనే రోజులలో గ్రామ మునసబు, మా ప్రచార ఫలితంగా ఓటర్లెవరు ఓట్లు వేయలేదు. పోలింగ్ ఆఫీసర్లుగా వచ్చిన ఉద్యోగులు కూడా మా కృషికి ఆనందించి మమ్ములను అభినందించారు. ఇంకా మా ఉత్సాహానికి మితిలేదు. అప్పటికి సాయంత్రం నాలుగు గంటలు అయింది. ఇంకా రెండుగంటల కాలం వున్నది. పోలింగుకు గ్రామోద్యోగీయులు ఓటు చేశారా మా గ్రామానికి ప్రథమ తాంబూలార్హత వుండదు. కొందరు వోటు చేద్దామని, మరికొందరు వద్దని తర్జన భర్జనలు పడ్డారు. మేమందరిని వోటు చేయవద్దని ప్రాధేయపడు చున్నాం.

అపుడు నేను, నా మిత్రుడు పండిత వెంకట సుబ్బయ్య వెంకట నరసింహం గారి వద్దకు వెళ్ళి "పెదనాయనా! మన గ్రామానికి గొప్ప పేరు ప్రతిష్ఠలు వచ్చే ఈ ముహూర్తాన్ని మనం సరిగా ఉపయోగించుకోవాలి. మీరు సాహసించే వోటు చేయనని ప్రకటిస్తే యెవ్వరూ వోటు చేయరు" అని కోరగా, ఆయన వారందరిని ఒకచోట చేర్చి, ప్రజలందరకు వ్యతిరేకంగా మనం వోటు చేయడం ఏమీ న్యాయంగా నాకు కనబడడం లేదు. ఏ డిప్యూటీ కలెక్టరో మనలను పిలిపించి అడిగితే యిలా చెప్పుదాము: "మా గ్రామస్తులందరు మమ్ములను వోటుచేయవద్దన్నారు. ప్రభుత్వమా వోటువేయమని మాకు సర్క్యులర్ పంపలేదు. ప్రజలను ధిక్కరిస్తే ప్రభుత్వపు అండ అయినా మాకుంటుందనే హామీని ఏ ఉద్యోగస్తుడు మాకు ఇవ్వలేదు".

అందువల్ల ప్రజాభిప్రాయానికి కట్టుబడ్డాం అని చెబుదాము" అని అన్నారు. ఈ వాదనకు అదివరకే సుముఖులుగా వున్న కొడాలి మునసబు తుమ్మల సీతారామయ్యగారు బలపరచారు. అందరు సరేనని వోటుచేయకుండా ఖాళీపెట్టెలకు జాగ్రత్తగా సీళ్ళువేయించి పంపుటలో ఆఫీసర్లకు తోడుబడ్డారు. ఈ సీతారామయ్యగారి కుమాళ్ళు నరసయ్య, వెంకట్రామయ్యగార్లు నేటికి కాంగ్రెస్‌కు అండదండలుగా వుంటూ వున్నారు.

మేమందరం యజ్ఞయాగాది క్రతువులు చేసినంత ఆనందంతో ఇండ్లకు వెళ్ళి సుఖస్వప్నాలతో ఆ రాత్రి గడిపి మరురోజు ఉదయం బందరు వెళ్ళి మా గురువులకు జయప్రదమైన మా కృషిని నివేదించుకొని వారి అభినందనల నందుకున్నాము.

ఈ ప్రజల ఘన విజయానికి తోడ్పడిన గ్రామోద్యోగీయులెల్లరు అభినందనీయులు.

# గొర్రెపాటి వెంకయ్యగారు

తండ్రి నరసన్నగారు. ఈయన బాలకృష్ణమ్మగారి ముఖ్యానుచరుడు, శిష్యుడు. ఆయన పేరు స్మరిస్తూ ఆయనను ఆదర్శమూర్తిగా భావించేవారు. ఈ వెంకయ్యగారు ఛైర్మన్ వెంకయ్యగారికంటే ఎనిమిది సంవత్సరాలు పెద్ద. కొండపల్లి సుబ్బయ్యగారిదీ ఈయనదీ ఒకటే వయస్సు. ఈయన గొర్రెపాటివారిలో చాలామందికి కిరీటంలేని రాజు. దేవాలయ అర్చకులకు, పద్మశాలీయులకు, రజకులకు, భజంత్రీలకు ఈయన అంటే భక్తి, భయం కూడా. గ్రామంలో హెచ్చు పలుకుబడి కలవాడని చెప్పవచ్చు. గ్రామపెత్తనదారుకు అవసరమైన అన్ని హంగులు కలవు. వీరి పార్టీకి నరసన్నగారి పార్టీ అని ప్రసిద్ధి.

రామస్వామిగారి అనంతరం కోటలో తన సన్నిధానమున ఘంటసాలవారిని ఒకరిని వుంచుకొనుట అవసరమని జమీందారు మల్లిఖార్జున ప్రసాద్‌నాయుడుగారు భావించారు. ధర్మగోటక వ్యాజ్యంలో మా నాయనగారితో కలిసి వ్యవహరించిన దోనేపూడి వెంకట్రాయులుగారి మీద ఈయన పాచికలు విసిరారు. తాను కోటలో వుండుటకు అవకాశం వుండదనిన్నీ, తన మిత్రుడు బాలకృష్ణమ్మగారి అనుచరుడు, శిష్యుడు వెంకయ్యగారు వుంటారని వెంకట్రాయులుగారు చెప్పారు. బాలకృష్ణమ్మగారు, వీరరాఘవయ్యగారు చనిపోయిన తర్వాత వెంకట్రాయులుగారు, వెంకయ్యగారు గ్రామవ్యవహారాలలో కలిసి వ్యవహరించేవారు.

ఈయన కోటలో వుండి ద్రవ్యార్జన, భూముల సంపాదన, గౌరవ ప్రతిష్ఠలకు భంగం లేకుండా చేసినా, ఘంటసాల గ్రామ సాముదాయక శ్రేయస్సుకు భంగం కలిగే వ్యవహారాలలో ఎంతమాత్రం పాల్గొనేవారు కాదు.

"మీ ఘంటసాల పార్లమెంటులో ఏమేమి నిర్ణయాలు జరిగినవి" అని జమీందారు గారు అడిగినప్పుడు ఘంటసాల గ్రామ ప్రముఖుల హుందాతనం పెంచే విధంగా సమయస్ఫూర్తిగా సమాధానం చెప్పేవారు వెంకయ్యగారు. ఈ జమీందారుగారి పరిపాలనా వ్యవహారాలను గూర్చి వెంకయ్యగారు అనేక కథలు చెప్పేవారు. ధర్మగోటకాన్ని కబళించడపు ఆలోచన మల్లిఖార్జున ప్రసాదనాయుడుగారికి నిరంతరం వున్నా అందులకు ఈయన ఏ మాత్రం అవకాశం ఇచ్చేవారు కాదు.

ప్రథమంలో ఈయన జాతీయోద్యమానికి మా మిత్రబృందం చేసే కృషికి బాగా వ్యతిరేకంగా వుండేవారు. అందుకు కారణాలు జమీందారుగారి ప్రభావం ఈయన మీద వుండడం ఒకటి రెండు ఈ ఉద్యమం, తద్వారా నేను పైకి వస్తే నా పలుకుబడివల్ల తనకు గ్రామంలో ప్రతిద్వంద్వియగు ఛైర్మన్ వెంకయ్యగారి వర్గం బలపడుతుందని బ్రహ్మయ్య, మామగారు వెంకయ్యకు అనుకూలంగా ఉంటాడు గాని, మనకు వుంటాడా? అని తనవారితో



అంటూ వుండేవాడు. ఈయనకు బంధువు, నాకు మిత్రుడు అయిన వెంకటసుబ్బయ్య, నేను తరచు ఈయనను కలుసుకుంటూ వుండడం, ఈయన ఏకగ్రీవంగా వైస్-ఛైర్మన్ అగుటకు మేము కృషి చేయటం పంచాయతీ బోర్డులో మా మిత్రవర్గం వ్యవహార సరళి ఈయనకు నాయెడల సద్భావం ఏర్పడుటకు కారణమైనవి.

ఏదైనా వ్యవహారం వచ్చి ఛైర్మన్ వెంకయ్యగారు, ఈయనతో మనం ఎక్కడ కలుద్దాము అని అంటే – నా అంతటి వాడవునీవు నీ అంతటివాడను నేను మనం కలిస్తే దేవాలయపు అరుగులమీద కలవాలి, లేదా దేవుడంటి బ్రహ్మయ్య యింటివద్ద కలవాలి అనేవారు. 1920 నుంచి 1927 వరకు నేను తాలూకా బోర్డు ప్రెసిడెంటుగా బందరు వెళ్ళేవరకు ఈ పెత్తందార్ల ఆలోచనా కేంద్రం మా యిల్లే.

1933లో హరిజన దేవాలయ ప్రవేశానికి సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ ధర్మకర్తగా ఈయన మా కృషి జయప్రదమగుటకు తోడ్పడ్డారు. ఆనాటి నుంచి ప్రతి ఎన్నికలలోను కాంగ్రెసు అనుకూలంగానే తోడ్పడ్డారు గ్రామంలోను. తాలూకా అంతటా కమ్యూనిస్టు కాంగ్రెసు వ్యతిరేకత చాలా ఉధృతంగా 1946 నుంచి 1952 వరకు ఉండేది. తూర్పు కృష్ణాలో ఈ సందర్భంలో దీన్ని యెదుర్కొనే భారం మాపై పడినది. వెంకయ్యగారు మాకు పూర్తిగా సహకారమిచ్చారు. మా గ్రామ సంఘానికి అధ్యక్షుడుగా 1940–45 వరకు వున్నారు. ఈ ఎన్నిక సమయాన వీరికి బలమైన ప్రతిపక్ష మేర్పడినది. వీరికి పూర్తి బలమిచ్చి, వీరి గెలుపుకు నేను ప్రధాన సహకారినైన కారణాన గ్రామములో బలమైన ప్రత్యర్థి వర్గం నాకు ఏర్పడుటకు జరిగినది. అప్పటి గ్రామ పరిస్థితుల ననుసరించి వీరే అధ్యక్షుడగుట గ్రామానికి లాభకారియని నేను, శ్రీ పండిత, వెంకటసుబ్బయ్య తలచుటవల్ల నేను ఆ విధంగా చేశాను.

"ఎవరున్నారురా బాలకృష్ణమ్మ పెదనాయన తరువాత? మన బ్రహ్మయ్యే కదా గ్రామాన్ని ఉద్ధరించింది? ఆయన మేడ కట్టిస్తే ఈయన చప్టాలు, రోడ్లు, కాలువలు హైస్కూలు ఏర్పాటు చేశాడు. ఇంకా ఎవరైనా ఉన్నారా చేయడానికి" అనేవారు. ఆయన అవసానకాలంలో నా చేయి ఆయన హృదయం మీద పెట్టుకొని "గ్రామం వుంది. మా కుటుంబాలు వున్నాయి. మా వైస్-ఛైర్మన్ వుంటాడు" అని చెప్పారు. ఈయన తరువాత ఈయన తమ్ముడు కుమారుడు వెంకటసుబ్బయ్య అనే యువకుడు పంచాయతీ బోర్డు వైస్ ప్రెసిడెంటుగా పది సంవత్సరాలున్నాడు. ఆయనకు వైస్ ఛైర్మన్ అనే సార్థక నామధేయ మేర్పడినది.

# గొర్రెపాటి బ్రహ్మన్న కుమారుడు వెంకయ్యగారు

పుల్లయ్య, బ్రహ్మన్న గార్లనే మేనమామ మేనత్త బిడ్డలు పేరున వీరి కుటుంబాలు ప్రసిద్ధి చెందినవి. వీరు సంపన్న గృహస్థులు. పాడిపంట సమృద్ధిగా గల్గి ఆనాడు వడ్డీ వ్యాపారం చేసే ధనవంతులుగా పరిగణింపబడేవారు.

వీరి అన్నదమ్ములు నల్గురిలో జ్యేష్ఠుడు వెంకయ్యగారు. శరీరం నలుపైనా, సమున్నతాకారం కలిగిన గంభీరమూర్తి అందరినీ ఆకర్షించేవారు. వెంకయ్య ద్వయం వగైరా పెత్తనదార్ల అందరిలోకి పెద్ద ఒక నిర్ణయానికి ఈయన వచ్చిన తరువాత ఆయనను మార్చడం బ్రహ్మతరంగాదు. ఆధ్యాత్మిక చింతన గల్గి కొంత వైరాగ్యాన్ని పెంచుకున్నారు. అచల మత సిద్ధాంతాల యందు ఈయనకు అనురక్తి హెచ్చు. జనక మహారాజు ఆయనకు ఆదర్శ మూర్తియేమో! కొంతకాలం జ్ఞానోపార్జన కొరకు బైరాగుల వెంట, సన్యాసుల వెంటబడ్డారు. తన శ్రమ వృథాయని త్వరలోనే గ్రహించి వేమన సూక్తులయందు గురి కుదుర్చుకొన్నారు. తత్వజ్ఞాన పుస్తకాలు చదువుతుండేవారు. వార్తాపత్రికలు చదువుతుండేవారు. ఆ కాలపు వారందరిలోకి హెచ్చు జాతీయభావాలు గలవారు. కాంగ్రెసు సంస్థయందు ఆయనకు అఖండమైన భక్తి, నిత్యఖద్దరువాది.

1918లో ప్రథమ ప్రపంచ సంగ్రామ కాలంలో దివి తహసీల్‌దారు హుమయూన్ సాహెబు (తరువాత కలెక్టరైనారు) చందాల కొరకు మా గ్రామం రాగా రైతులు బీదస్థితివల్ల చందాలివ్వలేరని ఖచ్చితంగా చెప్పిన మహామహుడు. "నేను ఇల్లిల్లు తిరిగి వసూలు చేస్తాను" అని ఆయన అంటే, గ్రామంలో ముఖ్యులను కాదని మీరు వసూలు చేయగలరా? అని నిర్భయంగా అన్న ధైర్యశాలి. వెంటనే తహసీల్‌దారు అక్కడనే తనతో వున్న సబ్‌ఇన్‌స్పెక్టరు రంగనాయుడుగారితో ఏకాంతంగా మాట్లాడి ఏమనుకున్నారో యేమో యితర సంభాషణలలోనికి దింపి మరొకసారి వచ్చి వసూలు పని సాగిస్తామని మరొక వూరికి వెళ్ళిపోయారు. ఈ సంభాషణ జరిగినపుడు మేము అక్కడనే జమీందారుగారి ఠాణాలో వున్నాము. అప్పటికే జాతీయవాదులమైన మాకుకూడా ఆ సంభాషణలు భయం కలిగించాయి. వెంకయ్యగారిని అరెస్టు చేస్తారేమో ననుకున్నాము. అయితేనేమి ఆయనకు నిమ్మకు నీరెత్తినట్టు ప్రశాంతంగా వున్నారు.

1923 సంవత్సరంలో కాకినాడలో జరిగిన కాంగ్రెసుకు మాతోపాటు హాజరైనారు. గ్రామ పంచాయతీ బోర్డు సభ్యుడుగా గ్రామంలో మట్టిపనులన్నీ ఆయన అజమాయిషీలోనే జరిగేవి. అదివరకు వీధులలో నీళ్ళు ప్రవహించి మట్టికొట్టుకుపోయే కాలువలన్నిటిని పూడ్పించి గ్రామానికి శాశ్వత లాభం చేకూర్చారు. నేను ఆయనను "ఏమండీ ఇంజనీరుగారూ" అని సంబోధించితే నవ్వుకునేవారు. "గ్రామ ఉమ్మడి ధనం యెవరివద్ద నిల్వవుండకూడదు.



ఉంటే అది వెర్రి తలపులు కలుగజేస్తుంది" అనేవారు. గ్రామసంఘానికి ఆయన అధ్యక్షుడుగా, నేను కార్యదర్శిగా ఉండేవారము. ఆ కాలంలోనే ఒక గ్రామ చావిడి వేయించి అందులో బాలికా పాఠశాల ఉంచడం, తర్వాత ఆ చావిడినమ్మి ఆ ధనంతో గొ॥న॥కు॥ వెంకయ్యగారు అధ్యక్షుడుగా, గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు కార్యదర్శిగా ఉన్నప్పుడు బాలకృష్ణమ్మగారు కట్టించిన మేడను అంటి రెండుగదులు డాబా వేయడం, అందులో పుస్తకభాండాగారం వగైరా ఉంచడం జరిగింది.

శ్మశానంలో ఉన్న పుట్టలు వగైరా తీయించుటను గూర్చి నేను ఆయనతో సంప్రతించగా, రైతులందరు వాళ్ళ చేలో పుట్టలు వగైరా ఉండనియ్యరయ్యో శ్మశానంలో నైనా ఆ జంతువులను బ్రతకనియ్యకపోతే ఎట్లా" అని అన్న భూతదయాపరుడు. ఈయన గౌతమబుద్ధుని, మహాత్ముని అహింసాభావం ఈయనలో మూర్తీభవించ లేదనుకొనగలమా?

1921లో గ్రామంలోని సివిల్ క్రిమినల్ కేసులు రాజీచేయుటకు అన్ని వర్గాల ప్రముఖులము ఒక ప్రణాళిక నేర్పరచుకున్నాము. మధ్యవర్తులుగా వుండతగిన వ్యవహార జ్ఞానం గలవారి జాబితా ఒకటి తయారుచేసి వుంచాము. తగాదాలు వచ్చినపుడు పార్టీలు వారిలోనుంచి చేరి ఒకరిని ఎన్నుకొనడం, ఆ ఇద్దరు కలిసి మరి ఒకరిని ప్రధాన న్యాయాధిపతిగా యేర్పరచుకొనడం, వారిద్దరికి ఏకీభావం లేకపోతే వారు యెవరికివారు సూచించిన రెండు పేర్లు లాటరీవేసి ఆ వచ్చిన వారిని జడ్జిగా తీసుకొనడం యీ ప్రణాళిక. చాలా కాలం జయప్రదంగా జరిగింది. దీని కార్యభారమంతా అధ్యక్షుడుగా ఆయన, కార్యదర్శిగా నేను నిర్వహించాము. క్రిమినల్ కేసులు రాజీచేస్తున్నందుకు సంజాయిషీ చెప్పమని పోలీసుస్టేషనుకు మమ్ములను పిలిపించారు. నోటీసు ఇచ్చి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటప్పయ్యనాయుడుగారు, మేము చల్లపల్లి వెళ్ళాము. ఏవో ప్రశ్నలు చాలా వేశారు. నదురు బెదురు లేకుండా మేము సమాధానం చెప్పాము.

## కొన్ని ప్రశ్నలు :

ప్రశ్న : మీ ఆఫీసు యెక్కడ ?

జవాబు : దేవాలయ మండపం. గ్రామం మధ్యలోని చెట్టు క్రింద.

ప్ర: ఆఫీసు రికార్డు యేది ?

జ : మాకు రికార్డు అనేది లేదు.

ప్ర : మరి ఎలా విచారణ సాగిస్తున్నారు ?

జ : మా గ్రామం పుట్టినప్పటినుంచి చదువుకోని మా పెద్దలు ఎలా విచారించారో అలాగే నోటిమాటలతోనే వాదనలు.

ప్ర : రికార్డు లేకపోతే జ్ఞాపకం ఎలా వుంటుంది తీర్పు యివ్వడానికి?

జ : వినడం తీర్పు అప్పటికప్పుడు చెప్పి వాళ్ళ చేత ఆచరింపజేయడం.

ప్ర : అయితే క్రిమినల్ కేసులు రాజీ చేయకూడదని తెలుసా ?"

జ : ఖూనీ కేసులు, మానభంగం కేసులువంటివి మేము రాజీ చేయలేదు. అవి జరగనూ లేదు. తిట్టుకోవడం, కొట్టుకోవడంలాంటి చిన్న కేసులు - యిప్పుడేమిటి యెప్పుడు రాజీ చేయడం మా గ్రామంలో తాతలనాటి నుంచి వస్తూ వున్నది.

ఏదో యిలా తంతు పూర్తిచేసి వెళ్ళిరమ్మనమని సగౌరవంగా పంపించారు నాయుడు గారు. అప్పటి నుంచి ఒక విధమైన స్నేహ మేర్పడింది ఆయనతో. నాకు కనపడినపుడు ఆప్యాయతగా మాట్లాడుకునేవారము. ఈ వెంకయ్యగారితో కలిసి పని చేయడం అదృష్టంగానే భావించేవాడిని నేను.

మేము చాలా కేసులలో కలసి పంచాయతీదార్లుగా వుండేవారము. డబ్బు డిపాజిట్లకు ఆయన సీళ్ళువేసి మరీ తనవద్ద వుంచేవారు. ఊరు మధ్యనగల దక్షిణపు నూతిలో మంచి నీళ్ళు పడుటకు ఈయన పంపింగుసెట్టు తెప్పించి పంచాయతీ బోర్డు తరఫున పని చేయించారు. మంచినీళ్ళు పడలేదు. అప్పుడు మా గ్రామం మెట్టవూరే. మాగాణి కాల్వల నుంచి మూడుమైళ్ళ కాలువలు తీయించి మా చెర్వులు మంచి నీటితో నింపాలని ఈయన ఆలోచనలు చేశారు. తగినంత డబ్బు ఒనగూడే స్థితి కనపడలేదు. ఇలాగే ఈయన చాలా స్కీములు వేస్తూ వుండేవారు. నేను జైలులో వుండగా ఆయన 1933లో చనిపోయారు. 1920 నుంచి ఈయన చనిపోయేవరకు అన్ని రంగాలలో మాకు చేయూతనిచ్చారు.

ఈయన జ్యేష్ఠకుమారుడు మాకు విద్యార్థి దశలో నాయకుడు. ఇంటరు చదువుతూ నాగపూర్‌లో పరమపదించిన మా వెంకటేశ్వర్లు అన్నయ్యనుగూర్చి జ్ఞాపకం చేసుకొనడం నా విధి.

ఆయన నాలుగైదు సంవత్సరాలు నాకంటె పెద్ద. ఆంధ్రదేశంలో సర్వోదయ కార్యకర్తగా ప్రసిద్ధిపొందిన మానికొండ సత్యనారాయణ శాస్త్రిగారు ఈయన సహపాఠీలు, సుప్రసిద్ధ ఆంధ్రనాయకుడు మాగంటి బాపినీడుగారు ఈయన ఆప్తమిత్రుడు.

ఈయన బ్రహ్మమందిరంలో వసతి నేర్పరచుకున్న కారణాన కీర్తిశేషులైన ముట్నూరి కృష్ణారావు పంతులుగారికి అన్నప్పగారికి (బ్రాహ్మో) అర్జా కృష్ణారావుగారికి సన్నిహితుడయ్యాడు. వారి ద్వారా సంస్కరణవాది జాతీయవాది అయ్యాడు. ఆయన వస్త్రధారణ వగైరా బెంగాలీల అనుసరణ. ఆయన మా విద్యార్థి బృందానికి నాయకుడు. ఆయన నాయకత్వంలో 1916లో గుడివాడలో వారంరోజులు జరిగిన కృష్ణామండల సభలకు మేమందరం వలంటీర్లుగా వెళ్ళాము.



అక్కడ పందిళ్ళు, పాకలు వగైరా నిర్మాణంలోను, వివిధ కార్యకలాపాలలోను పాల్గొని కార్యనిర్వాహకుల ప్రశంసల నందుకున్నాము. నేను స్టోర్‌కీపర్‌గా వ్యవహరించాను.

బందరులో జరిగిన ప్రథమ ఆంధ్రదేశ విద్యార్థి సభల ఆర్గనైజరుగా వారు, వారితో పాటు మేము వ్యవహరించాము. బందరులోని కమ్మ విద్యార్థుల గ్రంథాలయ నిర్మాతలలో ఆయన ఒకడు. దాని కార్య నిర్వాహకులలో నేనూ ఒకడుగా వుండేవాడిని.

1914లో ఘంటసాలలో శ్రీ రామమోహన గ్రంథాలయ స్థాపకుడాయన. వారి సహచరులము మేము. దాని ప్రథమ వార్షికోత్సవానికి కీర్తిశేషుడు శ్రీ కానూరి వెంకట చలపతయ్యగారు అధ్యక్షత వహించారు. దీనికి అనుబంధంగా వయోజన విద్యాలయాన్ని మేము నడిపాము. ఇట్టి ప్రజాసేవకు మమ్ము పురికొల్పి ఒక పంథాన మమ్ము నడిపిన ఘనత ఆయనది. ఆయన బందరులో యఫ్.ఏ.లో ఉత్తీర్ణుడు కాలేకపోయాడు. నాగపూరులో చదవడానికి వెళ్ళి అక్కడ విషజ్వరానికిలోనై కీర్తిశేషుడయ్యాడు.

ఆయన పరమపదించిన రోజున నేను జ్వరంతో బాధపడుతూ పదిహేడవ లంఖణంలో వున్నాను. ఆయన మరణవార్త వినగానే నేను ఖంగారుపడతానని తరువాత కొద్దిరోజులకు గాని నాకు తెలియనీయలేదు.

ఈ వెంకయ్యగారి తమ్ముడు అప్పయ్యగారి కుమారుడే కిసాన్ వెంకట సుబ్బయ్యగారు మా మిత్రవర్గంలోనివాడు. ముందు వ్రాస్తాను వారిని గురించి.

## వేమూరి రత్నయ్యగారు

పుల్లయ్యగారి తమ్ముడు అప్పన్నగారు వీరి తండ్రి, వీరి తల్లి బాలకృష్ణమ్మ గారి సోదరి. పేరు రత్తమ్మగారు. వీరి అన్నగారిని పుల్లయ్యగారు దత్తత చేసుకున్న కారణాన పుల్లయ్యగారి సుబ్బయ్య అనేవారు. మా తండ్రిగారి వయస్సే, మా తండ్రి గారికి స్నేహితుడు, మంచి సాహసికుడు, సత్యవాది. ఆయనకు మంచి భవిష్యత్తు కలదని అందరు భావించేవారు. కాని చిన్నతనంలోనే ఆకస్మికంగా మరణించారు.

రత్నయ్యగారు, ఛైర్మన్ వెంకయ్యగారికి ఆప్తమిత్రుడు. ఇద్దరి రూపురేఖలు, ఒడ్డు పొడుగు, దస్తూరి దాదాపు ఒక్కటే. ఒకరు బాలకృష్ణమ్మగారి మనుమడు. మరొకరు బాలకృష్ణమ్మగారి మేనల్లుడు. గ్రామంలో చాలాకాలం ఒకే పార్టీగా వ్యవహరించారు. ఇద్దరు ముసద్దీలే. కొంచెం హెచ్చు తగ్గులుగా, ఒకరు నిండు, నిబ్బరం నెమ్మదీలకు పొగడ్తలందుకుంటే, ఒకరు సునిశితమైన మేధకు, సాహసానికి, పాండిత్య ప్రకర్షకు ప్రశంసింపబడేవారు.

ఈయన ఎపుడూ శాస్త్రమో, ప్రబంధమో, పురాణమో, గీతారహస్యమో చదువుతూ వుండేవారు. ఈయన వ్రాసిన హిందూ ధర్మ రహస్యం అచ్చు అయినది. ఈయన ముసాయిదాలను వేమూరి రామచంద్రరావుగారి వంటి ప్లీడరు మెచ్చుకునేవారు. ఈయన ముసాయిదా ఏ ప్లీడరుకయినా చూపితే "ఎవరో వ్రాసినట్లున్నది. ఇంకా దీనిని చూడడమెందుకు?" అనేవారు. ఈయన వ్రాతపనులు చేసినట్లే వ్యవసాయం పనులున్నూ చేసేవారు. చిన నరసన్నగారి వెంకయ్యగారికి, ఈయనకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే మనస్తత్వం ఘనీభవించినా, మా కోరిక ననుసరించి అందరు ఒకచోట చేరి గ్రామ వ్యవహారాలను గూర్చి చర్చలు జరిపేవారు.

ఈయనకు నాయందు ప్రత్యేకాభిమానానికి కారణం అవసరమైన సందర్భాలందు పెద్దలముందు ఖచ్చితంగా మాటాడి అందులకు వారు ఒప్పుకొనునట్టు చేయడంలో ఒకపద్ధతి ననుసరించడం. ఈయన ఎల్లప్పుడు మమ్ములను ప్రోత్సహించేవారు. "నాయనా! మీరు బుద్ధిమంతులు. ఏదో గ్రామానికి చేయండి సంతోషిస్తాను" అనేవారు.

ఈయన జమీందారు మల్లిఖార్జున ప్రసాదనాయుడుగారికి ప్రత్యర్థిగా ఎస్టేటులో 1921లో ఒక పార్టీని నడిపి 1908 దరిమిలా కొత్తగా ఏర్పడిన జమీందారీ కమతాలను కొన్నింటిని ఆక్రమించుకునేటట్టు చేశారు. ఘంటసాల సహకార పరపతి సంఘ స్థాపకుడు ఈయనయే. ఈయన ప్రథమ అధ్యక్షుడు. ఈయన తర్వాత నేనే ఆ సంఘానికి అధ్యక్షుడనై అయిదువేలు మాత్రమే అప్పు ఇచ్చుటకు శక్తిగల ఆ సంఘాన్ని 25 వేలకి పెంచి అభివృద్ధికి తెచ్చాను. ఇప్పుడు ఇది విశాల పరపతి సంఘంగా రూపొంది బాగా పనిచేస్తున్నది.

## దోనేపూడి వెంకట్రాయులుగారు

కమ్మవారిలో ఆనాడు వ్రేళ్ళమీద లెక్కపెట్ట తగిన ధనవంతమైన కుటుంబాలలో వీరిది ఒకటి. వీరి తండ్రి వరహాల రామన్నగారని ప్రసిద్ధి కెక్కారు. ఆయనకు ఈయన మూడవ కుమారుడు కల్లాకపటం తెలియని ఉత్సాహి. అధర్మం అంటే ఏవగించుకొనడం, ధర్మానికి పాలుపడడం ఈయన ప్రకృతి. ఈయనకు విరోధులంటూ ఎవరూ లేరు. పొలాలు కొనడం, పశుసంపద వృద్ధి చేయడం, కడవలతో పాలు పిండించడం, అనుభవించడం ఈయన పద్ధతి. దోనేపూడివారికి వీరు ఏకైక ప్రతినిధి.

మాకు రెండుమైళ్ళ దూరంలోగల చిలకలపూడి, రుద్రవరం, కోసూరు గ్రామాలలో వీరిమాట చాలా గౌరవంగా చెల్లుబడిఔతూ వుండేది. ధర్మగోటకవ్యాజ్యంలో ఈయన మా నాయన వీరరాఘవయ్యగారితో సమాన భాగస్వామి. వీరి కృషి ఫలితమే నేడు మేము అనుభవించేది ముందు సంతతి అనుభవించేది. వారిది "ఒరే, అరే" అనే స్నేహం. పదుగురకు పెట్టాలనే దాత, జమీందారుగారి వద్దకు యెన్నిసార్లు యే పనిమీద వెళ్ళినా కోటలో భోజనం



చేయడం వారికి లోబడినట్టే అనుకునే తత్వంగల శోత్రియుడు వీరరాఘవయ్యగారు బ్రతికివున్నంతవరకు ప్రతి అడుగు కలిపే వేసేవారు. ఆఖరున ఈయన శుశ్రూషలోనే ఈయన చేతులలోనే ఆయన ప్రాణం విడిచారు. తరువాత అట్టి స్నేహం యేర్పడింది. చిన నరసన్నగారి కుమారుడు వెంకయ్యగారితో. స్నేహమంటే జీవితాంతం వరకు స్నేహం చేయాలి గాని కొంతకాలంకా దనేది వీరి ఆదర్శం, జీవితాంతం వరకు వెంకయ్యగారు వీరు స్నేహితులు. ఒకటేమాట, ఒకటే అడుగు. వీరి కుమారుడు శ్రీ సీతారామయ్య కాంగ్రెసులో నా సహచరుడు, మిత్రుడు. మా మిత్రత్వం ఆయనకు ఆనందం కలుగజేసేది. వీరరాఘవయ్య నేను ఇలాగే స్నేహంగా వుండేవారము అని మురిసిపోయేవారు. ఆయన గురించి వేరుగా వ్రాస్తాను.

## గొర్రెపాటి గోపాలకృష్ణయ్యగారు

తమ తాతగారి పేరుతో రంగన్నగారి కుటుంబమని వీరు ప్రసిద్ధి కెక్కారు. ఈ కుటుంబంవారు చాలా పౌరుషం గలవారనే పేరు గడించుకున్నారు. వీరు చాలాకాలం పంచాయతీ బోర్డు సభ్యులుగా ఉండగాను 920లో ఏర్పడిన ధర్మఘోటక సంఘ ప్రథమాధ్యక్షులుగా వీరు ఎన్నుకొనబడినపుడు వీరితో సహచరులుగా మేము పనిచేయడం తటస్థించినది. మా నాయన దోనేపూడి వెంకట్రాయులుగారు గ్రామ రాజకీయాలలో ప్రప్రథమంగా ప్రవేశించినపుడు, వారికి సహచరుడుగా వున్న రామస్వామిగారు వీరి అన్నగారే. ఈయనది నిండైన, నెమ్మదైన విగ్రహము. గ్రామ రాజకీయాలలో గొ॥న॥కు వెంకయ్యగారికి సహచరుడు. వీరి తర్వాత వీరి తమ్ముడు పట్టయ్యగారు గ్రామ రాజకీయాలలో ప్రముఖపాత్ర వహించారు. ఒక పార్టీ నాయకుడయ్యాడు.

## లక్ష్మీనారాయణగారు

రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘ రథసారధులలో ప్రథమశ్రేణికి చెందినవారు వానపాముల లక్ష్మీనారాయణగారు. వృత్తి బంగారపు పని. బంగారు మేనిఛాయ, తెల్లని వస్త్రధారణ మంచి ముసద్ది వ్యవహర్త. 1920లో ఏర్పడిన ధర్మఘోటక సంఘానికి ప్రథమ కార్యదర్శి. పంచాయతీ బోర్డులో చాలాకాలం సభ్యుడుగా వున్నారు. జాతీయవాది, కాంగ్రెసు భక్తుడు, గ్రామంలో అన్ని రంగాలలో మాకు పూర్తి సహకార మిచ్చేవారు. మా నాయనగారి పట్లగల లక్ష్యం నామీద ప్రేమగా మార్చుకున్నారు. నేను పంచాయతీబోర్డు సభ్యుడననడంలో సహకరించిన విషయం వ్రాశాను. నేను తాలూకాబోర్డు అధ్యక్షుడనైన తరువాత కారులో నాతోవచ్చి నాకు నివసించడానికి యిల్లు, వసతిచూసి నన్నందు ప్రవేశపెట్టి తిరిగివచ్చారు ఆనందంతో. ఈయన స్టాంపు వెండరు కూడా. ఈ సందర్భంగా నా సహకారం వీరికి వుంటూ వుండేది.

ఈయన అన్నగారి కుమారుడు భ్రమరాచార్యులకు విద్యాబుద్ధులు చెప్పించి పెంచి పెద్దజేశాడు. ఆయన నాకు మిత్రుడు. తాలూకా బోర్డు అధ్యక్షుడుగా ఆయనకు నేను వుద్యోగమివ్వడం జరిగింది. ఆయన బోర్డు హైస్కూలులో ఆదర్శప్రాయమైన ఉపాధ్యాయుడుగా ప్రశంసలనందుకున్నారు.

## వానపాముల సుబ్బారాయుడు గారు

ఈ లక్ష్మీనారాయణగారు ఎవరో కాదు ఘోటక వ్యవహారాలలో మా నాయనగారికి కుడిభుజంగా పనిచేసి కీర్తిగన్న సుబ్బారాయుడి గారి సోదరుడు. సుబ్బారాయుడుగారిని గూర్చి ఒకమాట. ఘోటక వ్యాజ్యం దాఖలు అయిన అయిదు మాసాలకు కాబోలు నేను పుట్టాను. నేను వుయ్యాల మంచంలో వుండగా వచ్చి, చూచి, వ్యాజ్యం మాకు అనుకూలమైతే నా స్వహస్తంతో వుయ్యాలమంచంచేసి తీసుకువచ్చి అందులో బాబుని పడుకోబెడతాను అని మ్రొక్కుకు వెడుతున్నాను, అని వెళ్ళారు. వ్యాజ్యం అనుకూలమైనది. నాకు వుయ్యాల మంచం తయారుచేసి మొక్కుబడి తీర్చుకుని ఆనందించారు సుబ్బారాయుడుగారు.

ఘోటకం కేసులో ముద్దాయిలుగా వున్న దోనెపూడి బాపన్నగారు 1920లో నేను పంచాయతీబోర్డు సభ్యత్వం కోరగా బహిరంగంగా ఒక ఓటు నాకు, ఒక ఓటు వెంకట్రాయులు గారికి అని ప్రచారంచేసి మా నాయనగారి ఎడ ఆయనకుగల స్నేహాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భమున బలవంతుడగు వెంకయ్యగారిని ధిక్కరించడం కూడా జరిగింది.

రామస్వామిగారి కుమారుడు వడ్లమూడి క్రిష్ణయ్య, వడ్లమూడి సుబ్రహ్మణ్యంగార్లు వడ్లమూడి వారందరిచేత ఒక ఓటు నాకు ఒక ఓటు వారి బావ వెంకయ్యగారికి వేయించడం అన్ని రంగాలలోను కాంగ్రెసుకు అండదండగా వడ్లమూడివారిని వుంచడం జరిగింది. అలాగే బండి రామయ్యగారు, బండి రత్తయ్యగారున్ను.

## పెదకాపు వెంకన్నగారు

పెద్ద కుటుంబ బలగం గలవారు వీరు. ధర్మఘోటకం కేసులో మొదటి ముద్దాయి. ఈయనను తిరుగదీసుకొనడానికి జమీందారు కత్తిన్నర భూమి ఇస్తానన్నా లొంగనిధీరుడు. ధర్మఘోటకం వ్యాజ్యం జయప్రదమవడానికి మంది మార్బలం సమకూర్చిన యోధుడు.

ఘంటసాల గ్రామం తరపున జమీందారుగారి కోటలో పెండ్లిండ్లకు పట్టాభిషేకానికి ఎవరినైనా పంపించవలసివస్తే పెదకాపుగారి కుటుంబ ప్రతినిధినే పంపడం ఆచారం. ఈయన తరువాత ఈయన మూడవ కుమారుడు పట్టాభి రామయ్యగారు అట్టి ప్రాతినిధ్యం వహించేవారు. ఆయన తరువాత ఆయన తమ్ముడు రత్తయ్యగారు పెదకాపు అని పిలువబడుతున్నాడు. ఈయన చాలాకాలం పంచాయతీ బోర్డు సభ్యుడుగా వున్నారు.



ఈ పెదకాపు వెంకన్నగారి తమ్ముడు రామస్వామిగారున్ను ధర్మఘోటక వ్యాజ్యంలో ముద్దాయే, ఈయన మనుమడే గ్రామ రాజకీయాలలోను ఖద్దరు సంస్థలోను సముచితపాత్ర వహించిన పేరయ్యగారు.

## పండిత గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

1917లో చదువులు మానిన మేము ప్రజాసేవ చేయాలనే తత్పరత, దృఢదీక్ష విద్యార్థి దశలోనే అలవరచుకున్నాము. 1918లో కాంగ్రెసు – ముస్లింలీగ్ ప్రణాళిక మీద గ్రామాలవెంట నేను గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, వేమూరి సీతారామయ్య తిరిగి సంతకాలు చేయించి వాటిని తీసుకువెళ్ళి పట్టాభి సీతారామయ్యగారికి ఇచ్చాము.

1919లో ఏర్పడిన జిల్లా కాంగ్రెసు సంఘంలో మేము ముగ్గురం సభ్యులుగా వున్నాము. గ్రామాలవెంట శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, నేను ప్రచారం చేసేవారము. మాది ఒకే మాట, ఒకే అడుగుగానే ఉండేది. మా గ్రామానికి సంబంధించిన వ్యవహారాలలో గాని, రాజకీయాలలోగాని మేము ఆలోచించుకొని కార్యక్రమాన్ని రూపొందించుకొని నిర్వర్తించేవారము.

తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెస్ కమిటీ భూమిశిస్తు ఫలానా తేదీవరకు ఇవ్వవద్దు అని ఆంక్షవిధించినపుడు మేము అందుకు కట్టుబడి వున్నాము. మా గ్రామమంతా ఈ నిర్ణయాన్ని శిరసావహించి ఆచరించింది. తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెసు సంఘం ఆ సంవత్సరం పామర్రులో సమావేశమై పన్నులు చెల్లించవలసినదని వచ్చిన మహాత్ముని ఆదేశాన్ని ప్రకటించింది. మహాత్ముని నుండి అట్టి ఆదేశం వస్తుందని మేము వూహించలేదు. ఆ సమావేశానికి మేము బయలుదేరే ముందు మేమిరువురము సంప్రదించుకుని, కాంగ్రెసు ఆదేశించే ఎడల పన్నులు చెల్లించకుండా ఉండి భూములను వేలం వేయించుకొనుటకు సంసిద్ధులయ్యాము.

1930 ఉప్పు సత్యాగ్రహంలో ఆయన జైలుకు వచ్చాడు. 1932లో ఆయన భార్య శ్రీమతి కుటుంబమ్మగారు కల్లు దుకాణాల పికెటింగు చేసి జైలుకు వచ్చారు. తరువాత ఆయన పూర్తిగ సాహిత్య రంగమునకు అంకితమయ్యారు. విద్యార్థి దశ నుండి ఆయన, నేను చాల సన్నిహితంగా వున్నాం.

నేను అయిదవ ఫారము చదువుతూ వుంటే ఆయన నాల్గవ ఫారం చదువుతూ బందరులో కౌతా శ్రీరామశాస్త్రిగారి దగ్గర బెంగాలీ భాష చదువుకున్నారు. 1930లో జైలులో హిందీభాష చదువుకున్నారు, మితభాషి.

ఓపికగా రాత్రింబవళ్ళు చదవడం, చదివిన వాటిని రిఫరెన్సుగా ఉంచుకోవడం ఆయనకు అలవాటు. తాను రచయితగా పేరు ప్రతిష్టం ఆర్జించాలనే ఆశయం ఆయన విద్యార్థి దశలోనే ఉండేది.

1923లో మహాత్ముడు జైలులో వుండగా ఆయన నిర్బంధాన్ని గురించి హిందీకి అనువాదం తెలుగులో ప్రకటించారు. అది ఆయన ప్రథమ రచన. దాన్ని ప్రభుత్వం నిషేధించడంవల్ల ఆయన నిరుత్సాహపడలేదు. ఇంకా క్రొత్త రచనలకు ఇది ప్రోత్సాహంగా ఆయన భావించాడు.

"వల్లభాయి పటేలు", సరోజినీ దేవి, "ప్రజానాయకుడు ప్రకాశం" "ఆచార్య రంగా" "మన రైతు పెద్ద" "కట్టమంచి రామలింగారెడ్డి చరిత్ర" "కవిరాజు రామస్వామి చౌదరి" – "లాలా లజపతిరాయి చరిత్ర" మా "ఘంటసాల చరిత్ర" నిత్యజీవితానికి ఉపయోగపడే మధుర జీవనము "మాటమన్నన" కూడా రచించిన ఆయన ఈనాడు గద్య రచయితలలో ముఖ్యంగా జీవిత చరిత్రల రచయితగా ఆంధ్రదేశంలో ప్రసిద్దిని ఆర్జించుకున్నాడు. ఇన్ని జీవితచరిత్రలు వ్రాసినవారు మరొకరు లేరు.

"సరోజినీదేవి" చరిత్రకు ఆనాటి మన మద్రాసు ప్రభుత్వం నుంచి, "కట్టమంచి రామలింగారెడ్డి చరిత్రకు "దేశోద్ధారక నాగేశ్వరరావుగారి చరిత్రకు ఈనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నుండి అవార్డులు అందుకున్నారు.

ఆంధ్రదేశంలో ఆయన పండిత గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగా ప్రసిద్ధి పొందుతున్నారు.

ఈ చరిత్రలే కాక "భట్టుమూర్తి రామ రాజ భూషణుడా?" "అక్షరాభిషేకం" "శరద్దర్శనం" "చలం జీవితం, సాహిత్యం" "హంపీ పిలుపు" మొదలుగా గల గ్రంథాలను పెక్కురచించారు.

నా చరిత్ర వ్రాసి దానికి "మన రైతు పెద్ద" అని నామకరణం చేశాడు. ఆంధ్రప్రదేశ్‌లో 'రైతు పెద్ద'గా నన్ను అందరు పిలవడం నేడు జరుగుతున్నది.

నా షష్ఠి పూర్తి ఉత్సవానికి 'సరోజినీదేవి' చరిత్రను నాకు అంకితం కూడా ఇచ్చి నా ఎడల గల ప్రేమను ఆయన వెల్లడించారు.

విద్యార్థి దశనుండి అవిచ్ఛన్నంగా నేటి వరకు ప్రేమభావంతో మా మేనులు రెండైనా ప్రాణం ఒకటిగా మేము వ్యవహరిస్తున్నందుకు నేను సంతసిస్తున్నాను.

ఆయన రచయితగా ఆంధ్రదేశంలో ప్రముఖంగా గౌరవమర్యాద లందుకుంటూ నన్ను కూడా రచయితగా పలువురి దృష్టిలోకి తీసుకురావాలనే ఆయన ప్రోత్సాహం వల్లనే ఇటీవల "కాలచక్రం – మన కర్తవ్యం", "జాతి వెలుగులు" నేను వెలువరించడం జరిగిది.



# కిసాన్ వెంకట సుబ్బయ్యగారు

బందరులో చదువుకుంటున్న కాలంనుంచి వెంకట సుబ్బయ్యగారు, నేను సన్నిహిత సంబంధం గలవారము. నేను 4వ ఫారం చదువుతుండగా ఈయన ఫస్టు ఫారం చదువుచుండే వాడు. విద్యార్థి దశలో మాకు నాయకుడని ఇదివరకు వ్రాసిన కీ.శే. వెంకటేశ్వర్లుగారీయన పెదతండ్రిగారి కుమారుడే. ఆయన అజమాయిషీలోనే ఈ వెంకటసుబ్బయ్య కూడా బ్రహ్మమందిరంలో మాతో వుంటూ ఉండేవారు.

చదువులు మానిన తరువాత ఘంటసాలలో మేము ఒకే రాజకీయ కుటుంబంలోని వారుగా అన్ని వ్యవహారాలను పరస్పరం సంప్రతింపులతో వ్యవహరించుకునేవారము.

చురుకు, చొరవను పురస్కరించుకుని నాది మొదటి స్థానం. రెండవ స్థానం పండిత వెంకట సుబ్బయ్యగారిది.

మా కంటె వయసులో చిన్నదైన ఈ వెంకట సుబ్బయ్య, దోనేపూడి సీతారామయ్య, గొర్రెపాటి నరసింహం వరుసక్రమంలో ఉండేవారు.

మా వూరిలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారు వుండుటచే వెంకట సుబ్బయ్యలు హెచ్చు.

గొర్రెపాటివారు ఆ దేవునికి ధర్మకర్తలగుటచే గొర్రెపాటి వారిలో మరీ హెచ్చు. మొదటి రోజులలో ఒకరిని ఎర్ర వెంకట సుబ్బయ్య, రెండవవారిని నల్ల వెంకట సుబ్బయ్య అని అనేవారు. వీరు సర్వత్రా ప్రతిష్ఠ పొందిన తర్వాత ఒకరు పండిత వెంకట సుబ్బయ్యగాను, మరొకరు కిసాన్ వెంకట సుబ్బయ్యగాను అన్వర్థ నామధేయులైనారు. గ్రామ రాజకీయాలలోను, స్వరాజ్య సంరంభంలోను మేమందరం సహచరులం.

1929లో మహాత్మాజీ, ఖద్దరు ఉద్యమ సంచారంలో మా వూరు వచ్చినపుడు కాంగ్రెస్ స్వచ్ఛంద సైనికులకు ఈయన సేనాధిపతిగా వ్యవహరించారు. ప్రజా సమూహ మంతటిని క్రమశిక్షణలో వుంచుట చూచి మహాత్ముడు "ఇది మన జాతీయ సేన" అని ప్రశంసించారు.

1930లో ఉప్పు సత్యాగ్రహానికి పూర్వం మా వూరిలో నరసింహదేవర సత్యనారాయణ గారి అధ్యక్షతన క్రింద జరిగిన కృష్ణాజిల్లా సహకార సభకు నేను ఆహ్వాన సంఘాధ్యక్షులుగా వుండగా, ఈయన వలంటీరు సేవాధ్యక్షుడుగా ఉన్నాడు.

స్వరాజ్య సంరంభంలో కారాగార క్లేశముల ననుభవించిన సైనికుడీయన. ఈయన భార్య శ్రీమతి సరస్వతమ్మగారు కల్లుదుకాణాల పికెటింగ్ వగైరా కార్యక్రమాలలో పాల్గొని

శ్రీకృష్ణ జన్మస్థానమలంకరించారు. మహాత్ముని ఖద్దరు సంచారంలో యీవిడ తన మెడలోని బంగారు గొలుసును మహాత్మునికిచ్చారు. ఈవిడ చాలా ఉదార స్వభావం గల మహిళామణి.

రైతు ఉద్యమ మహానాయకులైన ఆచార్యరంగాగారు అఖిలభారత రైతు సంఘాధ్యక్షులైన తర్వాత ఆయన స్థానే నేను రాష్ట్ర సంఘాధ్యక్షుడనైనాను. నా తరువాత కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు ఆయన తర్వాత ఈ వెంకట సుబ్బయ్యగారు చిరకాలం ఆంధ్ర రాష్ట్ర కిసాన్ సంఘాధ్యక్షుడుగా సమర్థతతో ఆ సంస్థ కార్యకలాపాలను నిర్వహించారు. ఆచార్య రంగాగారి ప్రేమకు, ప్రశంసకు పాత్రులైన కొలదిమంది ప్రథమశ్రేణి శిష్యులలో ఈయనకు ప్రముఖస్థానం గలదు.

ప్రకాశం పంతులుగారు రెవిన్యూమంత్రిగా ఉండగా జమీందారీల రద్దుకై ఒక రిపోర్టు వ్రాయుటకు అప్పటి స్పీకర్ సాంబమూర్తిగారు ఒక కమిటీ ఏర్పాటు చేసి దానికి అధ్యక్షుడుగా ప్రకాశం పంతులుగారిని నియమించారు. ఆ కమిటీ ముందు సాక్ష్యమిప్పించుటకు గాను, వ్యక్తులను నిర్ణయించి వివరములను అందజేయుటకు ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘం తరుపున మేము, రెబ్బాప్రగడ మందేశ్వరశర్మ గారి ఆధ్వర్యమున ఒక కమిటీ నిర్ణయించాము. శ్రీ శర్మగారికి సహాయకులుగా శ్రీ వెంకటసుబ్బయ్య అహర్నిశలు శ్రమచేసి తగినంతగా సాక్ష్య సామాగ్రిని సేకరించి, తన కర్తవ్యాన్ని ప్రశంసాపాత్రంగా నిర్వహించారు.

1950లో కాకాని వెంకటరత్నంగారు కృష్ణాజిల్లా బోర్డు అధ్యక్షుడైనపుడు వీరు ఉపాధ్యక్షుడుగా స్థానిక సంస్థల ద్వారా ప్రజాసేవ చేశారు.

ఆచార్య రంగాగారు 1952లో కృషికార్‌లోక్‌పార్టీ స్థాపించినపుడు దానికి ఉపాధ్యక్షుడుగాను తరువాత ఆంధ్రప్రదేశ్ స్వతంత్రపార్టీ ప్రథమ అధ్యక్షుడుగాను పిదప ఆంధ్రప్రదేశ్ స్వతంత్రపార్టీలో ప్రథమశ్రేణి నాయకుడుగా వ్యవహరిస్తున్నారు.

కర్షక ఉద్యమంలో ఆచార్య రంగాగారికి అండదండలుగా ఉన్న ప్రధాన సహచరులు గౌతు లచ్చన్నగారి తరువాత స్థానం వెంకటసుబ్బయ్యగారిదంటే అతిశయోక్తి కానేరదు. శ్రీరంగాగారి కృషీకార్ పార్టీ ఏర్పడువరకు జిల్లా రాష్ట్ర రాజకీయాలలో మేము కలిసిమెలిసి సంప్రతించుకొని వ్యవహరించుకొనేవారం.

ఆనాటినుంచి మా దారులు వేరై వేరు రంగాలలో వ్యవహరిస్తున్నా పరస్పరం గౌరవ మర్యాదలకు భంగం లేకుండా ప్రేమభావంతో వున్నందులకు సంతోషం.



# శ్రీ దోనేపూడి సీతారామయ్య

వీరిది సంపన్న కుటుంబం. వీరి తాత రామన్నగారు. పేరు ప్రతిష్ఠలు గల ధర్మిష్ఠి. ఆయనకు వరహాల రామన్నగారని ప్రసిద్ధి. ఈయన తండ్రి వెంకట్రాయులుగారు, కల్లాకపటం తెలియని ఉత్సాహి, సత్యధర్మనిష్ఠాగరిష్ఠుడు.

మా నాయన వీరరాఘవయ్యగారు, వీరు ప్రాణమిత్రులు. గ్రామంలో తమ కంటె పెద్దలను తమకు ధర్మమని తోచిన సందర్భంలో జంకుగొంకు లేకుండా ఎదుర్కొనుటలో వీరు ప్రతిష్టనార్జించుకున్నారు.

ధర్మఘోటక వ్యాజ్య సందర్భంలో చల్లపల్లి జమీందారుతో పోరాడిన యువజంట వీరని వ్రాసివున్నాను. ఈ వెంకట్రాయులుగారి కుమారుడే చి॥ సీతారామయ్య.

వెంకట్రాయులుగారు నా మీద గల ప్రేమ కొద్ది తెలుగు, ఇంగ్లీషు చదువు కోవడానికి ఈయనను నా వద్దకు పంపించారు. చదువుకున్నది కూడా తక్కువే. అంతమాత్రాన ఈయన నాశిష్యుడని చెప్పుకొనుట సబబు కాదు, నా సహచరుడు. సోదరుడు అని చెప్పుకొనుట సముచితం, ప్రేమపాత్రుడు.

1926లో మద్రాసు శాసనసభకు స్వరాజ్యపార్టీ అభ్యర్థిగా కాళేశ్వరరావు, సూరయ్యగార్లు నిలబడ్డారు. వెంకట్రాయులుగారు ఆయన మిత్రుడైన గొర్రెపాటి నరసన్నగారి కుమారుడు వెంకయ్యగారి ప్రోత్సాహంతో ఒక వోటు అడుసుమిల్లి గోపాలకృష్ణయ్యగారి కివ్వ నిశ్చయించుకున్నారు. అపుడు ఘంటసాలలో రూ. 10/- శిస్తు యిచ్చేవారి ఓట్లు 210 మాత్రమే. ఓటు చేయడానికి హెచ్చుమందికి అర్హతలు కలిగియున్నా జాయింటు పట్టాలు విడదీయని కారణం చేత హెచ్చు విస్తృత ప్రాతినిధ్యం లేకపోయింది. అపుడు ఎస్టేటు గ్రామంలో అంతటా అలాగే ఉండేది.

దోనేపూడివారిలో 19 ఓట్లు గలవు. అందరికి వెంకట్రాయులుగారి మాట సుగ్రీవాజ్ఞ. (శ్రీ సీతారామయ్యకు నా యెడల లక్ష్యం. ప్రేమయేకాక, కాంగ్రెసు యెడల భక్తిమెండు) శ్రీ సీతారామయ్యను ఏకాంతంగా కలిసి యీ విషయం చర్చించాను. ఆయన జంకు గొంకు లేకుండా ఆయన తండ్రిగారికి వ్యతిరేకంగా నాతో కలిసి రాత్రింబవళ్ళు ఓట్ల కాన్వాసింగుకు తిరిగాడు. వెంకట్రాయులుగారి ఓటు మినహా మిగతా ఓట్లన్నీ కాళేశ్వరరావు, సూరయ్యగార్లకే పడ్డాయి.

అప్పటికి ఆయన వయస్సు చాలా చిన్నది. మైనారిటీ వెళ్ళిందో లేదో పోలింగ్ స్టేషనులో తన తండ్రిగారి కెదురుగా నిలిచి బహిరంగంగా ఈ కాన్వాసు చేయడం అందరికీ ఆశ్చర్యం కలుగజేసింది. ఆనాటి నుంచి మా సన్నిహితత్వం మరీ హెచ్చింది.

చిలకలపూడి, రుద్రవరంలో వీరికి భూములున్నాయి. మొత్తం నాలుగు వందల ఎకరాలు మావూరివారి భూమి కలదు. పైగా ఆ రెండు ఊళ్ళ ఆసాములకు కూడా భూములున్నాయి. వారందరు వెంకట్రాయులుగారి యెడల భక్తి శ్రద్ధలు గలిగి వుండేవారు.

పై గ్రామాలలో పల్లపుసాగు, మురుగు పంపుతో మెట్టపైరులు ఈ భూములలో వుండేవికావు. వర్షపు నీటితోగానీ, మురుగు నీటితోగాని మాగాణి సాగుచేసి రైతులు వరిపంట పండిస్తే 20 రెట్లవరకు ప్రభుత్వం పెనాల్టీ విధించేది. వెంకట్రాయులుగారు ఈ నీటి తీరువ రద్దు చేయించుటకు, మాగాణి సాగుకు అనుమతి ప్రభుత్వం నుంచి తెప్పించుటకు అష్టకష్టాలు పడ్డారు. పని జరుగలేదు. చెప్పుకుంటే వినేనాథుడు లేడు. శ్రీ సీతారామయ్య ప్రేరణతో 1937లో నేనీ విషయం చేపట్టాను. అప్పుడు నేను ప్రధాన కార్యదర్శిని ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘానికి.

భాస్కరరావు నాయుడుగారు కలెక్టరు. కేశవరావుగారు పి.డబ్ల్యు.డి. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నా కోరికపై వారిద్దరు ఈ భూములను చూచి ప్రజల విజ్ఞప్తులను విని, కరణాల లెక్కలైన అడంగులలో ఆయకట్టులో చేర్చే సందర్భాలలో ఫస్టు ప్రిఫెరెన్సు ఈ భూముల కివ్వాలని, అంతవరకు మురుగు నీటితో పల్లపు సాగు చేస్తే ఒక రూపాయి మాత్రమే పెనాల్టీ విధించాలని ఆర్డరు వేశారు. ఇది రైతులకు అమూల్యమైన సహాయం.

తరువాత మురుగునీటి నిల్వకు కట్టవేసి సాగుచేయించడానికి కూడా కొన్ని ప్రయత్నాలు చేశాము. అది ప్రభుత్వం వారి ముద్రాధికారంతో స్థిరపరచడానికి బ్రహ్మ ప్రయత్నాలు కావలసి వచ్చినవి. ఈ సందర్భంలో మేము చాల వ్యతిరేకశక్తులను యెదిరించవలసి వచ్చింది. నా స్వభావం ఉద్యోగస్తులను గాని, మంత్రులను గాని రెండు మూడుసార్లు చూడడం మాత్రమే. హెచ్చుసార్లు చూడడం నాకు తలనొప్పితో కూడినపని. ఈ భూమి సాగుకు శాశ్వత సదుపాయం ఏర్పడుటకు సోదరుడు కీ॥శే॥ కళా వెంకట్రావుగారి సహాయం అమూల్యమైనది.

ప్రకాశం పంతులుగారి ఉత్పత్తి - కొనుగోలుసంస్థ మా వూరులో నేను స్థాపించి నపుడు ఈయనే దానికి అధ్యక్షుడుగా వుండి సమర్థతతో నిర్వహించారు. తరువాత పంచాయతీబోర్డు అధ్యక్షుడుగా దాని ఆదాయం వృద్ధిచేసి అభివృద్ధి పనులు కొన్ని సాధించారు. అదివరకు వేమూరి రత్నయ్యగారిచే స్థాపింపబడి నేను పండిత వెంకటసుబ్బయ్య అధ్యక్షులుగా అభివృద్ధికి తీసుకువచ్చిన సహకార పరపతి సంఘాన్ని విశాల పరపతి సంఘంగా హెచ్చుగా మార్చుటలో నేను కృషి చేశాను. దాని అధ్యక్షుడుగా ఆ సంఘానికి ఆయన ఏకగ్రీవంగానే ఎన్నుకోబడ్డారు. ఘంటసాల గ్రామ సంఘానికి నా తరువాత ఆయనే అధ్యక్షుడయ్యారు. వీటన్నిటిలో నా సహకార సహాయాలు ఆయనకు వుండేవి.



నేను లెజిస్లేటివ్ కౌన్సిల్ అధ్యక్షుడుగా హైదరాబాదులో స్థిరనివాసం ఏర్పరచుకొనే వరకు ఘంటసాల గ్రామంలోని సర్వకార్య నిర్వహణ మేమిద్దరం సంప్రతించుకునే చేస్తుండే వారం. మా యిద్దరిని విడరాని జంటగా ప్రజలు భావించేవారు. మా స్నేహాన్ని చూసి వారి తండ్రి ఎక్కువగా ఆనందించేవారు. ఈయన స్వరాజ్య సంరంభంలో కారాగారవాసం చేశాడు. ఈయన భార్య శ్రీమతి బాలమ్మ (వేమూరి లక్ష్మయ్యగారి కుమార్తె), కల్లుదుకాణాల పికెటింగు వగైరా కార్యక్రమాల్లో పాల్గొన్నది. దురదృష్టవశాత్తు ఆమె చిన్నతనంలోనే కీర్తిశేషురాలగుటతో జీవితాంతం వరకు తీరని దుఃఖం సంప్రాప్తించినది.

ఆయన తిరిగి వివాహం చేసుకోలేదు. విశాల పరపతి సంఘం తరఫున ఒక రైస్‌మిల్లు నిర్మాణం చేయడం, ఆ సంఘం తరఫున ఒక భవన నిర్మాణం చేయడం, మా వూరు దక్షిణాన గుండేరు మీద ఒక వంతెన నిర్మాణం ఆయన కృషి ఫలితం.

## గొర్రెపాటి చిన నరసింహంగారు

ఈయన ఘంటసాలలో పేరు ప్రతిష్ఠలు గలిగి పౌరుషానికి ప్రసిద్ధిగన్న రంగన్నగారి కుటుంబానికి చెందినవాడు. చిన్నవయస్సుననే దేశభక్తితో మాకు సన్నిహితుడైనాడు. ఆయన సుశిక్షితుడైన సైనికుడు. రామభక్తుడైన హనుమంతుని శ్రేణిలో చేర్చదగినవాడు. ఒక పని ఆయనకు పురమాయిస్తే, దానిని జయప్రదంగా నిర్వర్తించి పర్యవసానం తెల్పడం తన విధిగాభావించే ప్రవృత్తి ఆయనిది.

1930లో నేను ముందే నల్లజండాల ప్రదర్శన కేసులో జైలుకు వెళ్ళాను. తాటిగెలలు, ఈత గెలలు నరుకుట, కల్లు దుకాణాల వద్ద పికెటింగులు జరుపుట మొదలగు కార్యక్రమాలకు ఆయన ఆధ్వర్యం వహించాడు. రాత్రింబవళ్ళు విశ్రాంతి లేకుండా ఆయన యీ ఉద్యమంలో నిమగ్నుడయ్యాడు. ఆక్టింగు మున్సిఫ్ లక్ష్మయ్యగారి సలహా సంప్రదింపులు సహాయ సంపత్తి ఈయనకుండేవి.

1930, 1932లో సత్యాగ్రహాలలో ఈయన జైలుకు వెళ్లాడు. ఈయన సహ ధర్మచారిణి శ్రీమతి లక్ష్మీకాంతమ్మగారు కూడా ఈయన అడుగుజాడలలోనే పికెటింగు జరిపి ప్రజా మన్ననల నంది జైలును పునీతమొనర్చారు.

తూర్పు కృష్ణా జిల్లాలో ప్రతిరోజు బందరులో జట్టు తరువాత జట్టుగా (batch by batch) అరెస్టులు జరిగే సందర్భంలో ఎప్పుడవసరమైనా, ఆరోజు నగర సంకీర్తనచేసి, దెబ్బలు తింటూ జైలుకు వెళ్ళే కార్యక్రమంలో ఈయన దూకుతుండేవారు. ఒకరోజు సంభాషణలో శ్రీ పట్టాభిగారు "మీ చిన నరసింహం ఋషివంటివాడు" అని ప్రశంసించారు. మా కందరికి ఆనందమయింది. ఇటువంటి సోదరుడు. మిత్రుడు మాకున్నాడు గదా అని పరవశులయ్యాం.

1923 నుంచి 29 వరకు మేము నడిపిన దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు ఖద్దరు సంస్థ కార్యనిర్వహణ నాతోబాటు సహభాగస్వామ్యం శ్రీ చిననరసింహం. ఆయన విరామమెరుగని నిరంతర శ్రమే మా గ్రామానికి ఆ ఖద్దరు సంస్థద్వారా ప్రతిష్ట తెచ్చింది. రాజకీయాలలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా, ఆయన బంధువులు స్వతంత్ర పార్టీలో చేరినా ఆయన నేటికీ కాంగ్రెసు యెడల అచంచల భక్తితో ఉన్నందుకు ఆయనను, ఆయన దేశభక్తిని నేను ప్రశంసిస్తున్నాను.

గ్రామంలో జరిగిన గ్రామాభ్యుదయ కార్యనిర్వహణలో ఆయన మా భాగస్వామి అని వేరుగా వ్రాయనక్కరలేదు.

ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా ఆయనకు జైలుశిక్షతోపాటు, అయిదు వందల రూపాయలు జరిమానావేస్తే, ఆయన చెల్లించలేదు. ఆయన భూములను వేలం వేస్తే గ్రామంలో ఎవరూ కొనలేదు. ఇంతలో గాంధీ-ఇర్విన్ ఒడంబడిక వచ్చింది. అంతటితో ప్రభుత్వ ఉద్యోగుల ఆర్భాటాలకు స్వస్తి జరిగింది.

## *29వ కృష్ణా మండల సభ*

1892లో కృష్ణామండల సభ యావదాంధ్రలో ప్రథమంగా యేర్పడింది. ఆనాడు ఇప్పటి గుంటూరు జిల్లాలోని ఒంగోలు తాలూకా మినహా మిగతా జిల్లా అంతా కృష్ణాజిల్లాలోనే వుండేది. అఖిలభారత కాంగ్రెసు సభతో పాటు సంఘసంస్కరణల సభ కూడా ఆదిలో జరిగినట్లుగానే మండలసభతో పాటు సంఘసంస్కరణ సభ కూడా జరిగేది.

ఆ కాలంలో మండల సంఘాలే ప్రజల సాంఘిక, ఆర్థిక, రాజకీయ, నైతికాది విషయాలను వెల్లడించేవి. వాటి ద్వారానే ప్రముఖులు ప్రజాసేవ చేస్తూ వుండేవారు. 29వ కృష్ణామండల సభ దివి తాలూకా పెదకళ్ళేపల్లిలో 1920 జూన్ నెలలో జరిగింది. ఇది మండలసభలలో ప్రత్యేక ప్రాముఖ్యం గాంచింది, దీనికి అధిక సంఖ్యాకులుగా రైతులు వచ్చి సభా కార్యక్రమంలో పాల్గొన్నారు, అధ్యక్షుడు కానూరి వెంకటా చలపతయ్యగారు కేవలం రైతే, ఆయనది గుడివాడ తాలూకా కౌతరం.

ఆనాడు గుడివాడ తాలూకా కౌతరం ఆంధ్రదేశంలోనే జాతీయభావాలు కలిగి దేశ సేవాతత్పరతతో ముందుకు ఉరుకుతున్న యువకులు నాయకత్వం వహించిన గ్రామం. ఆ నాయకులు (1) కానూరు వెంకటా చలపతయ్య (2) కానూరి పెదవెంకట వాసయ్య, (3) బొచ్చు పద్మనాభయ్య, (4) యెర్నేని కోనయ్య, (5) కానూరి దామోదరయ్యగార్లు చలపతయ్య దామోదరయ్యగార్లు సోదరులు, కోనయ్యగారిది గురజ గ్రామం, తరచుగా అయినా కౌతరంలో వుంటూ వీరందరు ఒకే జట్టుగా వ్యవహరిస్తూ వుండేవారు. ఆ రోజులలో జరుగుతున్న



కాన్ఫరెన్సులకు సంఘసంస్కరణ సభలకు వీరు విధిగా హాజరగుచుండేవారు. వీరి నాయకుడు వెంకటాచలపతయ్యగారు. వీరు తెలుగు బాగా చదువుకున్నవారు. వారితండ్రి లింగమూర్తిగారి పాండిత్య ప్రకర్ష వీరిలోను వున్నది. చక్కని వ్యాసాలు వ్రాసేవారు, ఒకప్పుడు నేటి ఇంగ్లీషు చదువులను గూర్చి వీరు వ్రాసిన వ్యాసాన్ని ముట్నూరు కృష్ణారావు పంతులుగారు ఆ వారం వారు వ్రాయవలసిన ప్రధాన వ్యాసంస్థానే ముద్రించారు. ఇట్టి అపూర్వగౌరవం కృష్ణా పత్రిక ద్వారా రైతులోకంలో వీరికి మాత్రమే సిద్ధించింది. మహాసభలలో చక్కగా మాట్లాడ గలిగేవారు. కాంగ్రెసు భక్తుడు, రైతు ఉద్యమ పితామహుడు. ఆనాడు అనేక సభలకు ఆయన అధ్యక్షత వహించినందున ప్రెసిడెంట్ చలపతయ్య గారనే ఖ్యాతి గాంచారు.

ఈయనకు ఎ బి సి డి లు రాకపోయినా డాక్టరు పట్టాభి సీతారామయ్యగారివలె అంకెల నెన్నింటినో తమ ఉపన్యాసాలలో ఉద్ఘాటించగల ప్రతిభావంతులు.

కౌతరం గ్రామంలో ఆనాడు ఈ జాతీయ బీజములు నాటిన ఘనత కట్టమంచి కొళందరెడ్డిగారిది. వారిది చిత్తూరు జిల్లాలోని కట్టమంచి గ్రామం.

కట్టమంచి రామలింగారెడ్డిగారి తాతగారు, వీరి తాతగారు, అన్నదమ్ములు, వీరు పోలీసు ఇన్‌స్పెక్టరుగా వుండగా ఒక సంఘటన జరిగింది. బెజవాడ తాలూకా కంకిపాడు గ్రామంలోని ప్రయాణీకుల బంగళాలో ఒక గదిని ఈయన ఆక్రమించుకొని డ్యూటీమీద పొరుగూరికివెళ్ళగా, బెజవాడ సబ్‌కలెక్టరు ఒక ఆంగ్లేయుడు వచ్చి ఆ గదిలో దిగి రెడ్డిగారి సామానులను ఒక మూలకు త్రోసివేయించి వాటిస్థానే తన సామానులు వుంచారు. రెడ్డిగారు వచ్చినతోడనే ఈ విషయం తెలుసుకుని ఆ సబ్‌కలెక్టరు కోటు వగైరా మరొకదానిమీద తన జవానులతో వేయించి, తన సామానులను యథాస్థానమందు పెట్టించారు. ఇది అంతా చూసిన ఆ ఆంగ్లేయుడు అధికారగర్వంతోను, పాలకజాతి అనే అహంకారంతోను, రెడ్డిగారిని తృణీకరించి మాట్లాడినారు. రెడ్డిగారు తిరిగి ఆయన భాషలోనే ఆయనకు సమాధాన మివ్వడమేగాక, అవుసరమైన సందర్భంలో తనచేతి బలాన్ని చవిచూపించడానికి సిద్ధమయారు.

వెంటనే యిద్దరూ తమపై ఆఫీసరులకు తంతిసమాచారం అందజేసిన మీదట జిల్లాకలెక్టరు, జిల్లా పోలీసు సూపరెంటెండెంటు హాజరై యిరువురి వాదనలను విని సబ్ కలెక్టరు చేత రెడ్డిగారికి లిఖితపూర్వకంగా క్షమాపణ ఇప్పించడం జరిగింది ఈ క్షమాపణపత్రాన్ని చట్రం కట్టించి రెడ్డిగారు తన ఆఫీసులో భద్రంగా వుంచుకొన్నారు. నాకు చూపించి, పై విషయాన్ని వివరంగా చెప్పారు: "కృష్ణాపత్రిక" పై సంఘటనను గూర్చి "ఆత్మగౌరవం గల పోలీసు ఉద్యోగి" అని ప్రధాన వ్యాసాన్ని వ్రాసి ప్రశంసించడం జరిగింది. ఈ కొళందరెడ్డిగారు కృష్ణాజిల్లాకు దత్తపుత్రుడు. ఈయన ఉద్యోగానికి రాజీనామా యిచ్చి కౌతరంలో ఒక జాతీయ పాఠశాలను ఆంధ్రలక్ష్మీ రైస్‌మిల్లును స్థాపించి వాటికి యాజమాన్యం వహించి

నడుపుతుండేవారు. పైన పేర్కొన్న వెంకటా చలపతయ్య ప్రభృతులను తన సహచరులుగా చేసుకొని, జాతీయ భావాలను నాటారు.

ఆ గ్రామంలో ప్రథమ కమ్మ మహాజనసభ జరిపిన ఘనత రెడ్డిగారిదే. కమ్మవారిలో చైతన్యం కలుగుటకు రెడ్డిగారు ఈ సభలకు అంకురార్పణ చేశారు.

పెదకళ్ళేపల్లిలో జరిగిన ఈ కృష్ణామండల సభకు ఆ గ్రామ కాపురస్తుడే అయిన కొడాలి శివరామకృష్ణారావుగారు ఆహ్వాన సంఘాధ్యక్షుడు, వీరు ఈ మండల సభకు సంచార కార్యదర్శిగా పనిచేసి యుండిరి. ఈయన అపుడు ఆంధ్ర వారపత్రికకు సహాయ సంపాదకుడుగా వుంటున్నారు. హంపి క్షేత్రకవి కీ॥ శే॥ కొడాలి సుబ్బారావుగారు వీరి కుమారుడే. ఎంతో భవిష్యత్తు కలదనుకొనిన ఈ సుబ్బారావు గారు చిన్నతనముననే స్వర్గస్థులగుట ఆంధ్రదేశ దురదృష్టము.

సభా అధ్యక్షుడు రైతు, జాతీయవాది, అనుభవజ్ఞుడు అగుటవల్ల జిల్లాకు సంబంధించిన అవసరాలను అన్నిటిని తన అధ్యక్షోపన్యాసములో చర్చించి జమీందారీలు రద్దుకానిది, రైతులు, దేశం బాగుపడదని హెచ్చరించెను.

వేమూరి రత్నయ్యగారితో కలిసి నేను ఈ సభకుగాను మా గ్రామంలోను, చుట్టుప్రక్కల గ్రామాలలోను రెండువందల రూపాయలు వసూలుచేసి యిచ్చి ఈ సభలో జోక్యం పూర్తిగా తీసుకున్నాను. చలపతయ్యగారి ప్రోత్సాహంతో జమీందారీల రద్దును గురించిన తీర్మానమును చెరుకువాడ వెంకట నరసింహం పంతులుగారు ప్రతిపాదించారు. నేను దానిని బలపరచాను. కాని సభ్యులనుంచి ఆనాడు అట్టి భావాలకు తగినంత ప్రోత్సాహం రాలేదు. కొంత తర్జన భర్జనల అనంతరం ఆ తీర్మానాన్ని గూర్చిన చర్చ మరుసంవత్సరానికి వాయిదా వేయడం జరిగింది. ఈ సభకు వచ్చిన ప్రతినిధుల, ప్రేక్షకుల భోజన వసతికి విడిదికి చల్లపల్లి జమీందారు శ్రీమంతు రాజా యార్లగడ్డ మల్లిఖార్జునప్రసాద్ నాయుడుగారు, వారి భవనాలను వశపరచుటయే గాక, వారి ఉద్యోగులను నౌకర్లను సహితం సహాయంగా యిచ్చి వుండిరి. ఇంతేకాదు, వారి ఉద్యోగులను నౌకర్లను సహితం సహాయంగా యిచ్చి వుండిరి. ఇంతేకాదు, ఆ మూడురోజులకు కావలసిన కూరగాయలు, పెరుగు, పాలు వగైరాలను సప్లయి చేయుటే గాక, కొంత ధన సహాయమున్ను చేసి ఉండిరి. తమ ఎస్టేటు గ్రామంలో యీ మహాజనసభ దిగ్విజయంగా జరగాలని, యీ సభకు వచ్చు పెద్దపిన్నలకు షడ్రసోపేతంగా విందులు జరగవలెనని చెప్పి అందులకు సర్వ సహాయములను చేసి ఉండిరి.

శ్రీ మల్లిఖార్జున ప్రసాద్‌నాయుడుగారు అప్పటికే వృద్ధులు. మంచి పరిపాలనాదక్షులు. లోకజ్ఞానమునకు వారికి సాటి అయిన వారుండుట అరుదు. లోకజ్ఞానము మూర్తీభవించిన మూర్తి అని వారిని శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు ప్రశంసించారు. ఒక సందర్భమున ఈ



సమావేశములో చర్చకు వచ్చిన "జమీందారీ రద్దు" తీర్మానమును గూర్చిన సంగతి సందర్భములను తెలుసుకుని, తన సన్నిధాన వర్తనులతో "ఏమిటయ్యా, మహాజనసభలు జరపటానికి మనం అష్టకష్టాలుపడి అన్ని సహాయాలు చేస్తే, మనకే ఎసరుపెడుతున్నారేమిటి, మన ఇంట్లోనే తిని మన ఇంటి వాసాలు లెఖ్ఖపెట్టినట్లుగా ఉన్నది" అని నవ్వుకున్నట్లు విన్నాను. మనము స్వంతంగా సాగుచేసుకునే భూములు మాత్రమే మనకుంటవిగాని, ఈ జమీందారి ఎపుడు లాక్కునేదే అని వారు అంటూ వుండేవారుకూడ. భారతదేశ మంత్రి మాంటాగు, భారతదేశపు రాజప్రతినిధి చెమ్సుఫర్డు కలిసి చేసిన రాజకీయ సంస్కరణలు అసంతృప్తికరములు. నిరాశజనకములు అనే కాంగ్రెసు తీర్మానాన్ని అంగీకరించడం, రాజుగారి ప్రకటన (Kings prociamation) అసంతృప్తికరమని తీర్మానం చేయడం ముఖ్యతీర్మానాలు.

డాక్టర్ పట్టాభి సీతారామయ్య పంతులుగారితో ఎక్కువ సన్నిహితంగా మాట్లాడే అవకాశం ప్రథమంగా పెదకళ్ళేపల్లిలోనే నాకు కల్గింది. అప్పటికే పట్టాభిగారు రాజకీయంగా అతివాదులుగానే పరిగణించబడుతున్నారు. కాని ఆనాటి ఆయన వేషం – ధోవతి, మోకాళ్ళ కిందవరకు పొడువాటి కోటు (Closed neck long coat) జరీ తలపాగ, వల్లెవాటు వుత్తరీయం, చేతికర్ర. ఇది మితవాదుల వస్త్రధారణ పద్ధతి. అది తలగుడ్డల యుగం. వారి స్నేహితులు సహచరులు పెద్దలు, కాంగ్రెసులో మితవాదులైన న్యాపతి సుబ్బారావు, మోచర్ల రామచంద్ర రావు, బయ్యా నరసింహేశ్వర శర్మ, వేమవరపు రామదాసు పంతులు ప్రభృతులు. ఆ పెద్దల వలెనే బహు ప్రజ్ఞతో కూడిన వాదనకు తోడు అంకెల నెన్నిటినో క్రోడీకరిస్తూ, తేదీలతోకూడా అనర్గళమైన వాగ్ధోరణితో, ఎదుటివారు ఎంత ప్రతిభావంతులైనా వారిని నిరుత్తరుల జేయగల ప్రతిభ గలవారు పట్టాభిగారు. వారి ఉపన్యాసం అందరిని ముగ్ధులను చేసింది.

ఈ కాన్ఫరెన్సు పూర్తి అయిన తర్వాత శ్రీ కాళేశ్వరరావు పంతులు, చలపతయ్య గార్లను నేను ఘంటసాలకు తీసుకువెళ్ళి వారిచేత బహిరంగసభలో రాజకీయాలు – ప్రజల కర్తవ్యం గురించి వుపన్యాసాలిప్పించి, వారిని గౌరవంగా పంపించాను. అయ్యదేవర కాళేశ్వరరావు పంతులుగారు బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడుగారి శిష్యులే. ఆయన (వెంకటరత్నం నాయుడు) వెనుకముందు చూడని త్యాగమూర్తి. మహాత్ముని కార్యక్రమమునకు ముందే అంటరాని తనమును నిర్మూలించుట కర్తవ్యంగా నెంచిన సంఘసంస్కర్త, దేశభక్తుడు. చాలా స్వతంత్రుడు, పరమపూజ్యుడు.

## కృష్ణాజిల్లా జాతీయవాదుల సభ

1920 ఆగష్టు ఒకటవ తేదీన బెజవాడలో శ్రీ మాడపాటి వెంకటేశ్వరరావు టౌన్ హాలులో కృష్ణాజిల్లా జాతీయవాదుల సభ జరిగింది. నేటి పశ్చిమగోదావరిజిల్లా ఆనాటి కృష్ణాజిల్లాలోనే కలిసివుండేది. ప్రజాప్రతినిధిగా నేను సభకు హాజరైనాను.

మేమందరం హాలులో సమావేశమయ్యేసరికి భారత రాజకీయ రథచోదకుడు, పరమ పూజ్యుడు, భారత ప్రజల ఆశాజ్యోతి అయిన లోకమాన్య బాలగంగాధర్ తిలక్ అస్తమించినట్టు పత్రిక ద్వారా తెలుసుకొని, నిస్పృహ, నిరుత్సాహపూరిత హృదయాలతో సభను మరుసటికి వాయిదా వేసుకుని దుఃఖాశ్రువులతో అక్కడ నుంచి నిష్క్రమించాము.

మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ గారు తమ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించడానికి నిర్ణయించిన తేదీకూడ ఆగస్టు ఒకటే, గాంధిగారు తిలక్‌గారి స్థానే ప్రధాన నాయకుడవుతాడనే అభిప్రాయం ఆనాటికి ప్రజలలో లేదు.

1920లో జరిగే మద్రాసు చట్టసభకు అభ్యర్థులను నిర్ణయించడానికై ఆ సమావేశం జరిగింది. బారిష్టర్ కందుల వీరరాఘవస్వామి నాయుడుగారు ఆ సభకు అధ్యక్షత వహించారు. వారి ముఖ్య సలహాదారు బులుసు సాంబమూర్తిగారు, బారిష్టరు టంగుటూరి ప్రకాశం పంతులుగారు కూడా ఆ సభకు హాజరయ్యారు.

ఆనాడు వీరందరు సిల్కు సూట్లలో వున్నారు, అప్పటికి ఖద్దరు ఇంకా జాతీయ దుస్తులుగా రూపొందలేదు. ఆనాటి జాతీయవాదుల వస్త్రధారణ స్వదేశి మిల్లు వస్త్రాలతో కూడినదే.

కృష్ణాజిల్లాకు చెందిన అయ్యదేవర కాళేశ్వరరావు పంతులు, కానూరి వెంకటా చలపతయ్య, గంపలగూడెం కుమారరాజా, పింగళి లక్ష్మీనారాయణగార్లు ప్రధాన వక్తలుగా వున్నారు.

## మోచర్ల రామచంద్రరావు పంతులుగారు

1906కు పూర్వమే "ఆంధ్ర భీష్మ" న్యాపతి సుబ్బారావు పంతులు, బయ్యా నరసింహేశ్వరశర్మ మోచర్ల రామచంద్రరావు పంతులుగారలు ఆంధ్ర నాయకత్రయంగా అఖిల భారత వర్గంలో ప్రసిద్ధిగన్నవారు.

కేంద్ర, రాష్ట్ర, (ఢిల్లీ, మద్రాసు) శాసనసభల చర్చలలో చురుకుగా పాల్గొంటూ అనేక అంకెలను క్రోడీకరిస్తూ, ప్రభుత్వ వాదనలను ఖండిస్తూ రైతు సమస్యలకు ప్రాముఖ్యత నిస్తూ – ఆంధ్ర ప్రజల ప్రశంసలను శ్రీ రామచంద్రరావు పంతులు అందుకున్నారు. ఈయన శాంతమూర్తి, నిరాడంబరులు. చిన్నవాళ్ళను సయితం చాలా ఆప్యాయతతో ప్రేమతో గౌరవించి సంభాషించే సౌమ్యుడు.

వీరు దక్షిణదేశ గోఖలేగా ప్రతిష్ట నార్జించుకున్నారు. రైతు సమస్యలను కూలంకషంగా చర్చించడం చేత "రైతు బాంధవుడు"గా ప్రజలు గౌరవించారు. 1920 నాటికి ఈయన కాంగ్రెసులో మితవాద శ్రేణికి చెందినవారు. ఈనాటి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలు 1927 నాటికి పూర్వం స్థానిక సంస్థల వ్యవహారాలలో కృష్ణాజిల్లాగా పరిగణింపబడేవి,



ఆనాటి కృష్ణాజిల్లా బోర్డుకు ప్రథమ ప్రజాప్రతినిధి అయిన అదృష్టవంతుడు వీరే. ఆనాటి మదరాసు ప్రభుత్వం, ఈయనను ఒక రాయబారవర్గంలో సభ్యుడుగా ఇంగ్లండుకు పంపి, మూడు మీటింగులకు హాజరు కాలేదనే నెపంతో ఆ ప్రభుత్వమే ఈయన సభ్యత్వాన్ని రద్దుచేసి, తిక్కాని బాలాజీరావు నాయుడుగారిని ఈయన స్థానే అధ్యక్షునిగా నియమించింది. కాంగ్రెసు కార్యకలాపాలలో ఈయన మితవాదే అయినా ప్రభుత్వం వీరి విమర్శల్ని హర్షించక ఈయనను బాధ్యతగల పదవుల నుంచి తప్పించడానికి ప్రయత్నించేదనడానికి ఇది నిదర్శనం.

1920 సంవత్సరపు చట్టసభ అభ్యర్థుల ఎన్నికలకు ప్రచారం ప్రారంభమైనది. మోచర్ల రామచంద్రరావు పంతులుగారు తాము అభ్యర్థిగా నిలుస్తున్నట్టు, ఓట్లు ఇప్పించ వలసినదిగా నాకు ఉత్తరం వ్రాశారు. దానికి సమాధానంగా మాంటుఫర్డు సంస్కరణలను గురించి కాంగ్రెసు తీర్మానం, దానికి భిన్నంగా మితవాదుల తీర్మానం – ఈ పరిస్థితులలో మీ భావాలేమిటో విశదపరచవలసినదిగా ఉత్తరం వ్రాశాను. మా ప్రాంతానికి వచ్చినపుడు నన్ను కలుసుకొని నా సందేహాలు తీర్చగలమని వారు సమాధానంగా వ్రాశారు.

## పింగళి వెంకయ్య

వారు దివితాలూకా పర్యటనకు వచ్చినపుడు పింగళి వెంకయ్యగారిని, నన్ను చల్లపల్లికి పిలుచుకు రావలసినదిగా ఘంటసాలకు పంపారు.

మాకు నాలుగుమైళ్ళ దూరంలో వున్న యార్లగడ్డ కరణం హనుమంతరావు గారి కుమారుడు ఈ వెంకయ్యగారు. వీరు అతివాదులలో ఒకరు. 1916లో భారతదేశానికి ప్రత్యేకంగా ఒక జెండా ఆవశ్యకత గురించి పుస్తకం వ్రాసి ప్రచురించారు. (A National flag of India) ఈ విషయమై 1917 కలకత్తాలో శ్రీమతి అనిబిసెంటుగారి అధ్యక్షతన జరిగిన సభలో ఉపన్యసించారు.

వారితో కలిసి చల్లపల్లి వెళ్ళి రామచంద్రరావుగారికి నమస్కరించాను. వారు నన్ను చూచి వెంకయ్యగారితో బ్రహ్మయ్యగారు ఏరి?" అని అడిగారు, "వీరే బ్రహ్మయ్యగారు" అని నన్ను చూపి పరిచయం చేశారు వెంకయ్యగారు. "మీ వూళ్ళో మరొక బ్రహ్మయ్య గారున్నారా?" అన్నారు. అందుకు నేను నవ్వి "మీకు ఉత్తరం వ్రాసింది, సమాధానం అందుకున్నది నేనే, రాజకీయాలలో మరొక బ్రహ్మయ్య లేదు" అన్నాను. అప్పుడు వారు 'మీరు అన్యథా భావించవద్దు. నా ఉత్తరానికి మీరు వ్రాసిన సమాధానాన్ని నేను శ్రద్ధగా చదువుకున్నాను. ఆ ఉత్తరాన్ని బట్టి మీకు ముప్పయి, ముప్పయి అయిదేండ్ల వయస్సు వుంటుందని అంచనా వేశాను. మీరు ఇంత చిన్నవారని నేను అనుకోలేదు" అని ఆప్యాయతతో సంభాషణ సాగించారు.

కొంతసేపయిన తర్వాత వారిని మా వూరుకు రమ్మనమని ఆహ్వానించాను. వారితో బందరు తాలూకాబోర్డు అధ్యక్షులు శెజింబి హనుమంతరావు పంతులుగారు కూడా వున్నారు. అది వర్షాకాలం, మా వూరికి మట్టిరోడ్డు కూడా లేదు, బళ్ళు రావడానికి కూడ సరయిన సౌకర్యం లేదు. వారు వస్తామని నిర్ణయించిన రోజున రెండు మేనాలు పంపాను. ఎదురేగి వారికి మంచి స్వాగతం యిచ్చాను. మూడువేల మంది చుట్టుప్రక్కల గ్రామప్రజలను కూడ సభకు హాజరయ్యేట్టు చేశాను. స్వాగతపత్రం సమర్పించి చాలా గౌరవించాను.

## మా ఊరికి చప్టా

తర్వాత మా స్వాగత సన్మానాలకు ఆనందం వెల్లడిస్తూ, తాను జిల్లాబోర్డు అధ్యక్షులైన కారణం చేత మా వూరికి కావలసిన సౌకర్యాల గురించి నన్ను ప్రశ్నించారు. మా వూరికి తూర్పున గంజికాలువకు సత్తులు దిబ్బ వద్ద ఒక చప్టా కట్టించవలసినదిగా మా నాయనగారు డిప్యూటీకలెక్టరుకు పెట్టిన మహజర్ అర్జీ నాకు గుర్తుకు వచ్చింది. వెంటనే వారికి ఆ చప్టా నిర్మాణాన్ని గురించి అడిగాను. "అందుకు అయ్యేఖర్చులో సగం వంతు మీరు ఇవ్వగలరా" అని వారన్నారు. నాలుగవ వంతు ఇవ్వగలమని నేను చెప్పాను. అప్పటికప్పుడే వారు వెంటనున్న అసిస్టెంటు ఇంజనీరు తంగిరాల సూర్యనారాయణగారిని పిలిచి సుమారు ఎంతవుతుందన్నారు. ఆరువేలు కావచ్చునని వారు చెప్పారు. సరే, 1,500 రూపాయలు మీరు కట్టండి, జిల్లా బోర్డు తరపున ఆ చప్టా వేయిస్తామని వారన్నారు. కంట్రిబ్యూషన్ కట్టి పనులు చేయించుకోవడం అదివరలో మా గ్రామానికి అలవాటు లేదు. మా గ్రామానికే కాదు. పల్లెటూళ్ళకే లేదు. ఇదే ప్రథమం.

ఈ అవకాశం నా ద్వారా కలిగినందుకు నా సమయస్ఫూర్తికి మావూరి పెద్దలు నన్ను మిక్కిలిగా ప్రశంసించారు. వెంటనే మా గ్రామస్తులకు చెందిన చిట్టూరు, బోళ్ళపాడు భూములపై చందాలు వేసి జిల్లా బోర్డు ఆఫీసులో పైకం జమకట్టడం జరిగింది. చప్టాకు కావలసిన కొండరాయి, కంకర గ్రామస్తుల సొంతబళ్ళతో తోలుకు వచ్చినందున వేరే కాంట్రాక్టరుతో నిమిత్తం లేకుండా గ్రామస్తులు ఈ చప్టాను సమిష్టిగా నిర్మాణం చేయడానికి అంగీకారం కుదుర్చుకున్నాము. దీనిలో ఛైర్మన్ వెంకయ్యగారు వారి తమ్ములు గోపాలుడు, సుబ్బయ్య, లక్ష్మయ్యగార్లు నాకు హెచ్చుగా తోడ్పడినారు. గ్రామంలో అదివరకు కుర్రవానిగా చూడబడిన నేను కొంత దక్షత గల వ్యక్తిగా గుర్తింపబడ్డాను. నాకు పలుకుబడి పెరిగింది.

మరొక చప్టా గంజి కాలువమీద బోయీల కట్టవద్ద అక్కడ భూములు కలవారు నన్ను కోరడం, బందరు తాలూకా బోర్డు అధ్యక్షులగు శెజింబి హనుమంతరావు పంతులుగారితో నేను మాట్లాడి మూడవవంతు డబ్బును ఇచ్చి, రెండవ చప్టాను నిర్మించడం జరిగింది. ఇది కూడా కాంట్రాక్టరుతో నిమిత్తం లేకుండా ఆ భూములు గల రైతులు



గొర్రెపాటి నరసన్నగారి కుమారుడు వెంకయ్య రంగన్నగారి కుమారులు గోపాలకృష్ణయ్య, తలసిల బసవన్న, నా సహచరులు గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, చిన నరసింహం మొదలయిన వారు బాధ్యత వహించి పనిచేశారు. ఇది 1923లో జరిగింది.

1920వ సంవత్సరములో మా గ్రామంలోని బోర్డు ప్రాథమిక పాఠశాలలో విద్యా బోధన సక్రమంగా లేదని, మా గ్రామపెద్దలు భావించి, నన్ను, పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారిని ఉపాధ్యాయులుగా చేరమని ప్రోత్సహించారు. అప్పుడు బందరు దివి తాలూకాకు ఒకే తాలూకాబోర్డు. అధ్యక్షుడు శెడింబి హనుమంతరావు పంతులుగారు. మేమిద్దరం ఉద్యోగాలకు దరఖాస్తులు పంపాము. మోచర్ల రామచంద్రరావు పంతులుగారితో కలిసి హనుమంతరావు పంతులుగారు మా గ్రామం వచ్చారు. రాత్రి భోజనాల సమయంలో రామచంద్రరావు పంతులుగారు నన్ను "మంచి ఆర్గనైజరు, అభివృద్ధికి రాగల సూచనలు గలవాడు" అని ప్రశంసించగా "ఆయన స్కూలు మాష్టరుకు దరఖాస్తు చేశాడు. నేను ఇవ్వాలనుకుంటున్నాను" అని హనుమంతరావుగారు చెప్పారు. "భవిష్యత్తులో అక్కరకొచ్చే కుర్రవాణ్ణి ఉపాధ్యాయ వృత్తిలో పెట్టి పైకి రాకుండా చెడగొట్టడం అవుతుందని" పింగళి వెంకయ్యగారన్నారు.

వారికి వద్దన చేస్తున్న ఉపాధ్యాయులు ఈ విషయమంతా విపులంగా మాతో చెప్పారు. నేను, పండిత వెంకటసుబ్బయ్య బాగా ఆలోచించుకొని ఈ ఉపాధ్యాయ వృత్తిలో చేరడం మంచిది కాదని నిర్ణయానికి వెంటనే వచ్చాము.

రామచంద్రరావు పంతులుగారితో మా గ్రామచప్టాను గురించి సంభాషణ జరుపుతున్నప్పుడే హనుమంతరావు పంతులుగారు "నీవు స్కూలు మాష్టరుకు దరఖాస్తు చేశావు కదా – నీ కివ్వ నిశ్చయించుకున్నాను. ఎప్పుడు చేరతావు?" అని అడిగారు. అప్పుడు నేను మా స్కూలు పరిస్థితులు వారికి వివరించి, స్కూలు మాష్టరుగా చేరకుండా వుండడానికే వచ్చిన నా నిర్ణయాన్ని తెలుపుతూ సరయిన ఉపాధ్యాయులను నియమించి స్కూలు పరిస్థితులను చక్కదిద్దవలసిందిగా అర్థించాను. అట్లుగా వారు చేశారు.

## వల్లూరి సూర్యనారాయణగారు

ఈయన మొదట ఉపాధ్యాయవృత్తిలో వుండి తరువాత ప్లీడరీవృత్తికి మారినారు. చాల నిరుపేద కుటుంబంలో వుండి, ఈయన స్వయంకృషివల్ల ఉన్నత స్థితికి వచ్చిన ప్రముఖుడు. మహా సమర్థుడైన న్యాయవాది. ఆయన వృత్తి ప్రారంభించిన నాటి నుంచి న్యాయ నిర్ణయానికే కంకణధారియై న్యాయాధిపతులను సయితం లెక్కపెట్టకుండా విమర్శించేవారు. ధర్మసంస్థల సంబంధంలో ఉచితంగానే వాదన చేసేవారు. మా ఘంటసాల ధర్మగోటక వ్యాజ్యం ప్రారంభ మయ్యేనాటికి ఆయన ప్రాక్టీసు ప్రారంభదశలోనే వున్నది. చాలాకాలం ఆయన చాలా

కష్టపడి కేసులో జయం పొందడానికి సర్వశక్తులను వినియోగించారు. అప్పుడు మా నాయన గారు ఫీజును గురించి అడుగగా "అప్పుడు నేను చిన్న ప్లీడర్ని. ఇప్పుడు పెద్ద ప్లీడర్ని అయ్యాను. నా రాబడికూడా చాలా పెరిగింది. మీరేమీ ఇవ్వనక్కరలేదు. మీరూ ఈ ధర్మకార్య నిర్వహణకు చాలా కష్టనష్టాలు పడ్డారని నాకు తెలుసు" అని చెప్పారు. కాని ఏదో కొంత చిన్న మొత్తమైనా తీసుకోవలసిందిగా కోరి వందరూపాయలను బలవంతాన యివ్వడం జరిగింది.

ధనార్జన ఎక్కువైనా ఆయన కుటుంబఖర్చులు, సొంత ఖర్చులు చాలా మితంగా వుండేవి. గుర్రపు బండి ఎక్కువ ఖర్చు అవుతుందని, మనిషి లాగేరిక్షా పెట్టుకున్నారు. అదే బందరులోని మొదటి రిక్షా, మేము ప్రతి రోజూ నోబుల్ హైస్కూలుకు వెళ్ళేది. వారింటి ముందునుంచే అవడం చేత ప్రతినిత్యం వారి దర్శనభాగ్యం మాకు సిద్ధించేది ఈయన లోకమాన్య బాలగంగాధర్‌తిలక్‌ను తన రాజకీయగురువుగా పరిగణించి, ఆయన అడుగు జాడలలో నడిచేవారు. ఈయన సూరత్ కాంగ్రెసులో తిలక్‌గారి అతివాద శిబిరంలోనే వున్నారు. "కృష్ణాపత్రిక" నిర్వహణలోను, "ఆంధ్ర జాతీయ కళాశాల" పరిపాలనలోను తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెసు నిర్వహణలోను వారు గుప్తంగా దానాలు చేసేవారు. ప్రథమంలో కాంగ్రెసు ప్రచారకుని నెలకు యాభై రూపాయల వేతనం మీద నియమించడానికి ఈయన ఆర్థిక సహాయం చేశారు. ఈయన నిర్మొగమోటంగా ఏ విషయం మీద అయినా సరే తన భావాలను వెల్లడించేవారు.

ఒకప్పుడు ఒక డిప్యూటీ మేజిస్ట్రేటును గురించి లంచగొండితనం ఆరోపించబడ్డ 'ఆఫిడవిట్టును' దాఖలు చేయడానికి ఎవ్వరు ముందుకు రానప్పుడు, ఈయన దాఖలుచేసి కొన్ని కష్టనష్టాలకు లోనయ్యారు. ఈయన మీద పెట్టబడిన కేసు ఈయనకు అనుకూలంగానే తీర్పుచెప్పబడింది.

డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు అంటూ వుండేవారు. "నేను ఎవరికీ జడవను – ఒక్క వల్లూరి సూర్యనారాయణగారికే జడుస్తాను. ఏదైనా లోపం నాలో వుందని ఆయన తలిస్తే నా ముఖం ఎదుటే అంటూ నా సమాధానాన్ని కోరతాడు ఆయన్నెప్పుడు దృష్టిలో వుంచుకొని మాట్లాడతాను"

ఈయన దేవాలయ, ధర్మాదాయ సంస్థలకు సంబంధించిన వ్యవహారాలను ఏమీ డబ్బు పుచ్చుకొనకుండానే ఉచితంగా వాదన చేసేవారు. అట్టి సంస్థల గురించి న్యాయం కోసం వేసే దావాలకు ఆర్థిక సహాయం కూడా చేసేవారు. దేవాలయ, ధర్మాదాయ బిల్లు నిర్మాణానికి ఈయన కృషి చాల అమూల్యమైనట్టిది. మహాత్ముని కోర్టుల బహిష్కరణకు ఈయన వ్యతిరేకి. ఈయన చెప్పిన కారణం "ఈ ధర్మాలయ సంస్థలకు నాబోటి న్యాయవాది అవసరం."



తన వృద్ధాప్యంలో తన కుమాళ్ళను పిలిచి "నా తండ్రి నాకు చెప్పించిన విద్య కంటే నేను మీకు విద్యాబుద్ధులు చెప్పించడంలో, మంచి సంబంధాలను తీసుకు రావడంలో, మంచి ఉద్యోగాలలో మిమ్మల్ని నిలపడంలో హెచ్చు శ్రమపడ్డాను. మీరు ఉన్నతమైన స్థితిలోనే నేడు వున్నారు. నా తండ్రి నాకేమి ఆస్థి ఇవ్వలేదు. నా ఆస్థిని కూడా మీరు ఆశించడం న్యాయంకాదు. నాకువున్న యావదాస్థినీ (ఆ రోజులలో లక్షరూపాయల విలువగలదాన్ని) కొవ్వూరులోని "ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠానికి దానం చేస్తున్నాను మీరు ఆనందించండి" అని చెప్పారు.

కొవ్వూరులో తాను నివసించడానికి నిర్మించుకున్న డాబాలో, తాను తనభార్య నివసించి వున్నంతకాలం తన బిడ్డలు వచ్చి వుండవచ్చునని, తమ ఇరువురి అనంతరం ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠానికి చెందేటట్లు విల్లు వ్రాశారు. అది చెల్లుబడి అయింది. ఆయన జ్యేష్ఠ కుమారుడు చిన్నతనంలోనే చనిపోవడం తటస్థించింది. ఆయన కోడల్ని పిలిచి, "నీవు పునర్వివాహం చేసుకోవడానికి నేను అనుమతిస్తున్నాను. చేసుకోవలసింద"ని కోరగా ఆవిడ అందుకు అంగీకరించలేదు. ఈ కారణాన ఆవిడకు బి.ఏ. ఎల్.టి. వరకు చదువు చెప్పించి, ఉపాధ్యాయవృత్తిలో పెట్టి తన ధర్మం నెరవేర్చుకున్నారు.

ఆయన ధనాన్ని రెండు చేతులతో ఆర్జిస్తూ ధర్మ సంస్థల నిర్వహణను అసిధారా వ్రతంగా పాలిస్తూ, దేశాన్ని ప్రేమిస్తూ, జాతీయసంస్థలకు భూరి విరాళాలను ఇస్తూ స్వరాజ్య సంరంభానికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహాయంచేస్తూ ఆదర్శప్రాయుడైన వ్యక్తిగా ప్రశంసింపబడ్డారు.

ఈ వల్లూరి సూర్యనారాయణరావుగారు కాంగ్రెసు ఆదేశానుసారం, "తిలక్ స్వరాజ్య నిధి" వసూళ్ళకు వేమూరి రామచంద్రరావుగారితో మా గ్రామం వచ్చారు. ఆనాడే మా జమీందారుకు వ్యతిరేకంగా తాను వ్యవహరించి ధర్మసొత్తుగా నిలిపిన గోటకాన్ని వెళ్ళిచూచి దాన్ని పొరుగు రైతులు ఆక్రమించుకొనకుండా జమీందారు మళ్ళీ దీని ఆక్రమణకు పున్నప్రయత్నాలు చేయకుండా ఒక సంస్థ నిర్మాణం అవసరమని భావించి, ఘంటసాల ప్రజలనందరిని బహిరంగంగా సమావేశపరచి ఘంటసాలలో గోటకసంఘ నిర్మాణం చేశారు. దీని ప్రథమాధ్యక్షుడు గొర్రెపాటి గోపాలకృష్ణయ్య, ప్రధానకార్యదర్శి వానపాముల లక్ష్మీనారాయణగార్లు తర్వాత ఈ సంఘానికి నేను కార్యదర్శిగా, అధ్యక్షుడుగా వ్యవహరించాను.

చల్లపల్లి ఎస్టేట్ దివాన్ ధర్మగోటకాన్ని స్వాధీనపరచుకోవడానికి ప్రయత్నించడంలో మా గ్రామ పెద్దలను తీసుకొని నేను కొవ్వూరు వెళ్ళి సూర్యనారాయణ పంతులుగారి అతిథిగా వుండి వారి సలహా సంప్రతింపులను పొందాను.

## అఖిల భారత కాం[గ్రెసు

దేశీయుల కష్టనివారణకై 1885న జాతీయ మహాసభ (కాం[గ్రెసు) ఏర్పడింది. [ప్రథమంలో అది ఆంగ్ల విద్యాధికుల [ప్రయోజనాలను అర్థిస్తూ, రాజభక్తిని వెల్లడిస్తూ [ప్రభుత్వం వారి దయాదాక్షిణ్యాలకు లోబడి వున్నది.

వంగీయుల దేశభక్తిని, ఆత్మ గౌరవాన్ని, చైతన్యాన్ని నాయకత్వాన్ని చూచి సహించలేక రాజ[ప్రతినిధి కర్జన్ [ప్రభువు మత [ప్రాతిపదికమీద వంగదేశాన్ని రెండుగా 1905లో చీల్చాడు.

ఈ వంగ విభజనకు వ్యతిరేకంగా లాలా లజపతిరాయ్, బాలగంగాధర్ తిలక్, బిపిన్ చం[ద్రపాల్ నాయకత్వాన స్వాతం[త్రోద్యమం [ప్రారంభమయింది. దీనినే "లాల్, బాల్, పాల్" యుగమన్నారు. ఈ [త్రిమూర్తుల నాయకత్వాన వంగ, మహారాష్ట్ర, పంజాబులలో స్వాతం[త్రోద్యమం పెచ్చు పెరిగినది. [ప్రభుత్వంవారు దమననీతి హెచ్చిన కొద్దీ [ప్రజలలో ధైర్యసాహసాలు పెరిగాయి.

శాసనబద్ధమైన ఆందోళనను అరికట్టడంవల్ల, కొందరు యువకులు దౌర్జన్య పద్ధతిని అవలంబించి, బాంబుల ద్వారాను, తదితరంగాను [ప్రజాకంటకులయిన ఆంగ్ల ఉద్యోగులను హతమార్చజొచ్చారు. కుదిరాంబోసు మొదలైనవారు దీనికి నాయకులు.

[బిటిష్‌వారి రాజనీతి బహుచతురమైనది. విభజించి పరిపాలించడం వారికి వెన్నతో పెట్టిన విద్య.

1909లో మింటో-మార్లే సంస్కరణలను తెచ్చి మితవాదులను కొందరిని చేరదీసి, వారి సహాయ సంపత్తితో పరిపాలించసాగారు. కాని, దేశాల అశాంతి అధికమై దారుణ కృత్యాలకు కారణమవుతున్నది.

## [ప్రథమ [ప్రపంచ యుద్ధం

1914లో [ప్రథమ [ప్రపంచ సం[గ్రామం [ప్రారంభమయినది. [బిటిషువారికి సహాయం తిలక్‌గారు చేయనిరాకరించినప్పటికీ, ఆంగ్లేయులకు మోహన్‌దాస్ కరమ్ చంద్‌గాంధి, వారి న్యాయ[ప్రీతియందు విశ్వాసముగలవాడై సర్వవిధాల తోడ్పడినారు.

పాపిష్టి పరిపాలనతో సహాయనిరాకరణ చేస్తూ, మనం ఇట్టి నిర్మాణ కార్య[క్రమం ద్వారా అభివృద్ధి చెందుతూ, అహింసాత్మకంగా పోరాడి స్వరాజ్యాన్ని సంపాదించడం గాంధీ మహాత్ముని ఆశయం.

ఇది అధర్మానికి, ధర్మానికి జరిగే సం[గ్రామం. ఉద్యమాన్నిబట్టి నాయకులు ఉంటారు. దీనికి ఏకైక నాయకుడు గాంధీ మహాత్ముడు. ఈ కార్య[క్రమం వలన లాభాలు [త్రివిధాలు. [ప్రభుత్వాన్ని లొంగదీసి మనం కార్యసిద్ధి నొందడం, యుద్ధం మొదలైన దౌర్జన్యకాండ వలన జరిగే జననష్టాన్ని ఆపడం, నిస్పృహ చెందుతున్న భారతీయ శక్తిని పునరుద్ధరించడం.



ఈ శాంతి సమరంలో [స్త్రీపురుషు, పసిబిడ్డలాది అందరూ చేరవచ్చు. దీనిలో భారతీయులు అధికంగా ఇదివరకు కనివిని ఎరుగని పద్ధతిన దేశభక్తులయ్యారు.

జాతి రూపురేఖలనే మార్చారు. మహాత్ముడు నూతన జాతిని నిర్మించాడు. కనుకనే జాతిపిత అయ్యాడు.

ఈ ఉద్యమం వృద్ధి అవడానికి మహాత్ముని వ్యక్తిత్వం - ఆత్మశక్తి, సంకల్పసిద్ధి దేశనాయకుల సహాయ సంపత్తులును.

ఈ అవసర కాం[గ్రెసులో తీర్మానించిన తీర్మానాలు 1920 డిసెంబరులో సేలం విజయ రాఘవాచారిగారి అధ్యక్షతన నాగపూరులో జరిగిన కాం[గ్రెసులో ఏక[గీవంగ అంగీకరించారు. ఈ వామన మూర్తికి ఇంత శక్తి ఎట్లా వచ్చిందో అని అందరూ ఆశ్చర్యపోయారు.

## బెజవాడలో అఖిలభారత కాం[గ్రెసు సమావేశం

అయ్యదేవర కాళేశ్వరరావుగారి కృషి ఫలితంగా అఖిల భారత కాం[గ్రెసు కమిటీ సమావేశం 1921 మార్చి 31, ఏ[ప్రిల్ ఒకటవ తేదీలలో బెజవాడలో జరిగినది. ఇంతవరకు కాం[గ్రెసు కాని అఖిలభారత కాం[గ్రెస్ కమిటీ సమావేశం కాని ఆం[ధ్రదేశంలో జరుగనందున గాంధీమహాత్ముడు, దేశనాయకులు వస్తారని తలచి ఆం[ధ్రదేశం నుంచి మూడు లక్షల జనం తీర్థయా[త్రకు వచ్చినట్టు వచ్చారు. ఇంత జనం ఎప్పుడు ఆం[ధ్రదేశంలో ఏ తీర్థానికి రాలేదు. విజయవాడంతా ఇసుకవేసిన రాలకుండేట్టు జనం నిండారు. వీథుల నిండా, స[త్రాల నిండా, నదీ తీరాల నిండా, ఎక్కడ చూచినా జనమే.

ఆం[ధ్రదేశంలోని అన్ని [ప్రాంతాలనుంచి దేశభక్తి [ప్రపూరితులైన [ప్రజలు వచ్చి స్వాతం[త్య సమర సర్వసేనాధిపతి గాంధీమహాత్ముని సందర్శించి తక్కుంగల అతిరథ మహారథులను కళ్ళారా గాంచి పునీతులమైతిమని ఆనందించారు.

బెజవాడలో ఎక్కడ చూచినా అలంకారాలే. ఎక్కడ చూచినా కాం[గ్రెసు ప[త్రాలే. ఎందుబోయినా మంగళవాద్యాలే. ఎటువెళ్ళినా దేశభక్తి పూరిత జాతీయ గీతాలే. ఎక్కడ విన్నా జాతి పునరుద్ధరణను గురించి మహాత్ముని గూర్చి దేశనాయకుల [ప్రశంసలే. ఎవరిని చూచినా ఖద్దరుదారులే. బెజవాడంతా కన్నుల పండువుగా ఉత్సాహంతో పండుగ చేసుకున్నది.

ఆనాడు రాముడు అరణ్యం నుంచి అయోధ్య కరుదెంచినపుడు [ప్రజలెంత ఉత్సాహభరితులుగా వున్నారో, ఈనాడు ఆం[ధ్ర[ప్రజ బెజవాడలో అలా వున్నది. ఆనాటికి బస్సులు లేవు. లక్షలాది జనం రైళ్ళమీద నేల ఈనినట్లు వచ్చారు బెజవాడకు. బెజవాడ స్టేషనులో టిక్కెట్టు కలెక్టర్లుగా పోలీసువారు వుండికూడా, టిక్కెట్టు కొనని వారిని ఏమీచేయలేకపోయారు. ఆ లక్షలాది జనాన్ని ఆ సమయంలో ఏమి చేయగలరు?

ఆ జనసందోహంలో గాంధీజీకి అంగరక్షకులు షౌకతలీ, కోడేటి రాజుగారలు.

మహాత్ముడెంత అల్పకాయుడో షౌకతాలీ అంత వున్నతాకారుడు. తాను 144 ధిక్కరించడం కంటే తన పుట్టుకే దానిని ధిక్కరించినదని చమత్కరించాడు.

## దేశానికి గాంధీజీ నాయకత్వం ప్రారంభం

మహాత్ముని పిమ్మట షౌకతాలీ, ఆయన తల్లి సోదరుడు మహమ్మదాలి ప్రజలను ఆకర్షించారు. వారు ఖిలాఫత్తు నిధికై రూపాయనోట్లను అమ్మారు. షౌకతాలి "ఆంధ్రరత్న" గోపాలకృష్ణయ్యగారిని ప్రశంసిస్తూ "ఈ దేశంలో ముగ్గురు పిచ్చివాళ్లు ఉన్నారు. గాంధీ మహాత్ముడు, నేను, నీవు" అని పలికారు.

మహాత్ముడు వున్నచోటున మధ్యాహ్నం ప్రజలు గుమిగూడారు. ఆయన దర్శనానికై. ఆ జనం ఆరాటపడుతున్నది ఎంత చెప్పినా వెళ్ళలేదు. అంతట మహాత్ముడు ఆ అలజడి గ్రహించి చేసేది లేక ఆ ఎర్రటెండలో ఒక బల్లమీద నిలబడ్డారు. స్వరాజ్య కార్యక్రమాల నిర్వహణకు, పంజాబు హత్యలకు తోడు ఖిలాపత్ అన్యాయాన్ని కూడా జోడించారు. మహాత్మాగాంధీ, మౌలానా మహమ్మదాలీ షౌకతాలీ సోదరులు దేశమంతటా పర్యటించారు.

ఉద్యమ ప్రచారానికై మూడు నెలలో కోటి రూపాయలు తిలక్‌నిధి వసూలు చేయడానికి, కోటిమంది కాంగ్రెసు సభ్యులను చేర్పించడానికి, ఖద్దరు ఉత్పత్తికి 20 లక్షల రాట్నాలను ఏర్పాటుచేయడానికి 1921 మార్చి 31 ఏప్రిల్ ఒకటవ తేదీలలో విజయవాడలో జరిగిన అఖిలభారత కాంగ్రెసు సంఘం నిర్ణయించింది.

ఈ తీర్మానపు అర్థం "దేశబంధు" చిత్తరంజన్‌దాస్ "Men, Money and Ammunition" సైన్యం, ధనం, ఆయుధ సామగ్రి అని భావగర్భితంగా తెలిపారు. గ్రామస్థాయి నుంచి దేశం వరకు పోటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తూ ప్రతిష్టంభన కలిగించడానికి ఉద్యమాన్ని సాగించారు. దేశ మెల్లెడలా కల్లుదుకాణాల పికెటింగు, విదేశవస్త్ర బహిష్కరణ, ఉధృతంగా సాగినది. ప్రభుత్వ దమననీతి పెచ్చు పెరుగుతున్న కొలదీ, ప్రజలలో సంఘటనాశక్తి, ఐకమత్యం పెంపొందుతూ వచ్చింది.

మహాత్ముడు స్వరాజ్య సంపాదనకు అహింస, సత్యాలనే ఆయుధాలుగా నిర్ణయించి, ఎట్టి హింసాకాండనైనా అహింసాయుతంగానే ఎదుర్కొనవలెనని శాసించారు. శ్రీకృష్ణ జన్మస్థానాలను యాత్రాస్థలాలుగా మార్చ నుద్దేశించారు.

ఈ సమావేశానికి మహాత్మాగాంధీజీ, కస్తూరిమాత, అలీ సోదరులు వారి మాతృదేవిని, లాలాలజపతిరాయ్, చిత్తరంజన్‌దాస్, మోతీలాల్ నెహ్రూ, మదనమోహన మాలవ్యా, కేల్కార్, పటేలు సోదరులు, జమునాలాల్ బజాజ్, జవహర్‌లాల్ నెహ్రూ, బాబూ రాజేంద్ర ప్రసాద్, సరోజనీదేవి, సరళాదేవి చౌదరాణి, అబ్బాస్ తయాబ్జీ సౌకం అజ్మల్‌ఖాన్, డాక్టర్



అన్సారీ, అబ్దుల్‌కలామ్ ఆజాద్, డాక్టరు సత్యపాల్, డాక్టర్ కిచ్లూ, కాకాసాహెబ్, కలేల్కర్, శ్రీమన్నారాయణ అగర్వాలా, పురుషోత్తమదాస్ టాండన్, శ్యామసుందర చక్రవర్తి, ప్రొఫెసర్ గిద్వాని సేన్ గుప్త, మహాదేవ్ దేశాయి, దేవదాసు గాంధి, శంకర్‌లాల్ బ్యాంకర్, రాజగోపాలాచారి, కొండా వెంకటప్పయ్య, ప్రకాశం, సాంబమూర్తి, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, గొల్లపూడి సీతారామశాస్త్రి, డాక్టరు సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, పట్టాభి, ముట్నూరి యింకా చాలామంది పెద్దలు వచ్చారు.

ఆంధ్రదేశం నలుమూలల నుంచి వచ్చిన లక్షలాది ప్రజలను మొదటి రోజున సరిగా కూర్చోబెట్టడం చాలా కష్టమైనది. అప్పుడు మైకులు కూడా లేవు. ప్రజలకు నాయకుల దర్శనమే దుర్లభమైనది, సభ భగ్నమైనది. ఈ తొక్కుడులో ముగ్గురు మరణించారు. ఇదంతా చూచి గాంధీగారు స్థానిక నాయకులను మందలించారు.

అంతట కాళేశ్వరరావుగారు ఆంధ్ర రత్నాన్ని అర్థించారు. ఆయన చీరాల నుంచి తన ఆధ్వర్యం కింద వచ్చిన అయిదువందల "రామదండు"ను నియోగించి అన్ని ఏర్పాట్లు తెల్లవారేసరికి చేయించారు. ఆయన వాసాలు బాదులు తెప్పించి వాటిని పాతించి, అయిదు ప్లాట్‌ఫారాలు ఏర్పాటుచేసి ఈ వీధుల గుండా నాయకుల కార్లు చుట్టూ తిప్పించి వారెవరో ఆంధ్రప్రజలకు ఎలుగెత్తి చాటుతూ అందరికీ దర్శనభాగ్యం కలుగజేశారు. సభ జయప్రదంగా జరిగిన కారణాన ఇందుకు ముఖ్య కారకులైన దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారిని, వారి రామదండును, వారి కార్యకౌశల్యాన్ని అఖిల భారత పెద్దలు మిక్కిలిగా ప్రశంసించారు.

ఈ అయిదు ప్లాటుఫారాల దగ్గిర నాయక ప్రముఖులు ఉపన్యాసిస్తూ వుంటే తెనుగులో ఆంధ్రులు తర్జుమా చేశారు. షౌకతాలీ వుపన్యాసాన్ని "ఆంధ్ర రత్న", కేల్కార్ ఉపన్యాసాన్ని నాగేశ్వరరావు పంతులుగారు "దేశబంధు" చిత్తరంజన్‌దాసు ఉపన్యాసాన్ని శ్రీ కాళేశ్వరరావు పంతులుగారు, అనువదించడం నేను చూచాను.

శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులు, శ్రీ చెరుకువాడ నరసింహం, శ్రీ వి.ఎల్.శాస్త్రి ప్రభృతులు అనువాదకులలో వున్నారు.

## త్రివర్ణ పతాక

ఈ సమావేశంలోనే మనకు కావలసిన జాతీయ జెండాను గురించి అదివరకే శ్రమచేసి రూపురేఖలు దిద్దిన పింగళి వెంకయ్యగారిని గాంధీగారు సంప్రదించడం, శ్రీ వెంకయ్యగారు ఆంధ్ర జాతీయ కళాశాలలో చిత్రలేఖనా అధ్యాపకులయిన ఈరంకి వెంకటశాస్త్రిగారితో సంప్రదించి, ఎరుపు, తెలుపు, ఆకుపచ్చ రంగులతో చిత్రించి గాంధీగారికి ఇవ్వడం జరిగినది.

ఎరుపు హిందూ మతానికి, ఆకుపచ్చ మహమ్మదీయ మతానికి, తెలుపు మిగతా అన్ని మతస్థులకు అని ఊహించారు. కొంతకాలానికి శిఖ్కులు తమకు ప్రత్యేకంగా ఒక

రంగు కావాలనడం అందుపై అఖిల భారత కాంగ్రెసు వారు మతాలతో నిమిత్తం లేకుండా ఎరుపు బదులు కుంకుమపూవు రంగు – త్యాగానికి, తెలుపు – శాంతి, సత్యధర్మాలకు, ఆకుపచ్చ పాడిపంటలకు సౌభాగ్యానికి చిహ్నాలుగా రూపొందించారు.

పరిశ్రమకు చిహ్నంగా రాట్నం మొదటినుంచి మధ్య చిత్రించబడింది.

మనకు స్వరాజ్యం వచ్చిన తర్వాత ఈ రాట్నానికి బదులుగా అశోక ధర్మచక్రాన్ని చిత్రించి, కాంగ్రెసు జాతీయ పతాకనే అఖిల భారత ప్రభుత్వ పతాకంగా పండిత జవహర్‌లాల్ నెహ్రూ అప్పటి ప్రధానమంత్రి – అంగీకరించడం జరిగినది.

## హరిజనోద్ధరణ

ఈ సమావేశంలోనే కృష్ణాజిల్లాలో గుడివాడ కేంద్రంగా పెట్టుకొని హరిజనోద్ధరణ కొరకు తన సర్వస్వం అర్పిస్తున్న బ్రహ్మచారి గూడూరు రామచంద్రుడు గారితో హరిజన సమస్యను గురించి మహాత్ముడు దీర్ఘంగా సంప్రతించి, ఆయన కృషిని ప్రశంసించి, అఖిల భారత కాంగ్రెసు సంఘంచే భూరి విరాళాన్ని ఇప్పించడం జరిగినది.

రామచంద్రుడుగారు మహాత్ముని కారులోనే సభాస్థలికి వచ్చారు.

ఈ సభ కార్యానిర్వహణకు తోడ్పడడానికి ఆంధ్రదేశం నలుమూలల నుంచి కాంగ్రెసులో భక్తితత్పరితగల మహిళామణులు అసంఖ్యాకంగా వచ్చారు. ఉత్సాహవంతులైన వారు స్వచ్ఛంద సేవాదళంగా చేరి ప్రశంసనీయంగా పెద్దల ఆశీర్వచనలను పొందే తీరున తమ విధులను సక్రమంగా నిర్వర్తించి, ప్రశంసల నందుకున్నారు.

అందరిలోను మహాత్ముని ఆశీర్వచనల నందుకొన్నది మాగంటి అన్నపూర్ణ దేవిగారు.

## శ్రీమతి మాగంటి అన్నపూర్ణాదేవి

వీరిది పశ్చిమ గోదావరిజిల్లా, పోతునూరు. మాగంటివారు ఆంధ్రదేశంలోనే ప్రసిద్ధి గాంచిన వర్ధిష్ణులు. వీరి భర్త మాగంటి బాపినీడుగారు కాలిఫోర్నియాలో ఎం.ఎస్.సి. చదువుతున్నారు.

ఈవిడ మహాత్ముని పిలుపు విని తన్ను తాను దేశానికి అంకితం చేసుకున్న త్యాగమూర్తి.

మహాత్ముని సన్నిధిని తనకున్న విలువైన విదేశ చీరెలను దహనం చేసి తన వంటిమీద వున్న బంగారు నగలన్నిటిని మహాత్ముని కర్పించుకోవడం జరిగింది.

ఆంధ్రదేశంలోనే కాదు, భారతదేశంలోనే ప్రథమంగా ఇట్టి త్యాగం చేసినది ఈ అన్నపూర్ణదేవి గారే.



శ్రీమతి అన్నపూర్ణదేవిగారు 1927లో క్షయవాయధితో అస్తమించినపుడు మహాత్ముడు ఆవిడను గురించి వ్రాసిన ప్రశంసావాక్యాలు ఇవి:

"1921లో బెజవాడలో జరిగిన మహిళా సమావేశంలో ఖద్దరు వస్త్రధారిణియై సభావ్యవహారం ఉత్సాహంతో, దీక్షతో, శాంతంగా నడవడానికి తోడ్పడుతున్న సమయాన అన్నపూర్ణను ప్రథమంగా దర్శించాను. ఆనాటి సమావేశాన ఖద్దరు ధరించినది ఆమె ఒక్కతే. నాకు జ్ఞాపకం ఉన్నంతవరకు తన ఆభరణాలను, చేతి గాజులను, హారాలను మొట్టమొదట అర్పించినది ఆమే. ఆ మహాసభలో ఆమె నలుమూలలకేగి, ఆభరణాలను, కానుకలను ప్రోగుచేసి తెచ్చారు. నాటి నుంచి అసహాయోద్యమంలో పాల్గొంటూ తుట్టతుదకు తదర్థమై ఆత్మసమర్పణం గావించారు.

"ఆమె మరణం వలన భక్తురాలినే కాదు కేవలం పుత్రికనే కోల్పోయినట్టు భావిస్తున్నాను. భారతపురంధ్రులలో అనేకులను నా పుత్రికలనుగా భావించుకొనగల భాగ్యం నాకు కలదు. వారందరిలో ఆమె అత్యుత్తమురాలు. ఆమె నిశ్చల భక్తితో ఫలాపేక్ష వదలి, దేశసేవ కావించారు. ఆమె వలె యువతీ యువకులనేకులు దేశారాధనలో ప్రాణసమర్పణం కావించిన గాని భారతదేశం మరల పూర్వంవలె పవిత్రవంతమై స్వతంత్ర్యం కానేరదనడం నిస్సంశయం. అంత ధైర్యం, అంత చిత్తశుద్ధి, అంత దేశభక్తి కనబరచిన అన్నపూర్ణాదేవికి స్థానికంగా స్మారక చిహ్నాన్ని ఏర్పరచడం విధాయకం.

బెజవాడ కార్యసంఘ సమావేశానికి వచ్చిన అతిథులకు సకల సౌకర్యాలు చాల సంతృప్తిగా జరిపి, ఆంధ్రుల ఆతిథ్యాన్ని మిగతా రాష్ట్రాలవారు ప్రశంసించే తీరున వ్యవహ రించిన బెజవాడ, కృష్ణాజిల్లా పౌరులకు, ప్రధాన నాయకత్వం వహించిన పూజ్యులు అయ్యదేవర కాళేశ్వరరావు, అద్దేపల్లి వెంకట గురునాధ రామశేషయ్య శ్రేష్ఠి గారలు చిరస్మరణీయులు.

మన పిండివంటలు ఆవకాయ వగైరా పచ్చళ్ళు ఉత్తరాది సోదరులను ముగ్ధులను గావించాయి. వాటి రుచిని వారు ఈనాటికి మరచిపోకుండా ప్రశంసిస్తున్నారు.

ఆవకాయ రుచిని శ్రీ లజపతిరాయ్ వగైరా పంజాబువారు ప్రశంసించి అనుభవించగా, ఆ కారపు మంటకు శ్రీ చిత్తరంజన్‌దాసు ప్రభృత బెంగాలీ బాబులు హడలి పోయారు.

## చెరుకురసం వంటి చెరుకువాడ వారి ఉపన్యాసాలు

చెరుకువాడ వెంకట నరసింహంగారి మాతామహు స్థానం మా గ్రామం. ఆయన జన్మించినది మా గ్రామంలోనే. ఆయన పెద్దఅక్కగారిని మా వూరిలోనే యిచ్చారు. నా చిన్ననాటినుండి తరుచు వారు మా గ్రామం వస్తూండేవారు. ఆయన ప్రథమోపన్యాసం మా గ్రామంలోనే జరిగింది. నాకు ఆయనమీద ఒక విధమైన ప్రేమ, లక్ష్యం ఏర్పడింది. ఆయనతో నాకు చనువున్ను హెచ్చు.